



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 18 | సంచిక: 58

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బైడెన్‌కు కేన్సర్

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ (82)కు ప్రోస్టేట్ కేన్సర్ నిర్ధారణ అయినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

- వివరాలు 6లో ▶



లక్నోను ముంచిన సన్‌రైజర్స్

6 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై హైదరాబాద్ విజయం సాధించింది. దీంతో లక్నో 'ప్లే ఆఫ్స్' ఆశలు గల్లంతయ్యాయి.

- వివరాలు 14లో ▶

ఇక గ్రామ పటాల డిజిటలైజేషన్

- పక్కాగా గ్రామీణ ప్రాంతాల సర్వే రికార్డులు
- కాలానుగుణంగా అప్‌డేట్ చేసేలా విలేజ్ మ్యాప్‌లు
- త్వరలో రాష్ట్రంలోని మూడు గ్రామాల్లో పైలట్ పద్ధతిన అమలు
- 26 నుంచి సర్వేయర్లకు శిక్షణ: మంత్రి పొంగులేటి

2లో

ఏసీ కంప్రెషర్ పేలుడే కారణమా?

- గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంపై వివిధ కోణాల్లో దర్యాప్తు
- నేడు భవనాన్ని పరిశీలించనున్న ఫోరెన్సిక్ నిపుణులు
- 17 మంది మృతుల్లో 10 మంది ఆ ఇంటి వారే
- అగ్నిప్రమాద ఘటనపై సుమోటోగా కేసు స్వీకరించిన రాష్ట్ర హెచ్‌ఆర్‌సీ

2లో

మా పాలన దేశానికే

రోల్ మోడల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- శాంతిభద్రతల నిర్వహణ, నిరుద్యోగం నిర్మూలనలో తెలంగాణ నంబర్ వన్
- 16 నెలల్లో రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం
- 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి ఆదర్శంగా నిలిచాం
- గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా ఇందిరా సౌర జలవికాసం పథకం
- అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులందరికీ ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు ఇస్తామన్న సీఎం
- నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో పథకం ప్రారంభం
- బహిరంగ సభ వేదికగా నల్లమల డిక్లరేషన్ ప్రకటన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్

'మా పాలన దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. శాంతిభద్రతల నిర్వహణ, నిరుద్యోగం నిర్మూలన, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సైతం మా పాలనను అభినందించక తప్పని పరిస్థితి నెలకొంది. మా పాలనలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపాం. గత 16 నెలల్లో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తెచ్చాం. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి ఆదర్శంగా నిలిచాం. మరో 1.50 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు కూడా కల్పించాం. గత ప్రభుత్వ పాలనలో నోటిఫికేషన్ల కోసం ధర్నాలు జరిగేవి. మా పాలనలో మాత్రం నోటిఫికేషన్లు వాయిదా వేయాలని ధర్నాలు జరుగుతున్నాయి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే కుటుంబం బాగుపడుతుంది. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరుల్ని చేసేలా ప్రణాళిక రూపొందించాం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిరా సౌర జలవికాసం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ పథకం పైలట్ ప్రాజెక్ట్ కింద మాచారంలోని 29 మంది చెంచు రైతులకు చెందిన 45 ఎకరాల పోడు భూముల్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. వాటిల్లో

మిగతా 3వ పేజీలో ▶




ప్రభుత్వ ఆస్పత్రిలో న్యాయమూర్తి ప్రసవం

వేములవాడ: వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయికి సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగింది. రెండో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. మొదటి కాన్పు సందర్భంగా.. 2023లో ఇదే ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. రెండూ సాధారణ ప్రసవాలే కావడం విశేషం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని తెలిపేందుకే.. తాను ఇక్కడ చేరినట్లు జడ్జి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఫైర్ లోడ్ తగ్గిద్దాం

- మంటల తీవ్రత పెంచే వస్తువుల విషయంలో జాగ్రత్త తీసుకోవాలని నిపుణుల సూచన
- హంగులు, ఆర్భాటాల కోసం ఫాల్ సీలింగ్‌లు, ఫర్నిచర్ వాడొద్దు
- అనవసరమైన కాగితాలు, కలప వస్తువులు, పాత బట్టలు, ప్లాస్టిక్‌లు వంటి దహనశీల పదార్థాలను తగ్గించాలి
- గ్యాస్ సిలిండర్‌లు, కిరోసిన్ వంటి ఇంధన పదార్థాలను సురక్షితంగా పెట్టుకోవాలి



సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాల నుంచి బయటపడాలన్నా, ప్రమాద తీవ్రత తగ్గాలన్న స్వీయ నియంత్రణే పద్ధతులే ముఖ్యం. వీలైనంత వరకు అగ్నికారణ వస్తువులు ఇంట్లో అవసరానికి మించి ఉండకుండా చూసుకోవాలి. అయితే ఈ ఫైర్‌లోడ్‌కు సంబంధించి స్పష్టమైన నిబంధనలు లేకున్నా, స్వీయ నియంత్రణే ప్రమాద సమయంలో శ్రీరామరక్ష అని నిపుణులు చెబుతున్నారు. గుల్జార్ హౌస్ చౌరస్తాలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇంత మంది చనిపోవడానికి అగ్ని ప్రమాదం తర్వాత వచ్చిన పొగను పీల్చడమే.. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కరెంట్ మీటర్ వద్ద చెలరేగిన మంటలు వ్యాప్తిలో పక్కనే ఉన్న చెక్కతో తయారు చేసిన షోకేస్ కీలకంగా మారింది. దీని నుంచి మంటలు పై అంతస్తులకు వ్యాప్తి చెంది ఏసీ కంప్రెషర్లు పేలి భయానక ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి అగ్నిప్రమాదాల్లో అత్యంత కీలకంగా మారుతున్న ఫైర్ లోడ్‌ను ఎంత వీలైతే అంత తగ్గించుకుంటేనే ఇళ్లు, కార్యాలయాలు సురక్షితంగా ఉంటాయి.

భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలి..

ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరు తమ ఇల్లు అత్యంత ప్రత్యేకంగా ఉండాలన్న ఆలోచనతో అవసరానికి మించి హంగూఆర్భాటాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి గదిలో ఫాల్ సీలింగ్, అందులో ప్రత్యేకంగా అలంకరణ లైట్లు, ఎల్ఈడీలు ఆకర్షణీయంగా ఉండేందుకు ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి గృహ అవసరాలకు తగినట్టుగా వైరింగ్, ఇతర ఎలక్ట్రికల్ వ్యవస్థ ఉంటుంది. దానికి అదనంగా ఇవన్నీ రావడంతో లోడ్ పెరిగి షార్ట్‌సర్క్యూట్‌లకు కారణమవుతోంది. ఫర్నిచర్ విషయంలోనూ కొంత ఇదే ధోరణి ఉంటోంది. చెక్కతో చేసిన కుర్చీలతోపాటు ప్రత్యేకంగా ఫోమ్, ఇతర పదార్థాలతో చేసి సోఫాలు, వార్డ్‌రోబ్‌లు, కబోర్డులు, ప్రతి గుమ్మానికి, కిటికీలకు కర్టెన్లు, కార్పెట్లు ఇలా అగ్నిప్రమాదాల తీవ్రతను పెంచే ఎన్నో వస్తువులను విరివిగా వాడుతున్నారు. కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లోనూ అలంకరణ వస్తువులు, లైటింగ్, కార్పెట్లు, కాగితాలు ఇలా ఎన్నో అగ్నితీవ్రత పెంచే వస్తువులు మనం గమనిస్తూనే ఉంటాం. వీటిని పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు కానీ..వీలైనంత వరకు తగ్గిస్తే మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్ సిస్టమ్‌లు, స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ అలారంలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

ఇళ్లలో ఫైర్‌లోడ్ తగ్గింపు ఇలా....

- గదుల్లో అనవసరమైన కాగితాలు, కలప వస్తువులు, పాత బట్టలు, ప్లాస్టిక్ వంటి దహన శీల పదార్థాలను తగ్గించాలి.
- ఫర్నిచర్ కోసం లెదర్, ఫైర్-రిటార్డెంట్ ఫాబ్రిక్‌లు వంటి ఫైర్-రెసిస్టెంట్ పదార్థాలు ఉపయోగించాలి.
- గ్యాస్ సిలిండర్‌లు, కిరోసిన్ వంటి ఇంధన పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలి. వీటిని వంటగది బయట బాగా వెంటిలేషన్ ఉన్న ప్రదేశంలో ఉంచాలి.
- అధిక విద్యుత్ లోడ్ నివారించడానికి ఒకే సాకెట్‌లో బహుళ ఉపకరణాలను ఉపయోగించొద్దు.
- పాత వైరింగ్‌ను తనిఖీ చేసి, అవసరమైతే మార్చాలి. ఇవే షార్ట్ సర్క్యూట్‌లు అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణం.
- ఎల్ఈడీ లైట్లు, ఎనర్జీ-సేవింగ్ ఉపకరణాలను ఉపయోగించడం ద్వారా వేడి ఉత్పత్తిని తగ్గించొచ్చు.
- అగ్ని నివారణ ఉపకరణాలైన స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ అలారంలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఇంట్లో ఇన్‌స్టాల్ చేయాలి.
- గ్యాస్ సిలిండర్ మంటలు వస్తే, తడి గుడ్డను ఉపయోగించి మంటలను ఆర్పడానికి ప్రయత్నించాలి.

వాణిజ్య ప్రదేశాల్లో ఫైర్‌లోడ్ తగ్గింపు ఇలా

- గిడ్డంగులు, ఆఫీసులు, షాపులలో దహనశీల పదార్థాలను (కాగితం, కెమికల్స్, ప్లాస్టిక్‌లు) సురక్షితంగా నిల్వ చేయాలి.
- రసాయనాలు, ఇంధనాలను ఫైర్-ప్రూఫ్ కంటైనర్లలో ఉంచాలి.
- అగ్ని నిరోధక పదార్థాలతో తయారైన ఫర్నిచర్, కర్టెన్లు, కార్పెట్‌లను ఉపయోగించాలి.

స్వీయ నియంత్రణే కాపాడుతుంది..



అగ్ని ప్రమాద కారణ వస్తువుల విషయంలో స్వీయ నియంత్రణే మనల్ని కాపాడుతుంది. మంటలు విస్తరించకుండా, మంటలను తట్టుకునే వ్యవస్థలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో వీలైనంత వరకు కర్టెన్లు, ఇతర ఫర్నిచర్ తగ్గించడం ఉత్తమం. ఆస్పత్రులు, వాణిజ్య ప్రదేశాల్లోనూ ప్రధానంగా మెట్ల వద్ద, ఫైర్ ఎగ్జిట్లు వద్ద కార్పెట్లు ఉండకుండా చూసుకోవాలి. అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో జీప్లస్‌టూ భవనాల్లోనూ సాధారణ వాటర్ స్ప్రింక్లర్లు పెట్టుకుంటారు. దీనివల్ల 50 శాతం అగ్నిప్రమాదాలు తగ్గాయి. మన దగ్గర కూడా రెండు, మూడు అంతస్తుల్లోనూ సాధారణ వాటర్ పైప్‌లైన్‌కు లింక్ చేసుకొని అన్ని గదులకు వాటర్ స్ప్రింక్లర్లు పెట్టుకోవడం అత్యంత సురక్షితం.

– వి.శ్రీనివాస్, ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు

80% అగ్నిప్రమాదాలకు షార్ట్ సర్క్యూటే కారణం



అగ్ని ప్రమాదాలను పరిశీలిస్తే 80% వరకు షార్ట్ సర్క్యూట్ కారణంగానే జరుగుతున్నాయి. నివాస, వాణిజ్య సముదాయం ఏదైనా అందులో విద్యుత్ వాడకానికి తగినట్టుగా వ్యవస్థ ఉండాలి. ప్రత్యేకించి కండక్టర్లు, వైర్ల కెపాసిటీ గురించి శ్రద్ధపెట్టాలి. పొటెన్షియల్ ఎర్త్ సిస్టం రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చుచేస్తే ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల విద్యుత్ కారణంగా అగ్నిప్రమాదాలు నియంత్రించొచ్చు. దీని వల్ల మీ కుటుంబం సురక్షితంగా ఉంటుంది. – ఈ. ప్రసాదరావు, రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్

క్లుప్తంగా...

అంబులెన్సులు, ఆక్సిజన్ అందలేదనేది అవాస్తవం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, హైదరాబాద్: గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు.. అంబులెన్స్ రాక బాధితులకు ఆక్సిజన్ అందలేదనేది అవాస్తవమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గుల్జార్‌హౌస్‌లో అగ్ని ప్రమాదానికి గురైన 15 మంది బాధితులను ఏడు 108 అంబులెన్సుల్లో సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తక్షణమే తరలించి.. ఆక్సిజన్ అందించామని తెలిపారు. ప్రమాద సమాచారం 108 జిల్లా కో-ఆర్డినేటర్ భూమా నాగేందర్‌కు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు ఏడు 108 అంబులెన్సు వాహనాలను పరిశీలించారని తెలిపారు. అందులో అవసరమైన ఆక్సిజన్ వసతులు, నిల్వలు ఉన్నట్లు ధ్రువీకరించారని కలెక్టర్ వెల్లడించారు.

జిల్లాకొక డీ అడిక్షన్ సెంటర్

టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో డీ-అడిక్షన్, పునరావాస కేంద్రాల బలోపేతంలో భాగంగా ప్రతి జిల్లాలో కనీసం ఒక డీ-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టీజీ యాంటీనార్కోటిక్స్ బ్యూరో అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో, తెలంగాణ ప్రభుత్వంలోని వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ కలిసి సోమవారం టీజీఏఎన్‌బీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు చర్చించారు. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భాగంగా అధికారులు పలు కీలక అంశాలు చర్చించారు. ప్రస్తుతం జోగుళాంబ గద్వాల్, కామారెడ్డి, మహబూబ్ నగర్, మహబూబాబాద్, నిర్మల్, నిజామాబాద్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, సంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ప్రత్యేకమైన డీ-అడిక్షన్ కేంద్రాలు లేనందున ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్కొక్క సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఈహెచ్‌టీ సబ్ స్టేషన్లలో కార్మికులకు వీడీఏ పెంపు

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌కోకు చెందిన ఎక్స్‌ట్రా హైవోల్టేజీ (ఈహెచ్‌టీ) సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న కార్మికులకు వేరియబుల్ డ్రౌట్ అలవెన్స్(వీడీఏ)ను పెంచుతూ ట్రాన్స్‌కో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏసీ కంప్రెషర్ పేలుడే కారణమా?

గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై వివిధ కోణాల్లో దర్యాప్తు.. నేడు భవనాన్ని పరిశీలించనున్న ఫోరెన్సిక్ నిపుణులు

17 మంది మృతుల్లో 10 మంది ఆ ఇంటి వారే.. పూర్తిగా దగ్ధమైన మోదీ, కృష్ణ పెరల్స్ దుకాణాలు

సాక్షి, హైదరాబాద్: గుల్జార్‌హౌస్‌లో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదానికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఏసీకి సంబంధించిన కంప్రెషర్ పేలుడు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఏసీ నిరంతరాయంగా పని చేయడంతో కంప్రెషర్ పేలి ఉంటుందని, పక్కనే ఉన్న కరెంట్ మీటర్లకు మంటలు అంటుకుని వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. గదుల్లో ఉడ్ పార్టిషన్ల కారణంగా మంటలు, పొగ పెరిగి మొదటి, రెండో అంతస్తులకు వ్యాపించినట్లు అంచనా వేస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు మంగళవారం ఆ భవనాన్ని పరిశీలించనున్నారు. వారి అధ్యయనం తర్వాతే అగ్నిప్రమాదానికి కారణాలపై పూర్తి స్పష్టత రానుంది.

పది మంది ఆ ఇంటి వారే..

ఘోర అగ్నిప్రమాదంలో కుటుంబీకులు, బంధువులు కలిపి మొత్తం 17 మంది చనిపోయారు. వీరిలో 10 మంది గుల్జార్ హౌస్‌లోని ఆ ఇంట్లో ఉండే మూడు కుటుంబాలకు చెందిన



వారే అని తేలింది. కుటుంబ పెద్ద ప్రహ్లాద్ రాయ్ మోదీ (73), ఆయన భార్య మున్నీ బాయ్ మోదీ (72), కుమారుడు పంకజ్ మోదీ (35), ఈయన భార్య వర్షా మోదీ (35), వారి కుమార్తెలు ఆన్య మోదీ (11), ఇద్దిక మోదీ (8), కుమారుడు ఇరాజ్ మోదీ (2)తో పాటు అభిషేక్ మోదీ (30), రాజేందర్ కుమార్ (67), ఈయన భార్య సుమిత్ర (65) ఆ భవనంలోనే ఉంటున్నారు.

ఏడుగురు వేర్వేరు ప్రాంతాల వారు

రజినీ అగర్వాల్ (47) సనత్‌నగర్‌కు, శీతల్ జైన్ (37), ఈమె కుమార్తె ఆరుషి జైన్ (17), రిషబ్ జైన్ (13) యూసుఫ్‌గూడకు, హర్షాలీ గుప్తా (7) బంజారాహిల్స్‌కు, ప్రథమ్ అగర్వాల్ (14), ఈమె సోదరుడు ప్రన్సీ అగర్వాల్ (6) మూసారాంబాగ్‌కు చెందిన వారని తేలింది. ఈ వివరాలను పోలీసులు తమ ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు.

సుమోటోగా తీసుకున్న హెచ్ఆర్‌సీ

ఈ అగ్నిప్రమాద ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) సుమోటోగా కేసు స్వీకరించింది. భవన భద్రత, విద్యుత్ నిర్వహణ, అగ్నిప్రమాద నివారణ పరంగా నిబంధనలు పాటించడంలో లోపాలున్నాయని మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా కమిషన్ ఈ చర్య తీసుకుంది. సీఎస్, నగర పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్‌లు జూన్ 30లోగా సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

నిందితులు లేరు.. సెక్షన్లు లేవు!

→ గుల్జార్ హౌస్‌లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంపై చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇందులో నిందితుల పేర్లు కానీ, సెక్షన్లు కానీ లేవు. మిస్సింగ్ కేసుల మాదిరిగా అగ్నిప్రమాదం అంటూ నిందితులు లేరంటూ (నో అక్యూజ్డ్) దీన్ని రిజిస్టర్ చేశారు. చార్మినార్ వద్ద నివసించే ఉత్కర్ష్ మోదీ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. సాధారణంగా పోలీసు కేసులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) లేదా భారతీయ న్యాయ సంహితల్లోని (బీఎన్ఎస్) సెక్షన్ల కింద నమోదవుతాయి. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే ఇలా చట్టం, సెక్షన్లు, నిందితులు లేకుండా కేసులు నమోదవుతూ ఉంటాయి. ఈ అగ్ని ప్రమాదంపై చార్మినార్ పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని (బీఎన్ఎస్ఎస్) 173, 176 సెక్షన్లను అనుసరించి కేసు నమోదు చేశారు. అంతేకానీ ఎలాంటి సెక్షన్లు వినియోగించడం కానీ, ఎలాంటి ఆరోపణలు చేయడం కానీ జరగలేదు. యాక్ట్ అండ్ సెక్షన్స్ అని ఉండే రెండో కాలమ్‌లో కేవలం 'ఫైర్ యాక్సిడెంట్ (అగ్నిప్రమాదం)' అని మాత్రమే పొందుపరిచారు. అలాగే ఇంకో కాలమ్‌లో 'నో అక్యూజ్డ్ (నిందితులు లేరు)'అంటూ పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరిగింది ఇంట్లో కావడం, దానిపై ఎలాంటి అనుమానాలు లేకపోవడం, ఇంటి యజమాని సహా అంతా చనిపోవడం తదితర కారణాల నేపథ్యంలో ఇలా నమోదు చేశారని అధికారులు చెప్తున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మహమూద్ అలీ


గుల్జార్‌హౌస్ ఘటన బాధాకరం

- అగ్నిప్రమాదంలో ఒకేసారి 17 మంది చనిపోవడం విషాదకరం
- ఘటనా స్థలాన్ని సందర్శించిన కేటీఆర్

చార్మినార్/రాజేంద్రనగర్/మణికొండ(హైదరాబాద్): ప్రభుత్వం అందాల పోటీలపై పెట్టిన శ్రద్ధను, అగ్ని ప్రమాదాల నివారణ, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజిన్‌లలో నీళ్లు ఉండి ఉంటే గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదం ఘటనలో ప్రాణనష్టం తగ్గేదని అభిప్రాయపడ్డారు. గుల్జార్‌హౌస్‌లోని అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని సోమవారం ఆయన మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డిలతో కలసి సందర్శించారు. అలాగే, రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లిలో ఉంటున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగ్నిమాపక సిబ్బందికి సరైన మాస్కులు లేకపోవడంతో వారు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేక పోయారన్నారు. 125 ఏళ్ల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం అన్నారు. బాధితుల తరఫున జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వారి పక్షాన పోరాడుతామన్నారు. బాధిత కుటుంబీకులకు రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తాను రాజకీయం చేయడానికి రాలేదని, కానీ ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలి కదా అని ప్రశ్నించారు. సీఎం వద్దనే హోం, మున్సిపల్ శాఖలు ఉన్నాయని, ప్రమాద స్థలం వద్దకు సీఎం వస్తే బాగుండేదన్నారు.

కేటీఆర్ ఏది చెప్తే కిషన్‌రెడ్డి అదే మాట్లాడుతున్నారు: జగ్గారెడ్డి

గుల్జార్‌హౌస్ ఘటనపై రాజకీయం తగదు



సాక్షి, హైదరాబాద్: గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద ఘటనా స్థలానికి వెళ్లిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన హోదాను మరచి బాధ్యత లేకుండా మాట్లాడారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో తనకంటే సీనియర్‌గా కిషన్ రెడ్డిని గౌరవిస్తానని, అయితే ఆయన కేవలం రాజకీయం చేయడమే కాకుండా ప్రజలకు సేవ చేయడం కూడా నేర్చుకోవాలని హితవు పలికారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుల్జార్‌హౌస్ ఘటన బాధాకరమేనని, ప్రమాదం జరిగిన నిమిషాల్లోనే సీఎం రేవంత్ అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారని చెప్పారు. సీఎం ఘటనా స్థలికి వెంటనే వెళితే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్న ఆలోచనతోనే ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చారని వివరించారు. సీఎం రేవంత్ సూచనతోనే డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, దామోదర రాజనర్సింహ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి ఘటనా స్థలికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. దీనిని కూడా రాజకీయం చేయాలని కిషన్‌రెడ్డి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని అన్నారు. 'నాకు ఒక మిత్రుడు చెప్పాడు. ఈ మధ్య కిషన్‌రెడ్డి కేటీఆర్ ఏం చెప్తే అది మాట్లాడుతున్నారని. అలా చెప్పినప్పుడు నాకు విచిత్రం అనిపించింది'అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ రేకులు ఈదురుగాలికి పడిపోయినప్పుడు, భరతమాతకు హారతి కార్యక్రమంలో టపాసులు పేలి ప్రమాదవశాత్తు ముగ్గురు చనిపోయినప్పుడు కూడా సీఎం రేవంత్ ఇలానే రాజకీయం చేశారా? అని ప్రశ్నించారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం చర్యలు

- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణ సంస్థలకు నీటిపారుదల శాఖ స్పష్టీకరణ
- పాత బకాయిలు క్లియర్ చేయాలని నిర్మాణ సంస్థల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బరాజ్‌ల విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. సోమవారం ప్రాజెక్టుల నిర్మాణ సంస్థల ప్రతినిధులతో నీటిపారుదల శాఖ అధికారులు సమావేశమయ్యారు. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం పరీక్షలతోపాటు మరమ్మతు పనులు చేయాలని అధికారులు నిర్మాణ సంస్థలకు సూచించారు. దీనికి మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ, అన్నారం నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఆఫ్కాన్స్, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ ప్రతినిధులు స్పందిస్తూ ముందుగా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. గత వానాకాలానికి ముందు మేడిగడ్డ బ్యారేజీ రక్షణ కోసం చేపట్టిన పనుల తాలూకు బిల్లులు విడుదల కాలేదని వివరించారు. ఎన్డీఎస్ఏ నివేదికకు అనుగుణంగా తీసుకునే చర్యలకు సంబంధించిన ప్రణాళికలను బుధవారంకల్లా అందించాలని, బిల్లులు ఏ మేరకు పెండింగ్‌లో ఉన్నాయి?.. ఏయే పరీక్షలకు ఎన్ని నిధులు అవసరం వంటి అంశాలపైనా నివేదిక ఇవ్వాలని అధికారులు చెప్పారు. ఈ నివేదికను నీటిపారుదల శాఖ మంత్రికి పంపుతామన్నారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌లోని ఏడో బ్లాకు కుంగగా దీన్ని పూర్తిగా తొలగించాలని ఎన్డీఎస్ఏ సిఫారసు చేసింది. పరీక్షల అనంతరం బరాజ్‌లోని ఇతర బ్లాకులు ఎలా ఉన్నాయో తేల్చాలని చెప్పింది. అంతేకాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ప్రముఖ సంస్థలతో భూభౌతిక/ భూసాంకేతిక పరీక్షలు చేసి, బరాజ్‌ల పునరుద్ధరణ/మరమ్మతుల ప్రణాళికకు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తీసుకోవాలని ఎన్డీఎస్ఏ తన నివేదికలో వివరించింది. దీంతో నిపుణుల కమిటీ సిఫారసులకు అనుగుణంగా పరీక్షలు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కేంద్ర సంస్థలను కోరింది. మరో రెండు నెలల్లో గోదావరికి వరదలు రానుండటంతో బరాజ్‌లను కాపాడుకునే పనిలో ప్రభుత్వం ఉంది.

పీసీ ఘోష్ కమిషన్ గడువు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి ఘోష్ కమిషన్ గడువును ప్రభుత్వం రెండు నెలలు పొడిగించింది. మే 31న కమిషన్ విచారణ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి గడువు పెంచడం గమనార్హం. జూలై 31 వరకు గడువు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది మార్చి 14న ఏర్పాటైన ఈ కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారించి అదే ఏడాది జూన్ 30కల్లా నివేదిక సమర్పించాల్సి ఉంది. కానీ, ఇప్పటికే ఆరుసార్లు కమిషన్ గడువును పొడిగించారు. చివరిగా ఈ ఏడాది మే 31 వరకు గడువును పొడిగిస్తూ ఏప్రిల్ 29న ఉత్తర్వులు వెలువరించిన విషయం విదితమే. కాగా, కమిషన్ విచారణ దాదాపు పూర్తయిందని మే 31లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగింది. గడువు పొడిగింపుతో మిగిలిపోయిన వారిని ప్రశ్నించే అవకాశం ఉందని సమాచారం. వాస్తవానికి, కాళేశ్వరం ప్రాజెక్టు కోసం నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే సాగునీటి శాఖలోని కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పలువురు అధికారులను పిలిపించి వివరాలు రాబట్టింది.

ఇంతియాజ్



పాకిస్తాన్ వద్దట! నరకానికే తీసుకుపొమ్మని బ్రతిమిలాడుతున్నాడు!

ఇక గ్రామ పటాల డిజిటలైజేషన్

- పక్కాగా గ్రామీణ ప్రాంతాల సర్వే రికార్డులు
- కాలానుగుణంగా అప్‌డేట్ చేసేలా విలేజ్ మ్యాప్‌లు
- త్వరలో రాష్ట్రంలోని మూడు గ్రామాల్లో పైలట్ పద్ధతిన అమలు
- 26 నుంచి సర్వేయర్లకు శిక్షణ: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో సంస్కరణలు వడివడిగా జరుగుతున్నాయి. భూభారతి చట్టంతో పాటు భూముల రీసర్వే లాంటి కీలక ప్రక్రియలను పైలట్ పద్ధతిలో అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో అంకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన రెవెన్యూ రికార్డులను డిజిటలైజేషన్ చేసే దిశలో ముందడుగు వేసింది. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (టీఆర్ఎస్ఏసీ) ద్వారా సర్వే రికార్డుల (గ్రామ పటాలు) డిజిటలైజేషన్‌ను కూడా పైలట్ పద్ధతిలో అమలు చేయనుంది. అతి త్వరలోనే ప్రారంభం కానున్న ఈ గ్రామ పటాల డిజిటలైజేషన్ కోసం రాష్ట్రంలోని మూడు గ్రామాలను ఎంపిక చేసింది. తొలిదశలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రం, జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద కోరుకొండి గ్రామాల పటాలను డిజిటలైజ్ చేయనుంది. ఈ డిజిటల్ మ్యాప్‌ల ద్వారా ఆయా గ్రామాల్లోని భూములకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని తక్కువ ఖర్చుతో వేగంగా పొందవచ్చని రెవెన్యూ వర్గాలు చెపుతున్నాయి. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి లాంటి వివరాలు స్పష్టంగా వస్తాయని, ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగమవుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇక రికార్డుల భద్రతతో పాటు కాలానుగుణంగా అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా డిజిటలైజేషన్ చేస్తున్నామని ఆయన వివరించారు.

సర్వేయర్ల కోసం 10,031 దరఖాస్తులు: రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 10,131 దరఖాస్తులు వచ్చాయని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఈ లైసెన్సుడు సర్వేయర్ల నియామకంపై సోమవారం మంత్రి సమీక్ష జరిపారు. ఈ దరఖాస్తులను వెంటనే పరిశీలించి ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలిలోని సర్వే ట్రెనింగ్ అకాడమీలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అదే విధంగా భూవివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని చెప్పారు. శిక్షణ అనంతరం మండలాల వారీగా ఈ సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపర్చడంలో భాగంగా కచ్చితమైన భూరికార్డులను రూపొందిస్తున్నామని, భూవివాదాల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు.

సమీకృత వరద యాజమాన్య విధానం అమలు చేయాలి

ఈఎన్సీ జి.అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమీకృత వరద యాజమాన్య విధానం అమలు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల అధికారులతో వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలపై ముందస్తు సమాచారం లేనందువల్లే ఏపీలోని అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, గతేడాది వరదలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడిందని అనిల్‌కుమార్ గుర్తు చేశారు. తుఫానుల సమయంలో పట్టణ ప్రాంతాల్లో ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని సురక్షితంగా తరలించడానికి మేలు చేస్తుందన్నారు. దీనిని ఐఐటీ–హైదరాబాద్ నిపుణులు కూడా పరిశీలించారన్నారు. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఎంకే సిన్హాతో పాటు ప్రస్తుత చైర్మన్ అతుల్ జైన్‌లకు వివరించామన్నారు. సమీకృత వరద యాజమాన్య విధానంపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ సభ్యుడు. రాజశేఖర్ పలు అనుమానాలు వ్యక్తం చేయగా... అధికారులు నివృత్తి చేశారు.

క్లుప్తంగా...

ఆర్థిక ఇబ్బందులున్నా 'ఇందిరమ్మ' బిల్లులు ఇస్తున్నాం

- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు ఆపకుండా చెల్లిస్తున్నామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 5,364 మంది లబ్ధిదారులకు రూ.53.64 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ఇళ్ల నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపుపై సోమవారం ఆయన జూమ్ సమావేశంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తున్నామని, ఈ సోమవారం 1,607 మంది లబ్ధిదారులకు రూ.16.07 కోట్లు చెల్లించామని తెలిపారు. ఇప్పటివరకు 20,104 ఇళ్ల నిర్మాణం మొదలైందని, ఇందులో 5,140 ఇళ్లు పునాదుల వరకు, 300ఇళ్లు గోడల స్థాయి వరకు, మరో పది ఇళ్లు కప్పు వరకు పూర్తయ్యాయని వివరించారు. మిగతావి పునాదుల దశలో ఉన్నాయని పేర్కొన్నారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

నేరుగా విద్యార్థులకే డబ్బులు ఇవ్వాలి

కలెక్టర్‌కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు వినతి

కరీంనగర్ అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కీంను రద్దు చేసి విద్యార్థులకే నగదు చెల్లించి నచ్చిన కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు కోరారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఆయన వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఫీజు నియంత్రణ కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌కు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలపాలని కోరారు. ముఖ్యమంత్రే ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని చెప్పడం తీవ్రతను చాటుతోందని, ఈ క్రమంలో పాఠశాలలకు రావాల్సిన నిధులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, అందుకే ఆ స్కీంను రద్దు చేసి విద్యార్థులకే నేరుగా డబ్బులిస్తే పాఠశాలలపై భారం తప్పుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 వేలకుపైగా స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని వివరించారు. ఫీజు నిర్ణయంలో పరిమిత అధికారాన్ని కల్పించడం తగదని ఆయన అన్నారు. స్కూల్ గవర్నింగ్ బాడీ ఏర్పాటు పరిష్కారమని, అలాగే వర్గీకరణపై స్పష్టత లేదని తెలిపారు. క్యాష్ ద్వారా ఫీజు వసూలును పూర్తిగా నిషేధించడం తగదని ఆయన సూచించారు.

మా పాలన దేశానికే రోల్ మోడల్



కోయ సంప్రదాయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ



చేతులు పైకెత్తి సీఎంకు మద్దతు తెలుపుతున్న మహిళలు

▶ మొదటి పేజీ తరువాయి

బోర్లు, సోలార్ పంప్‌సెట్ ఏర్పాటుతో పాటు మామిడి, ఉద్యాన మొక్కలు నాటారు. కాగా ఆయా భూముల్లోని సోలార్ పంప్‌సెట్‌ను ముఖ్యమంత్రి ఆన్ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బహిరంగసభ వేదికగా నల్లమల డిక్లరేషన్‌ను ప్రకటించి మాట్లాడారు.

వాళ్లు భూములు గుంజుకున్నారు.. మేం పంటలు ప్రోత్సహిస్తున్నాం

'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోడు రైతుల భూములను గుంజుకుని వారికి బేడీలు వేసి జైలుకు పంపింది. ములుగు, తాడ్వాయి అడవుల్లో ఆడబిడ్డలను చెట్టుకు కట్టేసి కొడితే మేం వెళ్లి అండగా నిలబడ్డాం. కాంగ్రెస్ వచ్చాక గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా ఇందిరా సౌర జలవికాసం అమలు చేస్తున్నాం. గిరిజనుల పోడు భూముల్లో సోలార్ విద్యుత్, బోర్లు ఏర్పాటు చేసి వారు పంటలను పండించేలా ప్రోత్సహిస్తున్నాం.

అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

నేను ఇక్కడి నల్లమల ప్రాంతానికి చెందిన వాడినని చెప్పుకునేందుకు నా గుండె ఉప్పొంగుతోంది. అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులందరికీ రానున్న వంద రోజుల్లో ఉచితంగా సోలార్ బోర్లను ఏర్పాటు చేస్తాం. సోలార్ విద్యుత్ వినియోగంతో పాటు ఉత్పత్తి చేసి నెలనెలా రూ.ఐదారు వేల ఆదాయం కల్పించేలా చూస్తాం. నియోజకవర్గంలో ఎన్ని సోలార్ పంప్‌సెట్లైనా ఉచితంగా ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

సన్న బియ్యంతో పేదల ఆత్మగౌరవం పెంచాం..

గతంలో రైతులు వరి వేస్తే ఉరి అని చెప్పి కేసీఆర్ తన ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వరి వేసుకున్నడు. మేంవచ్చాక సన్నాలు పండించాలని చెప్పి రూ. 500 బోనస్ అందించాం. ఏడాదిలో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండించి దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపాం. రేషన్ బియ్యంగా సన్న బియ్యాన్ని అందించి పేదల ఆత్మగౌరవాన్ని పెంచాం.' అని సీఎం చెప్పారు.

ఏమ్మా.. నీళ్లు పడ్డాయా?

- చెంచు మహిళలతో సీఎం సంభాషణ



సాక్షి, నాగర్‌కర్నూల్: ఇందిరా సౌర జలవికాసం పథకం ప్రారంభోత్సవం సందర్భంగా మాచారంలోని చెంచుల పోడు భూములను సందర్శించిన ముఖ్యమంత్రి.. అక్కడే ఉన్న చెంచు మహిళలు ఉడుతనూరి అలివేలు, లక్ష్మమ్మలను పలకరించారు. వారితో కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు.

సీఎం: ఏమ్మా.. మీ బోరులో నీళ్లు పడ్డాయా?

అలివేలు: మా భూమిలో వేసిన బోరులో నీళ్లు మంచిగా పడ్డాయి సర్. సంతోషంగా ఉంది.

సీఎం: ఏం మొక్కలు నాటారు, వాటిని బతికించుకుంటారా?

అలివేలు: మామిడి, ఆవకాడో, బత్తాయి మొక్కలు నాటాం. బాగా కాపాడుకుంటాం సర్. ఇన్నాళ్లు మా భూమి బీడుగానే ఉంది. ఇప్పుడు పంటలు పండించుకుంటాం.

సీఎం: ఈ పథకంపై ఇతర మహిళలకు శిక్షణ ఇస్తావా?

అలివేలు: నేను డిగ్రీ పూర్తి చేశాను సర్. తప్పకుండా మా తోటి మహిళలకు, చెంచులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తా. మీరు మా కోసం ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది.

ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలి..

'భారత్–పాకిస్తాన్ యుద్ధం సమయంలో ప్రధాని ఇందిరా గాంధీ ఒక్క దెబ్బతో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ను రెండు ముక్కలు చేశారు. ఇప్పటికి 50 ఏళ్లైనా ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలని అంటారు. అలాంటి ఇందిరమ్మ రాజ్యంలో మేం ప్రజల కళ్లల్లో వెలుగులు నింపేలా పని చేస్తున్నాం. అక్రమ సంపాదనతో ఎవరెన్ని కుట్రలు చేసినా, మా ఆడబిడ్డలకు అన్నీ తెలుసు. సన్నాసులంతా కలసి సోషల్ మీడియాలో ఎంత ప్రచారం చేసినా, మహిళలకు నిజం తెలుసు. కడుపు నిండా విషం కక్కుతూ మా ప్రతిష్టకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. మేం వారి దిక్కు చూడం, పట్టించుకోం..' అని రేవంత్ అన్నారు.

దేశ చరిత్రలో ఎక్కడా లేదు: భట్టి విక్రమార్క

భూమి కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్న గిరిజనులకు హక్కులు కల్పించి నీటి సౌకర్యం కల్పించిన ఉదంతాలు దేశంలో ఎక్కడా లేవని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలోని గిరిజనుల కోసం సంకల్పం తీసుకోవడంతో తన జన్మ ధన్యమైందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, శ్రీహరి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వగ్రామంలో రేవంత్ పర్యటన

సీఎం రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గజమాల, పూలతో ఊరేగింపుగా వచ్చి స్వాగతం పలికారం. కాగా ముఖ్యమంత్రి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి తన ఇంట్లో భోజనం చేశారు.

'పోడు'కు నిధుల తోడు

గిరిజన సంక్షేమం లక్ష్యంగా నల్లమల డిక్లరేషన్

నల్లమల డిక్లరేషన్‌లో రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు అంశాలను పొందుపర్చింది. రాష్ట్రంలోని 2,30,735 మంది గిరిజనులకు 2006 ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం సంక్రమించిన సుమారు 6.69 లక్షల ఎకరాల భూములపై పూర్తి హక్కులను గుర్తించింది.

- రాష్ట్రవ్యాప్తంగా గిరిజనుల పోడు భూముల్లో నూరు శాతం ఉచితంగా బోరుబావులు, సోలార్ విద్యుత్ సౌకర్యంతో పాటు ఉద్యాన పంటల ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తారు. పోడు భూముల్లో నీటి సౌకర్యం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయిస్తారు.
- ఇందిరా సౌర గిరి జలవికాసం పథకం కింద గిరిజనులకు జీవనోపాధి కల్పించడంతోపాటు వారి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటారు.
- తొలుత మాచారంలో పైలట్ ప్రాజెక్ట్. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారు.
- ఈ పథకం పకడ్బందీగా అమలయ్యేందుకు ఐదేళ్ల పాటు లబ్ధిదారులతో సర్కారు సమన్వయం. ఎప్పటికప్పుడు అటవీ, విద్యుత్, భూగర్భ జలవనరులు, ఉద్యాన శాఖల పర్యవేక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెంచులు, ఆదిమ జాతుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం.
- రాజీవ్ యువవికాసం కింద ప్రత్యేకంగా గిరిజన యువతకు రూ.1,000 కోట్ల నిధులతో ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకు సబ్సిడీ రుణాలు.

అరెస్టులు, నిర్బంధాల మధ్య నల్లమల డిక్లరేషనా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- డిక్లరేషన్లు అమలు చేసే చిత్తశుద్ధి సీఎంకు లేదు



సాక్షి, హైదరాబాద్: రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్ అంటూ బీరాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయకుండా, కొత్తగా నల్లమల డిక్లరేషన్‌ను తెరమీదకు తెచ్చారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆర్భాటంగా డిక్లరేషన్లు ప్రకటిస్తున్న ముఖ్యమంత్రికి వాటిని అమలు చేసే చిత్తశుద్ధి మాత్రం లేదని ఎద్దేవా చేశారు. నల్లమల బిడ్డను అంటూ గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్, తనను కలిసేందుకు వచ్చిన అమాయక చెంచు బిడ్డలను అరెస్టు చేసి తన నిరంకుశ విధానాన్ని మరోమారు బయట పెట్టుకున్నారన్నారు. ఈ మేరకు సోమవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించి, డిక్లరేషన్ ప్రకటించడమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. 'ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ.. రేవంత్ ఆరు గ్యారంటీల అమలును మరచిపోయారు. రుణమాఫీ ఎగవేత, ధాన్యం కొనుగోలు, వడగళ్ల నష్టం గురించి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు'అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

అమావాస్య రోజు పున్నమి వెన్నెల..

'అమావాస్య రోజు కూడా పున్నమి వెన్నెల.. అని రేవంత్ అతిశయోక్తులు చెప్పగలరు. విద్యా భరోసా కింద రూ.5 లక్షల కార్డులు, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్‌పై హామీలను ప్రజలు రోజూ గుర్తు చేసుకుంటున్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు.. మరికొన్ని వర్గాలు రూ.4 వేల పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యోగులకు బకాయి పడిన డీఏలు, పీఆర్‌సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, అలాగే ప్రభుత్వంలో విలీనం కోసం ఆర్టీసీ కార్మికులు ఎదురుచూస్తున్నారు'అని హరీశ్‌రావు విమర్శించారు.

యాదగిరీశుడికి రూ. 30 లక్షల విలువైన ఆభరణాలు

బహూకరించిన వరంగల్ భక్తుడు





ఆలయ అర్చకులకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న అనిల్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: వరంగల్‌కు చెందిన భక్తుడు ఆకుల అనిల్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామికి రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను బహూకరించారు. ఆయన కుటుంబ సభ్యులతో సహా సోమవారం శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత.. రూ.17 లక్షల విలువైన హారం, రూ.13 లక్షల విలువైన రెండు వడ్డాణాలను ఆలయ అర్చకులకు అందజేశారు.



వంద మంది మూర్ఖులు కలిసి ఒక్క వివేకి కాలేరు!
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 20 మే 2025

కీలెరిగి వాత పెట్టిన ‘సుప్రీం’

యుద్ధంలో ఆయుధాలు మాత్రమే నిర్ణయాత్మక శక్తి కాదు... కోట్లాది పౌరులు ఒక్కటై వినిపించే స్వరం కూడా. కానీ పాకిస్తాన్‌తో తీవ్ర ఘర్షణలు తలెత్తిన వేళ ఆ సమష్టి స్వరానికి అవరోధం కల్పించేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి మన నేతల్లో కొందరు దేశాన్ని దిగ్భ్రమ పరిచారు. బహుశా అందుకే కావొచ్చు, కల్నల్ సోఫియా ఖురేషిపై నోరు పారేసుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కన్వర్ విజయ్ షా క్షమాపణను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. ఈ విషయంలో ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి ఈ నెల 28కల్లా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఐపీఎస్ అధికారులతో ఏర్పాటయ్యే ఈ బృందంలో ఒక మహిళా అధికారి ఉండాలనీ, దానికి ఐజీ ర్యాంకుకు తక్కువకాని అధికారి సారథ్యం వహించాలనీ ఉత్తర్వులిచ్చింది. ఈ తరహా విద్వేష ప్రసంగాలు బీజేపీ నేతల నుంచి మాత్రమే కాదు, కొందరు విపక్ష నేతల నుంచీ వినిపించాయి. చిత్రమేమంటే ఎక్కడా, ఎవరిపైనా పోలీసులు కేసులు పెట్టలేదు, చర్యలకు సిద్ధపడలేదు. కానీ సాధారణ పౌరులు చిన్నపాటి భిన్నస్వరం వినిపించినా విరుచుకుపడ్డారు. ఇందుకు అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ ఉదంతమే నిదర్శనం. కల్నల్ సోఫియాను కీర్తిస్తున్న బీజేపీ శ్రేణులు విద్వేష ప్రచారానికి బలవుతున్నవారిని ఎందుకు పట్టించుకోరని ఆయన ప్రశ్నించారు. సైన్యాన్నిగానీ, ఆ మహిళా అధికారుల్నిగానీ కించపరచలేదని, బాహాటంగా కనిపిస్తున్న ద్వంద్వ నీతిని ఎత్తిచూపటమే తన ఉద్దేశమని చెప్పినా ఆయన్ను అరెస్టు చేశారు.

విజయ్ షాపై మధ్యప్రదేశ్ పోలీసులు సొంతంగా కేసు నమోదు చేయలేదు. అక్కడి హైకోర్టు సుమోటోగా తీసుకుని తక్షణం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని పోలీసుల్ని ఆదేశించింది. ఆ తర్వాతైనా పోలీసులు సక్రమంగా చర్యలు తీసుకున్నది లేదు. ఎఫ్ఐఆర్ వాలకం గమనించిన హైకోర్టు చీవాట్లు పెట్టాకే వారికి జ్ఞానోదయమైంది. విజయ్ షా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదు. రాష్ట్రంలోని ఎస్టీ నియోజకవర్గం హర్సూద్ నుంచి ఇప్పటికి 8 దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు. మంత్రిగా పని చేస్తున్నారు.

సంక్షోభ సమయాల్లో సంయమనం పాటించటం చాలా అవసరం. బాధ్యతాయుత స్థానాల్లో వున్నవారు ఆ సంగతి మరిచిపోతున్నారు. విజయ్ షా వ్యాఖ్యల సంగతే తీసుకుంటే ఆయన అన్నది కేవలం కల్నల్ సోఫియా ఖురేషిని మాత్రమే కాదు... ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావన చేసి ఆయనపై సంశయాలు రేకెత్తించే విధంగా మాట్లాడారు. యుద్ధానికి సంబంధించిన వివరాలను వెల్లడించటానికి నియమించిన ఇద్దరు మహిళా ప్రతినిధుల్లో ఒకరైన కల్నల్ సోఫియాను ‘ఉగ్రవాదుల సోదరి’గా అభివర్ణించారు. ఉగ్రవాదులను ఆ వర్గం చేతే దెబ్బకొట్టించటానికి ప్రధాని ఆమెను తెలివిగా ఎంపిక చేశారన్నట్టు మాట్లాడారు. కల్నల్ సోఫియా నిర్వహించిన మీడియా సమావేశాలను గమనిస్తేనే ఆమె ఎంత సమర్థంగా, చతురతతో ఆ బాధ్యతను నెరవేర్చారో తెలుస్తుంది. గర్వించదగిన నేపథ్యం ఆమెది. దేశంలోని ప్రతి మహిళా స్ఫూర్తిదాయకంగా తీసుకోదగిన చరిత్ర ఆమెది. సైనిక కుటుంబం నుంచి వచ్చి, సైన్యంలో చేరి అందులోని వ్యక్తినే వివాహమాడి ప్రతి స్థాయిలోనూ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ కల్నల్ హోదా వరకూ ఎదిగారు. అటువంటామెను కేవలం ముస్లిం మహిళగా చూశారంటేనే... విజయ్ షా ఎంత ఉన్మాదపూరితంగా ఆలోచిస్తున్నారో అర్థమవుతోంది. అందుకే ఆయన ప్రసంగం తీరు చూసి దేశం యావత్తూ సిగ్గుపడుతోందని సుప్రీంకోర్టు అనక తప్పలేదు.

ఉగ్రస్థావరాలపై ‘ఆపరేషన్ సిందూర్’ సందర్భంగా మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ దేశమంతా ఒక్కటై ఈ కష్టకాలాన్ని అధిగమించటానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. దాని అర్థం, పరమార్థం విజయ్ షాకు కాస్తయినా అర్థం కాలేదని ఆయన చేసిన వ్యాఖ్యలు, అటు తర్వాత క్షమాపణ చెబుతూ చేసిన ప్రకటన గమనిస్తే తెలుస్తుంది. నోరుజారి తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నానంటే బహుశా కోర్టు చీవాట్లతో సరిపెట్టేదేమో! కానీ అందరి నేతల మాదిరే ‘ఎవరి మనోభావాలైనా దెబ్బతినివుంటే...’ అంటూ రాగం తీయడంతో వివాదంలో మరింత కూరుకుపోయారు. మంత్రి చెప్పిన క్షమాపణలో చిత్తశుద్ధి లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చేస్తున్నది క్షమించరాని తప్పని ఎటూ తెలియలేదు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు పార్టీ అధిష్ఠానం సైతం మందలించినా పునరాలోచన కలగలేదు, పరివర్తన రాలేదు. ఇలాంటివారిని నాలుగ్గోడల మధ్య మందలించటం కాదు... పదవి నుంచి సాగనంపివుంటే అలాంటివారికి అదొక హెచ్చరికగా ఉండేది. దేశ ప్రజలు కొనియాడేవారు. కానీ బీజేపీ ఆ పని చేయలేకపోయింది.

సమాజ్‌వాదీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ సైతం ఈ మాదిరి వ్యాఖ్యలే చేశారు. వైమానిక దళ అధికారులైన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, ఎయిర్ మార్షల్ ఏకే భారతిల కులాల ప్రస్తావన చేశారు. బీజేపీకి కల్నల్ సోఫియా మతం తెలిసిందిగానీ ఈ అధికారులిద్దరూ పీడిత కులాలవారని తెలియదని, లేకుంటే వారిపైనా తప్పుడు వ్యాఖ్యానాలు చేసేవారని అన్నారు. ఈ బాపతు నాయకులంతా మనుషుల్ని ఎంతసేపూ కులమతాల చట్రాల్లో చూస్తూ వారి సేవలనూ, అంకిత భావాన్నీ, సంకల్ప దీక్షనూ మరుగుపరుస్తారు. దేశభక్తి పేరుతో ఉన్మాదాన్నీ, విద్వేషాన్నీ పెంచి పోషిస్తారు. సుప్రీంకోర్టు స్పందించిన తీరు నేతలందరికీ గుణపాఠం కావాలి. సంక్షోభ కాలాల్లో మాత్రమే కాదు... సాధారణ సమయాల్లోనూ జాగ్రత్తగా మాట్లాడాలని తెలుసుకోవాలి.

ఈ కరవులో ఊళ్ళు బతికేదెట్లా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ఆంధ్రదేశం నదులతో, కొండలతో, సముద్ర తీరంతో సుసంపన్నమైనది. గోదావరి, కృష్ణ, పెన్నా వంటి నదులు, ఉప నదులతో ఒకనాడు సస్యశ్యామలంగా వర్ధిల్లింది. ఆంధ్రదేశ భౌగోళిక, సాంస్కృతిక, తాత్విక సాంకేతిక సంపద ప్రసిద్ధమైనది. చరిత్రకారుల ప్రకారం మొత్తం భారతదేశంలోనే ఇన్ని భౌగోళిక వనరులున్న ప్రాంతం మరొకటి లేదు. 974 కిలోమీటర్ల సముద్ర తీరం దీనికి ఆయువు. నదులు, చెరువులు, కాలువలు, గడ్డి మైదానాలతో; పండ్ల, ఫల, వృక్షాలతో ఆంధ్రదేశం సుసంపన్నమైనది. అంతేకాదు, దక్షిణాపథంలో ఆంధ్రదేశం కీలక స్థానంలో ఉంది. దానికితోడు తూర్పు తీరమైదానం సారవంతమైన పంట భూమి. అచటి రేవు పట్టణాలు దూరదేశాలతో వాణిజ్యం సాగించి ఐశ్వర్యవంతమైనాయి. కాకతీయులు విజృంభించే వరకు తీరాంధ్రమే ఆంధ్రదేశ రాజకీయాధికారానికి కేంద్రమై, సాంస్కృతిక ఉద్యమాలకు పుట్టినిల్లయింది.

దక్షిణాపథంలో పశ్చిమ ప్రాంతంలో విజృంభించిన రాజవంశాలు తీరాంధ్రాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించాయి. ఆంధ్రదేశాన్ని ఆక్రమించినవారు సులభంగా దక్షిణాపథ ఆధిపత్యం సాధించగలరు. ముఖ్యంగా కృష్ణా, తుంగభద్రా నదుల అంతర్వేదిపై ప్రతి రాజవంశం దృష్టి ఉండేది. అందుకే దాన్ని వశపరచుకోడానికై పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, చోళులు, కల్యాణి చాళుక్యులు, విజయనగర రాజులు, బహమనీ సుల్తానుల సంఘర్షణలు యావద్భారత చరిత్ర లోనే ఆసక్తిదాయకమైనవి. తత్ఫలితంగా ఈ రాజ వంశాలకు యుద్ధ రంగమై ఆంధ్రదేశం అశాంతికి, బాధలకు గురైంది. ఈ దండ యాత్రల ద్వారా ద్రావిడులు, కన్నడిగులు, మరాఠీలు (కాయస్థులు), కాళింగులు అధిక సంఖ్యలో ఆంధ్ర దేశానికి వచ్చి నిలిచిపోయినారు. అందుచేతనే భారతజాతిలో వలెనే ఆంధ్రజాతిలో భౌతికమైన వైవిధ్యం కనిపిస్తుంది.

ఒకప్పుడు వర్ధిల్లిన ప్రాంతం

భారతదేశాన్ని పాలించిన శాతవాహనులు, విష్ణుకుండినులు, చాళుక్యులు, కాకతీయులు, ముఖ్యంగా కృష్ణదేవరాయలు మన వ్యవసాయ సంస్కృతిని విస్తృతపరిచారు. అంతేగాకుండా మన సంపద బంగారు, వెండి, రాగి ధనాగారాలతో ఎలా వర్ధిల్లిందో చూడండి: విజయనగరంలో బంగారు, వెండి, రాగి నాణేలు అమలులో ఉండేవి. గద్యాణం బంగారు నాణెం. దాన్నే ‘వరాహ’ అనేవారు. ఇది చాళుక్యుల కాలం నుండి వస్తున్న నాణెం. బహుశా వరాహ పదమే ‘వరహా’ అయివుంటుంది. కృష్ణరాయల గద్యాణం 119.7 వడ్ల గింజల ఎత్తు ఉండేది. ఘట్టి వరాహ, దొడ్డ వరాహ అనే ప్రత్యేక గద్యాణాలు కూడ ఇచ్చేవారు. గద్యాణంలో సగం ‘ప్రతాప’. తరువాతవి ‘పణం’, ‘చిన్నం’. ఇవి అన్నీ బంగారు నాణేలే. ఎక్కువ వాడుకలో ఉన్న నాణెం పణం. ‘తార్’ అనేది వెండి నాణెం. ఇది పణంలో ఆరో వంతు. జీటలు, కాసు అనేవి రాగి నాణాలు. ఇవిగాక రాజ్యం పశ్చిమ ప్రాంతాల్లో పోర్చుగీస్, ఈజిప్షియన్ నాణేలు వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనారం ఈజిప్షియన్ నాణెం. ప్రౌఢరాయలు ‘దీనార టంకాల’తో శ్రీనాథుని తీర్థమాడించినాడు.

ప్రభుత్వమేగాక రాష్ట్రపాలకులు నగరాధిపతులు (వర్తక శ్రేష్ఠులు) గూడా నాణేలు ముద్రించేవారు. ‘ప్రతి సంస్థానానికీ టంకశాల గుత్త చేసుకొని వారి వారి పేరటను ముద్రలు కల్పించుతూ వచ్చిరి’ అని అట్టవన తంత్రం చెబుతున్నది. నాణేల నాణ్యతను కంసాలులు ఒరపు రాతినుపయోగించి నిర్ణయించేవారు.





◆ ఇప్పుడున్న ఆంధ్రదేశ పరిస్థితిని చరిత్రలో పోల్చుకుని చూస్తే దారుణంగా ఉంది. సామాజిక కార్యకర్తలుగా గ్రామాలకు వెళితే గుండెలు తరుక్కుపోయే సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాలు త్రాగునీరు లేక, సాగునీరు అందక, చివరకు పశుగ్రాసం కూడా లేక విలవిల్లాడుతున్నాయి. ఈ పరిస్థితి కరవును తలపిస్తూ ఉంది. ఇది రాష్ట్ర జీవన వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది.

గ్రామాల్లో దుర్భర పరిస్థితులు

ఇకపోతే ఇప్పుడున్న ఆంధ్రదేశ పరిస్థితి చరిత్రతో పోల్చుకుని చూస్తే దారుణంగా ఉంది. ముఖ్యంగా గ్రామాలు త్రాగునీరు లేక, సాగునీరు అందక, చివరకు పశుగ్రాసం కూడా అందక విలవిల్లాడుతున్నాయి. ఆంధ్రదేశంలో జీవించే పరిస్థితులు లేక దళితులు, బడుగు వర్గాలు విలవిలలాడుతున్నాయి. ఈ పరిస్థితి కరవును తలపిస్తూ ఉంది. కరవు రాష్ట్రజీవన వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా గ్రామాల్లో వృద్ధులు అన్నం లేక, గంజి లేక, సూరుల క్రింద ఉసూరుమంటూ జీవిస్తున్నారు.

సామాజిక కార్యకర్తలుగా గ్రామాలకు వెళితే గుండెలు తరుక్కుపోయే సన్నివేశాలు కనిపిస్తున్నాయి. కృష్ణా జిల్లాలోని మూడుతాళ్ళపాడులో దళిత స్త్రీలను ప్రశ్నిస్తే, ‘అన్నం వండుకొని మూడు రోజులైంది’ అని చెప్పారు. ఒకవేళ అన్నం వండుకున్నా చింతపండు పచ్చడి తప్ప కూర వండుకోలేని దశలో ఉన్నామనీ, ఇటువంటి దయనీయమైన పరిస్థితి మా జీవిత కాలంలో ఎప్పుడూ చూడలేదనీ వారు అన్నారు. అంటే ఒక కూర వండుకునే పరిస్థితిలో కూడా ఇవ్వాళ్టి గ్రామాలు లేవు. ఈ పరిస్థితుల్లో కూడా భర్తలకు ఏదైనా పని దొరికితే వారు తాగే వస్తున్నారని చెప్తున్నారు. ఖమ్మం జిల్లా వైరా రోడ్డులోని గోవిందాపురం మాదిగవాడలో కొందరు స్త్రీలతో మాట్లాడితే, కనీసం పని దొరికి వారం రోజులైందనీ, దొరికినా వచ్చే తక్కువ కూలీకి బియ్యం, ఇతర వస్తువులు రాక పస్తులుంటున్నామనీ, తలకు నూనె కూడా పెట్టుకోక నెలలు అయ్యిందనీ, పిల్లలను బడికి పంపలేక పనికి తీసుకెళుతున్నామనీ చెప్పారు.

నిజానికి రెండు తెలుగు రాష్ట్రాలలో కూలీ లేక ఊళ్ళకు ఊళ్ళు తరలి వెళ్ళిపోతున్నాయి. వ్యవసాయ కూలీలే కాదు, చేనేత కార్మికులైతే దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు. ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం దేశాయిపేట దేవాంగులు, పద్మశాలీలు... ఒక్కొక్క ఇంట్లో నాలుగైదు కుటుంబాలు జీవిస్తున్నామనీ, సరైన మజూరు లేక, ఇండ్లస్థలాలు లేక ఎమ్మార్వో చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయామనీ అంటున్నారు. ముఖ్యమంత్రి గారు చేనేతవారికి ప్రకటించిన లోన్లు అడిగితే... ‘ప్రకటనలు అలాగే ఉంటాయి, మాకు ఏమీ ఆర్డర్స్ రాలే’దని చెపుతున్నారనీ, ఇటువంటి ఆర్థిక దుఃస్థితి మేము గత 30 ఏళ్ళుగా ఎప్పుడూ చూడలేదనీ అంటున్నారు. విజయవాడలో ఒక బ్రాహ్మణ వీధిలో ఉంటున్న 200 కుటుంబాల్లో కనీసం 50 కుటుంబాలైనా పస్తులు ఉంటాయనీ, పట్టణాలలో పనిలేదనీ, ఇండ్ల స్థలాలు లేవనీ చెప్పారు.

పోరాటమే మార్గం!

ఆకలికి కులం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కరవు వలన నిరాసక్తత, నిర్వీర్యత అలుముకొని ఉన్నాయి. అటు పొలం పనులైన నాట్లు, కోతలు, కలుపులు లేవు. ఇతర రాష్ట్రాలకు వెళ్ళి అక్కడ పనిచేసుకోవాలంటే, బిల్డింగ్ కట్టే పనులే కాని వ్యవసాయ కూలీ పనులు లేవు. ఆంధ్ర దేశానికి గుండెకాయగా చెబుతున్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చేపల చెరువులు, రొయ్యల చెరువుల వలన వ్యవసాయ పనులు పూర్తిగా మృగ్యమయ్యాయి. పశువుల పరిస్థితి దారుణంగా ఉంది. పశువుల దాహార్తి, పశుగ్రాస లేమి సామాజిక, ఆర్థికవేత్తలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏటా వేసవి సీజన్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉన్నా అధికారులు సకాలంలో స్పందించ లేదు. వేసవిలో పశుగ్రాసం కొరత, వాతావరణ పరిస్థితుల కారణంగా పాల దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. ఎండు గడ్డి, పచ్చగడ్డి సమపరిమాణంలో అందించడంతోపాటు వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి.

ఇకపోతే ఆంధ్ర రాష్ట్రంలో భూమి ఎందుకు పంచటం లేదనేది, కార్పొరేట్ వ్యవస్థలకే భూమి ఎందుకు చవక రేట్లకు ఇస్తున్నారనేది నగ్న సత్యం. ఆంధ్ర రాష్ట్రంలో ఉపాధి కూలీలు మండుటెండల్లో ఎండుతున్నా వారికి మంచినీళ్ళు లేవు. వారికి కూలీ నెలలు తరబడి ఆపుతున్నారు. వారు దిక్కులేని పక్షుల్లా బతుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ప్రజలు జీవిస్తున్నారు. ఇది మంచిది కాదు. పాలక వర్గాలు రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించాలి. దేశానికి ఆయువైన గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నిండాలి. రైతులు, రైతు కూలీలు, వృత్తిదారుల ముఖాలలో నవ్వు వికసించాలి. అందుకు పోరాటాలే మార్గం. ప్రజలు చైతన్యవంతులై అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని మేల్కొల్పాలి. దళిత బహుజనులు తమ రాజ్యాంగ హక్కుల కోసం పోరాడినప్పుడే నిజమైన విముక్తి కలుగుతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ మీడియా

లాభం లేదు!



విదేశాలను ఒప్పించడానికి ప్రతినిధుల బృందాలను ప్రపంచమంతటా పంపడం వల్ల నామమాత్ర ప్రయోజనం కలుగుతుంది. మొదటిది: ఇండియా భద్రతా అనివార్యతల్లో ప్రపంచ అభిప్రాయానికి కొద్దిపాటి ప్రాసంగికతే ఉంటుంది. రెండోది: అధికారం, ప్రయోజనాల ప్రాతిపదికన దేశాలు వ్యవహరిస్తాయి తప్ప న్యాయబద్ధ హేతువు మీద కాదు! మిగతాదంతా నాటకం!!

– నితిన్ పాయ్, విధాన నిపుణులు

అయ్యో బైడెన్!



(అమెరికా మాజీ) అధ్యక్షుడు బైడెన్‌కు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉందన్న వార్త బాధ కలిగించింది. ఎంతోమంది పురుషులు ఈ వ్యాధికి గురవుతున్నారు. అది కలిగించే ప్రమాదం పట్ల మనం అవగాహన పెంచడం కొనసాగించాలి. చికిత్స విషయంలో జోకు ఆల్ ద బెస్ట్.

– రిషీ సునాక్, యూకే మాజీ ప్రధాని

ఇద్దరూ ఆగితేనే...



యుద్ధం చెడ్డదని మనందరికీ తెలుసు. కానీ దేశాల మధ్య యుద్ధాలతో ఉన్న సమస్య ఏమిటంటే, ఒక్క పక్షమే ఆపలేదు. పరుగెత్తుతున్న గుర్రం నుంచి ఎవరూ దూకలేరు.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఫోకస్ పెరిగేదెలా?



ఎప్పుడూ ఫోకస్ ఇచ్చే ఉపకరణాలు (డ్రగ్స్) ఏమిటో చెప్పాలని నన్ను అడుగుతూ ఉంటారు. గుర్తుంచుకోండి: శిక్షణతోనే ఫోకస్ వస్తుంది. అది కూడా వ్యాయామం లాంటిదే. 2–3 గంటలకు టైమర్ పెట్టుకోండి. ఆ మొత్తం సమయం దాని మీద పనిచేయండి. దృష్టి మళ్లిన ప్రతిసారీ మరో 10 నిమిషాలు కలపండి. బాత్రూమ్ బ్రేక్ ఒక్క దానికే అనుమతి. తర్వాతి సెషన్ మరింత సులభం అవుతుంది.

– ఆండ్రూ డి. హుబెర్‌మాన్, న్యూరోబయాలజీ ప్రొఫెసర్

అనుభవ సత్యం




మనం దేన్ని వెతుకుతున్నామో దాన్ని కేవలం మేధా అవగాహనతో చేరుకోలేం. అదొక అనుభవం. దానికి సిద్ధాంత పరమైన మేధా అవగాహన సరిపోదు. దాన్ని మించి వెళ్లాలి.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

ఇన్ బాక్స్

తెలుగు సినీ గీతాల సిరి

‘విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం’ అని పాటల తోటలో విహరించి, ‘చినుకు తడికి చిగురు తొడుగు పువ్వమ్మా’ అని పదలాలిత్యంతో లాలించి, ‘జగమంత కుటుంబం నాది’ అని ఘంటాపథంగా చెప్పి అక్షర సేద్యం చేసిన సాహితీ తపస్వి ‘సిరివెన్నెల’ సీతారామశాస్త్రి. ఆయన తెలుగు పాటకు ఊపిరి పోసిన శబ్ద మాంత్రికుడు, అక్షర శ్రామికుడు. తెలుగు సినీ గేయ చరిత్రలో గొప్ప పదప్రయోగాలతో ఆయన పాటల ప్రస్థానమే ఒక ప్రత్యేక అధ్యాయంగా సాగింది. ‘సిరివెన్నెల’ పాటల వెనుక సాహిత్య అధ్యయన శీలత, నిరంతర సృజన సాధన సుస్పష్టంగా కనిపిస్తాయి. పాటకు కావ్య గౌరవాన్ని తెచ్చారాయన. ‘ఆదిభిక్షువు వాడి నేది కోరేది’ అని శివతత్వాన్ని లోకానికి ఎంతో గొప్పగా పాటతో చాటి చెప్పారు.



‘సిరివెన్నెల’ సీతారామశాస్త్రి

సీతారామశాస్త్రి పూర్తి పేరు ‘చేంబోలు సీతారామశాస్త్రి’. 1955 మే 20న విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జన్మించారు. ‘సీతారాముడు’ అని ఆయనను చిన్ననాటి నుండి అందరూ పిలిచేవారు. 1974లో రాజమండ్రిలో టెలిఫోన్ శాఖలో చిరు ఉద్యోగంలో చేరి 1983 వరకు పని చేశారు. సాహిత్యంపై మక్కువతో చిన్న కథలు, నాటికలు, పాటలు రాశారు. ‘భరణి’ అనే కలం పేరుతో కూడా కొంతకాలం రచనలు చేశారు. సినీ దర్శకులు కె. విశ్వనాథ్ ‘సిరివెన్నెల’ సినిమాలో పాటలు రాసే అవకాశం తొలిసారిగా లభించింది. ఆ తర్వాత ఆ సినిమా పేరు ఆయన ఇంటి పేరుగా మారి పోయింది. ‘తెలవారదేమో స్వామి’ అంటూ మేలుకొలుపును రాసినా, ‘అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా, స్వర్ణోత్సవాలు చేద్దామా’ అని ప్రశ్నించినా తనదైన ప్రత్యేక ముద్రను కనబరుస్తూ ఎన్నో పాటలను ఆయన రాసి విశేష గుర్తింపు పొందారు. పాటలే కాకుండా ‘శివ దర్పణం’, ‘సిరివెన్నెల తరంగాలు’, ‘నందివర్ధనాలు’ అనే పుస్తకాలను ఆయన రచించి ప్రచురించారు.

మొత్తం 11 సార్లు నంది అవార్డులు అందుకున్న సినీ కవిగా ఆయనదొక రికార్డు. ‘మనస్విని’, ‘కళాసాగర్’, ‘కిన్నెర’, ‘వంశీ’, ‘రసమయి’, ‘భరతముని’ సంస్థల అవార్డులను, 6 ఫిలింఫేర్ అవార్డులను పొందారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ‘పద్మశ్రీ’ పురస్కారం అందజేసి ఆయనను గౌరవించింది. 2021 నవంబర్ 30న ఆయన తుది శ్వాస విడిచారు. వెలకట్టలేని వేడుకలా, అపూర్వ మైన అక్షరపు విరిజల్లులా అప్రతిహతంగా ఆయన ఆపాత మధురమైన, ఆలోచనాత్మకమైన సినీగీత రచనా ప్రయాణం సాగి ముగిసింది.

– డా॥ తిరునగరి శ్రీనివాస్
(నేడు ‘సిరివెన్నెల’ సీతారామశాస్త్రి 70వ జయంతి)

యుద్ధాల్లో ఓడేది శ్రామిక ప్రజలే!

ఇప్పుడు ప్రపంచంలో, ఏ ఖండంలో చూసినా, విన్నా, యుద్ధాలే యుద్ధాలు: దేశాల మధ్యా, ఒకే దేశంలో వేరు వేరు పక్షాల మధ్యా!

యాభై ఏళ్ళ కిందట, చెరబండ రాజు రాసిన ఒక కవిత పేరు, ‘విప్లవాల యుగం మనది! విప్లవిస్తే జయం మనది!’ అని. ప్రస్తుత పరి స్థితి వేరే రకంగా వుంది. ‘యుద్ధాల యుగం మనది! ఆప కుంటే చావు మనది!’ అన్నట్టుగా ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–పాలస్తీనాల మధ్యా; రష్యా–ఉక్రె యిన్ల మధ్యా జరుగుతున్నవి భీకర యుద్ధాలు! ఈ యుద్ధాలలాగా పత్రికల్లో, టీవీల్లో, ఎక్కువగా ప్రచారం కాని యుద్ధాలు ఎన్నో ఆఫ్రికాలో నిరంతరం ఏదో ఒక స్థాయిలో జరుగుతూనే ఉన్నాయి. బుర్కినా ఫాసో, కామెరూన్, కాంగో, ఇథియోపియా, మొజాంబిక్, నైజీరియా, సోమాలియా, సూడాన్ – ఇలా ఎన్నో దేశాల్లో దాదాపు 35 సాయుధ ఘర్షణలు ఇప్పటికీ కొనసాగుతున్నట్టు వార్తలున్నాయి.

ఈ యుద్ధాల వల్లా, నిరంతరం జరిగే సాయుధ ఘర్షణల వల్లా, కలిగే బీభత్సాల గురించి, అనేక అంతర్జాతీయ నివేదికలు వచ్చాయి. ఆ యా దేశాల తరఫున యుద్ధం చేసే సైనికులూ, ఆ దేశాల శ్రామిక జనాలూ, పెద్ద సంఖ్యల్లో చనిపోతున్నారు. బతికి ఉన్నవాళ్ళలో అనేకులు తీవ్ర గాయాలపాలై, కళ్ళూ, కాళ్ళూ, చేతులూ, పోగొట్టుకుంటున్నారు. స్త్రీలు అత్యాచారాలకు గురవుతున్నారు. పిల్లలు ఏ దిక్కూ లేని ‘అనాథ’లవుతున్నారు. లక్షలాది మంది శరణార్థులుగా తరలిపోతున్నారు. పొలాలూ, నదులూ, చెరు వులూ, నివాసాలూ– అన్నీ ధ్వంసం అవుతున్నాయి. గాలి కాలుష్యం వల్లా, నీటి కాలుష్యం వల్లా, జనాలు భరించలేని, నయంకాని, జబ్బుల పాలవుతున్నారు.

ఐక్యరాజ్యసమితి నివేదికల్లోనూ, ‘ప్రపంచ శాంతి గురించిన పరిశోధనా సంస్థల నివేదికల్లోనూ, యుద్ధ బీభత్సాల గురించిన వివరాలెన్నో చూడవచ్చు. ఉదాహరణకు, గాజా యుద్ధంలో 18 నెలల్లో 50 వేల మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారు. లక్షా 13 వేలమంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో దాదాపు 4 వేల 5 వందల మంది పిల్లలకు, ఆ గాయాలు విషంగా మారడం వల్ల, రెండు కాళ్ళూ తీసేశారు. ఆకలి మరణాలు సరేసరి. ఇజ్రాయెల్ దాడిలో, 85 వేల టన్నుల పేలుడు పదార్థాల వల్ల, గాలి కాలుష్యం విపరీతంగా ఉందని తేలింది.

అలాగే రష్యా–ఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధంలోనూ సైనికులూ, ప్రజలూ పెద్ద ఎత్తున చనిపోయారు. రష్యాలో ఉన్న బీబీసీ వార్తా సంస్థ యూనిట్... అక్కడి స్థానిక మీడియా సంస్థలు, వలంటీర్ల సహకారంతో జరిపిన సర్వే ప్రకారం: 1 లక్షా 6 వేల 745 మంది రష్యా సైనికులు ఉక్రెయిన్‌తో జరిగిన యుద్ధంలో చనిపోయారని అంచనా వేసింది. గత మూడు సంవత్సరాలలో ఆఫ్రికా దేశాలలో జరిగిన సాయుధ సంఘర్షణల్లో 3 లక్షల 30 వేలమంది చనిపోయారు.

యుద్ధ మరణాలు ఎన్ని లక్షలైనా, కోట్లు అయినా, ఉత్త అంకెలుగానే చూస్తున్నాము తప్ప దుఃఖభారంతో కుంగిపోవడం లేదు. ‘నల్ల స్తూపం’ అనే 1956 నాటి ఒక



జర్మన్ నవలలో, ఆ రచయిత ఇలా అంటాడు: ‘ఒక మనిషి చనిపోతే, అది ఒక మరణం మాత్రమే. అదే 20 లక్షలమంది చనిపోతే, అది ఒక అంకె మాత్రమే!’ ఇదే రకం అభిప్రాయాన్ని, అంతకు చాలా సంవత్సరాల ముందే, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో చలం గారు, ‘మ్యూజింగ్స్’లో ఇలా రాశారు: ‘యుద్ధం ముందు హత్యలు! యుద్ధమంతా హత్యలు! యుద్ధం తర్వాత హత్యలు! పదివేల మందిని హత్య చేశారంటే, అది వినే వారికి ఉత్త అంకెలు. చీమలమల్లే పుట్టుకొచ్చే ఈ ప్రజలలో పదివేల మంది ఒక సంఖ్య కాదు. మళ్ళీ నిండుకుంటారు అవలీలగా! కానీ, ఒక్క జీవితం, ఒక మనిషిది. ఆలోచించి, మాట్లాడి, ప్రేమించి, కలలు కనే ఒక్క జీవితం! ఇంక ఎన్నడూ తిరిగిరాని జీవితం! అనేకమైన సజీవమైన లత లతో ఇతరుల్ని పెనవేసుకున్న జీవితం! ఎంత విలువ!’

ఇంతకీ, ఈ యుద్ధాలు ఎందుకు జరుగుతున్నాయి? పెట్టుబడిదారీ ప్రపంచంలో యుద్ధాలన్నీ స్వదేశంలోనైనా, విదేశాల్లో అయినా ప్రకృతి వనరుల్నీ, శ్రామికుల శ్రమనీ దోచే లక్ష్యంతో జరుగుతున్నాయి. ఈ విషయాన్ని అనేక పరిశోధనలు రుజువు చేశాయి. ముగ్గురు ఆఫ్రికా ఖండ పరిశోధకులు 54 ఆఫ్రికా దేశాలలో జరుగుతున్న యుద్ధాల గురించి, విస్తారంగా సమాచారం సేకరించి, ‘ఆఫ్రికాలో జరుగుతున్న ఘర్షణలపై, ప్రకృతి వనరుల ప్రభావం ఉందా?’ అన్న వ్యాసంలో (రిసోర్సెస్ పాలసీ మాస పత్రిక, డిసెంబర్, 2021) ఇదే సంగతిని నిరూపించారు. ఈ యుద్ధాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ... ఫ్రాన్సూ, అమెరికా, బ్రిటన్, రష్యా, చైనా వంటి పెద్ద దేశాల ప్రోత్సాహం ఉంది. యుద్ధాలు జరిగితే, ఆ దేశాల్లోని ఆయుధ పరిశ్రమల యజమానులకు పండగే పండగ!


సరే, ఇంతకీ యుద్ధాల సమస్యకు పరిష్కారం ఏమిటి? యుద్ధ వ్యతిరేక మేధావిగా పేరుపొందిన బ్రిటిష్ తత్వవేత్త, బెర్ట్రాండ్ రస్సెల్ ప్రకారం: ‘మనుషులన్నా యుద్ధాల్ని రద్దు చేస్తారు. లేదా యుద్ధాలన్నా మనుషుల్ని రద్దు చేస్తాయి!’ అయితే, ఏ రకం మనుషులు యుద్ధాల్ని రద్దు చేస్తారు? లాభాలే లక్ష్యంగా ఉన్న పెట్టుబడిదారీ మనుషులైతే యుద్ధాల్ని రద్దు చెయ్యరు కదా?

శ్రామిక వర్గ మానవులు, శ్రమ దోపిడీ అనే దుర్మార్గాన్ని తీసిపారేసినప్పుడే, యుద్ధాలను రద్దు చెయ్యగలరు! అది జరిగేలోగా, తాత్కాలిక ఉపశమనం ఏమిటంటే, శ్రామిక జనాలు, తమ దేశాల ప్రభుత్వాలు దేశ రక్షణ పేరుతో చేసే ఆయుధ వ్యాపారాన్ని మాని ఆ వేల, లక్షల కోట్ల రూపాయల్ని విద్య మీదా, వైద్యం మీదా, ఉద్యోగాల మీదా ఖర్చుపెట్టేలా ఒత్తిడి తేవాలి. అది జరగకుండా, యుద్ధాలే కొనసాగితే, ఆ యుద్ధాల్లో ఏ దేశ ప్రభుత్వాలు గెలిచినా, ఓడిపోయేది మాత్రం అన్ని దేశాల శ్రామిక జనాలే!

– బి.ఆర్. బాపూజీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు

లోపలి శత్రువు

‘మమ’ (నాది) అనే రెండక్షరాలు, ‘న మమ’ (నాది కాదు) అనే మూడక్షరాల మధ్య ఎవరి కంటికీ కనిపించకుండా నిరంతరం పోరాటం జరుగుతూ ఉంటుంది. ‘మమ’ అనే భావమే సకల బంధాలకు, కోరికలకు మూలం. ఇది మనిషిని అజ్ఞానంలో పడేస్తుంది. ‘న మమ’ అనే భావన బంధ విముక్తికి హేతువు. ఇది సత్య, జ్ఞాన రూపాలలో ఉంటుంది. మమ అన్నది శరీర వాదం, న మమ అన్నది ఆత్మవాదం. నాది కాదు అనే భావనను బలోపేతం చేయాలంటే మనిషి తన లోపలి శత్రువును జయించాలి. బయట ఉన్న శత్రువులను జయించటం నిజమైన గెలుపు కాదు. లోపలి శత్రువుపై విజయం మోక్ష మార్గ సాధనను నేర్పిస్తుంది.



ఈ లోపలి శత్రువులలో కోరిక చాలా ముఖ్యమైనది. కోరిక లేకుండా ఎవరూ ఏ పనీ చేయరు. యజ్ఞాలు చేసినా, దానాలు చేసినా పూజాదులైనా... ఏదైనా సరే కోరికతోనే చేస్తారు.

మహాభారతంలో ‘కామగీతలు’ అనే పేరుతో కొన్ని శ్లోకాలు ఉన్నాయి. ఇందులో ‘గొప్ప తపస్సు చేస్తున్నా ఆ తపః ఫలం పట్ల కోరిక లేకుండా ఉండాలి. చివరికి మోక్షం కావాలన్న కోరిక కూడా లేకుండా ఉంటే కోరిక ను జయించినట్లే! మోక్షం కూడా తనంతట అది రావాలి కాని ప్రయత్నం చేసి అందుకోవాలనుకోకూడదు’ అని ధర్మరాజుతో శ్రీకృష్ణుడు చెబుతాడు.

కోరికలు గుర్రాలై పరుగెత్తితే మనిషి జీవితం అశాంతిమయం అవుతుంది. కాబట్టి, వాటిని అదుపులో ఉంచుకోవటం సర్వదా అభిలషణీయం అనేది భగవంతుని ఉవాచ.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి



గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.అష్టమి రా.12.22 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ధనిష్ఠ ప.3.36 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం: రా10.35 నుండి 12.08 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.33 వరకు, అమృత ఘడియలు: లేవు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.30, సూర్యాస్తమయం: 6.21.

కారు డ్రైవింగ్ నేర్చుకుంటూ.. పిల్లలను ఢీకొట్టిన మహిళ

• బాలుడు మృతి, మరో బాలికకు తీవ్ర గాయాలు



మణివర్మ

పటాన్‌చెరు టౌన్: కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న క్రమంలో ఓ మహిళ ఇద్దరు పిల్లలను ఢీకొట్టింది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సోమేశ్వరి కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నరైగూడెంకు చెందిన నరేందర్ పిల్లలు మణివర్మ (10), ఏకవాణి (14) ఆదివారం సాయంత్రం స్థానికంగా ఉన్న గ్రౌండ్‌లో ఆడుకునేందుకు వెళ్లారు. కాగా, నవ్యనగర్‌కు చెందిన మహేశ్వరి అనే మహిళ అదే మైదానంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటోంది. ఈ క్రమంలో పిల్లలను గమనించకుండా కారుతో ఢీకొట్టడంతో మణివర్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలిక తీవ్రంగా గాయపడటంతో ఆమెను బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మహేశ్వరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

కరెంటు తీగ తెగిపడి షాక్.. ఆపై పెట్రోల్ లీకేజీ

• మంటల్లో బైక్‌తోపాటు కాలిపోయిన వ్యక్తి





కాలిపోయిన బైక్, పక్కన మురళీధర్‌రెడ్డి మృతదేహం

సత్తుపల్లి: ఈదురుగాలులకు తెగిపడి న 11 కేవీ విద్యుత్ వైర్ తాకడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కిందపడగా, ఆపై పెట్రోల్ లీకేజీతో మంటలు చెలరేగడంతో బండితో పాటు సజీవ దహనమయ్యాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కొత్తూరుకు చెందిన పైడిమర్ల పెద్దమురళీధర్‌రెడ్డి (61) సోమ వారం తన తోటకి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో ఈదు రు గాలులకు తెగిపడిన 11 కేవీ విద్యు త్ వైర్‌ను గమనించకపోవడంతో బైక్‌ను తాకింది. దీంతో షాక్‌కు గురైన ఆయన వాహనంతో సహా కింద పడ్డాడు. ఈ క్రమంలో వాహనంలోని పెట్రోల్ లీకై మంటలు వ్యాపించడంతో ఆయన అక్కడే దహనమయ్యాడు. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం కానరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుదిరితే బీఓటీ.. కాదంటే హామ్

• ఉత్తర రింగు విషయంలో కేంద్రం సరికొత్త యోచన
• ఆ ప్రాంతంలో ప్రస్తుతం రోజుకు 23,500 ప్యాసింజర్ కార్ యూనిట్లు
• తాజాగా వెల్లడించిన ట్రాఫిక్ స్టడీ నివేదిక
• దీంతో ఖర్చు తగ్గించుకునేలా రోడ్డు నిర్మాణ విధానంలో మార్పు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డును భారీ వ్యయంతో ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మిస్తే దాని వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం (రిటర్న్స్) ఆశాజనకంగానే ఉంటుందని తాజాగా కేంద్ర ప్రభుత్వం అంచనాకొచ్చింది. 4 వరుసలుగా మొదటి విడతలో నిర్మించాలన్న ఆలోచనను మార్చుకొని 6 వరుసలుగా నిర్మించాలని ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు నిర్మాణంలో కాంట్రాక్టు పద్ధతిని కూడా మార్చాలని అనుకుంటోంది. రెండు నెలల క్రితం 4 వరుసల రోడ్డు నిర్మాణానికిగాను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో నిర్మాణ సంస్థ గుర్తింపునకు టెండర్లు పిలిచింది. ఇప్పుడు దానిని మార్చి కుదిరితే బీఓటీ (బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్), లేదా హామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) పద్ధతిలోకి మార్చాలని నిర్ణయించింది. ఈ రోడ్డును నిర్మించిన తర్వాత దాని మీదుగా వెళ్లే వాహనాల సంఖ్య భారీగానే ఉంటుందని, ఎన్‌హెచ్‌ఏఐ ఓ ప్రైవేట్ సంస్థతో తాజాగా నిర్వహించిన ట్రాఫిక్ స్టడీలో తేలినట్టు తెలుస్తోంది.

• నాలుగేళ్ల క్రితం నిర్వహించిన ట్రాఫిక్ స్టడీలో.. ఉత్తర రింగు నిర్మించే ప్రాంతాల్లోని ప్రస్తుత రోడ్ల మీద నిత్యం 14,850 ప్యాసింజర్ కార్ యూనిట్లు (పీసీయూ) తిరుగుతున్నట్టు తేలింది. తాజా సర్వేలో ఆ సంఖ్య 23,500 పీసీయూల వరకు ఉన్నట్టుగా ప్రైవేట్ సంస్థ నివేదించినట్టు తెలుస్తోంది. సవివరంగా అందిన నివేదికలోని అంశాలపై ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

ఖజానాపై నిర్మాణ భారం అంతగా లేకుండా..

రెండు నెలల క్రితం ఎన్‌హెచ్‌ఏఐ ఈపీసీ టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో రోడ్డు నిర్మాణ వ్యయం మొత్తం ప్రభుత్వమే (ఎన్‌హెచ్‌ఏఐ) భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసేకొద్దీ కాంట్రాక్టు సంస్థ పని పూర్తి చేస్తుంది. పెద్ద రోడ్లపై వాహనాల నుంచి టోల్ వసూలు చేస్తారు. తక్కువ సంఖ్యలో వాహనాలు తిరిగే రోడ్ల మీద టోల్ ఆదాయం నామమాత్రంగా ఉంటుంది. అలాంటి రోడ్లను సొంతంగా పెట్టుబడి పెట్టి నిర్మించి ఆ తర్వాత టోల్ ద్వారా దాన్ని రాబట్టుకునేందుకు కాంట్రాక్టు సంస్థలు ముందుకు రావు. అందుకే అప్పట్లో ఈపీసీ టెండర్లు పిలిచారు. ఉత్తర రింగు రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.17 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. ఈపీసీ పద్ధతిలో అంతమొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. దీంతో మరోసారి ట్రాఫిక్ స్టడీ నిర్వహించి, వాహనాల సంఖ్య పెరిగితే టెండరింగ్ మోడ్‌ను మార్చుకోవాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఓ ప్రైవేట్ సంస్థకు బాధ్యత అప్పగించింది. అందులో 23 వేలను మించి పీసీయూలు తిరుగుతున్నట్టు తేలింది. సాధారణంగా 20 వేల పీసీయూలను మించితే హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో రోడ్డును నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తారు. ప్రభుత్వం 40 శాతం వ్యయాన్ని భరిస్తుంది. మిగతా 60 శాతాన్ని కాంట్రాక్టు సంస్థ పెట్టుకుంది. రిటర్న్స్ ఉంటాయి కాబట్టి ప్రభుత్వం మిగతా మొత్తాన్ని దశల వారీగా వడ్డీతో సహా చెల్లిస్తుంది. ఇప్పుడు ఈ హామ్ విధానాన్ని అనుసరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. కుదిరితే బీఓటీ పద్ధతి సాధ్యమవుతుందేమో పరిశీలించాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఎన్‌హెచ్‌ఏఐని తాజాగా ఆదేశించిందని తెలుస్తోంది. బీఓటీ పద్ధతిలో రోడ్డు నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా నిర్మాణ సంస్థనే భరిస్తుంది. ఆ మొత్తాన్ని నిర్ధారిత కాలం (20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల కాలం)లో టోల్ వసూలు ద్వారా రాబట్టుకుంటుంది. ప్రభుత్వ ఖజానాపై ఏమాత్రం భారం ఉండనందున ఈ విధానం సాధ్యమవుతుందేమో పరిశీలించి, సాధ్యమే అనుకుంటే ఆ మేరకు టెండర్లు పిలవాలని సూచించింది. ప్రస్తుతం అధికారులు ఆ కసరత్తు చేస్తున్నారు. బీఓటీ టెండర్లకు కాంట్రాక్టు సంస్థల నుంచి స్పందన ఉండదనుకుంటే హామ్ విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఈనెలాఖరు వరకు దీనిపై తేల్చుకొని పాత టెండర్‌ను సవరించటమో, రద్దు చేసి కొత్త టెండర్ పిలవటమో చేస్తారు. భవిష్యత్‌లో ఈ రోడ్డు మీదుగా వాహనాల సంఖ్య భారీగా పెరిగే వీలుందని దాదాపు నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో.. ఒకేసారి 6 వరుసలుగా ఉత్తర రింగును నిర్మించి, ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగిన తర్వాత రెండో విడతలో మిగతా రెండు వరుస (మొత్తం ఎనిమిది లేన్లు)లను నిర్మించాలని దాదాపు నిర్ణయించింది. దక్షిణ రింగు విషయంలో మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

లెటర్ రాసి, సెల్‌ఫోన్లు వదిలేసి..

• అప్పుల బాధ తాళలేక ఇంటి నుంచి వెళ్లిపోయిన కుటుంబం
• కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు
• సిద్దిపేట జిల్లాలో ఘటన



బాలకిషన్



వరలక్ష్మి



శ్రావణ్



కావ్య



శిరీష

సిద్దిపేటకమాన్: అప్పుల బాధ తాళలేక ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లుగా ఉత్తరం రాసి, ఫోన్లు ఇంట్లోనే వదిలిపెట్టి ముగ్గురు పిల్లలతో సహా భార్యాభర్తలు అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో కలకలం రేపింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణం ఖాదర్‌పూరకు చెందిన వీరబత్తిని బాలకిషన్ (55) పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా పద్మావతి మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. ఏజెన్సీ నిర్వహణలో ఆయన పలువురికి డబ్బులు ఇవ్వడంతో పాటు, మరికొంత మంది వద్ద అప్పులు చేశాడు. కొద్ది రోజుల క్రితం ఏజెన్సీ తీసివేయడంతో అతడికి డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడం, అప్పులు ఇచ్చిన వారు నిత్యం వేధించడంతో కొంతకాలంగా ఆందోళనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం బాలకిషన్ అతడి భార్య వరలక్ష్మి (50), కుమారుడు శ్రవణ్‌కుమార్ (30), కూతుళ్లు కావ్య (23), శిరీష (20)లతో కలిసి అప్పుల బాధ తాళలేక ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లుగా లెటర్ రాసి, కుటుంబ సభ్యుల ముగ్గురి సెల్‌ఫోన్‌లు ఫ్లైట్ మోడ్‌లో ఉంచి ఇంట్లోనే వదిలిపెట్టి వెళ్లిపోయారు. వారు కనిపించకపోవడాన్ని గమనించిన సమీప బంధువు సంతోష్‌కుమార్ సోమవారం సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ మధు, సీఐ వాసుదేవరావు అక్కడికి చేరుకుని లెటర్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

దుంప కూరల సాగుతో పోషకాహార భద్రత

• జాతీయ సదస్సులో ఉద్యానవర్సిటీ వీసీ రాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: దుంప కూరగాయల సాగుతో దేశంలో పోషకాహార భద్రత సాధించడంతో పాటు ఉపాధి, ఎగుమతి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో దుంప కూరగాయలపై అఖిల భారత పంటల సమన్వయ పరిశోధన పథకం 25వ వార్షిక గ్రూప్ సదస్సును ఆయన ప్రారంభించారు. కేరళ దుంప కూరగాయల పరిశోధన సంస్థ, తెలంగాణలోని కూరగాయల పరిశోధన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు రెండు రోజులపాటు జరుగుతుంది. ఈ సదస్సులో దండ రాజిరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ మార్పులను దీటుగా తట్టుకోవడంతో పాటు దేశం మొత్తానికి పోషకాహార భద్రత, అలాగే రైతులకి అధిక ఆదాయాన్ని ఇచ్చే దుంపకూరలు భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. పెరట్లో సైతం పెరిగే శక్తి దుంప కూర పంటలకు ఉంటుందన్నారు. దేశంలోని ప్రతి పట్టణం చుట్టుపక్కల 50 కిలోమీటర్ల దూరంలో దుంప కూరగాయల సాగును ప్రోత్సహించాలని, అప్పుడే అవి వినియోగదారులకు వేగంగా అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ, పోషకాలతో కూడిన బయో ఫోర్టిఫైడ్ రకాలను భారీగా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

యువ వికాసం టార్గెట్లు ఖరారు!

• మండలాలు, మున్సిపాలిటీల వారీగా లక్ష్యాల విభజన
• దీని ఆధారంగా ప్రాథమికంగా లబ్ధిదారుల ఎంపిక
• మండల కమిటీలు రూపొందించిన జాబితాలు కలెక్టర్లకు..
• అంతిమంగా ఖరారు చేశాక లబ్ధిదారుల పేర్ల ప్రకటన
• జూన్ 2 నుంచి మంజూరు పత్రాలు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం లక్ష్యాలు ఖరారయ్యాయి. మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో లక్ష్యాలను నిర్దేశించిన సంక్షేమ శాఖలు.. వాటిని క్షేత్రస్థాయికి పంపాయి. వాటిని గ్రామాలు, వార్డుల వారీగా విభజించిన అధికారులు... ఆమేరకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నారు. యువ వికాసం దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 14తో ముగియగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్లకు 16,23,764 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి అర్హుల ఎంపిక పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. 2025–26 బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించడంతో... ఆమేరకు లబ్ధిదారుల సంఖ్యను సంక్షేమ శాఖలు ఖరారు చేశాయి. 4,93,231 మందిని ఎంపిక చేసి మంజూరీ పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

క్షేత్రస్థాయికి లక్ష్యాలు...

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. లబ్ధిదారులను అవతరణ ఉత్సవాలకు పిలిచి మంజూరీ పత్రాలు అందిస్తారు. ఆలోపు దరఖాస్తుల పరిశీలన, అర్హుల నిర్ధారణ చేపట్టాలి. వచ్చిన దరఖాస్తులను రెండు స్థాయిల్లో పరిశీలిస్తారు. మండలస్థాయిలో మండల కమిటీ ఉంటుంది. ఈ కమిటీకి గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్/జోనల్ కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను జిల్లాస్థాయి కమిటీకి సమర్పిస్తారు. ఈ కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా డీఆర్‌డీఏ పీడీ వ్యవహరిస్తారు. సభ్యులుగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు, మైనార్టీ సంక్షేమాధికారి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఉంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతితో జిల్లాస్థాయి కమిటీ తుది జాబితా ఖరారు చేస్తుంది. గ్రామ పంచాయతీ/ మున్సిపల్ వార్డు స్థాయి జాబితాలను ఈనెల 21లోగా జిల్లా కమిటీలకు అందజేయాలి. వాటిని ఈనెల 31లోగా మరోమారు పరిశీలించి ఇన్‌చార్జి మంత్రి ఆదేశానుసారం తుదిజాబితాను ఖరారు చేయాల్సి ఉంటుంది. జూన్ 2 నుంచి 9 మధ్య ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పథకం ప్రారంభ కార్యక్రమంలోనే ప్రకటించారు.

కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు ఇలా..

కార్పొరేషన్	దరఖాస్తులు	లక్ష్యం
ఎస్సీ	3,92,951	1,44,809
ఎస్టీ	1,83,494	91,687
బీసీ	8,01,008	1,55,050
ఈబీసీ	37,414	51,680
మైనార్టీ	2,04,202	45,000
క్రిస్టియన్	4,695	5,005

జీబీఆర్ క్రిప్టో కాయిన్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: జీబీఆర్ క్రిప్టో కాయిన్ మోసం కేసులో తెలంగాణ సీఐడీ అధికారులు మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు ఏ–1 కుర్రిమెల రమేశ్‌గౌడ్‌తో పాటు ఏ–2 కుర్రిమెల ఉమారాణి, ఏ–6 నేతల సురేశ్‌కుమార్, ఏ–7 వై.ఎస్.రవి కుమార్‌రెడ్డి అరెస్టయ్యారు. తాజాగా సైనిక్‌పురికి చెందిన ఏ–11 సుధాకర్, వనస్థలిపురానికి చెందిన ఏ–12 కర్నాటి రమేశ్‌రెడ్డిలను సీఐడీ అదుపులోకి తీసుకుంది. తక్కువ కాలంలో లాభాలు అందిస్తామని ఆశచూపి, సుమారు 1,400 మంది డిపాజిటర్ల నుంచి దాదాపు రూ.95 కోట్లు నిందితులు సేకరించారు. కేసు దర్యాప్తు కొన సాగుతోందని సీఐడీ డీజీ శిఖాగోయల్ తెలిపారు.

యూట్యూబ్‌లో చూసి.. అమెజాన్‌లో ఆర్డర్ చేసి..

• సౌదీ హ్యాండ్లర్ ఆదేశాలతో పేలుళ్ల కోసం ప్రయోగాలు
• ఏపీలో రిహార్సల్స్
• కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారితో కలిసి సిరాజ్, సమీర్ ఇన్‌స్టా గ్రూప్
• హైదరాబాద్‌లో రహస్య సమావేశం
• విజయనగరం ఉగ్రమూలాల కేసులో వెలుగులోకి కొత్త కోణాలు

సాక్షి, హైదరాబాద్: విజయనగరం ఉగ్రకుట్ర కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో పట్టుబడ్డ ఏపీ విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్ భారీ విధ్వంసానికి ప్లాన్ చేసినట్టుగా తెలుస్తోంది. కర్ణాటక, మహారాష్ట్ర యువకులు సైతం వీరి గ్యాంగ్‌లో ఉన్నట్టు తెలిసింది. వీరంతా ఇటీవలే హైదరాబాద్‌లో సమావేశమై బాంబు పేలుళ్ల కుట్రలకు సంబంధించి పలు అంశాలు పంచుకున్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఏపీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా సిరాజ్, సమీర్‌లను ఆదివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విజయనగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో అనేక కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రలింకుల నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అధికారులు సైతం రంగంలోకి దిగారు. సోమవారం విజయనగరం వెళ్లి స్థానిక పోలీసులు, ఇరు రాష్ట్రాల ఇంటెలిజెన్స్ అధికారుల నుంచి కీలక సమాచారం సేకరించారు. సౌదీ హ్యాండ్లర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు భారీ పేలుళ్ల కుట్రకు తెరతీసినట్టు కీలక ఆధారాలు ఉండటంతో ఎన్‌ఐఏ ప్రత్యేకంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది.

ప్రత్యేకంగా ఇన్‌స్టాగ్రామ్ గ్రూపు

ఈ కుట్రలో సిరాజ్, సమీర్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారు కలిపి మొత్తం ఆరుగురు ఉన్నట్టు గుర్తించారు. వీరంతా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకోగా.. సౌదీ హ్యాండ్లర్ అన్ని కీలక విషయాలను వీరి గ్రూప్‌కు పంపుతున్నాడు. ఇప్పటికే వీరంతా హైదరాబాద్‌లో సమీర్ సహాయంతో ఒక రహస్య ప్రాంతంలో 3 రోజుల పాటు గడిపినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందులో ప్రధానంగా బాంబుల తయారీ, అందుకు అవసరమైన వస్తువుల కొనుగోలు, డమ్మీ బ్లాస్టులు చేయడం, ఆ తర్వాత ఎవరు.. ఎప్పుడు.. ఎక్కడ.. ఎవరిని కలవాలి, తదుపరి కార్యాచరణ వంటి అనేక విషయాలు చర్చించుకున్నారు. సమీర్, సిరాజ్‌కు బాంబుల తయారీ పదార్థాల కొనుగోలు, తయారీ బాధ్యతను హ్యాండ్లర్ అప్పగించాడు. యూట్యూబ్‌లో వీరిద్దరూ బాంబుల తయారీ విధానం చూసినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో పేలుడు పదార్థాలు కొనుగోలు చేస్తే అనుమానం వస్తుందని, విజయనగరానికి చెందిన సిరాజ్‌కు ఆ బాధ్యత అప్పగించారు. టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేసేందుకు ప్రయోగాలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇందుకు అవసరమైన టిఫిన్ బాక్సులు, వైర్లు, రిమోట్ సెల్స్ అమెజాన్‌లో ఆర్డర్ చేసినట్లు తేలింది. ఏపీ రంపచోడవరం అటవీ ప్రాంతంలో ఇప్పటికే పలుమార్లు రిహార్సల్స్ నిర్వహించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్‌లో డమ్మీ బ్లాస్టింగ్స్, ఆ తరువాత వరుస పేలుళ్లకు కుట్ర చేసినట్టు గుర్తించారు.

సమీర్ గురించి ఆరా..

సికింద్రాబాద్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తున్న సమీర్.. బోయిగూడ రైల్ కళారంగ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే ఉంటూ ఇన్‌స్టాగ్రామ్ గ్రూప్ ద్వారా ఇతర నిందితులకు, సౌదీలోని హ్యాండ్లర్‌కు టచ్‌లో ఉంటున్నాడు. హైదరాబాద్ కేంద్రంగా మిగిలిన ఆరుగురు సభ్యులకు షెల్టర్ ఇవ్వడం.. బాంబుల తయారీలో సిరాజ్‌కు సహకారం అందించడంలో కీలకంగా ఉంటున్నాడు. సమీర్ ఇంకా ఎవరెవరితో సన్నిహితంగా ఉండేవాడు.. సమీర్‌తో కాంటాక్ట్‌లో ఉన్న వారు ఎవరు అన్న విషయాలపై తెలంగాణ ఇంటెలిజెన్స్ ఆరా తీస్తోంది.

దేశం ధర్మసత్రం కాదు

- శరణార్థులకు ఆశ్రయం కుదరదు
- శ్రీలంకవాసి కేసులో 'సుప్రీం' వ్యాఖ్యలు
- శరణార్థులు దేశం వీడాలని ఆదేశం



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న శరణార్థులందరికీ ఆశ్రయం ఇవ్వడానికి భారత్‌ ధర్మసత్రమేమీ కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత్‌లో ఆశ్రయం ఓ శ్రీలంక శరణార్థి పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టేస్తూ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. ''భారత్‌ ఇప్పటికే 140 కోట్లకు పైగా జనాభాతో సతమతమవుతోంది. శరణార్థులకు ఆశ్రయమివ్వడానికి దేశం ధర్మసత్రం కాదు'' అని పేర్కొంది. శరణార్థులు తక్షణం భారత్‌ను వీడాలని ఆదేశించింది. వారికి భారత్‌లో ఆశ్రయం ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఎల్టీటీఈతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో అరెస్టయిన శ్రీలంకవాసి పిటిషన్‌పై జస్టిస్‌ దీపాంకర్‌ దత్తా, జస్టిస్‌ కె వినోద్‌ చంద్రన్‌ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ప్రాథమిక హక్కుల్లో భాగంగా పిటిషనర్‌కు స్వేచ్ఛగా జీవించే హక్కుందని ఆయన తరఫున లాయర్‌ వాదనను జస్టిస్‌ దీపాంకర్‌ దత్తా తోసిపుచ్చారు. ఆ హక్కు భారతీయ పౌరులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎల్‌టీటీఈ కార్యకర్త అనే అనుమానంతో పెటిషనర్‌ 2015లో అరెస్టయ్యాడు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిషేధ) చట్టం కింద దోషిగా తేలడంతో 2018లో పదేళ్ల జైలు శిక్ష పడింది. 2022లో మద్రాస్‌ హైకోర్టు దాన్ని ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష ముగియగానే భారత్‌ వీడాలని, అప్పటిదాకా శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. వాటిని సవాలు చేస్తూ అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ''2009లో శ్రీలంక యుద్ధంలో ఎల్‌టీటీఈ సభ్యుడిగా పోరాడినందున అక్కడ నన్ను బ్లాక్‌ గెజిటెడ్‌గా ఉంచారు. కనుక శ్రీలంకలో నాకు ప్రాణహాని ఉంది. నా భార్య పలు వ్యాధులతో, కుమారుడు పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుతో బాధపడుతున్నారు. వారు భారత్‌లోనే స్థిరపడ్డారు. నేను కూడా వారితో పాటు ఇక్కడే ఉండిపోతా'' అని అభ్యర్థించాడు. శ్రీలంకలో ప్రాణహాని ఉందని వాదించాడు. దానితో జస్టిస్‌ దత్తా పూర్తిగా విభేదించారు. ''అయితే మాత్రం ఇక్కడ స్థిరపడేందుకు మీకేం హక్కుంది? మరే దేశమైనా వెళ్లండి'' అని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు. రోహింగ్యా శరణార్థుల విషయంలో కూడా సుప్రీంకోర్టు ఇటీవల ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ''ఐరాస శరణార్థుల కార్డుల వంటివి ఉన్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అక్రమంగా దేశంలోకి చొరబడి ఉంటే తిప్పి పంపించేయాల్సిందే'' అని ఆదేశించింది.

మొసలి కన్నీళ్లు వద్దు

మీ వ్యాఖ్యలతో దేశమంతా సిగ్గుపడుతోంది

- మీరు కూడా ఇప్పటికైనా కనీసం సిగ్గుపడండి
- బీజేపీ మంత్రి విజయ్‌ షాపై సుప్రీం ఆగ్రహం
- మనస్ఫూర్తిగా క్షమాపణలు కూడా చెప్పరా?
- కల్నల్‌ ఖురేషీపై వ్యాఖ్యల కేసులో ధ్వజం
- ఇంకా దారుణ వ్యాఖ్యలు చేయబోయారు
- సమయానికి పదాలు దొరక్క ఆగారంతే
- మీలాంటి వాళ్లను ఏం చేయాలో తెలుసు
- తీవ్రంగా మండిపడ్డ జస్టిస్‌ సూర్యకాంత్‌
- ప్రత్యేక సిట్‌తో దర్యాప్తుకు ఆదేశాలు

న్యూఢిల్లీ: కల్నల్‌ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యల కేసులో మధ్యప్రదేశ్‌ గిరిజన సంక్షేమ మంత్రి కున్వర్‌ విజయ్‌ షా క్షమాపణలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ''న్యాయ విచారణ నుంచి బయటపడేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడుతున్నట్లు నటిస్తారు. మొసలి కన్నీరు కారుస్తారు. మీ క్షమాపణ అలాగే ఉంది. హైకోర్టులో మీరు క్షమాపణలు చెప్పిన వీడియో చూశాం. ఏదో కోర్టు అడిగింది కదా అని చెబుతున్నట్లుగా ఉంది. సూటిగా తప్పు ఒప్పుకుంటూ నేరుగా క్షమాపణలు చెప్పి ఉండాల్సింది. కానీ మీరేం చేశారు? అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటే, వాటివల్ల ఎవరైనా బాధ పడి ఉంటే అంటూ నానా వంకలూ తిప్పారు. ఇదెక్కడి క్షమాపణ? తప్పు ఒప్పుకునే పద్ధతేనా ఇది? ఇలాంటి వ్యవహార శైలికి సిగ్గుపడాలి మీరు'' అంటూ తూర్పార బట్టింది. ''నిజాయితీగా, మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఎందుకు? మీ వ్యాఖ్యలతో యావత్‌ దేశం సిగ్గుపడుతోంది'' అంటూ తీవ్రంగా మందలించింది. ఈ విషయంలో మంత్రిని అత్యున్నత న్యాయస్థానం గత వారమే తీవ్రంగా మందలించడం, కల్నల్‌ ఖురేషీకి క్షమాపణలు చెప్పాలని ఆదేశించడం తెలిసిందే. ఆ మేరకు మధ్యప్రదేశ్‌ హైకోర్టులో మంత్రి క్షమాపణలు చెప్పారు. తనపై కేసు కొట్టేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ పై న్యాయమూర్తులు జస్టిస్‌ సూర్యకాంత్‌, ఎన్‌.కోటీశ్వర్‌ సింగ్‌ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మంత్రి క్షమాపణలు చెప్పిన తీరుపై జస్టిస్‌ సూర్యకాంత్‌ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ''అలాంటి మొసలి కన్నీళ్లు వద్దు. కనుక మీ క్షమాపణలు అవసరం లేదు. మీలాంటి వాళ్ల విషయంలో ఎలా వ్యవహరించాలో మాకు బాగా తెలుసు'' అని స్పష్టం చేశారు. ''మీరో సీనియర్‌ రాజకీయ నాయకుడు. చాలా ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉన్నారు. ప్రతి మాటా ఆచితూచి మాట్లాడాలి. తద్వారా అందరికీ ఆదర్శంగా నిలవాలి. కానీ మీరేం చేశారు? కల్నల్‌ ఖురేషీపై వ్యాఖ్యల వీడియో పూర్తిగా చూశాం. మీరు దారుణ వ్యాఖ్యలు చేశారు. ఆ క్రమంలో మరింత అభ్యంతరకర పదజాలం కూడా వాడబోయారు. సమయానికి పదాలు దొరక్క ఆగిపోయారంతే! మన సైన్యం ఘనతను చూసి దేశమంతా గర్విస్తుంటే మీరేమో ఇలాంటి మతిలేని మాటలకు దిగారు. ఇలాంటి వ్యవహార శైలికి సిగ్గుపడాలి మీరు!'' అంటూ మండిపడ్డారు.

సిట్‌లో మహిళా ఐపీఎస్‌

మంత్రి వ్యాఖ్యలపై నమోదైన కేసులో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ మధ్యప్రదేశ్‌ ప్రభుత్వంపైన ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. దర్యాప్తు ప్రగతిపై పోలీసులను ప్రశ్నించి వారి సమాధానంపై పెదవి విరిచింది. ఈ కేసు దర్యాప్తుకు ముగ్గురు సీనియర్‌ ఐపీఎస్‌ ఆఫీసర్లతో సిట్‌ ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్‌ డీజీపీని ధర్మాసనం ఆదేశించింది. ''మంగళవారం ఉదయం పదింటికల్లా ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్‌ ఏర్పాటవ్వాలి. ముగ్గురు ఐపీఎస్‌లూ రాష్ట్రానికి చెందని వారై ఉండాలి. ఒక మహిళా ఐపీఎస్‌ ఉండాలి. మే 28లోగా సిట్‌ తొలి నివేదిక సమర్పించాలి'' అని పేర్కొంది. ఆపరేషన్‌ సిందూర్‌ వివరాలను వెల్లడించిన కల్నల్‌ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరిగా వర్ణిస్తూ విజయ్‌ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వాటిని మధ్యప్రదేశ్‌ హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. మంత్రిపై ఎఫ్‌ఐఆర్‌ నమోదుకు ఆదేశించింది.

ట్రంప్‌నెందుకు నిలువరించలేదు?

- 'కాల్పుల విరమణ'లో ట్రంప్‌ జోక్యంపై విపక్ష సభ్యుల ఆగ్రహం
- భారత్‌కు సంబంధం లేదు
- కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ
- ఆ ఒప్పందంలో అమెరికా పాత్ర ఎంతమాత్రమూ లేదని వెల్లడి
- 'ఆపరేషన్‌ సిందూర్‌' పరిణామాలను ప్యానెల్‌కు నివేదించిన విక్రం మిస్రీ

న్యూఢిల్లీ: భారత్‌, పాక్‌ పరస్పర సైనిక చర్యలు, తర్వాత నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, తదనంతర పరిణామాలు, పూర్వాపరాలపై విదేశీ వ్యవహారాల స్థాయీ సంఘంలో సోమవారం జరిగిన చర్చ చివరకు విపక్ష, అధికార పక్షాల వాదనలతో వాడీవేడిగా ముగిసింది. కేంద్రం తరఫున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్‌ మిస్రీ హాజరై సమగ్ర వివరాలను వెల్లడించగా విపక్ష కూటమి సభ్యులు ట్రంప్‌ జోక్యంపై ప్రధానంగా ప్రస్తావించి కేంద్ర నిర్లక్ష్య వైఖరిని తూర్పారబట్టారు. తన కారణంగానే కాల్పులు ఆగిపోయాయని, కాల్పుల విరమణ ఒప్పందం తెరమీదకొచ్చిందని ట్రంప్‌ దాదాపు ఏడు సార్లు సొంత డబ్బా కొట్టుకున్నా ప్రధాని మోదీ ఎందుకు ఆయనను నిలువరించలేదని విపక్ష సభ్యులు నిలదీశారు. కాల్పుల విరమణ కోసం మధ్యవర్తిత్వం వహించాలని అమెరికాను కోరలేదని ప్రభుత్వ వైఖరిని మిస్రీ స్పష్టంచేశారు. అమెరికా అధ్యక్షుడే ఉద్దేశపూర్వకంగా సొంతంగా కలుగజేసుకునేందుకు ప్రయత్నించారని, జోక్యంపై ట్రంప్‌ కనీసం భారత్‌ నుంచి అనుమతి కూడా తీసుకోలేదని మిస్రీ చెప్పారు. ట్రంప్‌ ప్రకటనలను విపక్ష సభ్యులు ప్రస్తావించడం, మోదీ ప్రభుత్వానికి ట్రంప్‌కు ఎలాంటి సంబంధం లేదని మిస్రీ వాదించడంతో కొద్దిసేపు సమావేశంలో వాడీవేడి చర్చ జరిగిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రికార్డ్‌ స్థాయిలో 24 మంది సభ్యులు పాల్గొన్న ఈ సమావేశం ఏకంగా మూడు గంటలపాటు సాగింది. కాంగ్రెస్‌ ఎంపీ శశిథరూర్‌ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తృణమూల్‌ కాంగ్రెస్‌ తరఫున అభిషేక్‌ బెనర్జీ, కాంగ్రెస్‌ తరఫున రాజీవ్‌ శుక్లా, దీపేందర్‌ హూడా, ఎంఐఎం తరఫున అసదుద్దీన్‌ ఒవైసీ, బీజేపీ తరఫున అపరాజితా సారంగి, అరుణ్‌ గోవిల్‌లు పాల్గొన్నారు. ''కాల్పుల విరమణలో అమెరికా మధ్యవర్తిత్వం చేయలేదు. మధ్యవర్తిగా ఉండాలని కోరలేదు. కాల్పుల విరమణ కేవలం ద్వైపాక్షికమే. తొలుత ఉద్రిక్త పరిస్థితులున్నా తర్వాత సద్దుమణిగాయి. అవి దాదాపు అణుయుద్ధానికి దారి తీశాయన్న వాదనల్లో ఎలాంటి నిజంలేదు'' అని మిస్రీ చెప్పారు

ఆయనే కావాలనే దూరారు

''తాను మధ్యవర్తిత్వం చేయడం వల్లే అణుయుద్ధ మేఘాలు విడిపోయాయని, జమ్మూకశ్మీర్‌ సమస్యలను పరిష్కరిస్తానని పదేపదే ట్రంప్‌ చెబుతున్నా మోదీ సర్కార్‌ ఎందుకు ఆయనను నిలువరిస్తూ ప్రకటనలు చేయలేదు?'' అని విపక్ష సభ్యులు ప్రశ్నించారు. ''ఇంత జరుగుతున్నా అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్‌) నుంచి పాక్‌ నిధులెలా సంపాదించింది?. భారత్‌ ఎందుకు నిధులను అడ్డుకోలేకపోయింది. ఆర్మీకి వ్యతిరేకంగా సోషల్‌ మీడియాలో వార్తలు వెల్లువెత్తుతుంటే ప్రభుత్వం ఎందుకు వెంటనే స్పందించలేకపోయింది?'' అని విపక్ష సభ్యులు ప్రశ్నించారు. వీటికి మిస్రీ సమాధానమిచ్చారు. ''జోక్యం మాటున ట్రంపే స్వయంగా భారత్‌, పాక్‌ మధ్యలో దూరిపోయారు. ట్రంప్‌ జోక్యం విషయంలో భారత ప్రమేయం లేదు. ఉద్దేశపూర్వకంగా జమ్మూకశ్మీర్‌ అంశాన్ని ఆయన ప్రస్తావించారు'' అని మిస్రీ స్పష్టంచేశారు. చైనా తయారీ సైనిక ఉపకరణాలను పాకిస్తాన్‌ వినియోగించిందన్న విపక్షాల వాదనలను మిస్రీ తోసిపుచ్చారు. ''వాళ్లు ఏ దేశానికి చెందిన ఆయుధాలు వాడారనేది ఇక్కడ ప్రధానం కాదు. మనం వాళ్లను ఎంత బలంగా దెబ్బకొట్టామనేదే ముఖ్యం'' అని మిస్రీ అన్నారు. పరస్పర సైనిక చర్యల్లో మనం ఎన్ని యుద్ధవిమానాలను కోల్పోయామన్న విపక్షాల ప్రశ్నకు మిస్రీ సమాధానం ఇవ్వలేదు. ఇది జాతీయ భద్రతతో ముడిపడిన అంశమైనందున వివరాలు వెల్లడించట్లేదని పేర్కొన్నారు. మీపై దాడి చేయబోతున్నామని పాకిస్తాన్‌కు ముందే భారత్‌ అధికారికంగా తెలియజేసిందన్న వార్తలను మిస్రీ తోసిపుచ్చారు. ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా కేవలం ఉగ్రస్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని, ఆర్మీ బేస్‌లు, జనావాసాలపై దాడులు చేయలేదని మాత్రమే, దాడుల తర్వాత పాక్‌కు తెలిపామని మిస్రీ స్పష్టం చేశారు. ఈ విషయంలో విదేశాంగ శాఖ మంత్రి ఎస్‌.జైశంకర్‌ చేసిన ప్రకటనను కొందరు వక్రీకరించారని మిస్రీ తెలిపారు. తుర్కియే మొదట్నుంచీ భారత్‌కు దూరంగానే ఉంటోందని గుర్తుచేశారు. అయితే దాడులను భారత్‌ ఆపేశాక ఆగ్రహంతో సామాజిక మాధ్యమాల్లో మిస్రీపై జరుగుతున్న ట్రోలింగ్‌ను స్థాయీ సంఘం సభ్యులంతా ఏకగ్రీవంగా ఖండించడం విశేషం.

తక్షణ చర్చలకు రష్యా, ఉక్రెయిన్‌ అంగీకరించాయి: ట్రంప్‌

పుతిన్‌, జెలెన్‌స్కీతో చర్చలు

వాషింగ్టన్‌: కాల్పుల విరమణ దిశగా రష్యా, ఉక్రెయిన్‌ తక్షణం చర్చలు మొదలు పెడతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ ప్రకటించారు. ఇరు దేశాధినేతలు వ్లాదిమిర్‌ పుతిన్‌, జెలెన్‌స్కీ ఇందుకు అంగీకరించినట్టు వెల్లడించారు. చర్చల విధివిధానాలను ఆ దేశాలే నిర్ణయించుకుంటాయని చెప్పారు. పుతిన్‌తో ట్రంప్‌ సోమవారం రెండు గంటలకు పైగా సుదీర్ఘంగా ఫోన్‌ చర్చలు జరిపారు. అనంతరం జెలెన్‌స్కీతోనూ చర్చించారు. ''యుద్ధం ముగిశాక అమెరికాతో రష్యా భారీ ఎత్తున వ్యాపారం చేయాలని పుతిన్‌ అభిలషించారు. అందుకు నేను సరేనన్నాను'' అని చెప్పుకొచ్చారు. తద్వారా ఉక్రెయిన్‌ కూడా భారీగా లబ్ధి పొందుతుందని అభిప్రాయపడ్డారు. యుద్ధానికి తెర దించడంపై పుతిన్‌, ట్రంప్‌ మధ్య ఇది మూడో ఫోన్‌ సంభాషణ కావడం విశేషం! చర్చల వివరాలను జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్‌ కమిషన్‌ చీఫ్‌ ఉర్సులా వాండెర్‌ లెయన్‌, ఫ్రాన్స్‌, ఇటలీ, జర్మనీ తదితర దేశాధినేతలతో పంచుకున్నట్టు అధ్యక్షుడు వివరించారు.

బైడెన్‌కు కేన్సర్‌

- ప్రొస్టేట్‌ కేన్సర్‌గా గుర్తింపు
- ప్రమాదకర దశలో ఉందన్న వైద్యులు



వాషింగ్టన్‌: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌ (82)కు ప్రొస్టేట్‌ కేన్సర్‌ నిర్ధారణ అయ్యింది. బైడెన్‌ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో ఈ మేరకు తెలిపింది. మూత్ర సంబంధిత సమస్యల కారణంగా బైడెన్‌ గత వారం వైద్యులను సంప్రదించారు. పరీక్షల అనంతరం ఆయనకు ప్రొస్టేట్‌ కేన్సర్‌ ప్రమాదకర దశలో ఉన్నట్లు నిర్ధారించారు. దాని తీవ్రతను గ్లీసన్‌ స్కోర్‌ 9గా నిర్ధారించారు. ''బైడెన్‌కు కేన్సర్‌ కణాలు ఎముకలకు వ్యాపించినట్టు గుర్తించారు. కేన్సర్‌ తీవ్ర దశలో ఉన్నప్పటికీ అది హార్మోన్‌ ఆధారిత తరహాది కావడంతో సమర్థమైన చికిత్సకు అవకాశముంది'' అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలాంటి వైద్య చికిత్స తీసుకోవాలనే అంశంపై బైడెన్‌, కుటుంబీకులు వైద్యులతో చర్చిస్తున్నట్టు ఆయన కార్యాలయం వెల్లడించింది. దీనిపై బైడెన్‌ ఎక్స్‌ వేదికగా స్పందించారు. ''కేన్సర్‌ ఎవరినీ వదలదు. మీలో చాలామంది మాదిరిగానే నేనూ దాని బారిన పడ్డానని తెలిసింది. ఇలాంటి సమయంలో నాకు, జిల్‌ (భార్య)కు మద్దతుగా నిలిచినందుకు అందరికీ కృతజ్ఞతలు'' అని పేర్కొన్నారు. తాను, భార్య ఉన్న ఫొటోను పోస్ట్‌ చేశారు. ప్రొస్టేట్‌ కేన్సర్‌ను నయం చేయడం చాలా కష్టం. దాని తీవ్రతను గ్లీసన్‌ స్కోర్‌లో 6 నుంచి 10 దాకా కొలుస్తారు. 8 నుంచి 10 వరకు అత్యంత తీవ్ర దశ అని అర్థం. మిగతా కేన్సర్లలా కాకుండా ప్రొస్టేట్‌ కేన్సర్‌ శరీర భాగాలన్నింటికీ విస్తరిస్తుంది. ఆ క్రమంలో ఎముకలకు సోకుతుంది. కనుక మందుల ద్వారా ఈ కేన్సర్‌ కణాలను ఒంటినుంచి సమూలంగా నిర్మూలించడం చాలా కష్టమని వైద్యులు చెబుతారు. అయితే బైడెన్‌లో కనిపించిన కేన్సర్‌ హార్మోన్లపై ఆధారపడది వృద్ధి చెందే తరహాది. ఇలాంటి కేన్సర్లకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులతో ప్రభావవంతమైన చికిత్స అందించవచ్చు. ''దీన్ని పూర్తిగా నయం చేయలేం. ఆపరేషన్‌, రేడియేషన్‌ థెరపీ కూడా మంచిది కాదు. మంచి చికిత్సే మెరుగైన మార్గం'' అని మసాచుసెట్స్‌ జనరల్‌ బ్రిగమ్‌ కేన్సర్‌ సెంటర్‌కు చెందిన డాక్టర్‌ మాథ్యూ స్మిత్‌ తెలిపారు.

దాచిపెట్టారా?

ప్రొస్టేట్‌ కేన్సర్‌కు సంబంధించి బైడెన్‌ ప్రకటనపై అమెరికా వైద్య నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాధి ఇంత తీవ్ర స్థాయికి చేరేదాకా ముందస్తు సంకేతాలే లేవంటే నమ్మశక్యంగా లేదంటున్నారు. ''బహుశా వ్యాధి విషయం బైడెన్‌కు చాలాకాలంగా తెలుసు. కానీ ఇంతకాలం దాచి ఉంటారు'' అని అభిప్రాయపడుతున్నారు. జో బైడెన్‌ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఆయన ఆరోగ్యంపై ఊహాగానాలు చెలరేగడం దీనికి బలం చేకూరుస్తుంది. ముఖ్యంగా గత అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఆరోగ్యమే ప్రధాన చర్చనీయాంశంగా కూడా మారింది. అధ్యక్ష పదవికి తిరిగి పోటీ చేయాలని 2024 జూన్‌లో బైడెన్‌ నిర్ణయించుకున్నప్పుడు తీవ్ర చర్చే జరిగింది. కానీ ప్రత్యర్థిగా నిలిచిన ట్రంప్‌తో డిబేట్‌లో పూర్తిగా తేలిపోవడం, పలుమార్లు పదాల కోసం కూడా తడుముకోవడం వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో బరిలో నుంచి తప్పుకోవాలంటూ సొంత పార్టీ నుంచి కూడా డిమాండ్లు పెరగడంతో చివరికి వాటికి తలొగ్గారు. పలువురు భారత వైద్య నిపుణులు దీనిపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం విశేషం. కొన్నిసార్లు ప్రొస్టేట్‌ కేన్సర్‌ బాగా ముదిరేదాకా బయట పడకపోవడం సహజమేనని వారు చెప్పుకొచ్చారు.

స్పందించిన ట్రంప్‌, హారిస్‌, మోదీ

బైడెన్‌కు కేన్సర్‌ అని తేలడంపై అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ''విషయం తెలిసి నేను, మెలానియా చాలా బాధపడ్డాం. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం'' అని సోషల్‌ మీడియాలో పోస్ట్‌చేశారు. బైడెన్‌ కేన్సర్‌ బారిన పడ్డారనే విషయం తనను కలచివేసిందని మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ ఎక్స్‌లో పోస్ట్‌ చేశారు. కేన్సర్‌పై బైడెన్‌ తన ట్రేడ్‌ మార్క్‌ సంకల్పంతో పోరాడతారని మాజీ అధ్యక్షుడు బరాక్‌ ఒబామా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్‌, పలువురు సెనేటర్లు తదితరులు కూడా బైడెన్‌ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

2023లోనే చర్మ కేన్సర్‌


బైడెన్‌కు 2023లోనే ప్రాథమిక తరహా చర్మ కేన్సర్‌ బయటపడింది. అంతకుముందు 2021లో పెద్దపేగులో అసాధారణంగా పెరిగిన కణజాలాన్ని తొలగించారు. దాన్ని కేన్సర్‌ ప్రాథమిక దశగా పరిగణిస్తారు.

సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులపై విచారణకు

ముందస్తు అనుమతి ఎందుకు?

సమీక్షించాల్సిన టైమొచ్చింది: ధన్‌ఖడ్‌

- జస్టిస్‌ వర్మ ఉదంతమే తాజా నిదర్శనం
- నోట్ల కట్టలు బయటపడి రెండు నెలలైంది
- దేశమంతా ఊపిరి బిగబట్టి మరీ చూస్తోంది
- ఆయనపై ఇంకా ఎఫ్‌ఐఆరే నమోదు కాలేదు
- నేరన్యాయ చట్టాలు ఈ కేసుకు వర్తించవా?
- ఇది తీవ్రమైన విషయమన్న ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణల్లో న్యాయ విచారణల నుంచి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ఉన్న రక్షణకు సంబంధించి ఉపరాష్ట్రపతి జగ్‌దీప్‌ ధన్‌ఖడ్‌ సంచలన వ్యాఖ్యలు చేశారు. వారిపై అభియోగాలు వచ్చినప్పుడు విచారించేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. అందుకు సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. సోమవారం ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ యశ్వంత్‌ వర్మ నివాసంలో నోట్ల కట్టల కేసును ప్రస్తావించారు. ''అది బయటపడి రెండు నెలలవుతోంది. అయినా జస్టిస్‌ వర్మపై ఇప్పటికీ ఎఫ్‌ఐఆర్‌ నమోదు కాలేదు. పైగా దానిపై విచారణ జరిపిన ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ సాక్షుల నుంచి కేసుకు సంబంధించిన ఎల్రక్టానిక్‌ పరికరాలను స్వాధీనం చేసుకుంది. అలా ఎలా చేస్తారు? ఇది చాలా తీవ్రమైన అంశం'' అంటూ మండిపడ్డారు. జస్టిస్‌ వర్మపై ఎఫ్‌ఐఆర్‌ నమోదులో ఇంత ఆలస్యం ఎందుకని ధన్‌ఖడ్‌ ప్రశ్నించారు. ''ఆయన నివాసంలో బయటపడ్డ డబ్బెంత, దాని మూలాలేమిటి, అది ఎవరికి చెందినది, ఈ ఉదంతం న్యాయవ్యవస్థనే కలుషితం చేసిందా వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి ప్రజలంతా ఊపిరి బిగబట్టి మరీ ఎదురు చూస్తున్నారు. దీని వెనక దాగున్న పెద్ద తిమింగలాలెవరో కనిపెట్టి బయట పెట్టాల్సిన అవసరముంది. దేశ పౌరులందరికీ సమానంగా వర్తించే నేరన్యాయ వ్యవస్థను ఇంత కీలకమైన కేసుకు ఎందుకు వర్తింపజేయలేదు?'' అంటూ ప్రశ్నలు గుప్పించారు. రెండు నెలలు దాటుతున్నా ఈ ప్రశ్నల్లో వేటికీ ఇప్పటిదాకా బదులు లేదన్నారు. ''జస్టిస్‌ వర్మ కేసులో సత్వర విచారణ జరగాల్సిన అవసరముంది. 1991లో సుప్రీంకోర్టు ఇచ్చిన కె.వీరాస్వామి తీర్పును పునఃపరిశీలించాల్సిన సమయం కూడా వచ్చింది'' అని ధన్‌ఖడ్‌ అన్నారు. జస్టిస్‌ వర్మ ఇంట్లో భారీగా నోట్లకట్టలు బయటపడటం నిజమేనని కమిటీ తేల్చడం, సీజేఐ ఆ నివేదికను రాష్ట్రపతికి పంపడం, ఆయన్ను పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేయడం తెలిసిందే.

పారదర్శక నియంత్రణ వ్యవస్థ కావాలి

దురుద్దేశపూర్వక ఆరోపణలు తదితరాల నుంచి ఉన్నతస్థాయి న్యాయమూర్తులకు తప్పకుండా రక్షణ కల్పించాల్సిందేనని ధన్‌ఖడ్‌ అభిప్రాయపడ్డారు. అయితే ఈ విషయంలో సమగ్రమైన అంతర్గత నియంత్రణ వ్యవస్థ కూడా అత్యంత అవసరమని స్పష్టం చేశారు. అది పూర్తి పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, వేగవంతంగా ఉండాలని సూచించారు. ''జస్టిస్‌ వర్మ ఉదంతంపై ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక హైకోర్టు న్యాయమూర్తితో సీజేఐ ఒక కమిటీ వేశారు. నిజానిజాలను నిగ్గుదేల్చేందుకు వారెంతగా శ్రమించి ఉంటారో ఒక్కసారి ఊహించుకోండి. కానీ వారి కమిటీకి ఎలాంటి రాజ్యాంగబద్ధతా, చట్టబద్ధతా లేవు. వారిచ్చే నివేదికను సుప్రీంకోర్టు సొంతంగా ఏర్పాటు చేసుకుని పాలనపమైన ఏర్పాటును అనుసరించి ఎవరికైనా పంపవచ్చు. ఇక ఆ నివేదిక ప్రయోజనమేమిటి?'' అని ఆయన ప్రశ్నించారు.

ఏమిటా తీర్పు?

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు అవినీతి నిరోధక చట్టాల వర్తింపు విషయమై కె.వీరాస్వామి వర్సెస్‌ యూనియన్‌ ఆఫ్‌ ఇండియా కేసులో 1991లో అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ''న్యాయమూర్తులు కూడా ప్రజా సేవకులే. కానీ ఆ చట్టం ప్రకారం వారిని విచారించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరి'' అని పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలంటే ఇది తప్పనిసరి తెలిపింది.

హైకోర్టు జడ్జీలందరికీ సమాన పెన్షన్‌

- పదవీకాలం తదితరాలతో ఏ మాత్రమూ నిమిత్తం లేదు
- వన్‌ ర్యాంక్‌, వన్‌ పెన్షన్‌ వారికి వర్తిస్తుంది: సుప్రీంకోర్టు
- మాజీ సీజేలకు ఇకపై రూ.15 లక్షల వార్షిక పెన్షన్‌
- న్యాయమూర్తులకు రూ.13.5 లక్షలు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ: మాజీ న్యాయమూర్తుల పెన్షన్‌ తదితరాల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ''నియామక తేదీ, పద్ధతి, పదవీకాలం తదితరాలతో నిమిత్తం లేకుండా రిటైర్డ్‌ హైకోర్టు న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్‌ అందజేయాల్సిందే. ఎందుకంటే హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన రోజునుంచే వారు రాజ్యాంగపరమైన శ్రేణిలోకి వస్తారు. కనుక అలాంటి రాజ్యాంగపరమైన పదవుల విషయంలో వన్‌ ర్యాంక్‌, వన్‌ పెన్షన్‌ విధానమే పాటించాలి'' అని స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్‌ బి.ఆర్‌.గవాయ్‌, న్యాయమూర్తులు జస్టిస్‌ అగస్టీన్‌ జార్జ్‌ మసీ, జస్టిస్‌ కె.వినోద్‌చంద్రన్‌ ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, గౌరవాన్ని నిలబెట్టేందుకు న్యాయమూర్తుల వేతనాల్లాగే వారి పదవీ విమరణ ప్రయోజనాలు కూడా ఒకేరకంగా ఉండటం తప్పనిసరి అని సీజేఐ గవాయ్‌ అభిప్రాయపడ్డారు. ''హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలు, పెన్షన్‌ తదితరాల విషయంలో వారి నియామక తేదీ, బాధ్యతల తరహా (శాశ్వత, అదనపు న్యాయమూర్తులు), నేపథ్యం (బార్‌, జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ) వంటివి ప్రాతిపదిక అసలే కారాదు. అది వివక్షాపూరితమే గాక ఆర్టికల్‌ 14కు విరుద్ధం కూడా'' అని పేర్కొంది. ఈ మేరకు 63 పేజీల తీర్పు వెలువరించింది. ''జిల్లా న్యాయాధికారులుగా, బార్‌ సభ్యులుగా వారి సేవలను, అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, జిల్లా న్యాయాధికారిగా రిటైరయ్యాక హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి మధ్యలో ఉండే అంతరం వంటివి కూడా తక్కువ పెన్షన్‌కు ప్రాతిపదిక కావడానికి వీల్లేదు. నూతన పెన్షన్‌ పథకం (ఎన్‌పీఎస్‌) అమల్లోకి వచ్చాక బాధ్యతలు చేపట్టినా సరే, హైకోర్టు న్యాయమూర్తుల (వేతనాలు, సర్వీసు నిబంధనల) చట్టం, 1954 ప్రకారం ప్రావిడెంట్‌ ఫండ్‌ తదితరాలకు కూడా వారు పూర్తిగా అర్హులు'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. రిటైర్డ్‌ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు రూ.15 లక్షలు, న్యాయమూర్తులకు రూ.13.5 లక్షల చొప్పున మౌలిక వార్షిక పెన్షన్‌ అందించాలని పేర్కొంది. రిటైర్డ్‌ హైకోర్టు అదనపు న్యాయమూర్తుల మరణానంతరం సంబంధీకులకు కుటుంబ పెన్షన్‌, గ్రాట్యుటీ తదితరాలను నిరాకరించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. అలాగే జాతీయ గ్రీన్‌ ట్రిబ్యునల్‌ న్యాయమూర్తులకు, జిల్లా న్యాయమూర్తులకు కూడా పదవీ విరమణ ప్రయోజనాలు సమానంగా ఉండాలని ఆదేశించింది.

అఖిలపక్ష బృందం నుంచి పఠాన్‌ నిష్క్రమణ

మమ్మల్ని సంప్రదించకుండానే చేర్చారు: టీఎంసీ

న్యూఢిల్లీ/కోల్‌కతా: ఆపరేషన్‌ సిందూర్‌ తర్వాత భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్‌ను అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు విదేశాల్లో పర్యటించే అఖిలపక్ష బృందాల జాబితా నుంచి తృణమూల్‌ కాంగ్రెస్‌ ఎంపీ యూసుఫ్‌ పఠాన్‌ నిష్క్రమించారు. తమను కనీసం సంప్రదించకుండానే తమ పార్టీ ఎంపీని ఈ బృందంలో చేర్చేశారని తృణమూల్‌ కాంగ్రెస్‌ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. విదేశాల్లో భారత దౌత్యయుద్ధంలో పాల్గొనబోమని చెప్పట్లేమని, కనీసం తమ తరఫున ఎవరిని పంపాలనే స్వేచ్ఛ తమకు ఉండాలని టీఎంసీ పేర్కొంది. పరస్పర సైనిక చర్యల్లో భారత వాణిని బలంగా వినిపించేందుకు ఇండోనేసియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్‌, సింగపూర్‌లకు వెళ్లే బృందానికి జనతాదళ్‌(యూ) ఎంపీ సంజయ్‌ ఝా నేతృత్వం వహిస్తుండగా ఈ బృందంలో యూసుఫ్‌ పఠాన్‌ పేరును చేర్చుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం తెల్సిందే. ఈ వైఖరిని టీఎంసీ తప్పుబట్టింది.

మళ్లీ బ్రిటన్‌, ఈయూ చెట్టాపట్టాల్‌

కీలక అంశాల్లో పరస్పర సహకారానికి చరిత్రాత్మక డీల్‌ ఖరారు

లండన్‌: బ్రెగ్జిట్‌ అంటూ ఐరోపా సమాఖ్యతో తెగదెంపులు చేసుకుని ఆర్థిక కష్టాల కడలిలో మునిగిన బ్రిటన్‌ మళ్లీ అదే యూరోపియన్‌ యూనియన్‌ చేయూతతో ఆర్థికపథంలో పరుగెత్తేందుకు సమాయత్తమైంది. పరస్పర సహకారమే లక్ష్యంగా లండన్‌ వేదికగా బ్రిటన్‌, యూరోపియన్‌ యూనియన్‌ అగ్రనేతల మధ్య సోమవారం జరిగిన చర్చలు ఫలించాయి. దీంతో చరిత్రాత్మక డీల్‌కు బాటలుపడ్డాయి. 2016 జూన్‌ 23న బ్రెగ్జిట్‌కు అనుకూలంగా బ్రిటన్‌వాసులు ఓటేశాక 2020లో ఈయూ నుంచి విడిపోయాక ఐరోపా సమాఖ్యతో మళ్లీ సమగ్రస్థాయి ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే తొలిసారి. సోమవారం లండన్‌లో జరిగిన సమావేశంలో బ్రిటన్‌ తరఫున ప్రధాని కీర్‌ స్టార్మర్‌, ఈయూ తరఫున యురోపియన్‌ కమిషన్‌ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌ డీర్‌, యురోపియన్‌ కౌన్సిల్‌ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చర్చలు సఫలమయ్యాక పలు అంశాలపై ఇరు వర్గాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. అయితే ఈ నూతన అంశాలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనేది తెలియరాలేదు. ఒప్పందంలోని ముఖ్యాంశాలు..

- ఆహార వాణిజ్యంలో సంక్లిష్టమైన అనుమతులు, ఆంక్షలను ఎత్తేశారు. దీంతో ఆహారోత్పత్తుల్లో స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం లభించింది.
- వృక్ష, జంతు సంబంధ ఆహారం తరలింపులో సరిహద్దు వద్ద సాధారణ తనిఖీలను ఇకపై ఆపేస్తారు. ఆహారోత్పత్తుల ఎగుమతి, దిగుమతి వ్యయాలు భారీగా తగ్గి యూకే, ఈయూల్లో ఆహార ధరలు దిగిరానున్నాయి.
- బ్రిటిష్‌ బర్గర్లు, సాస్‌లు, సముద్ర ఆహారం ఇకపై ఈయూ దేశాలకు ఎగుమతి కానుంది.
- ఈయూ ఎయిర్‌పోర్ట్‌ల వద్ద బ్రిటన్‌ పౌరుల క్యూలు తగ్గిపోయి సులభంగా సరిహద్దును దాటేయొచ్చు. సరిహద్దుల వద్ద ఆటోమేటిక్‌ ద్వారాలైన ఈ–గేట్స్‌ను బ్రిటన్‌ పౌరులు ఇకపై విరివిగా వినియోగించుకోవచ్చు.
- బ్రిటన్‌ సముద్రజలాల్లో ఈయూ సభ్యదేశాల పడవలు చేపలు పట్టుకునేందుకు ఇచ్చిన గడువును 2038 జూన్‌ 30వ తేదీదాకా పొడిగించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం : 20 : మే : 2025



మంచి మాటలు చెప్పినందుకు...

మద్యానికి బానిసైన వ్యక్తికి మంచి మాటలు చెప్పినందుకు ఓ వ్యక్తి తన బావ వరుసైన వ్యక్తిని నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. -8లో



యురేకా... ఒసాకా

దశాబ్దాల చరిత్ర కలిగిన జపాన్‌లో జరిగే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రదర్శన ఒసాకా ఎక్స్‌పోలో మన సిటీకి చోటు దక్కింది.

- సిటీప్లస్‌లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/26.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



హైదర్‌నగర్‌లో జేసీబీతో ఆక్రమణలు తొలగించిన దృశ్యం

ఆక్రమణలకు హైడ్రా చెక్

రెండు ప్రాంతాల్లో ‘ఆపరేషన్స్’

పుప్పాలగూడ, హైదర్‌నగర్‌లో అక్రమ కట్టడాల తొలగింపు

- ఓ ప్రాంతంలో రోడ్డు, పార్కుల్లో ఉన్నవి కూల్చివేత
- మరోచోట 9 ఎకరాల హెచ్‌ఎండీఏ భూమి సంరక్షణ
- న్యాయస్థానం ఆదేశాల మేరకే చర్యలు: కమిషనర్



హైదర్‌నగర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లోని ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయి విచారణ చేసిన అధికారులు ఆక్రమణలుగా తేల్చి కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లో ఉన్న డైమండ్ హిల్స్, మణికొండలోని పుప్పాలగూడలో ఉన్న డాలర్ హిల్స్‌ల్లో కూల్చివేతలు చేపట్టారు. హైడ్రా ఈ రెండు చోట్లా బోర్డులు ఏర్పాటు చేసింది.

కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ...

హైదర్‌నగర్ సర్వే నం.145లోని 9 ఎకరాల్లో డైమండ్ హిల్స్ పేరుతో లేఔట్ వేశారు. 79 ప్లాట్లతో కూడిన 2000 సంవత్సరం నాటి దీనికి హెచ్‌ఎండీఏ అనుమతి ఉంది. 2007లో అన్ రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ డీడ్‌తో డాక్టర్ ఎస్ఎస్‌డీ ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమణలు మొదలెట్టారు. ప్లాట్ యజమానులు పార్టీ కాని కేసుల్లో ఎక్స్ పార్టీ డిక్రీ తీసుకుని బైలీఫ్ ద్వారా వ్యవసాయ భూమి అని చూపుతూ ఏడెకరాలు ఆక్రమించారు. ఆ కేసులో ప్లాట్ యజమానులను పార్టీ చేయకుండా కోర్టును తప్పుదోవ పట్టించి పొందిన బైలీఫ్ ఆర్డర్‌తో ఈ లే ఔట్‌లోని స్విమ్మింగ్‌పూల్, రహదారులు, పార్కులు, ప్లాట్ల హద్దులు, పునాదులను చెరిపేసి ఆక్రమించారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 9న హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ప్రసాద్ ఖాళీ చేయడం లేదని వాపోయారు. ఆ భూమిని వివిధ సంస్థలకు పార్కింగ్ కోసం అద్దెకు ఇస్తూ నెలకు రూ.50 లక్షలకు పైగా ఆర్జిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లేఔట్‌లోని మిగతా రెండు ఎకరాల్లో ఉన్న ప్లాట్లకు వెళ్లడానికి వీలు లేకుండా ఫెన్సింగ్ కూడా వేశారని వాపోయారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న హైడ్రా కమిషనర్ గత బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలు నిర్ధారించి సోమవారం వాటిని తొలగించే చర్యలు తీసుకున్నారు.

డాలర్ హిల్స్‌లోనూ ఇదే తరహా కథ..

పుప్పాలగూడలోని డాలర్ హిల్స్‌లోనూ ఆక్రమణల్ని హైడ్రా తొలగించింది. సర్వే నం. 104/1, 106, 113ల్లో సంతోష్‌రెడ్డి, ఆయన మిత్రులకు 60 ఎకరాల భూమి ఉంది. ఇందులోని 30 ఎకరాల్లో 1998లో డాలర్ హిల్స్ లే ఔట్ వేశారు. హెచ్‌ఎండీఏ ప్రిలిమినరీ లేఔట్‌తో మొత్తం 80 శాతం ప్లాట్లు అమ్మేశారు. ఆపై లేఔట్ రద్దయ్యేలా ప్రయత్నించి 2005లో చేయించారు. ఆపై స్థల యజమానులు కుమ్మక్కై వ్యవసాయ భూమిగా మార్చుకున్నారు. ఈ విషయం అప్పటికే ప్లాట్లు కొన్న వారికి తెలీదు. ఎల్ఆర్ఎస్‌తో అనుమతులు తీసుకుని కొందరు ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. సంతోష్‌రెడ్డి తదితరులు ఈ లేఔట్‌లోని రెండు ఎకరాల పార్కు, రహదారులతో పాటు కొన్ని ప్లాట్లను కలిపి పక్కనే ఉన్న 30 ఎకరాల భూమికి జోడించారు. దీన్ని ఎన్‌సీసీ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మేశారు. 2016 నుంచి ఈ వివాదం కోర్టులో ఉన్నప్పటికీ అనుమతులు తీసుకోకుండా ఎన్‌సీసీ నిర్మాణాలు చేపడుతోందని నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కమిషనర్ రంగనాథ్ ఈ నెల 14న క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా హైడ్రా సోమవారం అక్కడి నిర్మాణాలు తొలగించింది. అనుమతి లేకుండా సెల్లార్లు తవ్వడం, పేలుడు పదార్థాలను వినియోగించడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. పార్కులు, రహదారులు ఆక్రమించిన కేసుల్లో ఇంప్లీడ్ అవ్వాలని హైడ్రా నిర్ణయించింది.

‘స్టీల్’ కారిడార్

సికింద్రాబాద్-శామీర్‌పేట్ రూట్లో ఎలివేటెడ్ వంతెన నిర్మాణం

- ఏడాదిన్నరలో పూర్తయ్యేలా హెచ్‌ఎండీఏ ప్రణాళికలు
- హకీంపేట్ వద్ద సొరంగ మార్గం
- బేగంపేట్‌ఎయిర్‌పోర్ట్ టన్నెల్‌పై త్వరలో ఎయిర్‌పోర్ట్ అథారిటీతో ఒప్పందం
- హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సాధారణంగా సిమెంట్‌తో చేపట్టే ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణ సమయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్టీల్ కారిడార్ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో నిర్మాణ వ్యయం కొద్దిగా పెరిగినా కాలపరిమితి గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు 18.10 కిలోమీటర్ల కారిడార్‌ను స్టీల్‌తో నిర్మిచడం వల్ల కేవలం ఏడాదిన్నర కాలంలో పూర్తిచేసేందుకు అవకాశం ఉంది. సిమెంట్ బ్రిడ్జి నిర్మాణానికి ఐదేళ్ల కంటే ఎక్కువ సమయంపట్టవచ్చునని అంచనా. రెండు నిర్మాణ నమూనాల మధ్య ఉన్న కాలవ్యవధిని దృష్టిలో ఉంచుకొని స్టీల్ బ్రిడ్జి వైపు హెచ్‌ఎండీఏ అధికారులు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు ప్రస్తుతం ఈ కారిడార్‌లో రక్షణశాఖకు చెందిన భూముల సేకరణ పనులు తుదిదశకు వచ్చాయని, త్వరలోనే పూర్తి చేసి బిడ్డింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్లు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అలాగే సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ రూట్‌లో డెయిరీఫాం వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాతో ఈ వారంలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. ఈ రూట్‌లో బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద నిర్మించనున్న 600 మీటర్ల టన్నెల్‌కు ఇటీవల ఎయిర్‌పోర్ట్ అధికారుల నుంచి ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పరస్పరం ఒప్పందం ఏర్పాటు చేసుకోవలసి ఉంది.

హకీంపేట్ వద్ద మరో టన్నెల్...

శామీర్‌పేట్ రూట్‌లో తాజాగా ప్రతిపాదించిన ఎలివేటెడ్ స్టీల్ బ్రిడ్జి మార్గంలో హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద కూడా 500 మీటర్ల టన్నెల్ మార్గాన్ని నిర్మించనున్నారు. పూర్తిగా ఎలివేటెడ్ పద్ధతిలోనే నిర్మించనున్నప్పటికీ విమానాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సొరంగ మార్గం నిర్మించనున్నారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించనున్న మెట్రో కారిడార్‌లో కూడా హకీంపేట్ వద్ద సొరంగమార్గం నుంచి మెట్రో రైలు వెళ్లనుంది. మొదట్లో ఈ రూట్‌లో డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్‌కు ప్రతిపాదించారు. కానీ నిర్మాణ వ్యయం, సాంకేతిక అంశాలను దృష్టిలో ఉంచుకొని మెట్రోరైల్ కారిడార్ ప్రత్యేకంగా చేపట్టేందుకు హెచ్‌ఎంఆర్ఎల్ డీపీఆర్ రూపొందించింది. దీంతో హెచ్‌ఎండీఏ నిర్మించనున్న కారిడార్‌ను స్టీల్‌బ్రిడ్జిగా నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ రూట్‌లో 197 ఎకరాలకు పైగా భూసేకరణకు చర్యలు చేపట్టారు. రక్షణశాఖ నుంచి 113.48 ఎకరాలు సేకరించవలసి ఉంది. సుమారు రూ.2 వేల కోట్ల (పరిహారం చెల్లింపుతో సహా) నిర్మాణ అంచనాలతో ఈ కారిడార్‌కు హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు చేసింది. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం వల్ల మరో రూ.500 కోట్లు అదనంగా ఖర్చయ్యే అవకాశం ఉంది.

త్వరలో డెయిరీఫాం కారిడార్ పనులు...

ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరలో చేపట్టనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ తెలిపారు. ఈ కారిడార్ నిర్మాణానికి అన్ని అనుమతులు లభించాయని, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, అర్హత కలిగిన సంస్థల ఎంపికపైన కసరత్తు జరుగుతోందని చెప్పారు. మరోవైపు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద నిర్మించనున్న సొరంగమార్గంపైన ఈ వారంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీతో ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం నిర్మాణంపైన దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

ఉలిక్కిపడ్డ కళారంగ్ బస్తీ

- ఇక్కడి యువకుడికి ఉగ్ర సంబంధాలపై చర్చ
- విషయం తెలిసి ఆందోళన చెందిన స్థానికులు



సమీర్ (ఫైల్)



కళారంగ్ బస్తీలోని సమీర్ ఇంటికి తాళం వేసిన దృశ్యం

బన్సీలాల్‌పేట్: దేశంలో బాంబు పేలుళ్లకు ఉగ్రవాదులు పన్నిన కుట్రలను దర్యాప్తు సంస్థలు భగ్నం చేశాయి. ఈ ఈ కుట్రలో సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్ బస్తీకి చెందిన సయ్యద్ సమీర్(25) పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇక్కడి బస్తీ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. పోలీసులు సమీర్‌ను తీసుకెళ్లడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. తెలంగాణ, ఏపీ ఇంటెలిజెన్స్ విభాగం సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇద్దరిలో సమీర్ కూడా ఉండటం స్థానికులను ఒకింత భయాందోళనకు గురి చేసింది. ఉగ్ర కుట్రలో విజయనగరం ప్రాంతానికి చెందిన సిరాజ్‌తో పాటు కళారంగ్‌బస్తీకి చెందిన సయ్యద్ సమీర్‌గా పోలీసులు గుర్తించిన విషయం విదితమే. ఈ నెల 16న పోలీసులు మఫ్టీలో వచ్చి ట్రాన్సిట్ వారంట్‌పై సమీర్‌ను విజయనగరం తీసుకెళ్లారు.

సమీర్ కుటుంబ నేపథ్యం ఇదీ..

సయ్యద్ సమీర్ లిఫ్టు రిపేరింగ్ పని నేర్చుకొని మెకానిక్‌గా పని చేస్తున్నాడు. చాలా ఏళ్ల క్రితమే తండ్రి మరణించడంతో తల్లి, సోదరితో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. బస్తీలో ఎవరితో కూడా ఎక్కువగా మాట్లాడకుండా తన పని తాను చేసుకుంటూ పోయేవాడని ఇక్కడ ప్రజలు చెప్పారు. అలాంటి యువకునికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని తెలిసి ఆశ్చర్యపోయామన్నారు. ఈ యువకుడు దేశ విద్రోహ కార్యకలాపాలకు ఆకర్షితుడవుతాడని తాము ఊహించలేదన్నారు. కాగా బోయిగూడ కళారంగ్ బస్తీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉంటుంది. సుమారు 50 కుటుంబాలు ఇక్కడ జీవనం సాగిస్తుంటాయి.



సమీర్ ఉపయోగించిన బైక్

జాడలేని సమీర్ కుటుంబీకులు..

సమీర్‌ను మఫ్టీ పోలీసులు అరెస్టు చేయగానే కుటుంబీకులు గోపాలపురం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే.. ఉగ్రవాదులతో సమీర్‌కు సంబంధాలు ఉన్నాయనే విషయం తెలిసి వారు ఆందోళనకు గురయ్యారని తెలిసింది. అనంతరం వారు జాడలేకుండా పోయారు. ఎక్కడికి వెళ్లారు...ఏం చేస్తున్నారనే విషయం తెలియరాలేదు. ప్రస్తుతం సమీర్ ఇంటికి తాళం వేసి ఉంది. సమీర్ ఓల్డ్ సిటికి చెందిన పలువురు యువకులతో నిత్యం ఇంట్లో సమావేశాలు నిర్వహించే వాడని బస్తీ ప్రజలు చెప్పారు.

బేగంపేటలో వరద కట్టడికి స్లూయిస్‌గేట్

నిర్మాణానికి సిద్ధమైన అధికారులు

- ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం
- జూన్ మొదటి వారంలో శిల్పాలేఔట్ రెండో ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్



బేగంపేటలో పనులు పరిశీలిస్తున్న కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: బేగంపేట ప్రకాశ్‌నగర్ వద్ద రహదారిపై నీటినిల్వలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎయిర్‌పోర్ట్ డ్రెయిన్ ఔట్‌లెట్ వద్ద స్లూయిస్ గేట్ నిర్మించి సివిల్ ఏవియేషన్ రీసెర్చి ఆర్గనైజేషన్ (సీఏఆర్‌ఓ)కు చెందిన చెరువులోకి మళ్లించేలా వాల్వ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సూచించారు. దాంతోపాటు పది రీచార్జి బోర్‌వెల్స్ నిర్మాణానికి అనుమతించాలని సంబంధిత అధికారులను కోరారు. అందుకు ఎయిర్‌పోర్ట్ జీఎం(సీఐసీ) సానుకూలంగా స్పందించారు. చెరువు (కుంట) సామర్థ్యం పది లక్షల లీటర్లు కావడంతో వరద సమస్య తగ్గుతుందని భావించారు. ప్రకాశ్‌నగర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ వద్ద ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, వర్షం వస్తే నీటినిల్వలు, ట్రాఫిక్ సమస్యలు తప్పకపోవడంతో సోమవారం ట్రాఫిక్ ఉన్నతాధికారులు జనరల్ మేనేజర్(సీఐసీ), జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ (మెయింటెనెన్స్), చీఫ్ సిటీప్లానర్, జోనల్ కమిషనర్ తదితరులతో కలిసి సదరు ప్రాంతాన్ని, సీఏఆర్‌ఓ ప్రాంగణంలోని చెరువు, ఇంకుడు గుంతలు, రీచార్జి బోర్‌వెల్స్, కమతం హౌస్ వరదనీటి కాలువను పరిశీలించారు. పెద్ద క్యాచ్‌మెంట్ ఏరియాగా ఉన్న బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి వాన నీరు నేరుగా జీహెచ్‌ఎంసీ వరదకాలువలోకి చేరుతుండటంతో పెట్రోల్‌బంక్ దగ్గర ఓవర్‌ఫ్లో అవుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్య పరిష్కారానికి స్లూయిస్ గేట్ అవసరమని భావించి, నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ పనులకు ఎయిర్‌పోర్ట్ అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లకు సూచించారు. సదరు ప్రాంతాల్లో జెట్టింగ్ మెషిన్లతో పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేయాలని ఆదేశించారు. చివరి బోర్‌వెల్ పిట్ వద్ద నీటి ప్రవాహాన్ని తగ్గించేలా ఒక వాల్వ్ నిర్మించాలని కూడా సూచించారు.

ప్రజా సమస్యలకు ప్రాధాన్యం

గ్రేటర్ నగరంలో ప్రజలెదుర్కొంటున్న వీధిదీపాలు,పారిశుధ్యం, వీధికుక్కల బెడద తదితరమైన వాటికి ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ కర్ణన్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు సాఫీ ప్రయాణం కోసం నిర్మించిన శిల్పా లేఔట్ రెండో దశ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, జూన్ మొదటి వారంలో ఎప్పుడైనా ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఆరు లేన్లతో నిర్మించిన ఈ ఫ్లై ఓవర్‌కు రూ.178 కోట్లు ఖర్చు చేశారు. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో 17 మంది ఊపిరాడకే చనిపోయారంటూ వేదన వ్యక్తంచేశారు. వారికి బయటకు వెళ్లేందుకు, తప్పించుకునే మార్గం లేనందునే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందంటూ, అదే మైలార్‌దేవ్‌పల్లిలో బయటకు వెళ్లే మార్గమున్నందున ఎందరో బతికి బయటపడ్డారంటూ, నిబంధనల కనుగుణంగా నిర్మాణాలు, తగిన జాగ్రత్తలతోనే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు.

బంగారం వ్యాపారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో మాట్లాడుతున్న కేటీఆర్



ఫైర్‌సేఫ్టీ మెజర్స్ పాటించండి

అగ్నిప్రమాదం ఘటన దురదృష్టకరం

- గుల్జార్‌హౌస్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- సంతాప సభలో మాజీ మంత్రి కేటీఆర్
- బంద్ పాటించిన వ్యాపారులు



దుకాణాలు మూసి సంతాపం తెలియజేసిన బంగారం, వెండి వ్యాపారులు

చార్మినార్/దూద్‌బౌలి: పాతబస్తీలోని గుల్జార్ హౌజ్ సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదం సంఘటన దురదృష్టకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ప్రమాదంలో 17 మంది చనిపోవడం తీవ్రంగా బాధించిందని ఆయన పేర్కొన్నారు. సరాఫా జువెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాతబస్తీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో కేటీఆర్ పాల్గొని మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధితులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సేఫ్టీ మెజర్స్ పాటించాలన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసుకుని సేఫ్టీ మెజర్స్ పాటించే విధంగా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

జ్యువెలరీ వ్యాపారుల స్వచ్ఛంద బంద్..

గుల్జార్ హౌజ్ పరిసర ప్రాంతాల్లోని బంగారం, వెండి, ముత్యాల వ్యాపారులు సోమవారం ఉదయం నుంచి తమ దుకాణాలను మూసివేసి అగ్నిప్రమాద మృతులకు సంతాపం ప్రకటించారు. సరఫా జ్యువెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం చార్మినార్‌లోని శివుని మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ కుమార్ అగర్వాల్‌తో పాటు గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి.ఉమామహేందర్, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి తదితరులు పాల్గొన్నారు. కాగా సోమవారం పలువురు సందర్శకులు, పర్యాటకులు కూడా గుల్జార్ హౌస్ వద్దకు వచ్చి అగ్నిప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఒకేసారి 17 మంది చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు.

సెల్లార్ల తవ్వకాలతో జాగ్రత్త!

రక్షణ చర్యలు లేకుంటే బిల్డర్లపై క్రిమినల్ కేసులు

- వర్షాకాలం జాగ్రత్తలపై మార్గదర్శకాలు
- జారీ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ గుల్జార్‌హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 17 ప్రాణాలు బుగ్గిపాలయ్యాయి. ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు లేకపోవడం..అటు యజమానులు కానీ, ఇటు అధికారులు కానీ తగిన జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం అందుకు కారణం. వేసవి ముగియవస్తోంది. త్వరలోనే వర్షాకాలం రానుంది. వర్షాకాలంలో సంభవించే ప్రమాదాలు మరో రకం. ముఖ్యంగా సెల్లార్ల తవ్వకాలు, శిథిల భవనాల వల్ల ప్రమాదాలు పొంచి ఉంటాయి. శిథిల భవనాల సర్వే, తగు చర్యలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్.. తాజాగా సెల్లార్ల తవ్వకాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. వర్షాకాల సంసిద్ధతలో భాగంగా వీటిని జారీ చేశారు. సెల్లార్ల తవ్వకాల్లో తగిన జాగ్రత్తచర్యలు తీసుకోకపోయినా, నిబంధనలు ఉల్లంఘించినా యజమానులు, బిల్డర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణంలోని అన్ని భవనాలను తనిఖీచేసి సెల్లార్ల ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నదీ లేనిదీ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ముందస్తు జాగ్రత్తలిలా..

- నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను తనిఖీ చేసి సెల్లార్ల తవ్వకాలు పురోగతిలో ఉంటే అనుమతి పొందిన ప్లాన్ కనుగుణంగా సెట్‌బ్యాక్‌లు న్నాయో, లేదో పరిశీలించాలి. సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో నీరు నిలిచి ఉన్నట్లయితే వెంటనే పనులు నిలిపివేసి నీటిని తొలగించాలి. నేల దృఢంగా ఉందో లేదో తెలుసుకునేందుకు పరీక్షలు చేయాలి. చుట్టూ బారికేడింగ్‌తో పాటు రిటైనింగ్‌వాల్ నిర్మించాలి. వీటికోసం వెంటనే నోటీసులు జారీ చేయాలి. నోటీసుల మేరకు నడచుకోని పక్షంలో పనుల్ని వెంటనే నిలిపివేయడంతో పాటు నిర్మాణ అనుమతిని, బిల్డర్ లైసెన్సును రద్దుచేయాలి. అంతేకాదు నిర్లక్ష్యానికి బిల్డర్‌పై క్రిమినల్‌కేసు నమోదు చేయాలి.
- సగం తవ్వి వదిలేసిన సెల్లార్లను సీఅండ్‌డీ వేస్ట్ (నిర్మాణ, వ్యర్థాల) విభాగం సహకారంతో పూడ్చివేయాలి. అనుమతి పొంది కానీ, అనుమతి లేకుండా కానీ ఇప్పటికే తవ్విన సెల్లార్ల వద్ద పనులు జరగకుండా ఉన్నట్లయితే చుట్టుపక్కల ఉన్న భవనాల భద్రతను పరిశీలించాలి. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. సీఅండ్‌డీ, పారిశుధ్య విభాగాల సహకారంతో తవ్విన సెల్లార్లను పూడ్చివేయాలి.
- కొండచరియల ప్రాంతాల్లో వాలు ప్రాంతాల్లో, రాళ్ల కటింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధతో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కొండచరియల ప్రాంతాల్లో, రిటైనింగ్ గోడల వెంబడి నివసిస్తున్న వారిని అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందిగా సూచించాలి. ప్రమాదకర పరిస్థితులున్నట్లయితే వెంటనే ఖాళీ చేయించాలి. అవసరమైతే డిప్యూటీ కమిషనర్ సూచనమేరకు పోలీసుల సహకారం తీసుకోవాలి. నిర్మాణ ప్రాంతాల్లోనే లేబర్ క్యాంపులున్న ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు లేకుండా చూడాలి. నివాసాలు సెల్లార్ల పక్కనే ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతానికి తరలించాల్సిందిగా బిల్డర్లకు నోటీసులు జారీ చేయాలి.



- సెల్లార్ల తవ్వకాల పనులు పురోగతిలో ఉన్న యజమానులు, బిల్డర్లు, వర్షాకాలంలోగా త్వరితంగా పనులు పూర్తిచేయాలి. నేల పటిష్టత చర్యలు, రిటైనింగ్‌వాల్, బారికేడింగ్, తదితర పనులు తప్పనిసరిగా చేయాలి.
- వర్షాకాలం ఆరంభం నుంచి ముగిసేంత కొత్తగా సెల్లార్ల తవ్వకాలకు అనుమతులివ్వరాదు.

కూలీ డబ్బుల కోసం ఫోన్ చేసినందుకు..

ప్లంబర్‌ను చితకబాదిన కాంట్రాక్టర్

బంజారాహిల్స్: తనకు రావాల్సిన కూలీ డబ్బుల కోసం ఓ ప్లంబర్ తాను పని చేస్తున్న కాంట్రాక్టర్‌కు తరచూ ఫోన్ చేయడంతో ఆగ్రహం పట్టలేని కాంట్రాక్టర్ సదరు ప్లంబర్‌ను దారికాసి చితకబాదిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–13లోని శ్రీరామ్‌నగర్ బస్తీకి ఆశిష్‌కుమార్ దాల్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అతను జూబ్లీహిల్స్‌కు చెందిన అరుణ్‌కుమార్‌నాయక్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 17న తనకు రెండు రోజుల భత్యం రావాలంటూ పలుమార్లు అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన అరుణ్‌కుమార్ బైక్‌పై వెళుతున్న ఆశిష్‌కుమార్‌ను అడ్డగించి తనకు అన్నిసార్లు ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో బాధితుడి ఎడమ చేయి వేలు విరిగిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నోట్ల మార్పిడికి యత్నం

నిందితుడి రిమాండ్



కుత్బుల్లాపూర్: నకిలీ నోట్లు అంటగట్టి ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన మనీషా సావంత్ తనకు పరిచయస్తుడైన చత్తీస్‌ఘడ్ ప్రాంతానికి చెందిన కుంజురామ్ పటేల్‌కు రూ.18.5 లక్షలు ఆన్‌లైన్‌లో బదిలీ చేసింది. మనీషాకు ఇవ్వాల్సిన డబ్బులు నగదు రూపంలో ఇస్తానని, పేట్‌బషీరాబాద్‌లోని పాంటలూన్స్ షోరూమ్ వద్దకు రమ్మని చెప్పాడు. కుంజురామ్ ఆమెకు నకిలీ నోట్లు అంటగట్టేందుకు యత్నిస్తుండగా గుర్తించిన మనీషా అతడిని నిలదీసింది. దీంతో కుంజురామ్ అతని అనుచరులు అక్కడి నుంచి పరారయ్యారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు కుంజురామ్, అతడి అనుచరులను అదుపులోకి తీసుకుని సోమవారం మేడ్చల్ కోర్టులో ప్రవేశ పెట్టి రిమాండ్‌కు తరలించారు.

మారిస్తేనే మనుగడ

కేబుల్ లైఫ్ టైం 25 ఏళ్లలోపే!
- ఆ లోపే మార్చేయాలి.. లేదంటే ప్రమాదాలు తప్పవు
- లోడుకు తగ్గ వైరింగ్, ఎంసీబీలు, ఎర్తింగ్‌తోనే రక్షణ
- 'సాక్షి'తో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి టి.కాంతారావు స్పష్టీకరణ



సాక్షి, సిటీబ్యూరో: 'సాధారణంగా ఈ కేబుల్ జీవిత కాలం 25 ఏళ్లు మాత్రమే. ఆలోపే వాటిని మార్చేయాలి. ఐఎస్ఐ ప్రమాణాల మేరకే ఈ వైర్లను రూపొందించినప్పటికీ..వాటి సామర్థ్యానికి మించి లోడు కరెంట్‌ను వినియోగించడం, అంతర్గతంగా తలెత్తే వేడికి బయటి ఉష్ణోగ్రతలు తోడవడంతో ఆయా కేబుళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనైవుతుంటాయి. జాయింట్లు, లూజు కాంటాక్ట్‌ల వద్ద తరచూ స్పార్క్‌లు వెలుగు చూస్తుంటాయి. ఇటీవల వెలుగు చూస్తున్న మెజార్టీ విద్యుత్ ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణం' అని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ టి.కాంతారావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. గృహాలు, వాణిజ్య సముదాయాల్లో తరచూ వెలుగు చూస్తున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాటల్లోనే..

పాతవైర్లపైనే అదనపు లోడు..

మెజార్టీ గృహాలు, వాణిజ్య సముదాయాల్లో 1.5 స్క్వేర్ ఎంఎం, 2.5 స్క్వేర్ ఎంఎం సామర్థ్యానికి మించిన కేబుళ్ల వాడటం లేదు. ఈ కేబుళ్ల జీవిత కాలం కూడా 25 ఏళ్లకు మించి ఉండదు. అంతేకాదు ఒకప్పుడు సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పది లైట్లు, నాలుగు ఫ్యాన్లు, ఒక టీవీ, కూలర్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, మిక్సీ, ఐరెన్ బాక్స్ మాత్రమే కన్పించేవి. తీరా ఆదాయం, ఇంటి అవసరాలు పెరిగిన తర్వాత వాటి సరసన ఏసీలు, గీజర్లు, వాషింగ్ మిషన్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. ఆ మేరకు పాత లైన్లను తొలగించి, వాటి స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వైర్లను ఏర్పాటు చేయడం లేదు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాతలైన్లపై మరింత భారాన్ని మోపుతున్నారు. ఫలితంగా కేబుళ్లు ఒత్తిడికి గురై...షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. అంతేకాదు నిర్మాణ సమయంలో భవిష్యత్తు విద్యుత్ అవసరాలను అంచనా వేయలేకపోవడం వెరసి నిర్మాణ ఖర్చును తగ్గించుకునే క్రమంలో నాసిరకం విద్యుత్ వైర్లు, స్విచ్‌లు కొనుగోలు చేస్తుండటం కూడా ఈ ప్రమాదాలకు మరో కారణం. అంతేకాదు ఒకే సాకెట్ నుంచి మల్టీపుల్ ప్లగ్ కనెక్షన్లు ఇవ్వడం కూడా ప్రమాదాలకు కార ణమవుతోంది.

ఒత్తిడి వల్లే కంప్రెసర్లలో పేలుళ్లు..

ఇతర ఎలక్ట్రికల్ వస్తువులతో పోలిస్తే ఏసీ, గీజర్, వాషింగ్ మిషన్, ఓవెన్లకు విద్యుత్ లోడు ఎక్కువ అవసరం. సాధారణంగా మార్కెట్లో ఒకటి, ఒకటిన్నర, రెండు టన్నుల సామర్థ్యం ఏసీలు లభిస్తుంటాయి. ఏసీ సామర్థ్యాన్ని బట్టి కేబుళ్లను ఎంపిక చేసుకోవాలి. సాధారణంగా 1.5 టన్ను ఏసీకి 4 నుంచి 6 స్క్వేర్ ఎంఎంపైగా కేబుల్స్ వినియోగించాలి. కానీ మెజార్టీ భవనాల్లో 2.5 స్క్వేర్ ఎంఎం కేబుళ్లనే వాడుతున్నారు. పాత ఏసీల్లో ఇన్వర్టర్ మోడ్ సహా పవర్ సేవింగ్‌కు అవకాశం లేదు. ఇందు కోసం ఇన్వర్టర్ మోడ్ ఉన్న ఫైవ్ స్టార్, త్రీస్టార్ రేటింగ్ ఏసీలను ఎంపిక చేసుకోవాలి. ఏసీలను రోజంతా ఆన్‌లో ఉంచడం వల్ల కంప్రెసర్‌లో హీట్ జనరేట్ అవుతుంది. ఇన్వర్టర్ బ్యాటరీలను గాలి, వెలుతురు లేని ఇరుకైన ప్రదేశంలో ఏర్పాటు చేయడం వల్ల ఒత్తిడికి గురై..షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. ఇన్వర్టర్ బ్యాటరీల్లో మూడు నెలలకోసారి డిస్టిలరీ వాటర్ నింపాలి. వీటి నిర్వహణ లోపం వల్ల కూ డా బ్యాటరీలు పేలుతుంటాయి. గుల్జార్‌హౌస్‌లో వెలుగు చూసిన ప్రమాదానికి ఇది మరో కారణం కూడా.



ప్రాపర్ ఎర్తింగ్‌తోనే ఆస్తులు, ప్రాణాలకు రక్షణ..

మెజార్టీ భవనాల్లో ఎర్తింగ్ సిస్టం ఉండటం లేదు. ఒక వేళ ఉన్నా.. సరఫరాలో హెచ్చు తగ్గుల సమస్య వచ్చినప్పుడు పని చేయడం లేదు. వేసవిలో ఎర్తింగ్ పాయింట్లో తేమ శాతం తగ్గుతుంది. ప్రతి పదిరోజులకో సారి నీటిని పో యడం ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు తలెత్తినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించొచ్చు. అంతేకాదు పోల్ నుంచి ఇంట్లోకి కరెంట్ సరఫరా చేసే సర్వీసు వైరు వెంట సాధారణంగా జీఏవైర్‌ను ఏర్పాటు చేస్తుంటాం. షార్ట్ సర్క్యూట్ కారణంగా పోల్‌పై ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు హై ఓల్టేజ్ విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా నియంత్రించేందుకు ఎగ్ ఇన్సులేటర్ వినియోగించాలి. విద్యుత్ లీకేజీలు లేకుండా చూసుకోవడం, ప్రతి ఇన్సు లేషన్‌కు ఎంసీబీలు, ఆర్సీసీబీలను ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా చూసుకోవచ్చు' అని కాంతారావు స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు


కవిత (ఫైల్)


గాయపడిన రవి

మల్కాజిగిరి: విద్యుదాఘాతంతో భార్య మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా మెట్టుపల్లికి చెందిన కె.రవి, కవిత(30) దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి బతువుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మల్కాజిగిరి ఇందిరా నెహ్రూనగర్‌లో ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ నెల 18న ఆదివారం వారు బాలరాజ్ అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు. రెండో అంతస్తు నుంచి ఇనుప కడ్డీలు కిందికి దించుతుండగా కడ్డీలు విద్యుత్ తీగలడంతో రవి విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్తను రక్షించేందుకు వెళ్లిన కవిత కూడా ప్రమాదానికి గురైంది. స్థానికులు వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పతికి తీసుకెళ్లాలని సూచించారు. కవితను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.రవిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భవన యజమాని ముంత బాలరాజ్, మేస్త్రీ కె.భాస్కర్ నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె చనిపోగా, అల్లుడు గాయాల పాలయ్యాడని ఆరోపిస్తూ కవిత తల్లి దాప్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'నిర్లక్ష్యాన్ని సహించేది లేదు'

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ఫిర్యాదుదారులు అందించే దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం రెవెన్యూ శాఖకు సంబంధించి 24, ఇతర శాఖలకు సంబంధించి 29 దరఖాస్తులు అందినట్టు తెలిపారు.

వ్యాపారవేత్త అనుమానాస్పద మృతి

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యాపారవేత్త మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌సీఎల్ కాలనీ, ప్లెజంట్ వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో వ్యాపారవేత్త పి.వి.రామ్మోహన్‌రావు(60) నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ సూర్య ఫ్లాట్ తలుపు తట్టాడు. అయితే లోపలి నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన అతను అపార్ట్‌మెంట్ వాసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వారు తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా రామ్మోహన్‌రావు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వారి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి నోట్లోంచి తెల్లని నురుగు రావడం, రెండు చేతులు ముడుచుకున్న స్థితిలో ఉండటంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడి బావమరిది రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైసిటీ పనులకు నిధుల లేమి

- సర్కారు కరుణిస్తేనే ముందుకు
- లేకుంటే అంతే సంగతులు

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల కింద టెండర్లు పూర్తయినప్పటికీ, పనులు మొదలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే కేబీఆర్‌పార్కు చుట్టూ, ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర పనులకు సంబంధించి రూ. 1800 కోట్ల మేర పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కేబీఆర్ చుట్టూ పనులకు కోర్టు వివాదాలతో ముందుకు సాగలేని పరిస్థితి నెలకొనగా, మిగతా ప్రాంతాల్లో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. అందుకు అవసరమైన నిధులు జీహెచ్ఎంసీ ఖజానాలో లేవు. అవసరమైన నిధులను ప్రభుత్వం ఇస్తే తప్ప ముందుకు పోలేని పరిస్థితి. సదరు ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణలో భాగంగా ఆస్తులు కోల్పోయే నిర్వాసితులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 760 కోట్లకు సంబంధించిన పరిహారం ఖరారు, తదితరాలతో అవార్డులు పాసైనప్పటికీ, భూమిని స్వాధీనం చేసుకునేందుకు చెల్లించేందుకు నిధుల్లేవు.జీహెచ్ఎంసీకి చెందిన పబ్లిక్ డిపాజిట్ ఖాతా లోని రూ.2వేల కోట్లు సైతం ప్రభుత్వం వినియోగించుకోవడంతో జీహెచ్ఎంసీకి వచ్చే ఆదాయం సిబ్బంది జీతాల చెల్లింపులకే కనాకష్టంగా మారనుంది. ప్రస్తుతానికి 'ఎర్లీబర్డ్' ద్వారా వచ్చిన నిధులతో ఇబ్బంది లేకపోయినప్పటికీ, ముున్ముందు జీతాలకూ కటకటలాడాల్సిన పరిస్థితి తప్పదేమోనని జీహెచ్ఎంసీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల పనులు అడుగు ముందుకు పడని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఎస్సార్‌డీపీ(వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం) కింద పలు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు సైతం అప్పటి ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదు. కానీ, జీహెచ్ఎంసీ ఆర్థికపరిస్థితి, పరపతి దృష్ట్యా అప్పులు తెచ్చారు. వాటి చెల్లింపులకే ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. కొత్త అప్పులు స్వయంగా తీసుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి నిధులొస్తే కానీ సదరు ప్రాజెక్టుల పనులు ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం చేపడుతున్న ప్రాజెక్టుల వ్యయంలో సింహభాగం భూసేకరణలకే చెల్లించాల్సిన పరిస్థితి. నగరంలో ఎంతో డిమాండ్ ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ వంటి ప్రాంతాల్లో కావడంతో భూసేకరణ భారం అధికంగా ఉంది. ఎస్సార్‌డీపీ పనుల సందర్భంగా భూసేకరణలకు నగదు చెల్లించింది చాలా స్వల్పమే. చాలావరకు టీడీఆర్ ద్వారానే ఆ భారం ఖజానాపై పడకుండా చేశారు. ఇప్పుడు సైతం అధికారులు ఆదిశగా ఆలోచిస్తున్నారు. ఏమేర జారీ చేస్తారో వేచి చూడాల్సిందే.!

భౌతిక దాడులతో కార్మికులపై పెత్తనం సాధ్యం కాదు


మాట్లాడుతున్న అంబటి కృష్ణమూర్తి


అంబటి కృష్ణమూర్తిపై దాడి చేస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: భౌతిక దాడులకు పాల్పడటం వల్ల కార్మికులపై పెత్తనం సాధ్యం కాదని ఐఎన్‌టీయూసీ (ఆర్) జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించేందుకు వచ్చిన అంబటి కృష్ణమూర్తి తదితరులపై జి.సంజీవ్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారు. సంజీవ్ రెడ్డి వర్గానికి చెందిన నాయకులు చంద్రశేఖర్, ఆదిల్ షరీఫ్, నరసింహారెడ్డి తదితరులు అసభ్యంగా దూషిస్తూ అంబటి కృష్ణమూర్తిపై దాడి చేశారు. దీంతో దేశోద్ధారక భవన్ రణరంగాన్ని తలపించింది. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని సంజీవ రెడ్డి వర్గీయులను తరిమికొట్టారు. దాడి చేసిన వారిపై అంబటి కృష్ణమూర్తి ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై సంజీవ్ రెడ్డి అనుచరులు చేసిన దాడి కార్మిక వర్గంపై దాడిగా అభివర్ణించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనక్ ప్రసాద్ బృందం తనపై అవినీతి ఆరోపణలు చేయడం, జి.సంజీవ్ రెడ్డి అనుచరులు భౌతిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. జనక్ ప్రసాద్ బృందం చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారు తమ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాతీయ కార్యదర్శి బి.అమర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.నాగరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు అప్పారావు, గురువారెడ్డి, కృష్ణా గౌడ్, లలిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మంచి మాటలు చెప్పినందుకు...

- సమీప బంధువు దారుణ హత్య
- సరస్వతీ కాలనీలో నడి రోడ్డుపై ఘాతుకం


మోతీలాల్(ఫైల్)


రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

మేడ్చల్: మద్యానికి బానిసై సంసారాన్ని ఎందుకు చెడగొట్టుకుంటున్నావ్ మంచిగా ఉంటూ భార్యా పిల్లలను బాగా చూసుకో అంటూ నాలుగు మంచి మాటలు చెప్పినందుకు ఓ వ్యక్తి తన బావ వరుసైన వ్యక్తిని నడిరోడ్డుపై కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానిక సరస్వతీనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన సోలంకి మోతీలాల్(43), అతడి మేనత్త కుమారుడు శంకర్(35) కుటుంబాలతో కలిసి రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతీ నగర్‌లో ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. కాగా మద్యానికి బానిసైన శంకర్ కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కూడా మద్యం తాగి వచ్చిన అతను కుటుంబ సభ్యులతో గొడవ పడి సమీపంలోని రైల్వే ప్లాట్ ఫారంపై పడుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మోతీలాల్ అక్కడికి వెళ్లి శంకర్‌కు నచ్చజెప్పేందుకు యత్నించాడు. అయితే మద్యం మత్తులో ఉన్న శంకర్ అతడిని దుర్భాషలాడాడు. అనవసరంగా భార్యా పిల్లలతో గొడవలు ఎందుకని అతడికి సర్దిచెప్పిన మోతీలాల్ శంకర్‌ను ఇంట్లో దిగబెట్టి తన ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లేందుకు సిద్ధమైన మోతీలాల్ తన బంధువుల ఇంటి వద్దకు వెళుతుండగా అతడిని అడ్డుకున్న శంకర్ తన కుటుంబ విషయాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నావంటూ అతడిని తిడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. దీంతో మోతీలాల్ ఈ విషయాన్ని శంకర్ తల్లికి చెప్పేందుకు వెళుతుండగా ఆగ్రహానికి లోనైన శంకర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో మోతీలాల్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడే కుప్పకూలడంతో శంకర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబసభ్యులు మోతీలాల్‌ను 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

కారులోకి దూసుకెళ్లిన క్రాష్ బారియర్

ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే బెంగాల్‌వాసి దుర్మరణం
- గంటల తరబడి శ్రమించి మృతదేహం వెలికితీత


హిలాల్ మృతదేహం


ధ్వంసమైన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. క్రాష్ బారియర్‌ను ఢీకొట్టడంతో కారులోకి పది మీటర్ల మేర దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన కితాబ్‌అలీ అలియాస్ హిలాల్ (35) ఘట్‌కేసర్ మండలం, నాగారంలోని శిల్పానగర్, విశ్వసాయి బృందావనం అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. తుక్కుగూడ సమీపంలోని వివిధ కంపెనీలకు మ్యాన్‌పవర్ సప్లయ్ చేసేవాడు. సోమవారం ఉదయం తుక్కుగూడకు వచ్చి తిరిగి నాగారం వైపు కారులో వెళ్తున్నాడు. బొంగ్లూర్ ఎగ్జిట్ 12 వద్దకు రాగానే అతివేగం కారణంగా కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. దీంతో కారు అద్దంలో నుంచి క్రాష్ బారియర్ పది మీటర్ల వరకు దూసుకెళ్లడంతో కితాబ్‌అలీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో క్రాష్‌బారియర్ ఇరుక్కుపోవడంతో మృతదేహం బయటకు తీయడం పోలీసులకు కష్టతరంగా మారింది. ఔటర్‌రింగ్ రోడ్డు సిబ్బంది సహాయంతో కారు పైభాగం కట్ చేయించి గంటల తరబడి శ్రమించి మృతదేహాన్ని బయటికి తీశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ్రయమిచ్చిన మహిళను హత మార్చాడు

వెండి, బంగారు ఆభరణాల కోసం దారుణం

మేడ్చల్: పని ఇప్పిస్తానని స్నేహితురాలి కుమారుడిని ఇంట్లో పెట్టుకున్న పాపానికి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. సోమవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, లింగంపేట్‌కు చెందిన కటిక రాకేష్ సైదాబాద్‌లో తల్లితో కలిసి ఉంటున్నాడు. వికారాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మి అత్వెల్లిలో నివాసం ఉంటూ కిష్టాపూర్‌లెని వైన్స్‌లో స్వీపర్‌గా పని చేస్తుంది. రాకేష్ తల్లి లావణ్య, లక్ష్మి గతంలో పటాన్‌చెరులో ఒకే చోట పని చేయడంతో వారి మధ్య మంచి స్నేహం ఉంది. అయితే లావణ్య కుమారుడు రాకేష్ చెడు వ్యసనాలకు అలవాటు పడి జులాయిగా తిరుగుతుండటంతో ఆమె కొడుకును వెంట బెట్టుకుని ఈ నెల 15న లక్ష్మీ వద్దకు వచ్చింది. తన కుమారుడికి పని ఇప్పించాలని కోరగా అందుకు ఆమె అంగీకరించింది. అదే రోజు లక్ష్మీ, రాకేష్, అతడి తల్లి లావణ్య ముగ్గురూ కలిసి కల్లు తాగి ఇంటికి వెళ్లారు. మరి కొంత కల్లును తీసుకుని ఇంటికి వెళ్లారు. అనంతరం రాకేష్, లక్ష్మీతో కలిసి ఆమె ఇంటికి వెళ్లగా, లావణ్య సైదాబాద్‌కు వెళ్లి పోయింది. రాత్రి రాకేష్ లక్ష్మీతో కలిసి కల్లు తాగి అక్కడే నిద్రపోయాడు. లక్ష్మి నిద్రలోకి జారుకున్న తర్వాత రాకేష్ కత్తితో ఆమెను దారుణంగా హత్య చేసి చెవి కమ్మలు, కాళ్ల పట్టీలు, ముక్కు పుడక, రూ.3,500 నగదు,వెండి ఉంగరం, వెండి బ్రాస్‌లేట్ లను ఎత్తుకెళ్లాడు. ఆ తర్వాత ఆధారాలు చిక్కకుండా ఉండేందుకు ఆమె ఒంటిపై పాత వస్త్రాలు వేసి నిప్పటించి బయటి నుండి గడియ పెట్టి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సగం కాలిపోయి ఉన్న లక్ష్మి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మేడ్చల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు రాకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. కేవలం రూ.50వేల విలువైన బంగారు, వెండి ఆభరణాల కోసం రాకేష్ లక్ష్మిని హత్య చేసినట్లు డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సత్యనారాయణ, డీఐ సుధీర్‌కృష్ణ, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

గుంతలకు మరమ్మతులు



బంజారాహిల్స్: రహదారులపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అధికారులు రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 2 నుంచి శ్రీకృష్ణానగర్ వైపు వెళ్లే దారిలో పెద్ద ఎత్తున రోడ్డు దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన అధికారులు సోమవారం ఈ రోడ్డులో బీటీతో గుంతలను పూడ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఫిలింనగర్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు సూచనలతో సోమవారం లబ్ధిదారులకు స్థానిక కాంగ్రెస్ నేతలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్, వినాయకనగర్, నవ నిర్మాణ్‌నగర్, ఇందిరానగర్ బస్తీలకు చెందిన పలువురికి ఆస్పత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే దానం సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. నేతలు నాగేష్‌సాగర్, అబ్దుల్ ఘనీ, దామోదర్, గిరి, సిద్దూ, అశోక్‌గౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం: జాజుల

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామకంలో బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కమిషనర్ల నియామకంపై 48 గంటల్లో పునర్ సమీక్షించాలని డిమాండ్ చేశారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని తక్షణమే సరిదిద్దాలన్నారు. త్వరలో మరో ముగ్గురు కమిషనర్లను నియమించబోతున్నారని ఆ ముగ్గురిని బీసీలనే నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీసీల యుద్ధభేరీ మోగిస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు బాలగోని బాలరాజు గౌడ్, ప్రొఫెసర్ ఎం.బాగయ్య, కనకాల శ్యాం కురుమ, ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, జాజుల లింగం, తన్నీరు రాంప్రభూ, కడారి వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లో పర్స్ మిస్.. ఆన్‌లైన్‌లో నగదు కట్

వెంగళరావునగర్: రైల్లో పోగొట్టుకున్న పర్స్ వల్ల బ్యాంకుల్లో నగదు కట్ అయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... కృష్ణాజిల్లాకు చెందిన ఎస్.నాగరాజు స్థానిక జవహర్‌నగర్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. ఈ నెల 18వ తేదీ ఉదయం రేపల్లె–సికింద్రాబాద్ రైల్లో వచ్చి సికింద్రాబాద్‌లో దిగాడు. అక్కడ నుంచి బస్సులో యూసుఫ్‌గూడ వచ్చి తన గదికి వెళ్లి చూడగా పర్స్ కనిపించలేదు. అందులో ఏటీఎంలు, ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రూ. 2 వేలు ఉన్నాయి. ఉదయం 8.30 లోపు అతని బ్యాంకుల నుంచి రూ. 75 వేలు నగదు కట్ అయినట్టుగా మెసేజ్‌లు వచ్చాయి. ఎస్‌బీఐ నుంచి రూ. 40 వేలు, హెచ్‌డీఎఫ్‌సీ నుంచి రూ. 35 వేలు కట్ అయ్యాయి. ఏటీఎం నుంచి కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!

- సర్కారు బడులు తెరిచేలోగా పాఠ్యపుస్తకాలు సిద్ధం
- పటిష్ట ప్రణాళికతో పంపిణీ చేయనున్న విద్యాశాఖ
- పంపిణీకి సిద్ధంగా.. పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు
- జూన్ 9 నుంచి 'బడిబాట'..
- అందులోనే స్కూల్ యూనిఫాంలతోపాటు పాఠ్యపుస్తకాల పంపిణీ



ప్రభుత్వ పాఠశాలలకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు

బంజారాహిల్స్: 2025–26 నూతన విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు తెరిచే లోపు సర్కారు బడుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు ముందస్తుగానే పుస్తకాల సరఫరాకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే పుస్తకాల ముద్రణకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ నుంచే ముద్రణ ప్రారంభమైంది. దీంతో పాఠ్య పుస్తకాలు అనుకున్న విధంగానే లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో సర్కార్ బడులకు చేర్చారు.

- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, షేక్‌పేట, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 48 ప్రాథమిక, 4 ఎయిడెడ్ స్కూళ్ల పరిధిలో విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు సోమవారం చేరుకున్నాయి.
- షేక్‌పేట, ఖైరతాబాద్ మండలం–1, ఖైరతాబాద్ మండలం–2 రిసోర్స్ పర్సన్లు ఆయా పాఠ్య పుస్తకాలను సంబంధిత పాఠశాలలకు పంపించారు. ఇప్పటికే ఖైరతాబాద్–1, ఖైరతాబాద్–2 మండలాల పరిధిలో అన్ని స్కూళ్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తికాగా, షేక్‌పేట మండల పరిధిలో ఈ నెల 23వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అవసరమైన పుస్తకాల జాబితాను ఆయా పాఠశాలలు ముందే విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు వాటిని పంపించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పార్ట్–1 పుస్తకాలు అందించనున్నారు. ఎస్ఏ–1 పరీక్షలు పూర్తయ్యాక సెప్టెంబర్, అక్టోబర్‌లలో పార్ట్–2 పంపిణీ చేయనున్నారు.

నేరుగా పాఠశాలలకే...

విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా రెండేళ్ల నుంచి రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. సర్కార్ బడుల్లో ఇదివరకు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల నుంచి ఇంటర్ వరకు చదివే వారికి ఉచితంగా రాత పుస్తకాలు అందజేశారు.

- ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయి వారికి సైతం ఇవ్వనున్నారు. రాత పుస్తకాలు ఇదివరకు గోదాములకే చేరేవి. కానీ ఈ సారి నుంచి నేరుగా ముద్రణ కేంద్రం నుంచి పాఠశాలలకు చేరవేస్తున్నారు. ఇదిలా ఉండగా జూన్ 9వ తేదీ నుంచి బడి బాట కార్యక్రమం నిర్వహించనున్నారు. అప్పటి నుంచే విద్యార్థులకు స్కూల్ యూనిఫాంతో పాటు పాఠ్య పుస్తకాలు అందించనున్నారు. సర్కార్ బడుల్లో విద్యార్థులను చేర్పిస్తే అన్నీ ఉచితంగా ఇస్తారని తెలియజేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు ముందస్తుగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యేనా?



వెంకటేశ్వరనగర్‌లో రోడ్డు తవ్వి వదిలేసిన దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14 వెంకటేశ్వరనగర్ బస్తీలో మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు భారతీనాయక్ ఇంటిని ఆనుకుని సీసీ రోడ్డు నిర్మాణం కోసం నాలుగు వీధుల్లో పది నెలల క్రితం మంజూరయ్యాయి. ఇందులో భాగంగా నెల క్రితం రోడ్డు నిర్మాణం కోసం ఈ నాలుగు గల్లీల్లో సదరు కాంట్రాక్టర్ పాత రోడ్లను తవ్వి వదిలేశాడు. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్థానిక జీహెచ్ఎంసీ ఇంజనీర్లు పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉన్న వెంకటేశ్వరకాలనీ డివిజన్ జీహెచ్ఎంసీ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ల తీరుపై స్థానికులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఇప్పటికి వంద సార్లు ఫిర్యాదు చేశారు. అయినా సరే ఈ ఇద్దరూ ఎమ్మెల్యే ఆదేశించినా బేఖాతర్ చేస్తున్నారు. రోడ్లు తవ్వేయడంతో స్థానికుల రాకపోకలు నరకప్రాయంగా మారాయి. తవ్వకుండా పాత రోడ్డును అలాగే ఉంచినా తాము ఎలాగూ సర్దుకుపోయేవాళ్లమని, ఇప్పుడు తవ్వి రాళ్లు, మట్టి అక్కడే పడేయడంతో గుంతల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సైతం పలుమార్లు ఆదేశించారు. నెల గడుస్తున్నా పనుల్లో కదలిక లేదు.

'ఎట్టిపరిస్థితిల్లోనూ విలువలు కోల్పోవద్దు'



విద్యార్థులను సత్కరిస్తున్న సియాంట్ సంస్థ చైర్మన్ మోహన్‌రెడ్డి

బంజారాహిల్స్: డబ్బు, ఆరోగ్యం తిరిగి సంపాదించుకోవచ్చు.. కానీ విలువలు కోల్పోతే మళ్లీ సంపాదించుకోలేమని సియాంట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మోహన్‌రెడ్డి అన్నారు. సియాంట్ సంస్థ దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫలితాల్లో 48 మంది విద్యార్థులకు 500 పైచిలుకు మార్కులు రాగా వీరందరినీ సోమవారం సెయింట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అందులో 21 మంది సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... బాలికలను, మహిళలను గౌరవించాలని, వారు ఎక్కడైతే గౌరవించబడతారో ఆ సంస్థలు బాగుపడతాయని చెప్పారు. సమాజానికి తనవంతు సహకారం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు తమ సంస్థ తరఫున సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని సేవలు చేస్తామని, విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఇన్‌చార్జి హెచ్ఎం గోపాల్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



జెడ్‌సీకి వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ వెల్దండ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని కమలాపురికాలనీతో పాటు ఫిలింనగర్ 18 బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సోమవారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి ఎక్కడెక్కడ పనులు పెండింగ్‌లో ఉన్నాయో వాటి జాబితాను అందజేశారు. ఈ పనులపై ఆయన అధికారులతో చర్చించారు. కమలాపురికాలనీ, పద్మాలయా అంబేద్కర్‌నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డులలో నూతనంగా సీసీ రోడ్లు వేయాలని, దుర్గాభవానీనగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్‌కు హామీనిచ్చారు.

న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి ఏడు రోజుల జైలు

ఫిలింనగర్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతూ స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్న నిందితుడికి న్యాయమూర్తి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం తెలిపిన వివరాల ప్రకారం... ఫిలింనగర్‌లో నివసించే ఎస్.స్వామి (35) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్థానికంగా నెంబర్ ప్లేట్ లేని వాహనంపై తిరుగుతూ మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడుతుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని నాంపల్లిలోని పదవ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసు తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి మందా మురళి నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రమాదకరంగా నాలా గ్రిల్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పటేల్ నగర్ నుంచి బీజేఆర్ నగర్ వైపు వెళ్లే దారిలో మలుపు వద్ద ఉన్న నాలా ప్రమాదకరంగా ఉంది. కొన్ని నెలల క్రితం ఈ నాలాకు రక్షణగా ఉన్న గ్రిల్ పూర్తిగా విరిగిపోయి నాలాలో పడిపోయింది. దీంతో ఈ దారిగుండా వచ్చిపోయే వాహనదారులకు ఈ నాలా ప్రాణ సంకటంగా మారింది. రాత్రి వేళల్లో కొంత మంది వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాలా గ్రిల్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత యాదవ్

శ్రీనగర్‌కాలనీ: నిరంతరం ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ తెలియజేశారు. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ సుభాష్‌నగర్‌లో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చాలాకాలంగా డ్రైనేజీ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు ఈ పనులు పూర్తయితే ఊరట లభిస్తుందన్నారు. నేతలు శ్రీనివాస్ యాదవ్, బాబు, మురళీ, విజయ్, గణేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి, హరినాథ్

హిమాయత్‌నగర్: హనుమాన్ జయంతిని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఘనంగా నిర్వహించనున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలలో శ్రీ ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ఆకుపూజ, అర్చన, ప్రవచనం మొదలగు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీ భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ పిన్నమరాజు, టీటీడీ ధర్మాచార్యులు భార వికాస్ పరిషత్ ప్రాంత ప్రచారక్ పసుపులేటి నరేంద్రకృష్ణ, టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యులు సురేందర్ నిషితలతో కలసి ఆమె ఆవిష్కరించారు.



తొలగించిన వ్యర్థాలు మళ్లీ కాల్వల్లోకి..



కాల్వ నుంచి తొలగించిన మట్టిని అక్కడే పోసిన దృశ్యం

ఫిలింనగర్: వానాకాలానికి ముందు వరద నీటి కాల్వల్లో, నాలాల్లో చేయాల్సిన డీసిల్టింగ్ పనులు ఈ పాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ జూబ్లీహిల్స్ డివిజన్‌లో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరో వైపు వరద నీటి కాల్వల్లో నుంచి తొలగించిన వ్యర్థాలను వెంటనే అక్కడి నుంచి తరలించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తుండటంతో వర్షాలు వచ్చి ఆ వ్యర్థాలు మొత్తం మళ్లీ అదే వరద నీటి కాల్వల్లోకి వెళ్తున్నాయని కాలనీవాసులు ఫిర్యాదులు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 71లో నవ నిర్మాణ్‌నగర్ కాలనీలో వరద నీటి కాల్వల నుంచి తొలగించిన వ్యర్థాలు అక్కడే కుప్పలుగా పోశారు. వీటిని తొలగించాలని పలుమార్లు సిబ్బందికి కాలనీవాసులు సూచించినా పట్టించుకోవడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద నీటి కాల్వల్లోంచి తొలగించిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

యాదుల్లాకు పీహెచ్‌డీ



బంజారాహిల్స్: గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి విదేశీ హిందీ సాహిత్యంలో చేసిన పరిశోధనలకు గాను మహమ్మద్ యాదుల్లాకు డాక్టరేట్ వరించింది. ఆయన ప్రస్తుతం అంబర్‌పేట గోషామహల్ గర్ల్స్ గవర్నమెంట్ హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ సంగీత వ్యాస్ మార్గదర్శనంలో 'ప్రవాసీ లేఖక్ డాక్టర్ సురేష్ చంద్ర శుక్ల కె కథా సాహిత్యమే యుగ్ బోధ్' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించి డాక్టరేట్ సాధించారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎస్.రాజు యాదగిరినగర్ ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బండపల్లి చంద్రమ్మ సేవలు చిరస్మరణీయం

- ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

రహమత్‌నగర్: దివంగత కార్పొరేటర్ బండపల్లి చంద్రమ్మ ప్రజా సేవకు అంకితమైన నిస్వార్థ నాయకురాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కొనియాడారు. ఆమె చేసిన సేవలు రహమత్‌నగర్ డివిజన్ వాసులు ఎప్పటికీ మరిచిపోరని స్పష్టం చేశారు. చంద్రమ్మ నాలగవ వర్ధంతి సందర్భంగా రహమత్‌నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన పారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ... రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా చంద్రమ్మ రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి అవిరళ కృషి చేశారన్నారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ మాట్లాడుతూ... ఇకపై తన తల్లి బండపల్లి చంద్రమ్మ జయంతి, వర్ధంతిల సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నేత్ర వైద్య శిబిరంలో పెద్దఎత్తున రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. సాధురాం, రెనోవా కంటి ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు బండపల్లి చంద్రమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి పండ్లను పంపిణీ చేశారు. తెలంగాణ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ అసదొద్దీన్, పలు డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన పైప్‌లైన్ల వెలికితీత



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్‌–12లో అక్రమంగా వేసిన సీవరేజీ పైప్‌లైన్‌ను తొలగిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో అనుమతి లేకుండా రోడ్డు కటింగ్ చేయడంతో పాటు ఇష్టానుసారంగా నిబంధనలు తుంగలో తొక్కి వేసిన సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఇంజనీర్లు తొలగించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఇన్‌కమ్ ట్యాక్స్ క్వార్టర్స్‌కు, ర్యాడో షోరూంకు మధ్య ఉన్న రోడ్డులో ఓ భారీ భవనానికి సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు లేకుండా సదరు భవన యజమాని ఆదివారం సెలవు దినం కావడంతో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల కళ్లుగప్పి 25 మీటర్ల పొడవునా అక్రమంగా రోడ్డును తవ్వేశాడు. ఈ అక్రమ తవ్వకాలు, నిబంధనలకు విరుద్ధంగా సీవరేజీ పైప్‌లైన్ వేస్తున్నట్లుగా ఫిర్యాదు అందుకున్న జీహెచ్ఎంసీ, స్థానిక డీఈ అభినయ్‌కుమార్ స్పందించి ఆదివారం సాయంత్రం పనులు నిలిపివేయించారు. ఈ వ్యవహారాన్ని 'సెలవు దినం.. చప్పుడు కాకుండా తవ్వేద్దాం' అనే శీర్షికన సోమవారం 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన జూబ్లీహిల్స్ సర్కిల్ ఈఈ విజయ్‌కుమార్ అడ్డగోలుగా తవ్వేసిన రోడ్డులో సీవరేజీ పైప్‌లైన్లను వెలికితీయించారు. సంబంధిత భవన యజమానిపై, కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీకి మరమ్మతుల రుసుము చెల్లించి అక్కడ నుంచి అనుమతులు వచ్చిన తర్వాతనే ఈ పైప్‌లైన్ వేయాల్సి ఉంటుంది. అయితే స్థానికంగా కొంతమంది లీడర్ల అండదండలతో సదరు భవన యజమాని జలమండలి కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అక్రమంగా అనుమతులు లేకుండా అడ్డదారుల్లో ఈ పైప్‌లైన్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది లీడర్లు డబ్బులు వసూలు చేస్తూ అడ్డగోలుగా రోడ్లను తవ్విస్తున్నట్లుగా ఈ దందాతో బయటపడింది. అనుమతులు లేకుండా రోడ్డు తవ్వడమే కాకుండా పైపులు వేసింది కూడా జలమండలి సిబ్బంది, కాంట్రాక్టర్ కావడం గమనార్హం. అనుమతులు లేకుండా రోడ్డును తవ్వినందుకు తగిన చర్యలు ఉంటాయని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే వారిపై చర్యలు తీసుకుంటామని ఈఈ విజయ్‌కుమార్ హెచ్చరించారు. అదే విధంగా అనుమతులు లేకుండా ఆదివారం పనులు చేసినందుకు బోరబండ సెక్షన్‌లో జలమండలి కాంట్రాక్టర్‌గా పనిచేసే శివకుమార్ కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలంటూ జలమండలి జీఎం హరిశంకర్ ఆదేశాల మేరకు తట్టికాన వాటర్‌సెక్షన్ మేనేజర్ రాంబాబు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. చాలా చోట్ల జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అనుమతులు లేకుండానే లీడర్ల సహకారంతో చేతులు తడుపుతూ రోడ్లను తవ్వుతున్నారని, వీరిపై కూడా కేసులు నమోదు చేసే యోచనలో అధికారులు ఉన్నారు.

31న టీజేఎఫ్ రజతోత్సవం


టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ తదితరులు

పంజగుట్ట: తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) 25 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈ నెల 31న రజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఫోరం అధ్యక్షుడు అల్లం నారాయణ తెలిపారు. నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. వేడుకలు సంవత్సరం పాటు నిర్వహించి ఒక సావనీర్‌ను 2026 మే 31న ఆవిష్కరిస్తామన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

– గ్రేటర్ కమిషనర్ కర్ణన్


ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్ : ప్రజావాణిలో వచ్చిన ఆర్థిక పరమైన అర్జీలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని గ్రేటర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. ఆ మేరకు నిర్ణయం తీసుకున్నది, లేనిది అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రజావాణి విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని, వ్యక్తిగత, సామాజిక సమస్యలను వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని కమిషనర్ కోరారు.

భూదందాలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ : ఆర్. కృష్ణయ్య

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ భూములను కాంగ్రెస్ సర్కారు కార్పొరేట్ సంస్థలు, బడాబాబులకు ధారాదత్తం చేస్తూ భూదందాలకు పాల్పడుతోందని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ధ్వజమెత్తారు. భూదందాల వల్లే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్ల భవనాలను నిర్మించుకునేందుకు జాగా దొరకని దుస్థితి నెలకొందన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఇళ్ల పట్టాలున్న నిరుపేద బాధితులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాకురవి, నవీన్, యూత్ ప్రెసిడెంట్ గొల్లపల్లి అంజి పాల్గొన్నారు.

రాజధానిలో 23 మంది కొత్త ఏసీపీలు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది డీఎస్పీ/ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వీటిలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు సంబంధించిన పోస్టులు 23 ఉన్నాయి. ఈ స్థానాల్లో కొత్త ఏసీపీలు నియమితులయ్యారు. ఆయా పోస్టింగ్స్ ఇలా...

అధికారి	పోస్టింగ్
1. పి.నరేష్ రెడ్డి	బాలానగర్
2. వి.శ్రీకాంత్ గౌడ్	శంషాబాద్
3. సీహెచ్ శ్రీధర్	మాదాపూర్
4. సీహెచ్ శ్రీకాంత్	చిక్కడపల్లి
5. సీహెచ్ శంకర్‌రెడ్డి	మేడ్చల్
6. టి.సుఖ్‌దేవ్ సింగ్	సంతోష్‌నగర్
7. కె.సుబ్బరామిరెడ్డి	మలక్‌పేట
8. ఎ.యాదగిరి	గాంధీనగర్
9. ఎస్వీ రాఘవేంద్రరావు	ఎస్సార్ నగర్
10. వై.హరీష్ కుమార్	కాచిగూడ
11. ఎ.సుధాకర్	చంద్రాయణగుట్ట
12. ఇ.రవికిరణ్‌రెడ్డి	కూకట్‌పల్లి
13. ఏసీ బాలగంగిరెడ్డి	పేట్ బషీరాబాద్
14. పి.మురళీకృష్ణ	పంజగుట్ట
15. ఎస్.జానకిరెడ్డి	మహేశ్వరం
16. ఎస్.వెంకట్‌రెడ్డి	సైదాబాద్
17. ఎస్.సుదర్శన్	గోషామహల్
18. వై.వెంకట్‌రెడ్డి	కుషాయిగూడ
19. ఎస్.గిరిప్రసాద్	బాలానగర్ ట్రాఫిక్
20. కె.శశాంక్‌రెడ్డి	చిలకలగూడ
21. ఎస్.సైదయ్య	మహంకాళి
22. పి.ప్రవీణ్‌కుమార్	అబిడ్స్
23. మహ్మద్ వహీదుద్దీన్	హైదరాబాద్ ట్రాఫిక్-6


క్లాత్ మార్కెట్..


నడిచేందుకు కూడా వీలుకాని ఓ గల్లీ...

అదో పద్మవ్యూహం!

ఇదీ.. పాతబస్తీ పరిస్థితి

- 8 గజాల్లోనే భవనాలు.. అందులోనే వ్యాపారాలు
- ఇరుకు గల్లీలు..బాటిల్ నెక్ రోడ్లు
- వచ్చేదెలా..పోయేదెలా?
- గాలి, వెలుతురు అసలే రాదు
- అగ్ని ప్రమాదం జరిగితే కాపాడుకోలేని పరిస్థితి

చార్మినార్: ఇరుకు గల్లీలు.. బాటిల్ నెక్ రోడ్లు.. ముందుకెళ్తే వెనక్కి రాలేం.... సూర్యరశ్మి అసలే ఉండదు. ఇంట్లోకి వెలుతురు రాదు. బయటికి పొగ పోయే అవకాశమే ఉండదు.. ఇది పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులు. 8 గజాల్లోనే వ్యాపార సముదాయాలతో పాటు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. బల్దియా (ఎంసీహెచ్–మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) ఏర్పడక ముందు..అంటే నిజాం కాలం నుంచి ఇక్కడ ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. అప్పట్లో ఎలాంటి నిబంధనలు లేవు. తమకు తోచిన విధంగా ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. కొన్ని ప్రాంతాలైతే దాదాపు పద్మవ్యూహాన్నే తలపిస్తాయి. ఏదైనా ప్రమాదం జరిగినపుడు బయటకు వచ్చే దారికూడా అర్థం కాదు. ఇదీ పాతబస్తీలో పరిస్థితి.

వ్యాపార అవసరాలు పెరగడంతో..

పాతబస్తీలో వ్యాపార అవసరాలు పెరగడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలోని గదిని అద్దెకిస్తూ... ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 100, 200 ఏళ్లకు పైగా పాతబస్తీలో నివాస భవనాలు ఉన్నాయి.



ఆయా భవనాలలోనే వ్యాపారాలు సైతం కొనసాగిస్తున్నారు. ఎలాంటి సెట్ బ్యాక్‌లు ఉండవు. ఇక ప్రధాన రోడ్లే గల్లీల్లాగ ఉంటాయి. అంతర్గత రోడ్ల విషయం గురించి అసలు ఎవరికీ తెలియదు. తాము నివాసముంటున్న 10–15 గజాల్లోనే కొంత భాగం వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఎటువంటి ముందు జాగ్రత్తలు ఉండవు. జీహెచ్ఎంసి నిబంధనలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి.. కొత్తగా నిర్మించే భవనాలకు మాత్రమే నిబంధనలు వర్తిస్తున్నాయి. వందేళ్లకు పైగా నిర్మించిన వాటికి ఎలాంటి నిబంధనలు లేవు.

రెండు అడుగుల వెడల్పుతో..

రెండు అడుగుల వెడల్పుతో అర కిలోమీటర్ వరకు కూడా గల్లీలు ఉంటాయి. ఈ గల్లీల్లో నడక తప్ప ద్విచక్ర వాహనం కూడా ముందుకు వెళ్లలేని దుర్భర పరిస్థితులు ఉంటాయి. రెండు ఇళ్లకు నడుమ కామన్ గోడలు ఉంటాయి. కేవలం ముందు వైపు మాత్రమే ప్రధాన ద్వారం ఉంటుంది. కేవలం ఒక వైపు మాత్రమే రాకపోకలకు అవకాశం ఉంటుంది. అది కూడా రెండు అడుగుల గల్లీతోనే. మూడు వైపులా కామన్ గోడలు ఉండడంతో బయటినుంచి గాలి,వెలుతురుకు అవకాశమే ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం జరిగితే బాధితులను రక్షించడానికి అగ్నిమాపక సిబ్బంది పడరాన్ని పాట్లు పడాల్సి వస్తోంది. ఆదివారం గుల్జార్ హౌజ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలోని మృతుల కుటుంబాలు సైతం తమ వాహనాలను వేరే చోట పార్కు చేసుకొని కాలినడకన ఇంట్లోకి వెళ్లేవారు. కార్లు పార్కింగ్ చేసుకోవడానికి వీలు లేదు.

పటేల్ మార్కెట్లో పరేషాన్

హైకోర్టుకు కూతవేటు దూరంలో ఉన్న పటేల్ మార్కెట్.. వస్త్ర వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న ఈ వస్త్ర వ్యాపారానికి గిరాకీ ఎక్కువ. ఇతర జిల్లాల నుంచి పటేల్ మార్కెట్ కు వస్తుండడంతో ఇక్కడ ప్రతిరోజు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ కూడా ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే తప్పించుకోవడానికి ఎవరికి అవకాశం ఉండదు.



టిమ్స్ ఆసుపత్రి పనులు గడువులోగా పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలుంటే తన దష్టికి తీసుకురావాలని, పనులు గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం అల్వాల్‌లోని టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. అసుపత్రి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈలు వనజ, శ్రీనివాస్ రెడ్డి, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టరు.ఉమాగౌరీ, అల్వాల్ తహసీల్దార్ రాములు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజలు అందించే దరఖాస్తులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ హరిప్రియ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో 66 ఫిర్యాదులు అందినట్లు హరిప్రియ పేర్కొన్నారు. ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

- హైడ్రాను ఆశ్రయిస్తున్న బాధితులు
- ప్రజావాణిలో మొత్తం 59 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్'లో ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జాకోరులు వాలిపోతున్నారు. ఇన్నాళ్లు వీటిపై ఏం చేయాలో పాలుపోని బాధితులు ఇప్పుడు బయటకు వస్తున్నారు. ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రజల సామూహిక అవసరాలకు సంబంధించిన స్థలాల్లో ఉన్న కబ్జాలపై హైడ్రా తీరుతో పలువురు ఫిర్యాదుదారులు ముందుకు వస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ భూములతో పాటు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల అంశాన్ని హైడ్రా దృష్టికి తీసుకువస్తున్నారు. బుద్ధభవన్‌లోని ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 59 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 70 శాతం ఈ తరహా స్థలాలకు సంబంధించినవే కావడం గమనార్హం. టోలిచౌకి హకీంపేటలో బాబా హోటల్ వద్ద రోడ్డును ఆక్రమించి షాపు ఏర్పాటు చేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండలం సుభాష్‌నగర్ నుంచి కొంపల్లికి వెళ్లేందుకు 50 అడుగుల వెడల్పు రహదారి ఉంది. ఇది 100 అడుగుల పరిధిలో కేవలం 10 ఫీట్లకే పరిమితమైందని స్థానికులు హైడ్రా దృష్టికి తెచ్చారు. అక్కడ ఎదురెదురుగా ఉన్న ప్లాట్ల


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

యజమానులు చెరో 20 అడుగుల చొప్పున కబ్జా చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాజుల రామారంలోని సర్వే నెం.155లో ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన 3500 గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని భగత్ సింగ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఓయూ కాలనీలో తమ ప్లాట్‌ను నలువైపుల నుంచి మూసేయడంతో పాటు రహదారి పక్కనే ఉన్న శ్మశానాన్ని కూడా ఆక్రమించి విక్రయించారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. చెంగిచెర్లలోని సర్వే నెం.33/10లో మొత్తం 13 ఎకరాల భూమి ఉండగా.. అందులో ఆరు ఎకరాల్లో మాతా అరవింద్ కాలనీ ఉంది. మిగతా ఏడు ఎకరాలను సొంతం చేసుకున్న వ్యక్తి అది దేవాదాయ శాఖ పరిధిలో ఉందంటున్నాడని, ఇలానే అధికారులకు ఫిర్యాదు చేసి రిజిస్ట్రేషన్లు కాకుండా ఇబ్బందిపెడతున్నాడని స్థానికులు ఫిర్యాదు చేశారు.

గుల్జార్ హౌజ్ ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- 17 మంది మరణించడం బాధాకరం
- విచారణను జూన్ 30కి వాయిదా వేసిన మానవ హక్కుల కమిషన్

సిటీ కోర్టులు : చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌజ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మరణించడం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సోమవారం సుమోటోగా కేసు స్వీకరించింది. భవన భద్రత, విద్యుత్ నిర్వహణ, అగ్నిప్రమాద నివారణ లోపం కారణంగానే ఈ ఘటన జరిగిందని మీడియాలో వచ్చినవార్తల ఆధారంగా కమిషన్ ఈ కేసును తీసుకుంది. తెలంగాణ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్‌లకు ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారలోగా ఘటనపై పూర్తి నివేదిక అందజేయాలని సూచిస్తూ విచారణను జూన్ 30కి వాయిదా వేసింది.

ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్ 2025 సంవత్సరానికి వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సోమవారం పురస్కారాలు ప్రకటించింది.

- పద్య, గేయ కవిత్వంలో డాక్టర్ కంచనపల్లి గోవర్ధనరాజు రచించిన నిరుడు కురిసిన నిప్పు బల్మూరి కొండలరాయుడు గ్రంథం రచన కవిత్వంలో ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి అనే కవితా సంపుటి పురస్కారాలకు ఎంపికయ్యాయి.
- నవల విభాగంగా డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన గువ్వల చెన్నా అనే నవల, సాహిత్య విమర్శలో డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన సవారు ముస్లిం వ్యాసాలు, కథా ప్రక్రియలో రామచంద్రమౌళి రచించిన నిర్వహణ కథల సంపుటి, ఇతర ప్రక్రియల విభాగంలో డాక్టర్ సంగనభట్ల నరసయ్య రచించిన కోటిలింగాల తెలంగాణ ప్రాచీన చారిత్రక వ్యాసాల గ్రంథానికి, బాలసాహిత్యంలో డాక్టర్ అమరవాది నీరజ రచించిన ఏడురంగుల జెండా పుస్తకం పురస్కారాలకు ఎంపికైంది. అనేక సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికే ఈ పురస్కారాలను ప్రవేశపెట్టి నిర్వహిస్తున్నామని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు. ఈ సంవత్సరం అత్యధికంగా వచన కవిత్వంలో 48 గ్రంథాలు పోటీకి వచ్చినట్లు వివరించారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన త్వరలో హైదరాబాద్‌లో జరిగే ఉత్సవంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరిస్తామని డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, పట్టణాల్లో ఉండే పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలు మరింత దగ్గర చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి అనే అంశంపై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నవోదయ, కేంద్రీయ లాంటి వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. పట్టణాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు విపరీతంగా పెంచారన్నారు. ఫీజులను నియంత్రించేందుకు ఒక చట్టం తేవడంతో పాటు, ఓ బోర్డును కూడా ఏర్పాటుచేయాలన్నారు. పేద, మధ్యతరగతి వారు చదువుకునే హక్కును కాపాడాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చెయ్యడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ తేవాలన్నారు. ప్రభుత్వం కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఒకసారి కలిసి వివరిద్దామన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్, తల్లుల సంఘం కన్వీనర్ భాగ్యలక్ష్మి, హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ సాయినాథ్ పాల్గొన్నారు.

జూన్ 2 లోపు డీఏలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వామి గౌడ్

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2లోపు ఉద్యోగులు, పెన్షనర్లకు ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయిందని.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలని కోరింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాటూరి సుధాకర్ రెడ్డి, ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు విఠల్ తదితరులు మాట్లాడారు. పెన్షనర్లకు రూ.8 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ వైద్యం అందించాలని, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. నవీన్ మిట్టల్ కమిటీ కూడా ఇంత వరకు నివేదిక ఇవ్వలేదని ఆరోపించారు. ఇటీవల 10 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారని..వారికి ఇంత వరకు ఎలాంటి బెనిఫిట్స్ అందలేదన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాలకతీతంగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని వారు హెచ్చరించారు.త్వరలో జిల్లాల వారిగా పర్యటనలు నిర్వహించి ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్

హిమాయత్‌నగర్: మోదీ ప్రభుత్వం ముస్లింలను దెబ్బతీయడానికి తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 24న తెలంగాణ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ముస్లిం జేఏసీ కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్ వెల్లడించారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా తెలంగాణ మార్చ్ నిర్వహిస్తున్నామని, వేదిక ఎక్కడనేది త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ మార్చ్‌లో రాష్ట్రం నలు మూలల నుంచి ముస్లింతో పాటు ఇతర వర్గాల ప్రజలు పాల్గొంటారని తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ వ్యరేతికమని అన్నారు. ఈ చట్టాన్ని అమలు పరచకుండా ఉంచాలన్నారు. సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ మార్చ్‌కు సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేతలు కేసీఆర్, కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీపీఐ, సీపీఎం నేతలను ఆహ్వానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి కార్యదర్శి సయ్యద్ పారుబుద్దీన్ ఆలీ అహ్మద్, ఏపీసీఆర్ కార్యదర్శి డాక్టర్ షేక్ మహ్మద్ ఉస్మానీ పాల్గొన్నారు.

బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభానికి సిద్ధం


వివరాలు వెల్లడిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్

సనత్‌నగర్: కళ్లు జిగేల్‌మనిపించేలా సరికొత్తగా రూపుదిద్దుకున్న బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 103 రైల్వేస్టేషన్లను ఈ నెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందులో బేగంపేట ఒకటి. అమృత్ భారత్ స్టేషన కింద రూ.26.55 కోట్లతో అభివృద్ధి చేశారు. ఆ వివరాలను సోమవారం బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీఆర్ఓ శ్రీధర్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ విశాల్ వెల్లడించారు. బేగంపేట రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయం తలపించే రీతిలో అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేశామన్నారు. 12 మీటర్ల అడుగుల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, 2 లిఫ్టులు, నాలుగు ఎస్కలేటర్లు, సర్క్యులేటింగ్ ఏరియా, ఆధునిక మరుగుదొడ్లు, అప్రోచ్ రోడ్డు, ప్లాట్‌ఫారం రీసర్ఫేసింగ్, వెయిటింగ్ హాళ్ల నిర్మాణం వంటి పనులు పూర్తయ్యాయన్నారు. స్టేషన్ బయట గ్రీనరీ, రాక్ గార్డెన్, చిన్న నీటి ఫౌంటెన్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిర్దేశాలకు అనుగుణంగా మురుగునీటి శుద్ధికి ప్లాంట్లు, స్టేషన్ ప్రాంగణంలో ఉద్యానవన రూపకల్పనకు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. రూ.12 కోట్ల వ్యయంతో రెండో ప్రవేశద్వారం అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పార్థివదేహం గాంధీ కళాశాలకు అప్పగింత


డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పార్థివదేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి : పీపుల్స్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, తెలంగాణ మెడికల్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాపరెడ్డి (78) పార్థివదేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల కోసం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతాప్‌రెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంగతి విదితమే. సోమవారం ఉదయం గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ హెరిటేజ్ భవనంలో ఆయన భౌతికకాయాన్ని వైద్యుల సందర్శనార్థం ఉంచారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నందకుమార్‌రెడ్డి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు శరత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ప్రతాప్‌రెడ్డి పార్థివదేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ మెడికల్ కాలేజీ అనాటమీ విభాగ ప్రొఫెసర్లు సుధారాణి, సుధాకర్‌బాబులకు అప్పగించారు.

రూ.2కే వైద్య సేవలందించిన మానవతావాది..

జనరల్ ఫిజీషియన్ అయిన ప్రతాప్‌రెడ్డి భార్య గైనకాలజిస్ట్ శోభతో కలిసి నిరుపేదలకోసం 1975లో కూకట్‌పల్లిలో పీపుల్స్ ఆస్పత్రిని ప్రారంభించి రెండు రూపాయల నామమాత్ర ఫీజుతో వైద్యసేవలు అందించారు. 2021వరకు పీపుల్స్ ఆస్పత్రిని కొనసాగించారు. గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన ఆయన సుమారు రూ.50 లక్షల సొంత నిధులతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు.

సాక్షి
11
హైదరాబాద్‌, మంగళవారం, 20, మే, 2025
సిటీ ప్లస్



అలరించిన మీట్‌-గ్రీట్‌


సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లోని ఇనార్బిట్‌ మాల్‌లో నిర్వహించిన డోరేమాన్‌ మీట్‌– గ్రీట్‌ కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. వేసవి వినోదాన్ని అందించడంలో భాగంగా రెండు రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు కుటుంబ సమేతంగా తమకు ఇష్టమైన కార్టూన్‌ క్యారెక్టర్స్‌ డోరేమాన్‌, నోబితాలను దగ్గరగా చూసి అరుదైన అనుభూతిని ఆస్వాదించారు. ఈ ఈవెంట్‌లో భాగంగా చిన్నారుల కోసం, కలరింగ్‌ స్టేషన్లు, పజిల్‌–సాల్వింగ్‌ గేమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు తమ సొంత డోనట్‌లను రంగురంగుల టాపింగ్స్‌తో అలంకరించేందుకు టిమ్‌ హోర్టన్స్‌ డోనట్‌ డెకర్‌ వర్క్‌షాప్‌ నిర్వహించారు.

12 గంటలు గానం..

తెలుగు బుక్‌లో స్థానం

చిక్కడపల్లి: 12 గంటలపాటు నిర్విరామంగా 120 పాటలు పాడిన 69 ఏళ్ల గాయకుడు రికార్డు సృష్టించారు. ఆయనే ప్రముఖ గాయకుడు శేషగిరిరావు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చరల్‌ సెంటర్‌లో 69 ఏళ్ల శేషగిరిరావు 12 గంటలపాటు ఏకధాటిగా 120 పాటలు పాడారు. ఆయన అద్భుత గానంతో అబ్బుర పరిచి తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ స్థానం సంపాదించారు. భువన సంగీత ఝరి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాభారతి సిటీ కల్చరల్‌ సెంటర్‌ అధినేత పురుషోత్తం నారగోని, తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ అధినేత వెంకటాచారి, సంస్థ ప్రతినిధి అశోక్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.





రామ్‌ మిర్యాల లైవ్‌ కన్సర్ట్‌

క్వేక్‌ ఎరీనా వేదికగా స్వరాగాల హోరు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సింగర్‌ రామ్‌ మిర్యాల నగరంలోని క్వేక్‌ ఎరీనా వేదికగా తన స్వరాలతో హోరెత్తించనున్నారు. ఈ నెల 22న లైవ్‌ కన్సర్ట్‌తో రామ్‌ మిర్యాల సంగీతప్రియులను అలరించనున్నారు. తెలుగు రీజినల్‌ పాటలతో జరగనున్న ఈ కన్సర్ట్‌ రాత్రి 8 నుంచి 3 గంటలపాటు నిరంతరాయంగా కొనసాగనుంది. 21 ఏళ్లు పైబడిన వారికే ఈ కన్సర్ట్‌కు ప్రవేశముందని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన పాస్‌లు బుక్‌ మై షోలో అందుబాటులో ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

దశాబ్దాల చరిత్ర కలిగిన జపాన్‌లో జరిగే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రదర్శన ఒసాకా ఎక్స్‌పోలో మన సిటీకి చోటు దక్కింది. ఈ ఎక్స్‌పోలో పాల్గొన్న తొలి భారతీయ రాష్ట్రంగా తెలంగాణ టీ హబ్‌ సహకారంతో నిలవగా నగరానికి చెందిన 3 స్టార్టప్‌లు ఈ ఎక్స్‌పోలో ఆవిష్కరణలను ప్రదర్శించడం విశేషం.

-సాక్షి, సిటీబ్యూరో



యురేకా.. ఒసాకా



జపాన్‌ వేదికగా దుమ్మురేపిన సిటీ స్టార్టప్స్‌

- అంతర్జాతీయ ప్రదర్శనలో రాష్ట్రానికి తొలి ప్రాతినిధ్యం
- అద్భుతమైన ఆవిష్కరణలతో ఆకట్టుకున్న నగర యువత
- సత్తా చాటిన నగర సాంకేతిక సామర్థ్యం

ఒసాకా ఎక్స్‌పోలో పాల్గొన్న ''డీప్‌లూప్‌ ''స్టార్టప్‌ వర్చువల్‌ రియాలిటీ ఆధారిత శిక్షణ స్టిములేషన్లను ప్రదర్శించింది. ''మ్యాడ్‌ సైంటిస్ట్‌''అనే పేరున్న స్టార్టప్‌ అగెంటిక్‌–పవర్డ్‌ టెక్నాలజీ నెట్‌వర్క్‌ను ప్రదర్శించింది. మరో స్టార్టప్‌ ''రెనోట్‌ ఏఐ''ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ–పవర్డ్‌ స్మార్ట్‌ రీయూజబుల్‌ నోట్‌బుక్‌ను ప్రదర్శించింది. వినూత్న ఆవిష్కరణలతో ఈ స్టార్టప్‌లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఒసాకా వరల్డ్‌ ఎక్స్‌పో వేదికగా తెలుగు స్టార్టప్‌ రంగం తన సత్తా చాటిన నేపథ్యంలో సగర్వంగా ఇటీవలే నగరానికి తిరిగి వచ్చిన ఆయా స్టార్టప్‌ల ప్రతినిధులు 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు.



గొప్ప స్పందన లభించింది..

మేం రూపొందించిన రియల్‌ టైమ్‌ ఇన్ఫర్మేషన్‌ సింతెస్‌ గంటకోసారి 95% కచ్చితత్వంతో టెక్నాలజీ అప్‌డేట్స్‌ను అందించగలదు. ఈ టెక్‌ నెట్‌వర్క్‌ ఏజెంటిక్‌ పవర్‌తో పనిచేసే ప్లాట్‌ఫాం, టెక్‌ స్టూడెంట్లు, పరిశోధకులు ప్రొఫెషనల్స్‌కు సహాయకారిగా ఉంటూ రీసెర్చ్‌ను వేగవంతం చేస్తుంది. మాకు 9 ఏళ్ల చిన్నారుల నుంచి 85 ఏళ్ల పెద్దల వరకూ వచ్చిన ప్రతిస్పందన అద్భుతంగా ఉంది. కెనడా నుంచి వచ్చిన ఒక జంట తమ పిల్లలకు మ్యాడ్‌ సైంటిస్ట్‌ వేదికను ఉపయోగించి టెక్నాలజీ నేర్పుతున్నట్లు చెప్పడం మాకు దక్కిన గొప్ప గుర్తింపు

–భాను కిరణ్‌ మెర్గోజు, మ్యాడ్‌ సైంటిస్ట్‌ వ్యవస్థాపకుడు



ప్రజోపయోగ ఆవిష్కరణతో ఎక్స్‌పోలో పాల్గొన్నాం..

ఒసాకా ఎక్స్‌పోలో భారత పావిలియన్‌లో మా ఏఐ ఆధారిత స్మార్ట్‌ రీయూజబుల్‌ నోట్‌బుక్‌ను ప్రదర్శించడం గొప్ప అనుభూతినిచ్చింది. రీనోట్‌ ఏఐ ప్రపంచపు మొట్టమొదటి ఏఐ ఆధారిత స్మార్ట్‌ రీయూజబుల్‌ నోట్‌బుక్‌. ఇది వాటర్‌ ప్రూఫ్‌, టియర్‌–రెసిస్టెంట్‌. 100 సార్లు పునర్వినియోగించుకునేలా రూపొందింది. దీని మొబైల్‌ యాప్‌ చేతిరాతను డిజిటల్‌ టెక్స్ట్‌గా మార్చి, ఏఐ చాట్‌బాట్‌ ద్వారా సారాంశం చెబుతుంది. పేపర్‌ స్కెచ్‌లు రంగుల డిజిటల్‌ ఆర్ట్‌గా మారడంతో సహా ఎన్నో చేయగలదు. మా స్టాల్‌కు వచ్చిన ఓ జపాన్‌ పౌరుడు– 1970 ఒసాకా ఎక్స్‌పోలో భారత స్టాల్‌ సందర్శించి రెండు ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నానని, ఆ తరువాత ఎన్నడూ ఎవరివీ తీసుకోలేదని అన్నారు. 'మీ పని కేవలం ఇన్నోవేషన్‌ మాత్రమే కాదు, సమాజానికి ఉపయోగపడే గొప్ప సేవ'అని ఆయన చెప్పిన మాటలు భావోద్వేగానికి లోనయ్యేలా చేశాయి.

–సుమన్‌ బాలబొమ్మ, రీనోట్‌ ఏఐ వ్యవస్థాపకుడు



ఆ అనుబంధం ఓ గొప్ప అనుభవం...

ఒసాకాలో తెలంగాణ స్టార్టప్‌ ఎకోసిస్టమ్‌కు ప్రాతినిధ్యం ఒక ప్రత్యేకమైన, మరపురాని అనుభూతి. ఈ అవకాశాన్ని ఇచ్చిన టీహబ్‌కు ధన్యవాదాలు. డీప్‌లూప్‌ తరఫున వర్చువల్‌ రియాలిటీ ఆధారిత ట్రైనింగ్‌ స్టిములేషన్లను ప్రదర్శించాం. ఇవి ఇంటర్నెట్‌ ఆఫ్‌ థింగ్స్‌(ఐఓటీ) కృత్రిమ మేధస్సు(ఏఐ) సహకారంతో నడుస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మాకు 35కు పైగా క్లయింట్లు ఉన్నారు. మా ఏఐ సొల్యూషన్‌ను అనుభూతించాలనే ఆసక్తితో వేలాది మందితో కూడిన భారీ క్యూలను చూడటం నిజంగా సంతోషదాయకం. స్థానిక అనువాదకుల సాయంతో జపనీస్‌ భాషలో మాట్లాడుతూ అక్కడి ప్రజలతో కొత్త అనుబంధాన్ని ఏర్పరచుకోవడం ఒక ప్రత్యేక అనుభవం.

–సూర్యప్రకాష్‌ కూసుమంచి, డీప్‌లూప్‌ వ్యవస్థాపకుడు



అలరించిన ఫ్యాషన్‌ స్ట్రీట్‌ వాక్‌

ప్రారంభించిన అనన్య నాగళ్ల



గ్లోబల్‌ డిజైన్స్‌..

వైవిధ్యాన్ని కోరుకునే ఈ తరం యువతకు అధునాతన సృజనాత్మకతను జోడిస్తూ డిజైనింగ్‌ చేస్తున్నాం. ఇద్దరితో మొదలైన మా ప్రయాణం 30 మందికిపైగా ఫ్యాషన్‌ డిజైనర్లకు అవకాశాలను కల్పిస్తున్న ఫ్యాషన్‌ సెంటర్‌గా ఆవిష్కృతమైంది. గ్లోబల్‌ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్స్‌ను రూపొందిస్తున్నాం.

– దివ్య కర్నాటి, లెగ్డా డిజైన్‌ స్టూడియో నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: 'లెగ్డా డిజైన్‌ స్టూడియో' వేదికగా నిర్వహించిన 'ఫ్యాషన్‌ స్ట్రీట్‌ వాక్‌'లో నగరంలోని టాప్‌ మోడల్స్‌ అధునాతన ఫ్యాషన్‌ డిజైన్లతో అలరించారు. మహిళల ట్రెండీ డిజైన్స్‌తో ఫ్యాషన్‌ ప్రపంచాన్ని కలర్‌ఫుల్‌గా మార్చుతున్న లెగ్డా డిజైన్‌ స్టూడియో నూతన బ్రాంచ్‌ను హబ్సిగూడలో సోమవారం టాలీవుడ్‌ తార అనన్య నాగళ్ల ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ ఫ్యాషన్‌ డిజైనర్‌ దివ్య కర్నాటి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నటి అనన్య నాగళ్ల మాట్లాడుతూ ఈ తరం అమ్మాయిల అందాలను ఇనుమడింపజేసే డ్రీమ్‌ డిజైన్లను సృష్టించడానికి లెగ్డా డిజైన్‌ స్టూడియో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళలకు ఉపాధిని కల్పిస్తూ, వారి సృజనాత్మకతకు మద్దతుగా నిలుస్తున్న డిజైనర్‌ దివ్య కర్నాటి సేవలు మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో ఫ్యాషన్‌ స్టూడియో ఏర్పాటు చేయడం ఇక్కడి ఫ్యాషన్‌ హంగులకు, ఆదరణకు తార్కాణాలని శ్రీనివాస్‌ గౌడ్‌ అన్నారు. పేషెంట్‌ను పరీక్షించి డాక్టర్‌ మందులు ఇచ్చినట్టే, శరీర రూపురేఖలను బట్టి ఫ్యాషన్‌ దుస్తులను రూపొందించడం వినూత్న కళ అని బూర నర్సయ్య గౌడ్‌ అన్నారు.



సేఫ్టీ.. అదే ప్రియారిటీ



సాక్షి, సిటీబ్యూరో: వాహనదారుల్లో హెల్మెట్‌ ధరించడం, ట్రాఫిక్‌ నియమాలు పాటించడం తదితర అంశాలపై అవగాహన పెంచేందుకు హోండా మోటార్‌సైకిల్‌– స్కూటర్‌ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) రోడ్‌ సేఫ్టీ కార్యక్రమాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా ట్రాఫిక్‌ పోలీసులతో కలిసి హైదరాబాద్‌ ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ పార్క్‌లో 6 రోజుల వేసవి శిబిరాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసున్న 750 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే రహదారి భద్రతపై అవగాహన పెరగాలనే ఆలోచనతో ప్రమాద మరణాలను 2030 నాటికి 50 శాతం తగ్గించాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని మద్దతుగా, కార్పొరేట్‌ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని హెచ్‌ఎంఎస్‌ఐ ప్రతినిధులు తెలిపారు.

అన్నమయ్య కీర్తనలు ఆపాత మధురం



గన్‌ఫౌండ్రీ: తాళ్ళపాక అన్నమయ్య కీర్తనలు ఆపాత మధురమని ప్రముఖ నాట్య గురువు డాక్టర్‌ పసుమర్తి శేషుబాబు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి సందర్భంగా సంగీత నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాలన్నారు. అంతకు ముందు వివిధ అంశాలపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు, అన్నమయ్య కీర్తనల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌ డాక్టర్‌ వనజ ఉదయ్‌, ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అశోక్‌, తెలుగు ఛలనచిత్ర మండలి కార్యవర్గ సభ్యురాలు నాగులపల్లి పద్మిని, భారత ఆర్ట్స్‌ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు లలితతో పాటు పలువురు నాట్య గురువులు పాల్గొన్నారు.

విలాస నగరంలో స్కోడా కొడియాక్‌

హైదరాబాద్‌లో ఆవిష్కరించిన పీపీఎస్‌ మోటార్స్‌



సాక్షి, సిటీబ్యూరో: 130 సంవత్సరాల విశిష్టత కలిగిన స్కోడా ఇండియా అధునాతన స్కోడా కొడియాక్‌ వాహనాన్ని ఆవిష్కరించింది. ఈ సరికొత్త తరం 4x4 ఎస్‌యూవీ మోడల్‌ను కొండాపూర్‌లోని పీపీఎస్‌ మోటార్స్‌ స్కోడా షోరూంలో ఆవిష్కరించారు. ఈ ఏడాది తొలి ఉప–4ఎమ్‌ ఎస్‌యూవీ కైలాక్‌ను విడుదల చేసి స్కోడా ఆటో కొత్త యుగానికి నాంది పలికింది. ఇది ఈ ఏడాది కూడా ప్రీమియం పోర్ట్‌ఫోలియోలో బ్రాండ్‌ను కొనసాగిస్తూనే రెండోతరం కొడియాక్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్‌ డైరెక్టర్‌ పీటర్‌ జానెబా మాట్లాడుతూ మార్చిలో భారతదేశంలో ఒక నెల అమ్మకాల్లో అగ్రస్థానాన్ని సాధించామని, కైలాక్‌తోపాటు కుషాక్‌, స్లావియాల వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ వంటి నగరాల్లోని రోడ్లపై సునాయాసంగా, ఫ్రీ హ్యాండ్లింగ్‌ను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీపీఎస్‌ మోటార్స్‌ ఎండీ రాజీవ్‌ సంఘ్వీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీయో తెలియదు

మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి అన్నారు. ఆయన ఏ పార్టీకి చెందినవారో అసెంబ్లీ స్పీకర్‌ను అడిగితే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను చాలా సీనియర్‌నని, జగిత్యాల అభివృద్ధి గురించి తనకు అవగాహన ఉందని, ఎవరూ చెప్పాల్సిన పనిలేదని అన్నారు. జగిత్యాల అభివృద్ధికి నిధులిస్తానని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారని, ఆయనను జగిత్యాలలో జరిగే కార్యక్రమానికి ఆహ్వానించామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేస్తామని చెప్పడం హర్షించదగిన విషయమని అన్నారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్ల కల్పన విషయంలో బీజేపీ రాష్ట్ర శాఖ కేంద్రానికి లేఖ రాసేలా బీసీ సంఘాల నాయకుడు ఆర్. కృష్ణయ్య చొరవ తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీల విషయంలో రాష్ట్రం తరఫున చేయాల్సిందంతా చేశారని, ఇప్పుడు బంతి కేంద్రం కోర్టులో ఉందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వానిది నియంతృత్వ వైఖరి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



సాక్షి, యాదాద్రి : పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్రం నియంతృత్వంతో వ్యవహరిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. దేశ భద్రత కోసం కట్టుబడి ఉన్న ప్రతిపక్షాల సహకారాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తోందన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ చేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్‌తో పోరాటంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు చెప్పకుండా ప్రపంచ దేశాలకు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ విధానాలు దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా ఉన్నాయని ఆరోపించారు. బీబీనగర్ ఎయిమ్స్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది, యంత్రాల కొరత తీవ్రంగా ఉందన్నారు. సాగునీటి కాలువలు లేకుండా చేపడుతున్న ప్రాజెక్టుల వల్ల ప్రయోజనం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిధుల ఖర్చు విషయంలో ప్రాధాన్యతలను గుర్తించాలన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు ఎస్.వీరయ్య, చెరుపల్లి సీతారాములు పాల్గొన్నారు.

కేటీఆర్ కంటే హరీశ్‌రావుకే ఎమ్మెల్యేల మద్దతు: సామా



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభ ఆ పార్టీకి విచ్ఛిన్న సభగా మారిందని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబంలో కలహాలు తారస్థాయికి చేరాయని, ఆ పార్టీ నేతలు ఉనికి కోసం ఎవరి చదరంగం వారు ఆడుతున్నారని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేత కోటూరి మానవతారాయ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పుడు బీఆర్ఎస్ అంటే కేసీఆర్ కోసం బాపు రాష్ట్ర సమితి, కేటీఆర్ కోసం బేటా రాష్ట్ర సమితి, కవిత కోసం బేటీ రాష్ట్ర సమితి, హరీశ్‌రావు కోసం బతీజా రాష్ట్ర సమితిగా చెప్పుకోవాల్సి వస్తోందన్నారు. అయితే, కేటీఆర్ కన్నా హరీశ్‌రావుకే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, కేటీఆర్ తన ఇంటికి వచ్చి మాట్లాడాడని హరీశ్‌రావు వెనక్కు తగ్గితే ఆయన ఖేల్ ఖతం అవుతుందని, రాజకీయ భవిష్యత్తు ఉండదని అన్నారు. వాస్తవానికి హరీశ్‌రావు ప్రతిపక్ష నేత పదవి అడుగుతున్నాడని, అది ఇస్తే కష్టపడదామని ఆయన చూస్తుంటే ఆ పదవి హరీశ్‌రావుకు ఇస్తే తనకు గండంగా మారతాడనే భావనలో కేటీఆర్ ఉన్నాడని అన్నారు.

లోక్‌సభ సచివాలయ అధికారులకు శిక్షణ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ సచివాలయ అధికారులకు అయిదు రోజుల శిక్షణ తరగతులను సోమవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమం అధికారులకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం, సామర్థ్యాలను సమకూర్చుతుందని వివరించారు. కార్యక్రమంలో లోక్‌సభ సెక్రటేరియట్‌లోని పార్లమెంటరీ పరిశోధన, శిక్షణ సంస్థ డైరెక్టర్ పీకే మల్లిక్, విపత్తు నిర్వహణ, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కేంద్రం కోర్సు డైరెక్టర్, హెడ్ డాక్టర్ కందుకూరి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చలానా.. చెల్లించనివారే ఎక్కువ

- గత ఏడాది దేశంలో రూ.12 వేల కోట్ల జరిమానాలు విధింపు
- ఉల్లంఘనులు చెల్లించింది కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే
- 'కార్స్ 24'సంస్థ సర్వేతో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు



సాక్షి, హైదరాబాద్: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడి జరిమానా చెల్లించని వారే ఎక్కువగా ఉంటున్నారు. గత ఏడాది దేశవ్యాప్తంగా వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వాహన చోదకులకు పోలీసులు రూ.12 వేల కోట్ల మేర జరిమానా విధించారు. ఉల్లంఘనులు చెల్లించింది మాత్రం కేవలం రూ.3 వేల కోట్లే. సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ సంస్థ 'కార్స్ 24'సర్వేలో ఈ విషయం బయట పడింది. ట్రాఫిక్ చలాన్లలో 55 శాతం కార్లు, 45 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే. దీనికి సంబంధించి 'ది గ్రేట్ ఇండియన్ చలాన్ క్రైసెస్'పేరుతో ఓ నివేదిక విడుదల చేసింది.

సొంత కార్లు ఉన్నవారు తక్కువే

'కార్స్ 24'సర్వే ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి ఎనిమిది కోట్ల చలాన్లు జారీ అయ్యాయి. దీని ప్రకారం చూస్తే రహదారులపై సంచరించే ప్రతి రెండో వ్యక్తిగత వాహనంలో ఒకదానిపై చలాన్ ఉంటోంది. దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల కార్లు ఉండగా.. ద్విచక్ర వాహనాల సంఖ్య మాత్రం 35 కోట్ల వరకు ఉంది. రోడ్లపై సంచరిస్తున్న కార్లలో 92.14 శాతం క్యాబ్స్, ట్యాక్సీలే కాగా కేవలం 7.86 మాత్రమే వ్యక్తిగతంగా వినియోగించే వాహనాలు. 'కార్స్ 24'సంస్థ రహదారి భద్రతపైనా వెయ్యి మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ వివరాలు ఇలా...

- 43.9 శాతం మంది రోడ్డుపై పోలీసులు కనిపిస్తేనే, 17.6 శాతం మంది జరిమానాలు తప్పించుకోవడానికే నిబంధనలు పాటిస్తున్నారు. 31,2 శాతం మంది అప్పుడప్పుడు పోలీసులు ఉన్నారా? అనేది వెతుక్కుంటూ తమ డ్రైవింగ్ పంథా మార్చుకుంటున్నారు.
- రహదారిపై ట్రాఫిక్ పోలీసులను చూసినప్పుడు 51.3 శాతం మంది తమ వాహన వేగం, ఇతర నిబంధనల్ని చెక్ చేసుకుంటున్నారు. 34.6 శాతం మంది వేగం తగ్గించేసుకుంటున్నారు. 12.9 శాతం మంది తప్పించుకుంటూ మరో దారిలో వెళుతున్నారు.
- ఉల్లంఘనలపై కన్నేయడానికి సీసీ కెమెరాలు ఉన్నా, 47 శాతం మంది వాటిని పట్టించుకోవడం లేదు. 36.8 శాతం మంది తమ వేగం తగ్గిస్తున్నారు. 15.3 శాతం మంది కేవలం వేగాన్ని గుర్తించే కెమెరాలనే పట్టించుకుంటున్నారు.
- హరియాణాకు చెందిన ఓ ట్రక్ ఓవర్ స్పీడ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. గత ఏడాది ఉల్లంఘనలకు సంబంధించి రూ.2 లక్షలు జరిమానా విధించారు. బెంగళూరుకు చెందిన ఓ ద్విచక్ర వాహనచోదకుడు 500 ఉల్లంఘనలకు పాల్పడి రూ.3 లక్షలు జరిమానా చెల్లించాడు. గుర్‌గావ్‌లో ప్రతిరోజూ 4500 చలాన్లు జారీ అవుతున్నాయి.

పదేపదే ఉల్లంఘనలు ఎందుకంటే ?

చాలామంది డ్రైవర్లు చలాన్లను ఓ చిన్న అసౌకర్యంగా భావిస్తున్నారే తప్ప పెద్దగా పట్టించుకోవట్లేదు. 60.3 శాతం మంది తాము నిబంధనలు పాటిస్తామని చెబుతుండగా.. 20.4 శాతం మంది ఫైన్ వేసినా తాము మారమని స్పష్టం చేస్తున్నారు. 14.2 శాతం మంది లంచం ఇవ్వడమో, వ్యవస్థలో ఉన్న లోపాలను వాడుకోవడమో చేసి చలాన్ల నుంచి బయటపడుతున్నారు.

'చేయి తడిపే వారూ' పెద్ద సంఖ్యలోనే...

'కార్స్ 24'సర్వే చేసిన వారిలో 38.5 శాతం మంది ఒకటి రెండుసార్లు లంచాలు ఇచ్చారు. 15.9 శాతం మంది మాత్రం తరచూ ఇస్తూనే ఉండగా, 29.2 శాతం మంది మాత్రం తాము ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు చెల్లిస్తామని అంగీకరించారు.

సహ నిందితుల వాంగ్మూలం ఆధారమా?

- బెయిల్ సమయంలో వారి వాంగ్మూలాలను పరిగణలోకి తీసుకోవడమా?
- మద్యం కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును ఆక్షేపించిన సుప్రీంకోర్టు
- ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 30పై హైకోర్టు అభిప్రాయంతో మేం ఏకీభవించడం లేదు
- నిందితుడి వాంగ్మూలాన్ని.. సహ నిందితుడికి వ్యతిరేకంగా వాడరాదు
- పోలీసులకు ఇచ్చిన కస్టడీ వాంగ్మూలాలకు ఆమోద యోగ్యత లేదు
- మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలాలనే సహ నిందితులకు వ్యతిరేకంగా వాడొచ్చు
- మద్యం కేసులో కృష్ణమోహన్‌రెడ్డి ముందస్తు బెయిల్ తీర్పులో సుప్రీం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై అక్రమ కేసులో కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసే సమయంలో సహ నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను హైకోర్టు పరిగణలోకి తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. భారతీయ సాక్ష్యాల చట్టం 1872 సెక్షన్ 30 కింద తుది విచారణ (ట్రయల్) సందర్భంగా ఏ వాంగ్మూలాలను అయితే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందో, వాటిని ముందస్తు బెయిల్, బెయిల్ మంజూరు సమయంలో కూడా పరిగణలోకి తీసుకోవచ్చని హైకోర్టు చెప్పడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. హైకోర్టు అభిప్రాయంతో తాము ఎంతమాత్రం ఏకీభవించలేమని స్పష్టం చేసింది. సహ నిందితుల వాంగ్మూలాలను ముందస్తు బెయిల్, బెయిల్ మంజూరు సమయంలో పరిగణలోకి తీసుకోవడానికే వీల్లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద వాంగ్మూలం ఇచ్చింది సాక్షా? లేక నిందితుడా? లేక నిందితుడిగా మారే వ్యక్తా? అన్న విషయాన్ని బెయిల్, ముందస్తు బెయిల్ మంజూరు సమయంలో కోర్టు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కొన్ని సందర్భాల్లో 161 వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తి నిందితుడు కాకపోవచ్చు.. ఆ తరువాత నిందితుడు కావొచ్చని పేర్కొంది. నేర విచారణ ప్రక్రియలో ఓ నిందితుడి వాంగ్మూలాన్ని సహ నిందితుడికి వ్యతిరేకంగా ఉపయోగించరాదన్నది ప్రాథమిక సూత్రమని తెలిపింది.

రాజకీయ దురుద్దేశాలున్నట్లు పిటిషనర్లు ప్రాథమిక ఆధారాలు చూపారు..

మద్యం కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ కృష్ణమోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, వికాట్ సిమెంట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బొర్జూర్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం వాటిని కొట్టేసింది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున దాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదంటూ పిటిషన్లు కొట్టేసింది. ఇదే సమయంలో మద్యం కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలున్నట్లు పిటిషనర్లు ప్రాథమిక ఆధారాలను చూపారని, ఇందుకు ప్రభుత్వం న్యాయపరమైన పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పునకు సంబంధించిన కాపీ తాజాగా అందుబాటులోకి వచ్చింది.

పోలీసులకిచ్చిన వాంగ్మూలానికి ఆమోద యోగ్యత లేదు

'భారతీయ సాక్ష్యాల చట్టం సెక్షన్ 24 ప్రకారం సహ నిందితుడిపై మరో నిందితుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకునే ముందు.. ఆ వాంగ్మూలాన్ని అది ఇచ్చిన వ్యక్తికి వ్యతిరేకంగా దాన్ని స్పష్టమైన సాక్ష్యంగా రుజువు చేయాల్సి ఉంటుంది. ఈ వాంగ్మూలం భయపెట్టి, బెదిరించి, ప్రలోభపెట్టి తీసుకున్నదై ఉండకూడదు. పోలీసు అధికారికి ఇచ్చిన వాంగ్మూలాన్ని నిందితుడికి వ్యతిరేకంగా ఉపయోగించడానికి వీల్లేదు. పోలీసు అధికారికి ఇచ్చిన వాంగ్మూలం భారతీయ సాక్ష్యాల చట్టం సెక్షన్ 25 ప్రకారం పరిగణలోకి తీసుకోవడానికి వీల్లేదు. ఈ అంశాలన్నింటినీ కూడా కేసు ట్రయల్ సందర్భంగా పరిశీలించాల్సి ఉంటుంది. నిందితులందరినీ ఉమ్మడిగా విచారించినప్పుడు (జాయింట్ ట్రయల్) మాత్రమే సహ నిందితుల వాంగ్మూలాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వారిని ఒకే కేసులో, ఒకే కోర్టులో కలిపి విచారిస్తున్న సమయంలోనే వాంగ్మూలాలను పరిగణలోకి తీసుకోవడం సాధ్యమవుతుంది. సెక్షన్ 30 కింద అభియోగాలు నమోదు కానప్పుడు, నిందితులను విచారణకు హాజరుపరచనప్పుడు భారతీయ సాక్ష్యాల చట్టం వర్తించదు. ఈ నేపథ్యంలో నిందితుల వాంగ్మూలాన్ని కోర్టులు పరిగణలోకి తీసుకోజాలవు. ఒకవేళ సహ నిందితుల వాంగ్మూలాన్ని బెయిల్, ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా పరిగణలోకి తీసుకోవచ్చని అనుకున్నా కూడా కేవలం నేరాంగీకార వాంగ్మూలమే కాకుండా సహ నిందితుడిపై ఉన్న ఇతర స్వతంత్ర సాక్ష్యాలను కూడా కోర్టు తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి. సెక్షన్ 25 ప్రకారం కస్టడీలో పోలీసులకిచ్చిన వాంగ్మూలాలకు ఆమోద యోగ్యత లేనందున ఆ వాంగ్మూలాలను సహ నిందితులకు వ్యతిరేకంగా ఉపయోగించరాదు. సెక్షన్ 26 ప్రకారం మేజిస్ట్రేట్ సమక్షంలో ఇచ్చిన వాంగ్మూలాన్ని మాత్రమే సహ నిందితులకు వ్యతిరేకంగా ఉపయోగించవచ్చు'అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.



సాక్షి వాంగ్మూలానికి, నిందితుడి వాంగ్మూలానికి తేడా ఉంది..

'నిందితుడి వాంగ్మూలం సహ నిందితుడిని ఇరికించేలా ఉంటే ఆ వాంగ్మూలాన్ని సీఆర్‌పీసీ సెక్షన్ 161 ప్రకారం పరిగణలోకి తీసుకోవచ్చా? అనే విషయంలో ఎలాంటి అయోమయానికి, గందరగోళానికి తావులేకుండా స్పష్టతనివ్వదలిచాం. ఎఫ్ఐఆర్‌లో పేరున్న వ్యక్తిని, నేరం చేసిన వ్యక్తిని పోలీసులు విచారించి సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద అతడి వాంగ్మూలాన్ని నమోదు చేయవచ్చు. అయితే అలా నమోదు చేసిన వాంగ్మూలానికి ఎంత మాత్రం ఆమోదయోగ్యత లేదు. ఇదే విషయాన్ని సాహిబ్ సింగ్‌తో పాటు పలు కేసుల్లో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. 2022లో ఇంద్రేష్ కుమార్ కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని సాక్ష్యంగా పరిగణలోకి తీసుకోరాదని, అయితే బెయిల్ మంజూరు సందర్భంగా పరిగణలోకి తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు, చెప్పింది. ఈ కేసులో పూర్వాపరాల ఆధారంగా ఆ తీర్పునివ్వడం జరిగింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆ తీర్పు కేవలం సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలకే వర్తిస్తుంది గానీ నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలకు కాదు. ఆ తీర్పులో ఎక్కడా కూడా నిందితులు పోలీసులకిచ్చిన వాంగ్మూలాలను బెయిల్ మంజూరు సందర్భంగా పరిగణలోకి తీసుకోవాలని చెప్పలేదు. సెక్షన్ 161 కింద ఓ సాక్షి ఇచ్చిన వాంగ్మూలానికి, ఓ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలానికి చాలా తేడా ఉంది. పోలీసు అధికారికి నిందితుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. దాన్ని విస్మరించవచ్చు. నిందితుడి వాంగ్మూలాన్ని సహ నిందితుడికి వ్యతిరేకంగా వాడకూడదన్న న్యాయ సూత్రానికి ఓ మినహాయింపు ఉంది. నిందితుడి వాంగ్మూలం నేరాన్ని రుజువు చేసేదే కాక, అది విశ్వసించేదిగా, ఆధార సహితంగా ఉన్నప్పుడు ఆ వాంగ్మూలాన్ని సహ నిందితుడికి వ్యతిరేకంగా వాడొచ్చు. అయితే నిందితుడి వాంగ్మూలమొక్కటే సరిపోదు. సహ నిందితుడి పాత్రను రుజువు చేసేందుకు ఇతర సాక్ష్యాలు కూడా కావాల్సి ఉంటుంది. ఆ సాక్ష్యాలు నిందితుడి వాంగ్మూలానికి మద్దతునిచ్చేవిగా ఉండాలి. అందువల్ల సహ నిందితుడికి వ్యతిరేకంగా ముఖ్యంగా పోలీసు అధికారి ముందు ఇచ్చిన వాంగ్మూలాలను న్యాయస్థానాలు చాలా జాగ్రత్తగా పరిశీలించాలి'అని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

తుది ఉత్తర్వుల మేరకే ఎంఫిల్ అడ్మిషన్లు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా వర్సిటీ ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ) అడ్మిషన్లు తాము ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడే ఉంటాయని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రతివాదులైన ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 17కు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఉస్మానియా వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా ఏప్రిల్ 11న ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షను నిర్వహించారంటూ హైదరాబాద్ ఏఎస్‌రావు నగర్‌కు చెందిన సీహెచ్ శ్రీకృతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఠాకూర్ హరిప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ సైన్సెస్‌లో ఎంఫిల్ కోర్సులో ప్రవేశాలను నిలిపివేస్తూ, విద్యా శాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆ తీర్పు చట్టవిరుద్ధం.. బెయిలివ్వండి

హైకోర్టులో ఓఎంసీ కేసు నిందితుల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఓబులాపురం మైనింగ్ కేసు (ఓఎంసీ)లో నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తీర్పు చట్టవిరుద్ధమని, దాన్ని కొట్టివేయాలని, తమకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 21న హైకోర్టు విచారణ చేపట్టనుంది. ఓఎంసీ కేసులో దోషులుగా తేలడంతో గాలి జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లకు సీబీఐ కోర్టు మే 6న ఏడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. అనంతరం వీరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం జైల్లో ఉన్న గాలి జనార్దన్ రెడ్డి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ గత వారం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయగా... కోర్టు తిరస్కరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రధాన కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

'సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోలేదు'... సాక్షి ప్లస్-ఈ పేపర్‌లో

రాజ్ కేసిరెడ్డి అరెస్టు చట్ట వ్యతిరేకం

- ఆయన రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేయండి
- మద్యం విధానంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు
- కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది మహేష్ జెత్మలానీ
- తీర్పు రిజర్వ్ చేసిన జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం

సాక్షి, అమరావతి: మద్యం విధానం కేసులో రాజ్ కేసిరెడ్డి అరెస్ట్ చట్ట విరుద్ధమని సీనియర్ న్యాయవాది మహేష్ జెత్మలానీ సుప్రీంకోర్టుకు నివేదించారు. ఆయన రిమాండ్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించి, దానిని కొట్టివేయాలని అభ్యర్థించారు. రాజ్ కేసిరెడ్డి గత ప్రభుత్వ హయాంలో ఐటీ సలహాదారుగానే ఉన్నారని, ఆయనకు మద్యం విధానంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. నేరపూరిత విశ్వాస ఘాతుకానికి అవకాశం లేదని.. ఈ కేసులో ఆయనను అక్రమంగా, అన్యాయంగా ఇరికించారని తెలిపారు. అరెస్ట్ సమయంలో సహేతుక కారణాలు చూపలేదని, రాజ్యాంగంలోని అధికరణ 22లో నిర్దేశించిన విధి విధానాలకు సీఐడీ పోలీసులు తిలోదకాలు ఇచ్చారని పేర్కొన్నారు. అరెస్టు సమయంలో 409, 420 సెక్షన్లు పేర్కొన్న పోలీసులు... రిమాండ్ రిపోర్టులో అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) కింద సెక్షన్లు చేర్చారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని ప్రస్తావించారు.

రిమాండ్ ఉత్తర్వులను కొట్టేయాలంటూ పిటిషన్

మద్యం కేసులో తన కుమారుడు రాజ్ కేసిరెడ్డి రిమాండ్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించి, రిమాండ్ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఉపేందర్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రాజ్ కేసిరెడ్డి అరెస్ట్ అక్రమమని, రూల్ 160 ప్రకారం ఒక రాష్ట్ర పోలీసులు మరో రాష్ట్రంలో నివసిస్తున్న వ్యక్తికి సమన్లు జారీ చేయలేరని మహేష్ జెత్మలానీ వివరించారు. విచారణకు స్వచ్ఛందంగా హాజరవుతానని రాజ్ కేసిరెడ్డి సమాచారం అందించినప్పటికీ, విజయవాడకు వెళ్లే క్రమంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనను అరెస్ట్ చేశారని తెలిపారు. అరెస్టు సమయంలో చేర్చిన సెక్షన్లకు అదనంగా రిమాండ్ రిపోర్టులో ఇతర సెక్షన్లు చేర్చడం అక్రమమని వివరించారు. ప్రభుత్వ అధికారిని అరెస్ట్ చేసేముందు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 17ఏ, 19 ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. అంతేగాక ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో ఎలాంటి తప్పు జరగలేదని తెలిపారు.

ముందుగానే నిందితుడిగా పేర్కొన్నాం: సిద్ధార్థ్ లూథ్రా

కేస్ డైరీలో పొందుపరిచిన విధంగా రాజ్ కేసిరెడ్డిని ఏప్రిల్ 19వ తేదీనే నిందితుడిగా పేర్కొన్నారని సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. 2024 సెప్టెంబరులో తొలిసారిగా ఎఫ్ఐఆర్ దాఖలు చేసినప్పుడు అవినీతి నిరోధక చట్టాన్ని పొందుపరచలేదని.. అందువల్ల అప్పుడు 17ఏ గురించి ఎలాంటి అవసరం లేదన్నారు. ఆ తర్వాత దర్యాప్తు సందర్భంగా పలువురు ప్రభుత్వ అధికారులు ఈ కేసులో ఉన్నందున అవినీతి నిరోధక చట్టాన్ని వర్తింపజేశామని వివరించారు. రిమాండ్ సమయంలో కూడా రాజ్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదన్నారు. అయితే, సిద్ధార్థ్ లూథ్రా వాదనలపై మహేష్ జెత్మలానీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే కేసులో హైకోర్టులో సీఐడీ తరపున అడ్వకేట్ జనరల్ వినిపించిన వాదనలకు పూర్తి వ్యతిరేకంగా సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 19, 17ఏపై తమకు కొన్ని ప్రశ్నలు ఉన్నందున ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనం పరిశీలనకు నివేదించామని తెలిపింది. 17ఏ విషయంలో ఏవైనా వాదనలు ఉంటే చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత విస్తృత ధర్మాసనం ముందు వినిపించవచ్చని మహేష్ జెత్మలానీకి సూచించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.



త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు

త్రివేణి సంగమంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

ఐదో రోజు 80 వేల మంది పుష్కర స్నానాలు

భూపాలపల్లి/కాళేశ్వరం/భూపాలపల్లి అర్బన్: త్రివేణి సంగమ తీరంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు సోమవారం ఐదోరోజు ఉదయం నుంచే వేలాదిగా తరలివచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేసి నదీమాతకు విశేష పూజలు చేశారు. నదీ తీరంలో సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించారు. నదీమాతకు చీరె, సారె సమర్పించారు. పితృదేవతలకు పిండప్రదానం, పితృతర్పణాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. శని, ఆదివారాల్లో కనిపించిన రద్దీ.. సోమవారం కాస్త తగ్గింది. సుమారుగా 80 వేల మంది వరకు భక్తులు పుణ్య స్నానాలు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. గోదావరిలో నీటిప్రవాహం భారీగా ఉండటంతో భక్తులకు రక్షణగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోమవారం నాసిక్ త్రయంబకేశ్వర్ పీఠాధిపతి మహాకుండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ పుష్కర స్నానం చేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నరసింగరావు, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రెడ్యానాయక్, విప్ రాందాస్ పుష్కర స్నానాలు చేసి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. కాగా, సరస్వతి ఘాట్ వద్ద రాత్రి కాశీపండితుల ఆధ్వర్యంలో నదికి నవరత్నమాలిక హారతి ఇచ్చారు.

65 మందికి ఎండదెబ్బ

సోమవారం సర్వసతీ నది పుష్కరాలకు వచ్చిన భక్తుల్లో 65 మంది ఎండ దెబ్బకు గురైనట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. 3,842 మంది భక్తులకు ఓపీ సేవలు అందించామని, వడ దెబ్బ తగిలిన వారిలో 35 మందిని అడ్మిట్ చేసుకుని ముగ్గురిని భూపాలపల్లి ఆస్పత్రికి రెఫర్ చేశామని చెప్పారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పుష్కరాలపై లేదు

ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం: కేంద్ర మంత్రి బండి సంజయ్



పుష్కర స్నానం ఆచరిస్తున్న బండి సంజయ్ దంపతులు

కాటారం/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు సోమవారం ఆయన సతీమణి అపర్ణతో కలసి వచ్చారు. సరస్వతిఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. నదీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి మాత, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రపంచ అందగత్తెల పోటీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ పుష్కరాల నిర్వహణపై లేదన్నారు. ఆ పోటీలకు రూ.300 కోట్లు ఖర్చు చేసిన సర్కారు, పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారని, అలాగే వేములవాడ అభివృద్ధికి సైతం నిధులు మంజూరు చేస్తామని మాట ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదని విమర్శించారు. ఒకప్పుడు కాళేశ్వరానికి మంచి పేరు ఉండేదని, అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోవడంతో చెడ్డపేరు వచ్చిందని విచారం వ్యక్తం చేశారు.

జూన్ 2లోగా ఐదు డీఏలు ఇవ్వాలి

- కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలి
- ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న స్వామిగౌడ్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్, విఠల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భవించిన రోజైన జూన్ 2లోగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఐదు డీఏలు ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, పీఆర్సీ, ఓపీఎస్, మధ్యంతర భృతి, హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరింది. తెలంగాణ ఉద్యమంలో జీతాల కంటే జీవితాలు ముఖ్యమని పోరాటం చేసిన ఉద్యోగులకు అండగా ఉంటామని తేల్చి చెప్పింది. ఉద్యోగ సంఘాలతో సీఎం రేవంత్ సమావేశమై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ నేతలు మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, దేవీప్రసాద్, సి.విఠల్, భుజంగరావు, లక్ష్మణ్, ముజీబ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హోంగార్డులకు, కాంట్రాక్టు ఉద్యోగులు, పంచాయతీరాజ్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటివరకు జీతాలు రాలేదన్నారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం ఐక్య పోరాటం చేస్తామన్నారు. త్వరలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం అధ్యక్షులను కలుస్తామని చెప్పారు. విఠల్ మాట్లాడుతూ గతంలో ఉద్యోగులకు అన్యాయం చేసిన చంద్రబాబు అభాసుపాలయ్యారని గుర్తు చేశారు. దేవీప్రసాద్, పాతూరి సుధాకర్‌రెడ్డి తదితరులు కూడా మాట్లాడారు.

హీరోయిన్ సాయిధన్సికతో విశాల్ వివాహం

ఆగస్టు 29న పెళ్లి చేసుకుంటున్నట్టు ప్రకటన



తమిళ సినిమా: ప్రముఖ తమిళ హీరో విశాల్, హీరోయిన్ సాయిధన్సిక వివాహం చేసుకుంటున్నట్టు సోమవారం ప్రకటించారు. ఆగస్టు 29న తమ వివాహం జరుగుతుందన్నారు. వివాహం తర్వాత కూడా సాయిధన్సిక సినిమాల్లో నటిస్తారని విశాల్ వెల్లడించారు. ఇటీవల విశాల్ ప్రేమ, పెళ్లి గురించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. దక్షిణ భారత నటీనటుల సంఘం నూతన భవన నిర్మాణం పూర్తయ్యాక తాను పెళ్లి చేసుకుంటానని ఆ సంఘం కార్యదర్శి, నటుడు విశాల్ చాలాకాలం క్రితమే పేర్కొన్నారు. ఇప్పుడు భవనం పూర్తయ్యే దశలో ఉంది. దీంతో విశాల్ ఇటీవల తాను ఒక నటిని ప్రేమిస్తున్నానని, ఆమెను మరో నాలుగు నెలల్లో పెళ్లి చేసుకోబోతున్నట్లు పేర్కొన్నారు. తాజాగా సోమవారం రాత్రి చెన్నైలో జరిగిన యోగిడా ఆడియో ఆవిష్కరణ కార్యక్రమానికి విశాల్, సాయిధన్సిక కలిసి హాజరయ్యారు. వీరి ప్రేమకు శుభాకాంక్షలు తెలుపుతూ దర్శకుడు ఉదయ్‌కుమార్, పేరరసు, రాధారవి వంటి నటులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 20-5-2025

బ్యూటీఫుల్ గేమ్స్

మిస్ వరల్డ్ 2025



మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ టాలెంట్, బ్యూటి విత్ ఎ పర్పస్, బెస్ట్ స్విమ్ సూట్, నైట్ గౌన్, మిస్ ఫొటోజెనిక్, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, బ్యూటిఫుల్ హెయిర్.. స్కిన్ వంటి రౌండ్స్ ఉన్నట్టే స్పోర్ట్స్ చాలెంజ్ ఈవెంట్ కూడా ఉంటుంది. మిస్ వరల్డ్ 2025 పోటీలో భాగంగా హైదరాబాద్ లోని గచ్చిబౌలీ స్టేడియంలో ఘనంగా జరిగిన ఈ రౌండ్‌లో మిస్ ఎస్టోనియా.. ఎలిస్ రాండ్మా విజయం అందుకున్నారు. మొదటి రన్నరప్‌గా మిస్ మార్టీనిక్ ఆరేలీ జోచిమ్, రెండో రన్నరప్‌గా మిస్ కెనడా మారిసన్ నిలిచారు. వాళ్ల వివరాలు..



స్పోర్ట్స్ చాలెంజ్ ఈవెంట్ విజేతలు

1 మిస్ ఎస్టోనియా.. ఎలిస్ రాండ్మా



1999 నుంచి ఇప్పటివరకు ఎస్టోనియా దేశం.. మిస్ వరల్డ్ పోటీల్లో స్పోర్ట్స్ ఈవెంట్‌లో గెలిచి, ఈ బ్యూటీ పాజెంట్ లోని తర్వాత రౌండ్స్‌కి అర్హత పొందడం ఇదే మొదటిసారి. ఈ విజయంతో మిస్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మా.. యూరప్ టాప్ టెన్ ఫైనలిస్ట్స్, టాప్ 40 ఫైనలిస్ట్స్ జాబితాలో స్థానం సంపాదించుకుంది. ఎస్టోనియాలోని కిర్నాకు చెందిన ఎలిస్.. ఐటీ సిస్టమ్ డెవలప్‌మెంట్ గ్రాడ్యుయేట్. సేల్స్ కన్సల్టెంట్‌గా, స్టోర్ మేనేజర్‌గా, రాడిసన్ మెరిటన్ పార్క్ ఇన్ హోటల్‌లో హోస్టెస్‌గా, జూనియర్ ఐటీ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్‌గా.. రకరకాల ఉద్యోగాలు చేసింది. మోడలింగ్ అవకాశాలనూ అందిపుచ్చుకుంది. ఆన్‌లైన్ చారిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆమె వాటినే తన బ్యూటీ విత్ ఎ పర్పస్‌గా పేర్కొంది. 'స్పోర్ట్స్ చాలెంజ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించడం చాలా సంతోషంగా ఉంది. గెలుస్తానో లేదో అనుకున్నా కానీ సులభంగానే గెలిచాను. నిజానికిదో చాలెంజ్.. గొప్ప అనుభవం! జీవితంలోని ఒడిదుడుకులను ఎలా అధిగమించవచ్చో నేర్పే ఈవెంట్ ఇది. లైఫ్‌కి చాలా ఉపయోగపడుతుంది!' అని ఆ ఈవెంట్ గురించి చెప్పింది ఎలిస్.

2 మిస్ మార్టీనిక్.. ఆరేలీ జోచిమ్..



మార్టీనిక్‌లోని డ్యూకోస్ పట్టణానికి చెందిన ఆరేలీ జోచిమ్.. హైజీన్ సేఫ్టీ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్‌లో డిప్లొమా చేసింది. నిత్యం నవ్వుతూ ఉండే ఆరేలీకి ప్రకృతి అంటే ప్రాణం. జీవితాన్ని చాలా స్పోర్టివ్‌గా తీసుకుంటానంటోంది. తన జీవితానుభవాలు, తన భావోద్వేగ ప్రయాణాల స్ఫూర్తితో 'మెసాన్ లామ్మార్ (ప్రేమాలయం)' అనే సంస్థను స్థాపించి మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది. దీని గురించే ఆమె 'బ్యూటీ విత్ ఎ పర్పస్ రౌండ్'లో ముచ్చటించనుంది. 'బాడీ ఫిట్‌గా ఉండాలంటే స్పోర్ట్స్ చాలా అవసరం. ఏ ప్రొఫెషన్‌లో ఉన్నా ఆటల పట్ల ఆసక్తి పెంచుకుని ఏదో ఒక స్పోర్ట్‌ని ప్రాక్టీస్ చేస్తే శారీరకంగానే కాదు మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటాం. ఇది మన రెగ్యులర్ ప్రొఫెషన్‌లో సక్సెస్‌కి చాలా ఉపయోగపడుతుంది' అంటుంది ఆరేలీ జోచిమ్.

3 మిస్ కెనడా.. ఎమ్మా మారిసన్..



కెనడా, ఓంటారియోలోని ఓ చిన్న పట్టణం (Chapleau)లో పుట్టి, పెరిగిన ఎమ్మా.. మిస్ కెనడా కిరీటాన్ని ధరించిన స్థానిక ఆదిమ తెగకు చెందిన తొలి యువతి. ఇండిజినస్ ప్రిపరేటరీ స్టడీస్ అండ్ టూరిజంలో డిగ్రీ చేసింది. ఈస్థటిక్స్ అండ్ హెయిర్‌కి సంబంధించిన కోర్స్ కూడా చదివింది. అందాల పోటీ అంటే స్కిన్ షో కాదని, సామాజిక బాధ్యతను గుర్తించే వేదికని తెలిశాక.. ఆ పోటీల పట్ల మక్కువ పెంచుకుంది. బ్యూటీ పాజెంట్స్‌లో పాల్గొంది. 'రిబ్బన్ స్కర్ట్స్' అనే కార్యక్రమం ద్వారా తన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తోంది. 'రిబ్బన్ స్కర్ట్స్' అనేది తమ తెగ మహిళలకు సంబంధించిన ఒక సంప్రదాయ నేత. దాన్ని వాళ్లు తమ చరిత్ర, సాంస్కృతిక సంబరాలకు ఒక గుర్తుగా భావిస్తారు. దాన్నే ఆమె తన సామాజిక సేవా కార్యక్రమంగా ఎంచుకుంది. 'ఎందుకంటే కెనడాలో మైదాన ప్రాంతపు అమ్మాయిల కన్నా పన్నెండింతలు మా తెగకు చెందిన అమ్మాయిలు అదీ పదిహేనేళ్లలోపే శారీరక, లైంగిక దాడులకు బలవుతున్నారు. దీన్ని నిలువరించి మా తెగలోని అమ్మాయిలు సాధికారత సాధించేందుకే నేను 'రిబ్బన్ స్కర్ట్స్' పేరుతో సామాజిక కార్యక్రమాలను స్టార్ట్ చేశాను. స్వావలంబనతో మావాళ్లను నాగరిక సమాజానికి కనెక్ట్ చేయాలన్నదే నా లక్ష్యం. ఇదే నా బ్యూటీ విత్ పర్పస్' అంటుంది ఎమ్మా. మిస్ వరల్డ్ అందాల పోటీలలో సెకండ్ రన్నరప్ గెలుపు గురించి మాట్లాడుతూ 'గొప్ప ఎక్స్‌పీరియెన్స్. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన వాళ్లతో పోటీపడి విజేతగా నిలవడం మరచిపోని అనుభూతి. తర్వాత దశకు ఇదొక స్ఫూర్తి. నా బలాబలాలు తెలుసుకోవడానికి ఈ స్పోర్ట్స్ చాలెంజ్ ఈవెంట్ చాలా ఉపయోగపడింది. దీంతో నా ఆత్మవిశ్వాసం పెరిగింది' అని చెప్పింది.

బ్యూటిప్



జిడ్డుచర్మం వేసవిలో మరింత త్వరగా ఆయిలీగా మారుతుంటుంది. కాబట్టి రోజూ ఇంట్లోనే నేచురల్ మైల్డ్ బ్లీచ్ వేస్తుంటే ముఖం రోజంతా తాజాగా ఉంటుంది. బాగా పండిన టొమాటో గుజ్జును ముఖానికి అప్లయ్ చేసి పది నిమిషాల తర్వాత కడగాలి. టొమాటోలు కొన్ని పుల్లగా ఉండవు. అలాంటి టొమాటో గుజ్జులో మూడు లేదా నాలుగు చుక్కల నిమ్మరసం వేయాలి. టొమాటో బ్లీచ్‌గానూ, స్కిన్ టోనర్‌గానూ పని చేస్తుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) 19న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	95,510
బంగారం (22 క్యారెట్లు)	87,560
వెండి	98,710
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	96,550
బంగారం (22 క్యారెట్లు)	90,180
వెండి	98,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	95,510
బంగారం (22 క్యారెట్లు)	87,550
వెండి	1,08,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	96,550
బంగారం (22 క్యారెట్లు)	90,180
వెండి	98,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	95,400
బంగారం (22 క్యారెట్లు)	87,770
వెండి	98,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	95,500
బంగారం (22 క్యారెట్లు)	87,550
వెండి	1,09,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

పర్యావరణ హిత

ఎకో ఫ్రెండ్లీ వెడ్డింగ్!

పెళ్లి వేడుకలు అనగానే...ఎంత ఖర్చు చేస్తే అంత గొప్ప అనే భావన చాలా మందిలో ఉంది. అయితే కొందరు అందుకు భిన్నంగా ఉంటారు. చెన్నైకి చెందిన లైఫ్‌స్టైల్ అండ్ కమ్యూనిటీ బ్లాగర్ ఉమా రామ్ రెండో కోవకు చెందిన మహిళ. తన వివాహాన్ని ఎకో-ఫ్రెండ్లీ వెడ్డింగ్‌గా జరుపుకొని అందరి దృష్టిని ఆకర్షించింది.



శుభలేఖల నుంచి పెళ్లి వేడుకల ముగింపు వరకు ప్రతి దశలోనూ పర్యావరణ దృష్టితో అడుగులు వేసింది.

వివాహ వేడుకలో వ్యర్థాలను తగ్గించడానికి స్వచ్ఛంద సంస్థ 'కనెక్ట్ టు భూమి' సహాయం తీసుకొన్నారు.

డైనింగ్ నుంచి డెకార్ వరకు వృథాను వెట్, డ్రై వేస్ట్‌గా వేరు చేశారు.

వివాహ వేడుకల్లో ఉపయోగించిన పువ్వులు, పండ్లు, ఇతర కంపోస్టు చేయగల వ్యర్థాలను న్యూట్రీయెంట్-రిచ్ మాన్యూర్‌గా మార్చారు. పెళ్లి ఆహ్వాన పత్రికలను సీడ్ పేపర్ నుంచి తయారుచేశారు.

'మనసు ఉంటే మార్గం ఉంటుంది' అంటారు. ఈ మంచి సూత్రాన్ని వివాహ వేడుకలలో కూడా అనుసరిస్తే... పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

స్ఫూర్తి

జ్వలించే ప్రతిభ

చిన్న వయసులోనే యాసిడ్ దాడికి గురైన కఫీకి భవిష్యత్ మసక మసకగా కూడా కనిపించలేదు. అంతా అంధకారమే! భయానకమైన నిస్సహాయతలో నుంచి కూడా అప్పుడప్పుడూ అభయమిచ్చే శక్తి ఏదో పుట్టుకువచ్చి....

'అదిగో నీ భవిష్యత్' అని చూపుతుంది. కఫీ విషయంలోనూ అలాగే జరిగింది. ఛండీఘడ్‌కు చెందిన కఫీ 2023లో క్లాస్ 10 సీబీఎస్ఈ పరీక్షల్లో 95.2 శాతం మార్కులు సాధించి వార్తల్లో నిలిచింది. తాజాగా... క్లాస్ 12 సిబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 95.6 శాతం మార్కులు సాధించి తిరిగి వార్తల్లోకి వచ్చింది. తన విజయాన్ని కుటుంబ సభ్యులకు అంకితం చేసిన కఫీ... 'తల్లిదండ్రులు నా బలం. స్ఫూర్తి. వారు నా కోసం ఎంతో త్యాగం చేశారు. వారి రుణం తీర్చుకోవాలనుకుంటున్నాను. జీవితంలో ఎదురయ్యే చేదు అనుభవాలు మన భవిష్యత్తును నిర్ణయించలేవు. మన కష్టమే మన భవిష్యత్తు' అంటుంది కఫీ.



కఫీ మూడు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, హోలి పండగ రోజు ముగ్గురు వ్యక్తులు రంగు చల్లినట్లు తనపై యాసిడ్ చల్లారు. వారి రాక్షసానందానికి ఆ చిన్నారి కంటి చూపు దెబ్బతిన్నది. కఫీకి తిరిగి చూపు తెప్పించడానికి తల్లిదండ్రులు ఇరవై లక్షలకు పైగా ఖర్చు చేశారు.

'నా లక్ష్యం ఐఏఎస్' అని ఆత్మవిశ్వాసం నిండిన స్వరంతో చెబుతోంది కఫీ.

సాగుబడి

కృత్తిక కార్తె: ఏప్రిల్ 24 వరకు
రోహిణి కార్తె: 25 నుంచి



అటవీ జంతువులు, పశువుల నుంచి పంటలను కాపాడుకోవటానికి సోలార్ ఫెన్సింగ్ ఉపయోగపడుతుంది. చిన్న కమతాల్లో ఏర్పాటు చేసుకున్న రైతులను క్షేత్రస్థాయిలో గమనించినప్పుడు రైతులు చేస్తున్న కొన్ని పొరపాట్లను గమనించామని వాటర్‌లైవ్‌లిహుడ్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్‌మోహన్ తెలిపారు. సోలార్ ఫెన్సింగ్ నిర్వహణలో ఏ పనులు చెయ్యాలి? ఏ పనులు చెయ్యకూడదు? వంటి అంశాలపై కొన్ని సూచనలు ఇక్కడ పొందుపరుస్తున్నాం.

సోలార్ కంచె.. కొన్ని జాగ్రత్తలు!

సోలార్ కంచె వ్యవస్థలో సోలార్ ప్యానల్, బ్యాటరీ, ఎనర్జైజర్, ఫెన్సింగ్ వైర్లు ఉంటాయి. 8-10 అడుగుల దూరంలో పొలం చుట్టూ కట్టెలు, బొంగులు లేదా సిమెంటు స్తంభాలు పాతి కంచె ఏర్పాటు చేసుకోవచ్చు. రెండు రకాల యూనిట్లు మార్కెట్లో ఉన్నాయి. 1. సౌర విద్యుత్తును లాక్ చేసే ఎన్‌క్లోజర్ వున్నది. 2. ఎన్‌క్లోజర్ లేనిది. ఎనర్జైజర్, బ్యాటరీని రక్షించుకోవటానికి రైతు ఒక షెల్టర్‌ను నిర్మించుకోవాల్సి ఉంటుంది. సోలార్ బ్యాటరీలోని లోవోల్టేజి పవర్‌ను ఎనర్జైజర్ హైవోల్టేజ్ పవర్‌గా మార్చి కంచె తీగలకు సరఫరా చేస్తుంది. 40 వాట్స్ ప్యానళ్లు 5-8 ఎకరాల చుట్టూ కంచెకు సరిపోతాయి. 12 వోల్టులు, 18 అంప్రె (గంటకు) స్టోరేజ్ గల బ్యాటరీ పెట్టుకోవాలి. ఈ విద్యుత్‌ను ఎనర్జైజర్ 8 వేలు- 10 వేల వోల్టుల హైవోల్టేజి విద్యుత్‌గా మార్చి తీగలకు సరఫరా చేస్తుంది. ఇది పల్సేటింగ్ విద్యుత్తు. అంటే.. నిరంతరం విద్యుత్తు ప్రసరించదు. 1 - 1.2 సెకండ్లకు ఒకసారి మిల్లీ సెకండ్ మాత్రమే విద్యుత్తు ఆగి, ఆగి ప్రసరిస్తుంది. అందువల్లే పశువులకు కూడా గట్టి షాక్ తగులుతుంది. కానీ, ప్రాణాంతకం కాదు. షాక్‌కు షాక్‌కు మధ్య గ్యాప్ ఉంటుంది. కాబట్టి, ఒకటి రెండుసార్లు షాక్ తగలగానే పశువు అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోవటానికి వీలుంటుంది. ఎర్త్ విధిగా ఏర్పాటు చేయాలి. సోలార్ కంచెకు సంబంధించి అవగాహన పెంచుకొని, జాగ్రత్తగా నిర్వహించుకుంటే రైతులు దీర్ఘకాలం ప్రయోజనం పొందవచ్చు.

చేయవలసినవి

ఎనర్జైజర్‌పైన కనిపించే బ్యాటరీ వోల్టేజిని గమనించండి. వోల్టేజి 10 వోల్టుల కన్నా తక్కువకు తగ్గిపోతుంటే.. గడ్డి, చెట్లు సోలార్ కంచె వైర్లకు తగులుతున్నందున విద్యుత్తు నష్టం జరుగుతోందని గుర్తించాలి.

- కండక్టర్ వైర్‌కు అనుసంధానం చేసిన ఇన్సులేటర్లు పాడయ్యాయేమో అని తరచూ చూసుకోండి.
- స్థానికంగా దొరికే వెదురు బొంగులు పాతి సోలార్ కంచె ఏర్పాటు చెయ్యండి. ఇనుప / సిమెంటు స్థంభాల కన్నా ఇవి చవక.
- పది అడుగులకో బొంగు పాతాలి. అంతకన్నా దూరం అయితే గాలి, వానలకు ఇబ్బంది అవుతుంది.
- బ్యాటరీకి ఒక చిన్న డిసి బల్బును అమర్చితే పురుగులను నశింపజేసే దీపపు ఎరగా పనికొస్తుంది.
- యూనిట్‌ను వాన, ఎండ, దొంగల నుంచి రక్షించుకోవటానికి పక్కా షెల్టర్ నిర్మించాలి.
- సోలార్ ప్యానల్‌పైన దుమ్మును నెలకోసారైనా తుడవండి.
- ఎర్త్ సిస్టం బాగుందా లేదా అని నెలకోసారైనా చూడండి. నీరు పోయండి.
- రాత్రుళ్లు మనుషులు సోలార్ కంచెను పొరపాటున తాకకుండా ఉండేందుకు రిఫ్లెక్టివ్ రేడియం టేపు లేదా స్టిక్కర్లు ఏర్పాటు చేయండి.

చేయకూడనివి

- కంచె వైర్లను అడుగుకన్నా ఎత్తులో కట్టండి. పంట మొక్కలు/చెట్లకు కొంచెం దూరంగా ఏర్పాటు చేయండి. లేకపోతే కలుపు మొక్కలు ఫెన్సింగ్‌కు తగిలి, విద్యుత్తు నష్టానికి కారణమవుతాయి.
- ఫెన్సింగ్ వైరు కింద కలుపు పెరగనివ్వకండి. ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ లేదా వీడ్ మ్యాట్ వేసుకోవటం మేలు.
- చెట్టు, ఇంటి నీడలో సోలార్ ప్యానల్‌ను పెట్టకూడదు. ఇది దక్షిణం వైపు తిరిగి ఉంటే మంచిది.
- తుపాను సమయాల్లో, పిడుగుపాటుకు అవకాశం ఉన్నప్పుడు ఎనర్జైజర్‌ను ఫెన్సింగ్ వైరు నుంచి ముందుజాగ్రత్తగా వేరు చెయ్యండి.
- కంచెకు దగ్గరగా మొక్కలు నాటకండి. చెట్ల కొమ్మలు వైర్లను తాకనివ్వకండి.
- మనుషులు సోలార్ కంచెను తాకకుండా జాగ్రత్త తీసుకోండి. తాకితే ఆగి ఆగి షాక్ కొడుతుంది.
- పిల్లలను కంచెకు దూరంగా ఉంచండి. చిన్న వయస్కులు తాకితే ప్రాణాపాయం రావచ్చు లేదా గాయాలవ్వవచ్చు.
- వైర్లలో హై వోల్టేజ్ పల్స్ కరెంట్ ప్రసరిస్తూ ఉంటుంది. దీన్ని టెస్ట్ చేయటానికి సాధారణ టెస్టర్లు లేదా వోల్టు మీటర్లు వాడకూడదు. మీటర్లు పాడవుతాయి. వాడితే షాక్ తగులుతుంది.

మరిన్ని వివరాలకు చూడండి: https://justfence.in/solar-fencing/



పసుపు పచ్చని బ్రకోలి

ఊదారంగు క్యాలీఫ్లవర్


మన కూరగాయలు సంప్రదాయేతర రంగుల్లోకి రూపాంతరం చెందుతున్నాయి. క్యాలీ ఫ్లవర్ తెల్లగానే ఉండాలనేం లేదు.. వేరే రంగులో కనిపిస్తే ఆశ్చర్యపోకండి. త్వరలోనే పసుపు, ఊదా, ఆకుపచ్చ రంగుల్లోనూ క్యాలీ ఫ్లవర్ మార్కెట్‌లో కనిపించవచ్చు. అలాగే, బ్రకోలి ఆకుపచ్చగానే ఉండాలనేం లేదు.. పసుపు పచ్చగానూ ఉండొచ్చు. క్యారట్ ఎర్రగానే ఉండాలనేం లేదు.. ముల్లంగి, బంగాళదుంప, బీన్స్ ఇవన్నీ ఊదా రంగులోనూ రానున్నాయి. ఇంతకీ రంగుల కూరగాయలు మనకు మంచివేనా? రంగుతో పాటు పోషకాల్లోనూ ఏమైనా ప్రత్యేకత ఉందా? ఈ వంగడాలను రూపొందిస్తున్న పద్ధతులేమిటి? పర్యవసానాలేమిటి..?

కూరగాయలు కొత్త రంగుల్లో!

'కలర్ బ్రీడింగ్'తో రంగు రంగుల కూరగాయ వంగడాల అభివృద్ధి

సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతులకు తోడైన జన్యుసవరణ

పలు రంగుల్లో క్యాలీ ఫ్లవర్, బ్రకోలి, క్యారెట్, టొమాటో తదితర కూరగాయలు



ఊదారంగు బంగాళాదుంప



ఊదారంగు బీన్స్



ఊదారంగు ముల్లంగి

కూరగాయలు మనిషి తీసుకునే పౌష్టికాహారంలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. అవశ్యమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల కోసం కూరగాయలపైనే ఆధారపడుతున్నాం. వైవిధ్యభరితమైన రంగుల్లో కూరగాయలను రూపొందించటం (కలర్ బ్రీడింగ్) వ్యవసాయంలో దూసుకొస్తున్న సరికొత్త ధోరణుల్లో ఒకటి. కొత్త రంగుల్లో కనిపించే కూరగాయల్లో అదనపు పోషకాలు ఉండటం, వాణిజ్యపరమైన గిరాకీ ఉండటం వల్ల శాస్త్రవేత్తలు 'కలర్ బ్రీడింగ్'పై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అనాదిగా మనకు తెలిసిన రంగులోనే కాదు ఇతర రంగుల్లోనూ కూరగాయలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. చూపులకు ఆకర్షణీయంగా కనిపించడటం కోసం మాత్రమే కాదు ప్రత్యేక పోషకాల కోసం కూడా రంగుల కూరగాయ వంగడాలు రూపుదిద్దుకుంటున్నాయి.

అటవీ జాతులే ఆధారం

కొత్త వంగడాల రూపకల్పనలో మన కూరగాయలకు సంబంధించిన అటవీ జాతుల పాత్రే అధికం. సాధారణ వంగడాల్లో లోపించే ఆంథోశ్యానిన్లు, కరొటినాయిడ్లు, బెటాలైన్స్ అటవీ జాతుల్లో ఉంటాయి. అందుకే వాటితో సంప్రదాయ, ఆధునిక పద్ధతుల్లో సంకరపరచి రంగు రంగుల వంగడాలు రూపొందిస్తున్నారు. అధిక బీటా కరొటెన్ లేదా ఆంథోశ్యానిన్ కలిగిన నారింజ, ఊదా, తెలుపు, పసుపు, ఎరుపు రంగుల్లో క్యారట్ వంగడాలను రూపొందించడానికి అవకాశం ఉంది. అదే విధంగా, టొమాటోలో కూడా ఎరుపు, పసుపు, నారింజ, ఆకుపచ్చ, నలుపు, రెండు రంగులు కలిసిన రూపంలో లైకోపెన్ వంటి యాంటీఆక్సిడెంట్‌తో కూడిన కొత్త వంగడాలను రూపొందించడానికి వీలుందన్ని నిపుణులు చెబుతున్నారు.

క్యాప్సికం (కూరమిరప)లో కూడా ఆకుపచ్చ, ఎరుపు, పసుపు, నారింజ, ఊదా రంగుల్లో విటమిన్ సి కలిగి ఉండేలా కొత్త వంగడాలు రూపొందుతున్నాయి. బీట్‌రూట్‌లు సహజంగానే ఎరుపు, పసుపు లేదా తెలుపు రంగుల్లో ఉన్నాయి. డైటరీ ఫైబర్, బెటాలైన్స్ ఎక్కువ బీట్‌రూట్లలో ఉంటాయి. నారింజ, ఊదా, ఆకుపచ్చ రంగుల్లో క్యాలీఫ్లవర్ వంగడాలను రూపొందిస్తున్నారు. వీటిలో విటమిన్ సి, గ్లుకోసినొలేట్లు పుష్కలంగా ఉంటాయి. పౌష్టికాహారం, ఆకర్షణీయంగా ఉండే ఈ రకాల కూరగాయల్లో రంగురంగుల వంగడాల అభివృద్ధికి అవకాశాలున్నాయి.

జన్యుసవరణ కూడా..

కూరగాయల రంగును మార్చడానికి అనేక ప్రజనన (బ్రీడింగ్) పద్ధతులను ఉపయోగిస్తారు. సాంప్రదాయ పద్ధతిలో స్థానిక లేదా అడవి జాతుల నుంచి రంగురంగుల వైవిధ్యాలను ఎంచుకుని, వాటిని ఇతర రకాలతో సంకరం చేస్తారు. రేడియేషన్ పద్ధతిలో ఉత్పరివర్తన ప్రేరేపిత జన్యు మార్పుల ద్వారా కొత్త రంగుల వంగడాలను రూపొందిస్తారు. బంగారు రంగు క్యాలీఫ్లవర్ ఇలాంటిదే. వర్ణద్రవ్యం సంబంధిత లక్షణాలను మరింత సమర్థవంతంగా గుర్తించి, కొత్త రకాలను అభివృద్ధి చేయటంలో అత్యాధునిక మార్కర్-అసిస్టెడ్ సెలక్షన్ వంటి పద్ధతులు బ్రీడర్లకు తోడ్పడుతున్నాయి.

క్రిస్పర్ కాస్9 వంటి జన్యు సవరణ బయోటెక్నాలజీ విధానాలు వర్ణద్రవ్య జన్యువుల ఖచ్చితమైన సవరణకు దోహదం చేస్తాయని చెబుతున్నారు. అయితే జన్యుమార్పిడి పద్ధతులు ఇతర జాతుల నుంచి రంగును, జన్యువులను కూడా తెచ్చిపెట్టుకునే వీలుకల్పిస్తాయి. అతి ఎరుపు గుజ్జు కలిగి ఉండేలా పుచ్చకాయ వంగడాన్ని రూపొందించటంలో ఈ పద్ధతిని పాటించారు.

ఆదరణ ఉంటుందా?

కలర్ బ్రీడింగ్‌లో కొత్త వంగడాలు రూపొందించటం మన దేశంలో ఆంథోశ్యానిన్లతో కూడిన ఊదారంగు క్యారట్ వంగడంతో ప్రారంభమైంది. పోషకాలు అధికంగా ఉండే ఈ రకానికి మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోందని చెబుతున్నారు. ఆంథోశ్యానిన్లు అధికంగా ఉండే నల్ల టొమాటోలు, బీటా కరొటెన్‌తో కూడిన నారింజ రంగు క్యాలీఫ్లవర్ యూరప్‌లో ప్రాచుర్యం పొందాయి.


అయితే, కొత్త రంగుల కూరగాయలను, జన్యుసవరణ కూరగాయలను సంప్రదాయక మార్కెట్లలో వినియోగదారులు ఎంత వరకు ఇష్టపడతారనే సందేహాలున్నాయి. రంగుల ప్రాధాన్యం ప్రాంతానికో విధంగా ఉంటుంది. సాంస్కృతిక, సంప్రదాయ సంబంధమైన పట్టింపులు ఉంటాయి. కాబట్టి రైతులు ఈ రకాలను సాగు చేసే ముందు ఆలోచించుకోవాలి.

రంగును బట్టి పోషకాలు!

కూరగాయలు ఆయా రంగుల్లో ఉండటానికి మూల కారణం వాటిల్లోని ప్రత్యేక బయో యాక్టివ్ కాంపౌండ్లే. ఆంథోశ్యానిన్లు, కరొటినాయిడ్లు, క్లోరోఫిల్, బెటాలైన్స్ వంటి బయో యాక్టివ్ మూలకాలలో.. ఏ మూలకం ఉంటే ఆ కూరగాయకు ఆ రంగు వస్తుంది.

- కూరగాయ వేరే రంగులో ఉంటే చూడముచ్చటగా ఉండటంతో పాటు దానిలో పోషకాల వల్ల ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు.
- ఆంథోశ్యానిన్ల వల్ల ఊదా, ఎరుపు రంగులు వస్తాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించటంతో పాటు గుండెజబ్బుల ముప్పును తగ్గిస్తాయి.
- కరొటినాయిడ్ల వల్ల పసుపు, నారింజ రంగులు వస్తాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి.
- క్లోరోఫిల్ వల్ల ఆకుపచ్చని రంగు వస్తుంది. శరీరంలో నుంచి మలినాలను బయటకు పంపటానికి, పొట్ట సూక్ష్మజీవుల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఇది ఉపకరిస్తుంది.
- ఎరుపు, పసుపు రంగు కూరగాయల్లో ఉండే బెటాలైన్స్ శరీరంలో వాపును తగ్గిస్తాయి.

కలర్ బ్రీడింగ్‌తో పౌష్టికాహార భద్రత



అధిక పోషకాలున్న రంగు రంగుల కూరగాయలపై దేశవ్యాప్తంగా ప్రచారం కల్పిస్తే పౌష్టికాహార భద్రతకు దోహదమవుతుంది. సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతులతో ఎం.ఎ.ఎస్, క్రిస్పర్ కాస్ 9 జన్యుసవరణ వంటి ఆధునిక పద్ధతులను మిళితం చేస్తే మెరుగైన ఫలితాలు పొందే అవకాశాలున్నాయి. జెనిటిక్స్, బ్రీడింగ్ రంగంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులకు కలర్ బ్రీడింగ్ మంచి అవకాశాలను కల్పిస్తుంది.


– డాక్టర్ రామన్ సెల్వకుమార్,
సెంటర్ ఫర్ ప్రొటెక్టెడ్ కల్టివేషన్ టెక్నాలజీ
భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఎఆర్ఐ), పూసా, న్యూఢిల్లీ



ప్రిక్వార్టర్ ఫైనల్లో యశస్విని-దియా జోడీ

దోహా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. యశస్విని-దియా చిటాలె జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... 14వ సీడ్ సుతీర్థ ముఖర్జీ-ఐహిక ముఖర్జీ జంట పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. సోమవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్ యశస్విని-దియా ద్వయం 6-11, 11-6, 11-6, 11-9తో జెంగ్ జియాన్-లిన్ కియాన్ సిర్ (సింగపూర్) జంటను ఓడించింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత ద్వయం తమ సర్వీస్‌లో 15 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 24 పాయింట్లు సాధించింది. మరో మ్యాచ్‌లో సుతీర్థ-ఐహిక జోడీ 1-11, 11-13, 7-11తో అనెట్ కౌఫ్‌మన్-జియోనా షాన్ (జర్మనీ) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. 22 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తమ సర్వీస్‌లో 9 పాయింట్లు గెలిచి, 19 పాయింట్లను కోల్పోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు సత్యన్ జ్ఞానశేఖరన్ తొలి రౌండ్‌లో, మనుశ్ షా రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. సత్యన్ 5-11, 6-11, 7-11, 6-11తో థిబాల్ట్ పొరెట్ (ఫ్రాన్స్) చేతిలో, మనుశ్ షా 5-11, 6-11, 6-11, 9-11తో ఫెలిక్స్ లెబ్రున్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు.

లక్నోను ముంచిన సన్‌రైజర్స్



అభిషేక్


6 వికెట్లతో సూపర్ జెయింట్స్‌పై హైదరాబాద్ గెలుపు

- 206 పరుగుల లక్ష్యాన్ని 18.2 ఓవర్లలో ఛేదన
- ప్లే ఆఫ్స్ రేసు నుంచి లక్నో అవుట్
- చెలరేగిన అభిషేక్ శర్మ, క్లాసెన్
- మార్ష్, మార్క్‌రమ్ మెరుపులు వృథా

లక్నో: ఈ ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఇదివరకే ముగిసింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలిచి వారి 'ప్లే ఆఫ్స్' ఆశల్ని కూడా ముంచింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 6 వికెట్ల తేడాతో లక్నోపై జయభేరి మోగించింది. ముందుగా లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (39 బంతుల్లో 65; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), మార్క్‌రమ్ (38 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (26 బంతుల్లో 45; 6 ఫోర్లు, 1 సిక్స్) దంచేశారు. ఇషాన్ మలింగకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత సన్‌రైజర్స్ 18.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (20 బంతుల్లో 59; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), క్లాసెన్ (28 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. దిగ్వేశ్ రాఠి 2 వికెట్లు తీశాడు.

సెంచరీ భాగస్వామ్యం

మిచెల్ మార్ష్ దూకుడుతో లక్నో ఆట మొదలైంది. కమిన్స్ తొలి బంతికి 4, నాలుగో బంతికి 6 కొట్టాడు. ఇదే జోరుతో హర్ష్ దూబే రెండో ఓవర్లో మార్ష్ మరో సిక్స్ బాదాడు. మూడో ఓవర్లో బౌండరీతో మార్క్‌రమ్ టచ్‌లోకి వచ్చాడు. నాలుగో ఓవర్ తొలి బంతికే మార్క్‌రమ్ అవుటవ్వాల్సింది. క్రీజు వదిలి ఆడిన అతన్ని ఇషాన్ కిషన్ స్టంపౌట్ చేయలేకపోయాడు. ఇలా బతికిపోయిన మార్క్‌రమ్ 6, 4లతో రెచ్చిపోయాడు. దీంతో ఆ ఓవర్లో 17 పరుగులు వచ్చాయి. మార్ష్ దంచే పనిలో ముందున్నాడు. హర్షల్, ఇషాన్ మలింగ ఓవర్లలో భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో ఓపెనింగ్ జోడీ పవర్‌ప్లేలో 69 పరుగులు చేసింది. కాసేపటికే మార్ష్ 28 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. 9వ ఓవర్లో మార్క్‌రమ్‌కు మరోమారు లైఫ్ వచ్చింది. జీషాన్ బౌలింగ్‌లో ఇచ్చిన సులువైన క్యాచ్‌ను డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో అనికేత్ వదిలేశాడు. దీంతో అదే ఓవర్లో లక్నో 100 పరుగులు దాటింది. తర్వాత ఎట్టకేలకు మార్ష్ వికెట్ తీసిన హర్ష్ దూబే 115 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ (7) ఎక్కువసేపు నిలువలేదు. ఇషాన్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. రెండు లైఫ్‌లను సద్వినియోగం చేసుకున్న మార్క్‌రమ్ 28 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పూరన్ మధ్యలో పడిపోయిన రన్‌రేట్ పెంచేందుకు బ్యాట్ ఝుళిపించాడు. హర్షల్ 16వ ఓవర్లో సిక్స్ బాదిన మార్క్‌రమ్ అదే ఓవర్లో బౌల్డయ్యాడు. నితీశ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో భారీ సిక్సర్ బాదిన పూరన్‌తో పాటు శార్దుల్ (4)కూడా రనౌటయ్యారు. సమద్ (3)ను బౌల్డ్ చేయగా... ఆకాశ్ దీప్ (6) సిక్స్‌తో జట్టు స్కోరు 200 దాటింది. 20వ ఓవర్లో నితీశ్ 20 పరుగులిచ్చాడు.



పంత్

అభిషేక్ అదరహో

రెండు ఓవర్లలో సన్‌రైజర్స్ స్కోరు 23/1. అప్పటికి అభిషేక్ ఒక పరుగే చేశాడు. ఆకాశ్‌దీప్ మూడో ఓవర్ నుంచి అతని విధ్వంసం మొదలైంది. 4, 6 బాదిన అభిషేక్ తర్వాతి రూర్కే ఓవర్లోనూ దీన్ని రిపీట్ చేశాడు. దీంతో 3.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 50కి చేరింది. అవేశ్ ఖాన్ బౌలింగ్‌కు దిగితే వరుస బౌండరీలతో జోరు కనబరచడంతో పవర్‌ప్లేలో హైదరాబాద్ 72/1 స్కోరు చేసింది. ఆ తర్వాత ఓవర్ వేసిన రవి బిష్ణోయ్‌కి అభిషేక్ చుక్కలు చూపించాడు. 6, 6, 6, 6లతో 26 పరుగులు రాబట్టాడు. మూడో సిక్స్ బాదేసరికే 18 బంతుల్లో అతని ఫిఫ్టీ పూర్తయ్యింది. మరుసటి ఓవర్లో అభిషేక్ జోరుకు దిగ్వేశ్ రాఠి బ్రేక్ వేశాడు. ఈ సందర్భంగా రాఠి, అభిషేక్ మాటామాట పెంచుకున్నారు. అంపైర్లు సముదాయించి పంపారు. 35 బంతుల్లోనే 82 పరుగుల ధనాధన్ రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత ఇషాన్ కిషన్ (28 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్లాసెన్‌లు దాటిని కొనసాగించడంతో సన్‌రైజర్స్ లక్ష్యంవైపు దూసుకెళ్లింది. కిషన్ అవుటయ్యాక 'దంచే'పనిని క్లాసెన్, కమిందు మెండిస్ (21 బంతుల్లో 32 రిటైర్డ్ హర్ట్; 3 ఫోర్లు) చక్కబెట్టారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరు పెవిలియన్‌కు చేరినా... మిగతా లాంఛనాన్ని అనికేత్ (0 నాటౌట్), నితీశ్ రెడ్డి (0 నాటౌట్) పూర్తి చేశారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) మలింగ (బి) హర్ష్ 65; మార్క్‌రమ్ (బి) హర్షల్ 61; పంత్ (సి అండ్ బి) మలింగ 7; పూరన్ (రనౌట్) 45; బదోని (సి) నితీశ్ (బి) మలింగ 3; సమద్ (బి) నితీశ్ 3; శార్దుల్ (రనౌట్) 4; బిష్ణోయ్ (నాటౌట్) 0; ఆకాశ్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-115, 2-124, 3-159, 4-169, 5-194, 6-199, 7-199. **బౌలింగ్:** కమిన్స్ 4-0-34-0, హర్ష్ దూబే 4-0-44-1, హర్షల్ పటేల్ 4-0-49-1, ఇషాన్ మలింగ 4-0-28-2, జీషాన్ అన్సారి 2-0-22-0, నితీశ్ 2-0-28-1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అథర్వ తైడే (సి) దిగ్వేశ్ (బి) రూర్కే 13; అభిషేక్ (సి) శార్దుల్ (బి) దిగ్వేశ్ 59; కిషన్ (బి) దిగ్వేశ్ 35; క్లాసెన్ (సి) పంత్ (బి) శార్దుల్ 47; కమిందు (రిటైర్డ్‌హర్ట్) 32; అనికేత్ (నాటౌట్) 5; నితీశ్ రెడ్డి (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (18.2 ఓవర్లలో 4 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-17, 2-99, 3-140, 4-195. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 3-0-33-0, రూర్కే 2.2-0-31-1, దిగ్వేశ్ రాఠి 4-0-37-2, అవేశ్ ఖాన్ 3-0-25-0, రవి బిష్ణోయ్ 1-0-26-0, మార్క్‌రమ్ 1-0-14-0, శార్దుల్ 4-0-39-1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లక్నో	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్తాన్	13	3	10	0	6	-0.701
చెన్నై	12	3	9	0	6	-0.992

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × రాజస్తాన్
వేదిక: ఢిల్లీ

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'ఆసియా కప్'పై ఇంకా చర్చించనే లేదు!

భారత్ వైదొలిగిందనే వార్తలను ఖండించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు పాల్గొనడం లేదంటూ ప్రచారంలోకి వచ్చిన వార్తలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఖండించింది. అవన్నీ పూర్తిగా వదంతులేనని, ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే టోర్నీ గురించి అసలు బీసీసీఐలో చర్చ కూడా జరగలేదని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. భారత్ డిఫెండింగ్ చాంపియన్‌గా ఉన్న ఆరు దేశాల ఆసియా కప్‌ను ఈ ఏడాది టి20 ఫార్మాట్‌లో నిర్వహించనుండగా మరోవైపు మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ టోర్నీ త్వరలోనే శ్రీలంకలో జరగనుంది. 'ఆసియా ఖండపు ఈవెంట్లయిన పురుషుల ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ కప్‌లలో భారత్ ఆడటం లేదంటూ పలు వార్తలు అన్ని చోట్లా కనిపిస్తున్నాయి. వాటిలో ఏమాత్రం వాస్తవం లేదు. ఈ అంశంపై బీసీసీఐ అసలు చర్చించనే లేదు. కాబట్టి టోర్నీల్లో పాల్గొనరాదని నిర్ణయించినట్లు వస్తున్న వార్తలన్నీ వదంతులే. ఈ విషయంలో మేం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)కి ఎలాంటి లేఖ రాయలేదు. ప్రస్తుతం మా దృష్టంతా ఐపీఎల్‌పైనే ఉంది. ఆ తర్వాత కీలకమైన ఇంగ్లండ్ పర్యటనకు పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఆసియా కప్ విషయంలో ఏదైనా కీలక నిర్ణయం తీసుకుంటే మీడియా ద్వారానే ప్రకటిస్తాం' అని సైకియా పేర్కొన్నారు.



దేవజిత్ సైకియా

ఐపీఎల్‌లో ముజరబాని

ఇన్‌గిడి స్థానంలో ఆర్‌సీబీ జట్టులోకి



న్యూఢిల్లీ: జింబాబ్వే పేస్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబాని తొలిసారి ఐపీఎల్ అవకాశం దక్కించుకున్నాడు. 'ప్లే ఆఫ్స్' కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అతడిని రూ. 75 లక్షలకు ఎంచుకుంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కారణంగా పేసర్ లుంగీ ఇన్‌గిడి ఆర్‌సీబీ జట్టుకు ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండటం లేదు. మరో పేసర్ జోష్ హాజల్‌వుడ్ కూడా ఇప్పటి వరకు జట్టుతో చేరలేదు. దాంతో బెంగళూరు మేనేజ్‌మెంట్ ముజరబానిని ఎంచుకుంది. ఈ జింబాబ్వే బౌలర్ 118 టి20ల్లో 7.24 ఎకానమీతో 127 వికెట్లు పడగొట్టాడు. గతంలో లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు నెట్ బౌలర్‌గా పని చేసిన సమయంలో ఆ టీమ్ కోచింగ్ బృందంలో ఉన్న ఆండీ ఫ్లవర్ దృష్టిలో పడ్డాడు. ఫ్లవర్ కోచ్‌గా ఉన్న ముల్తాన్ సుల్తాన్స్, గల్ఫ్ జెయింట్స్ టీమ్‌లలో ముజరబాని భాగంగా ఉన్నాడు. దాంతో ఇప్పుడు ఆర్‌సీబీ హెడ్ కోచ్ ఫ్లవర్ అతడిని తీసుకున్నాడు. మరోవైపు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు దూరమై మరో లీగ్ మ్యాచ్ మాత్రమే మిగిలి ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా అనూహ్యంగా ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంచుకుంది. లీగ్ వాయిదా తర్వాత తిరిగి రాని రావ్‌మన్ పావెల్ స్థానంలో మధ్యప్రదేశ్‌కు చెందిన లెగ్‌స్పిన్నర్ శివమ్ శుక్లాను తీసుకుంది. గత సీజన్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనే 8 టి20లు ఆడిన శుక్లా 6.30 ఎకానమీతో 8 వికెట్లు తీశాడు.

సాక్షి సినిమా

ఇక నాకు ఇది కొత్త జన్మ

- మంచు మనోజ్



"నాకు నా హార్డ్‌వర్క్‌పై పూర్తి నమ్మకం ఉంది. ఈ బర్త్ డే (మే 20) నుంచి నాకు ఇది కొత్త జన్మ. నా బర్త్ డే స్టార్ట్ కాక ముందే నేను ఏదైతే స్టేజ్ (సినిమా వేదిక) మిస్సవుతున్నానో ఆ స్టేజ్‌కు తీసుకు వచ్చాడు దేవుడు. అంతకంటే పెద్ద బర్త్ డే గిఫ్ట్ ఏదీ ఉండదు" అని మంచు మనోజ్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించిన చిత్రం 'భైరవం'. జయంతిలాల్ గడా సమర్పణలో విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. అలాగే నేడు (మంగళవారం) మంచు మనోజ్ బర్త్ డే. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో మనోజ్ పంచుకున్న విశేషాలు.

- ఓ ఫ్యామిలీ ఫంక్షన్‌లో తమ్ముడు శ్రీనివాస్ (బెల్లంకొండ సాయి) నన్ను కలవడం, 'గరుడన్' సినిమా తెలుగు రీమేక్ 'భైరవం' గురించి దర్శకుడు విజయ్‌తో మాట్లాడమని చెప్పడం, కథ నచ్చి, నేనీ సినిమాకు ఓకే చెప్పడం చకా చకా జరిగిపోయాయి.
- ఈ చిత్రంలో నేను గజపతి వర్మ అనే క్యారెక్టర్ చేశాను. 'భైరవం'ని డైరెక్టర్ విజయ్ బాగా తీశాడు. యాక్టర్స్‌గా నాకు, శ్రీనివాస్, నారా రోహిత్‌గారికి కొంత స్క్రీన్ గ్యాప్ వచ్చింది. అయినా మాతో రాధామోహన్‌గారు మంచి మూవీ నిర్మించారు. ఇలాంటి నిర్మాతలు ఇండస్ట్రీలో ఉండాల్సిన అవసరం ఉంది.
- నా జీవితంలో నాకు మా నాన్నే హీరో (ప్రముఖ నటుడు-నిర్మాత మోహన్‌బాబు). నాన్నగారు కష్టపడి, పోరాడి ఇంత గొప్ప స్థాయికి వచ్చింది మనందరం చూశాం. ఆయన్ను చూస్తూ పెరిగాను. నాన్నగారిని స్ఫూర్తిగా తీసుకున్నాను. నమ్మినవాళ్లను బాగా చూసుకోవడం, వాళ్లతోనే ఉండటం, పదిమందికి హెల్ప్ చేయడం, స్కూల్‌ని బిల్డ్ చేయడం... ఇలా నాన్నగారు చాలా చేశారు. ఇక దాన్నుంచి (ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనల గురించి కావొచ్చు) నేను బయటకు రాలేకపోతున్నాను. విష్ణు అన్న నుంచి కొన్ని విషయాలు నేర్చుకున్నాను. అయితే ఏ సిట్యువేషన్‌లోనైనా మాట్లాడి, ఆ పరిస్థితులను ఎలా సెట్ చేయవచ్చో విష్ణు అన్న దగ్గర్నుంచి నేర్చుకోవాలనుకుంటున్నాను. అలాగే సమస్యలను పరిష్కరించడానికి మాట్లాడాలంటే నేను సిద్ధంగా ఉన్నాను.
- నేను తిరుపతిలో చదువుకున్నాను. తను (భార్య మౌనిక) ఆళ్లగడ్డలో చదువుకున్నారు. ఈ సిటీ జీవితమే కాకుండా మాకు పల్లె జీవితం కూడా ఉంది. అక్కడి ప్రజల ప్రేమాభిమానాలు, ఆదరణ మాపై ఉన్నాయి. మా పిల్లలకు ఏదైనా ఇవ్వగలను అంటే అది ఇదే.
- నేను సమస్యల్లో ఉన్నప్పుడు ఇండస్ట్రీ నుంచి చాలామంది ఫోన్ చేశారు. కానీ నా ఇబ్బందుల్లో వారిని ఇన్‌వాల్వ్ చేయాలనుకోలేదు. నా భార్య మౌనిక సపోర్ట్ సరిపోయింది. మనపై తప్పుడు ఆరోపణలు వచ్చినప్పుడు గమ్మునుండిపోతే, తప్పు చేసిన వ్యక్తులుగా మిగిలిపోతాం. భవిష్యత్‌లో మా పిల్లలు 'నువ్వు చేయనప్పుడు ఎందుకు గమ్మునున్నావ్' అంటే, ఓ బ్యాడ్ ఎగ్జాంపుల్‌గా ఉండకూడదనిపించింది. తప్పు చేయనప్పుడు ఎక్కడైనా మాట్లాడగలను.

సూర్య కొత్త సినిమా షురూ

హీరో సూర్య కొత్త చిత్రం ప్రారంభమైంది. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో జరిగాయి. ఈ చిత్రంలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా, రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు త్రివిక్రమ్ క్లాప్ ఇచ్చారు. ''పాత్రలు, కథల ఎంపికలో వైవిధ్యం ప్రదర్శించే సూర్యకు తెలుగులో మంచి ఫాలోయింగ్ ఉంది. భావోద్వేగాలను, వాణిజ్య అంశాలను మిళితం చేసిన కథలతో ప్రేక్షకులను మెప్పించగల దర్శకుల్లో వెంకీ అట్లూరి ఒకరు. 'సార్' (తమిళంలో వాత్తి), 'లక్కీ భాస్కర్' వంటి వరుస విజయాలు సాధించిన వెంకీ అట్లూరి తాజాగా సూర్య హీరోగా అద్భుతమైన కథతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



- మమితా బైజు, సూర్య

శిల్పా శిరోద్కర్‌కు కరోనా



బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్‌కు కరోనా వైరస్ సోకింది. తనకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని, అందరూ మాస్కులు ధరించి, జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ షేర్ చేశారు శిల్పా శిరోద్కర్. కోవిడ్ పాజిటివ్ నేపథ్యంలో ప్రస్తుతం శిల్పా ముంబైలో విశ్రాంతి తీసుకుంటున్నారని సమాచారం. ఇక బాలీవుడ్‌లో 'త్రినేత్ర', 'హమ్' (1991), 'గోపీ కిషన్' (1994) వంటి సక్సెస్‌ఫుల్ సినిమాల్లో నటించారు శిల్పా. అలాగే 1992లో తెలుగులో 'బ్రహ్మ' చిత్రంలో కూడా నటించారామె. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించి, బ్రేక్ తీసుకున్న శిల్పా ఇటీవల బిగ్‌బాస్ 18 సీజన్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొన్నారు. ఇదిలా ఉంటే... ఆసియా దేశాల్లో కరోనా వైరస్ ప్రభావం ఉన్న నేపథ్యంలో శిల్పా అక్కడికి ట్రావెల్ చేసి, ముంబై వచ్చారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక మహేశ్‌బాబు సతీమణి నమ్రత సోదరి శిల్పా శిరోద్కర్ అనే సంగతి తెలిసిందే.

కిరీటి హార్డ్‌వర్క్ చేశాడు

- సీనియర్ నటుడు వి. రవిచంద్రన్



- సాయి కొర్రపాటి, వి. రవిచంద్రన్, కిరీటి, దేవిశ్రీ ప్రసాద్, రాధాకృష్ణ

కర్ణాటక మాజీ మంత్రి, పారిశ్రామికవేత్త గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'జూనియర్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించగా, జెనీలియా కీలక పాత్ర పోషించారు. వారాహి చిత్రం బ్యానర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో జూన్ 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'లెట్స్ లివ్ దిస్ మూమెంట్... లెట్స్ లవ్ దిస్ మూమెంట్..' అనే సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను బెంగళూరులో నిర్వహించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ స్వరకల్పనలో శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను జస్ప్రీత్ జాజ్ పాడారు. విజయ్ పోలాకి నృత్య రీతులు సమకూర్చారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో కిరీటీ రెడ్డి మాట్లాడుతూ– ''చాలా మంచి సినిమా తీశాం. 'జూనియర్'లోని ప్రతి మూమెంట్‌ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో నాకు గాయమైంది. దాంతో కోలుకోడానికి ఏడాది పట్టింది. ఈ కారణంగా ఈ సినిమా రిలీజ్ ఆలస్యమైంది. లెజెండరీ యాక్టర్ వి. రవిచంద్రన్‌గారు మమ్మల్ని సపోర్ట్ చేసేందుకు ఈ సినిమాలో నటించారు'' అని తెలిపారు. ''మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. ఈ సినిమా కోసం కిరీటి చాలా హార్డ్ వర్క్ చేశాడు'' అని తెలిపారు వి. రవిచంద్రన్. ''రవిచంద్రన్, సెంథిల్, దేవిశ్రీప్రసాద్‌గార్లు వంటి సీనియర్స్ ఉండటం వల్ల మా 'జూనియర్' సినిమా ఫస్ట్ క్లాస్‌లో పాస్ అవుతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు రాధాకృష్ణ. ''కిరీటి యాక్షన్, డ్యాన్సింగ్ స్కిల్స్ చాలా సర్‌ప్రైజ్ చేశాయి. నటుడిగా అతనికి గొప్ప భవిష్యత్ ఉంది'' అన్నారు దేవిశ్రీ ప్రసాద్. ఈ వేడుకలో కొరియోగ్రాఫర్ విజయ్ పోలాకి, ఛాయాగ్రాహకుడు సెంథిల్ కుమార్ మాట్లాడారు.

తెలంగాణ నేపథ్యంలో...

రఘుబాబు, నాగదుర్గ, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, 'బలగం' సత్యనారాయణ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కలివి వనం'. తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రం ఇది. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''వనాలను సంరక్షించుకునే నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఇప్పటికే తెలంగాణ నేపథ్యంలో వచ్చిన 'బలగం, పొట్టేల్' సినిమాల తరహాలో మా చిత్రం కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.



- నాగదుర్గ


ఇబ్బందికరమైన గౌనులో జొనాథన్ గిల్హెర్మ్

కాన్స్ చిత్రోత్సవాల్లో నిబంధన ఉల్లంఘన

'నో న్యూడిటీ'... ఈసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు స్ట్రిక్ట్‌గా పెట్టిన నిబంధన ఇది. ఈ నిబంధనను అనుసరించి తారలు తమ దుస్తులను డిజైన్ చేయించుకున్నారు. కానీ, నటుడు జొనాథన్ గిల్హెర్మ్ మాత్రం ఈ నిబంధనను ఉల్లంఘించారు. జొనాథన్ నటించిన 'ఐ ఓన్లీ రెస్ట్ ఇన్ ది స్ట్రామ్' కాన్స్ చిత్రోత్సవాల్లో 'అన్ సర్టైన్ రిగార్డ్' విభాగంలో పోటీకి ఎంపికైంది. ఈ సినిమా స్క్రీనింగ్ కోసం చిత్రబృందంలోని కొందరితో కలిసి జొనాథన్ కాన్స్ ఉత్సవాలకు హాజరు అయ్యారు. తొలిసారి తాను ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నానని పేర్కొన్నారు జొనాథన్. అయితే అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఓ పొడవాటి గౌను ధరించి, ప్రత్యక్షమయ్యారాయన. పైగా వెనక భాగం మోకాళ్లపై వరకూ కనిపించేలా, ఆ గౌను చూడ్డానికి ఇబ్బందికరంగా ఉండటం చర్చనీయాంశమైంది. 'నో న్యూడిటీ నిబంధనను ఇలా ఉల్లంఘించాడేంటి' అనే చర్చ జరిగింది. అయితే ఈ ఫెస్టివల్ నిర్వాహకులు జొనాథన్ ప్రదర్శనపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కనిపించలేదు. ఇక ఈ నటుడు ధరించిన రెండో డ్రెస్ కూడా వెరైటీగా ఉంది. ఎండు ఆకులను తలపించేలా ఓ డ్రెస్ వేసుకున్నారు. అంతే కాదు... ఏకంగా బెంచ్ మీద కూర్చుని ఫొటోలకు పోజులిచ్చారు. ఇక 'ఐ ఓన్లీ రెస్ట్ ఇన్ ది స్ట్రామ్' విషయానికొస్తే... తెల్లవాడిగా ఉండటం వల్ల పశ్చిమ ఆఫ్రికాలో కలిగే కష్టాలను అధిగమించడానికి ప్రయత్నించే ఓ పోర్చుగీస్ పర్యావరణ ఇంజనీర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ పోర్చుగీస్ చిత్రంలో జొనాథన్ గిల్హెర్మ్ ఓ విచిత్రమైన బ్రెజిలియన్ వ్యక్తి పాత్ర పోషించారు. అందుకే కాన్స్‌కు విచిత్రమైన వస్త్రధారణలో హాజరై ఉంటారేమో!



- శుభాంగి, అనుపమ్



- జొనాథన్ గిల్హెర్మ్

తన్వీ ది గ్రేట్‌కి ప్రశంసలు

బాలీవుడ్ నటుడు–దర్శకుడు అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన 'తన్వీ ది గ్రేట్' చిత్రం కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కాగా, మంచి ప్రశంసలు లభించాయి. ''పలు దేశాలకు చెందినవారు మా సినిమా చూసి, అభినందించారు. వారి స్పందన చూసి, కదిలిపోయా'' అని పేర్కొని, ఈ చిత్రాన్ని జూలై 18న రిలీజ్ చేయనున్నట్లుగా అనుపమ్ ఖేర్ పేర్కొన్నారు. ఆర్మీలో చేరే తన్వీ అనే స్పెషల్ గర్ల్ చుట్టూ తిరిగే కథతో రూపొందిన ఈ చిత్రంలో తన్వీగా శుభాంగి దత్ నటించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు అనుపమ్ ఖేర్ కీలక పాత్ర కూడా పోషించారు. ఇక ఈ నెల 13న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆరంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 24 వరకూ ఈ ఫెస్టివల్ జరుగుతుంది.

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
271	74
82,059	24,945

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,188	▼	24
డోజోన్స్	42,753	▲	98
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,699	▲	14
డాక్స్	23,935	▲	168
షాంఘై	3,368	▼	1
నికాయ్	37,499	▼	255

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.40	115.29
€	యూరో	ఎస్‌బీఐ	94.40	97.08
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.21	59.72
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.82	56.02
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.63	68.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.36	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79

మళ్లీ ఐపీఓల సందడి!

ఈ నెలలోనే 6 కంపెనీల పబ్లిక్ ఆఫర్లు

- ఈ వారంలో రెండు.. వచ్చే వారం నాలుగు
- మొత్తం రూ.11,669 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: గత కొద్ది నెలలుగా కళతప్పిన ప్రైమరీ మార్కెట్లో మళ్లీ ఐపీఓల సందడి మొదలైంది. 2025లో అడపాదడపా వస్తున్న పబ్లిక్ ఇష్యూలు ఇకపై జోరందుకోనున్నాయి. ఈ నెలాఖరులోగా ఆరు కంపెనీలు స్టాక్ మార్కెట్ తలుపుతట్టనున్నాయి. మొత్తం మీద వచ్చే పది రోజుల్లో రూ.11,669 కోట్లు సమీకరించేందుకు రంగం సిద్ధమైంది. టెక్స్‌టైల్ కంపెనీ బొరానా వీవ్స్ నేడు (20న) ప్రారంభమై 22న ముగుస్తుంది. ఇక పుణేకు చెందిన ఆటోమొబైల్ విడిభాగాల తయారీ సంస్థ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ ఇష్యూ 21న ఆరంభమై 23న క్లోజవుతుంది. మిగిలిన నాలుగు కంపెనీలు వచ్చే వారంలో పబ్లిక్ ఆఫర్ చేపట్టనున్నాయి. లీలా ప్యాలెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌కు చెందిన స్లోస్ బెంగళూరు లిమిటెడ్, ఏజిస్ వోప్యాక్ టెర్మినల్స్, ఆరిస్‌ఇన్‌ఫ్రా సొల్యూషన్స్, స్కోడా ట్యూబ్స్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ వారంలోనే ఈ నాలుగూ ప్రైస్ బ్యాండ్‌లను ప్రకటించనున్నాయి.

ధరల శ్రేణి ఇలా...

బొరానా వీవ్స్ రూ.144 కోట్ల సమీకరణ కోసం చేపడుతున్న పబ్లిక్ ఇష్యూకి రూ.205–216 ధరల శ్రేణి (ప్రైస్ బ్యాండ్) ప్రకటించింది. బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ ఈ ఇష్యూ ద్వారా రూ.2,150 కోట్లు సమీకరిస్తోంది. దీనికి ధరల శ్రేణి రూ.85–90గా నిర్ణయించింది. స్లోస్ బెంగళూరు రూ.3,000 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ఓఎఫ్ఎస్ ద్వారా రూ.2,000 కోట్ల ప్రమోటర్ షేర్లను కూడా విక్రయించనుంది. ఏజిస్ లాజిస్టిక్స్ అనుబంధ సంస్థ ఏజిస్ వోప్యాక్ టెర్మినల్స్ తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించనుంది. ఇక నిర్మాణ రంగ మెటీరియల్ సరఫరాదారు ఆరిస్‌ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ రూ.600 కోట్లు, స్కోడా ట్యూబ్స్ రూ.275 కోట్లు సమీకరించే అవకాశం ఉంది.



ఇప్పటిదాకా 10...: ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు తోడు ట్రంప్ టారిఫ్ వార్ దెబ్బకు ఈ ఏడాది మార్కెట్లో తీవ్ర అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో మన సూచీలు ఆల్‌టైమ్ గరిష్టం నుంచి దాదాపు 17 శాతం మేర దిద్దుబాటుకు గురయ్యాయి. ఈ ప్రభావంతో కంపెనీలు ఐపీఓలకు ముఖం చాటేశాయి. 2024లో రికార్డు స్థాయిలో 91 పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించగలిగాయి. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా పోలోమంటూ వచ్చిన ఇష్యూకల్లా సబ్‌స్క్రయిబ్ **చేయడంతో ప్రైమరీ మార్కెట్ కళకళలాడింది.** అయితే, 2025లో ఇప్పటిదాకా **కేవలం 10 కంపెనీలు మాత్రమే ఐపీఓలకు వచ్చాయి.** కాగా, టారిఫ్ యుద్ధా**నికి ట్రంప్ 90 రోజుల విరామం ప్రకటించడం..** ట్రేడ్ డీల్స్‌పై జోరుగా **చర్చలు జరుగుతుండటంతో మార్కెట్లు మళ్లీ** తాజా కనిష్టాల నుంచి బాగానే బౌన్స్ అయ్యాయి. సెన్సెక్స్, నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్టానికి మరో 4 శాతం దూరంలోనే ఉన్నాయి. సెకండరీ మార్కెట్ దన్నుతో ఐపీఓలకు కంపెనీలు మళ్లీ ముందుకొస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, సెబీ నుంచి దాదాపు 57 కంపెనీలకు ఐపీఓల కోసం దాదాపు లైన్ క్లియర్ కాగా.. మరో 74 కంపెనీల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని యాక్సిస్ క్యాపిటల్ వెల్లడించింది. ఇందులో సోలార్/పునరుత్పాదక ఇంధనం నుంచి కో–వర్కింగ్ స్పేస్, ఫార్మా, హెల్త్‌కేర్, తయారీ, కెమికల్స్, రియల్టీ తదితర రంగాలకు చెందిన సంస్థలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఇష్యూగా నిలిచిన ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ ఏథర్ ఎనర్జీ దాదాపు రూ.3,000 కోట్లు సమీకరించడం విదితమే. అయితే, పేలవంగా లిస్టయ్యి.. ఇప్పటికీ ఇష్యూ ధర (రూ.321) కంటే దిగువనే ఉండటం గమనార్హం.

కోల్ ఇండియా సబ్సిడరీలు కూడా..



ప్రభుత్వరంగ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియాకు చెందిన రెండు అనుబంధ సంస్థలు.. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్), సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంపీడీఐ) ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి. ఈ రెండూ త్వరలోనే సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేయనున్నట్లు కోల్ ఇండియా డైరెక్టర్ దేబశిష్ నందా వెల్లడించారు. బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లను నియమించుకున్నామని, మార్కెట్ పరిస్థితులను బట్టి ఇష్యూ ఉంటుందని చెప్పారు. కోల్ ఇండియాకు 7 సబ్సిడరీలు ఉండగా. దేశీ బొగ్గు ఉత్పత్తిలో 80% వాటా దీని చేతిలోనే ఉంది.

ఎఫ్‌డీ రేట్లను తగ్గించిన ఎస్‌బీఐ

20 బేసిస్ పాయింట్ల కోత



న్యూఢిల్లీ: దేశంలోనే దిగ్గజ బ్యాంక్ ఎస్‌బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 20 బేసిస్ పాయింట్ల (0.20 శాతం) మేర తగ్గించింది. ఈ నిర్ణయం ఈ నెల 16 నుంచే అమల్లోకి వచ్చింది. బ్యాంక్ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారం మేరకు.. రెండేళ్ల నుంచి మూడేళ్లలోపు కాలవ్యవధి డిపాజిట్లపై గరిష్టంగా 6.7 శాతం రేటు ఇకమీదట లభించనుంది. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు డిపాజిట్లపై రేటు 6.55 శాతం అమల్లోకి వచ్చింది. 5–10 ఏళ్లలోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటు సాధారణ ప్రజలకు 6.30 శాతానికి తగ్గింది. ఏడాది నుంచి రెండేళ్లలోపు ఎఫ్‌డీలపై 6.5 శాతం రేటు అమలవుతుంది. అమృత్ వర్ష్ (444 రోజుల డిపాజిట్)పై రేటు 7.05 శాతం నుంచి 6.85 శాతానికి తగ్గింది. 60 ఏళ్లు నిండిన, 80 ఏళ్లు నిండిన వృద్ధులకు ఎప్పటి మాదిరే వడ్డీ రేటులో అదనపు ప్రయోజనం కొనసాగనుంది. గత నెలలోనూ ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 10–25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడం గమనార్హం. ఆర్‌బీఐ ఇప్పటివరకు రెండు విడతల్లో కలిపి అర శాతం మేర రెపో రేటును తగ్గించడంతో ఈ మేరకు డిపాజిట్ రేట్లను బ్యాంక్‌లు సర్దుబాటు చేస్తుండడం గమనార్హం.

రస్నా చేతికి జంపిన్

- హెర్షీస్ నుంచి కొనుగోలు
- బ్రాండ్ విలువ రూ. 350 కోట్లు?



ముంబై: రెడీ–టు–డ్రింక్ విభాగంలో విస్తరించే దిశగా హెర్షీస్ ఇండియా నుంచి జంపిన్ బ్రాండ్‌ను కొనుగోలు చేసినట్లు ఇన్‌స్టంట్ పానీయాల తయారీ సంస్థ రస్నా తెలిపింది. ఇందుకోసం ఎంత వెచ్చించినదీ కంపెనీ నిర్దిష్టంగా వెల్లడించనప్పటికీ.. బ్రాండ్ విలువ సుమారు రూ.350 కోట్లు ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తాము బ్రాండ్‌నే తప్ప తయారీ ప్లాంటును కొనుగోలు చేయలేదని రస్నా చైర్మన్ పిరుజ్ ఖంబట్టా తెలిపారు. ఇకపైనా అదే తయారీ ప్లాంటులో ఉత్పత్తి కొనసాగుతుందని పేర్కొన్నారు. 125 ఎంఎల్ పరిమాణంలో పెట్ బాటిల్స్, టెట్రాప్యాక్‌లను ప్రవేశపెట్టనున్నట్లు, వీటి ధర రూ. 10 నుంచి ఉండనున్నట్లు ఖంబట్టా వివరించారు. ఈ మార్కెట్ పరిమాణం రూ. లక్ష కోట్లుగా ఉండగా, వచ్చే రెండేళ్లలో దీనిపై రూ.1,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ నష్టం 271 పాయింట్లు
- 25,000 దిగువకు నిఫ్టీ



ముంబై: బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టాలు చవిచూశాయి. అమెరికా ప్రభుత్వ సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ సంస్థ ఏఏఏ నుంచి ఏఏ1 తగ్గించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 271 పాయింట్లు తగ్గి 82,059 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74 పాయింట్లు నష్టపోయి 25 వేల స్థాయి దిగువన 24,945 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 366 పాయింట్లు నష్టపోయి 81,965 వద్ద, నిఫ్టీ 104 పాయింట్లు పతనమై 24,916 వద్ద కనిష్టాన్ని తాకాయి. అమెరికా రుణం 36 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో యూఎస్ ప్రభుత్వ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ సంస్థ ఏఏఏ నుంచి ఏఏ1 తగ్గించింది. దీంతో ఆసియా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అమెరికా మార్కెట్లూ స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ ఆధారిత సొల్యూషన్ కంపెనీ ప్రొటీయన్ ఈగవ్ టెక్నాలజీస్ షేరు 20% క్షీణించి రూ.1,143 వద్ద లోయర్ సర్క్యూట్ తాకి అక్కడే ముగిసింది. పాన్ 2.0 ప్రాజెక్ట్ కోసం దాఖలు చేసిన బిడ్‌ను ఆదాయపు పన్ను శాఖ తిరస్కరించడంతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది.
- సర్దుబాటు చేసిన స్థూల ఆదాయపు (ఏజీఆర్) బకాయిలు రద్దు చేయాలంటూ టెలికం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో వొడాఫోన్ ఐడియా షేరు 9% క్షీణించి రూ.6.73 వద్ద స్థిరపడింది.
- డాలర్ ఇండెక్సు బలహీనత, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 85.42 వద్ద స్థిరపడింది. ఫారెక్స్ మార్కెట్లో 85.43 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 85.35 వద్ద గరిష్టాన్ని, 85.61 వద్ద కనిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎస్‌బీఐ లాభాలకు యోనో దన్ను	సుప్రీం కోర్టులో వొడాఫోన్ పిటిషన్ డిస్మిస్

మార్కెట్లోకి హోండా 'రెబల్ 500'



ధర రూ.5.12 లక్షలు • బుకింగ్‌లు ప్రారంభం • జూన్ నుంచి డెలివరీలు

గురుగ్రామ్: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్ఎంఎస్‌ఐ) 'హోండా రెబల్ 500' పేరుతో కొత్త మోటార్ సైకిల్‌ను దేశీయ మార్కెట్లో లాంచ్ చేసింది. ప్రారంభ ధర రూ.5.12 లక్షలు (ఎక్స్–షోరూమ్)గా ఉంది. గురుగ్రామ్, ముంబై, బెంగళూరులోని ఎంపిక చేసిన బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లో బుకింగ్‌లు మొదలయ్యాయి. ఈ జూన్ నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. 471 సీసీ లిక్విడ్–కూల్డ్, 4–స్ట్రోక్, 8–వాల్వ్, ప్యారలల్ ట్విన్–సిలిండర్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ కలిగిన రెబల్ 500ను భారత్‌కు తీసుకురావడం సంతోషంగా ఉందని కంపెనీ ఎండీ, సీఈఓ సత్సుము ఒటానీ తెలిపారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బీహెచ్‌ఈఎల్, హైదరాబాద్‌లో 18 మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్).. పార్ట్‌టైమ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- **విభాగాలు:** న్యూరాలజీ, ఆంకాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్, రేడియోలజీ, సర్జరీ.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డీఎం, ఎండీ /ఎంఎస్ /డీఎన్‌బీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.05.2025 నాటికి 65 ఏళ్లలోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ మేనేజర్/హెచ్‌ఆర్–ఆర్ఎంఎక్స్, హెచ్‌ఆర్ఎం విభాగం, గ్రౌండ్‌ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, బీహెచ్‌ఈఎల్, ఆర్‌సీ పురం, హైదరాబాద్–502032 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 04.06.2025.
- **వెబ్‌సైట్:** https://careers.bhel.in

హాల్ హైదరాబాద్‌లో 195 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. వివిధ విభాగాల్లో ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 195.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, సీవోపీఏ, ప్లంబర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మోటార్ వెహికల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్, మెకానికల్).
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఇంటర్వ్యూ తేదీలు:** 2025 మే 26, 27, 28
- **ఇంటర్వ్యూ వేదిక:** ఉత్సవ్ సదన్ ఆడిటోరియం, శిక్షణ–అభివృద్ధి వెనుక, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్–500042 చిరునామకు పంపించాలి.
- **శిక్షణ ప్రారంభతేది:** 10.07.2025.
- **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఏడీఏ, బెంగళూరులో 23 ఉద్యోగాలు

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అడ్మిన్ అసిస్టెంట్(పీపీఏ)–09, ప్రాజెక్ట్ సీనియర్ అడ్మిన్ అసిస్టెంట్(పీఎస్ఏఏ)–06, ప్రాజెక్ట్ అడ్మిన్ ఆఫీసర్(పీఏవో)–04, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్(పీటీఏ)–02, ప్రాజెక్ట్ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్(పీఎస్‌టీఏ)–02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 13.06.2025 నాటికి పీపీఏ, పీటీఏకు 35 ఏళ్లు, పీఎస్‌టీఏ, పీఎస్ఏఏకు 45 ఏళ్లు, పీఏవోకు 50 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు పీపీఏకు రూ.35,220, పీఎస్ఏఏకు రూ.47,496, పీఏవోకు రూ.59,276, పీటీఏకు రూ.35,220, పీఎస్‌టీఏకు రూ.50,224
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.06.2025
- **వెబ్‌సైట్:** https://ada.gov.in

నీట్.. కటాఫ్ తగ్గనుందా!

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్.. సంక్షిప్తంగా నీట్ యూజీ! జాతీయ స్థాయిలో.. ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు ఆయుష్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఈ ఎంట్రన్స్ టెస్ట్‌లో మంచి స్కోర్ సొంతం చేసుకుంటే.. జాతీయ, రాష్ట్ర స్థాయిలో వైద్య కళాశాలల్లో ప్రవేశం లభిస్తుంది. ఈ నెల (మే) 4న దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ పరీక్షకు 20 లక్షల మందికిపైగా హాజరయ్యారు! ఇప్పుడు వీరంతా కటాఫ్ మార్కులు ఎంత ఉండొచ్చు.. ఎన్ని మార్కులు వస్తే సీటు లభించే అవకాశం ఉంది.. ఒకవేళ నీట్ ఫలితం ఆశించిన విధంగా లేకుంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటి అనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో.. నీట్ యూజీ-2025 కటాఫ్ అంచనా, ప్రవేశాలు కల్పించే కోర్సులు, ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రత్యేక కథనం..

- నీట్ యూజీకి 20 లక్షల మందికిపైగా హాజరు
- తెలుగు రాష్ట్రాల నుంచి 1.5 లక్షల మంది
- 420–450 మార్కులతో ఎంబీబీఎస్ సీటుకు అవకాశం!
- దీటైన ప్రత్యామ్నాయ కోర్సులు మరెన్నో

నీట్ యూజీ– 2025 పరీక్షను ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్ట్‌లలో 180 ప్రశ్నలు–720 మార్కులకు నిర్వహించారు. ఈ పరీక్షలో ఫిజిక్స్ విభాగం ప్రశ్నలు అత్యంత క్లిష్టంగా ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొన్నారు. బయాలజీ సులభంగా ఉండడం వీరికి కొంత ఉపశమనం కలిగించే అంశంగా చెప్పొచ్చు. కెమిస్ట్రీలో ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలు అడిగారు. ఇవి సుదీర్ఘంగా ఉండటంతో సమయాభావానికి గురయ్యారు. అదే విధంగా కొన్ని స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు, మరికొన్ని అసెంప్షన్ అండ్ రీజనింగ్ ప్రశ్నలు అడిగారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన వారు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలో రాణించే అవకాశం ఉంది.

450 మార్కులతో సీటు

- నీట్ పరీక్ష శైలిని విశ్లేషించిన నిపుణులు ఈ ఏడాది కటాఫ్ మార్కులు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. ప్రశ్న పత్రంలో ఫిజిక్స్ అత్యంత క్లిష్టంగా ఉండటం.. బయాలజీ, కెమిస్ట్రీ విభాగాలు మధ్యస్థంగా ఉండడమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. 720 మార్కులకు 450 మార్కులకుపైగా సాధిస్తే రాష్ట్ర స్థాయిలోని స్థానిక కోటాలో సీటు పొందే అవకాశం ఉందంటున్నారు. గత ఏడాది ఇది 480గా ఉంది.
- ఆల్ ఇండియా కోటాలో ఇతర రాష్ట్రాల్లోని కళాశాలల్లో లభించే 15 శాతం సీట్లకు జనరల్ కేటగిరీలో 520–530 కటాఫ్‌గా ఉంటుందని అంచనా. మొత్తమ్మీద ఈ ఏడాది నీట్‌లో 450 మార్కులు సాధిస్తామనే ధీమా ఉన్న అభ్యర్థులు తదుపరి దశ కౌన్సెలింగ్‌కు సన్నద్ధమవ్వాలని సూచిస్తున్నారు.

నీట్ స్కోర్‌తోనే ఆయుష్

నీట్‌లో స్కోర్‌తో ఎంబీబీఎస్ సీటు లభించకున్నా.. దీటైన ప్రత్యామ్నాయ కోర్సులు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా ఆయుష్ కోర్సుల ద్వారా డాక్టర్ కలను సాకారం చేసుకోవచ్చు. ఆయుష్ కోర్సులకు కూడా నీట్ స్కోర్‌తోనే ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. తెలంగాణలో కేఎన్‌ఆర్‌యూహెచ్ఎస్, ఏపీలో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీలు ఈ ప్రక్రియను చేపడతాయి. ఆల్ ఇండియా కోటా విధానం ఆయుష్ కోర్సులకు కూడా అమలు చేస్తున్నారు.

బీహెచ్ఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్). ఈ కోర్సు పూర్తి చేసిన వారికి కెరీర్ పరంగా అవకాశాలకు కొదవ లేదు. కారణం..ఈ వైద్య విధానంపై రోగుల్లో ఆసక్తి పెరగడమే. పలు కార్పొరేట్ వైద్య సంస్థలు ప్రత్యేకంగా హోమియోపతి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తున్నాయి. ఉన్నత విద్యలో.. మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ వంటి స్పెషలైజేషన్లకు డిమాండ్ నెలకొంది. వీటిని కూడా పూర్తి చేస్తే భవిష్యత్తులో కెరీర్ పరంగా ఎలాంటి ఢోకా ఉండదనే చెప్పొచ్చు.

బీఏఎంఎస్

బైపీసీ విద్యార్థులు వైద్య రంగంలో స్థిరపడేందుకు మరో ప్రత్యామ్నాయం.. బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్). ఈ కోర్సులోనూ ఎంబీబీఎస్‌లో మాదిరిగానే అనాటమీ, ఫిజియాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. వీటిలో నైపుణ్యం ద్వారా సహజ సిద్ధ ప్రక్రియలతో రోగులకు వైద్యం చేయగలిగే పట్టు లభిస్తుంది. ఉన్నత విద్యలో.. ఎండీ స్థాయిలో ఆయుర్వేద, ఎంఎస్–ఆయుర్వేద కోర్సులు చదవొచ్చు. ఎంబీబీఎస్‌లోని జనరల్ మెడిసిన్‌కు సరితూగే కాయ చికిత్స, జనరల్ సర్జరీకి సరితూగే శల్యతంత్ర కోర్సులు పీజీ స్పెషలైజేషన్లుగా ఉన్నాయి.

యునానీ (బీయూఎంఎస్)

ఇటీవల కాలంలో ఆదరణ పెరుగుతున్న మరో వైద్య కోర్సు.. బీయూఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడికల్ సైన్స్). పూర్తిగా ప్రకృతి వైద్యంగా దీన్ని పేర్కొనొచ్చు. బీయూఎంఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ స్థాయిలో గైనకాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీలకు సరితూగే ఎండీ, ఎంఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.



బీఎన్‌వైఎస్

బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతిక్ అండ్ యోగిక్ సైన్సెస్. ఇది బైపీసీ విద్యార్థులకు వైద్య రంగంలో మరో ప్రత్యామ్నాయ కోర్సు. దీన్ని పూర్తి చేసిన వారికి యోగా, సిద్ధ యోగా వంటి విధానాల ద్వారా రోగులకు చికిత్స చేయగలిగే నైపుణ్యాలు లభిస్తాయి.

బైపీసీతో బీవీఎస్సీ

బైపీసీ విద్యార్థుల ముందున్న మరో ప్రత్యామ్నాయ కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ (బీవీఎస్సీ). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు తదితర అంశాలపై నైపుణ్యం కల్పించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేస్తే.. పౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశు వైద్య ఆసుపత్రులు, పశుసంవర్ధక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపకం కేంద్రాల్లో అవకాశాలు లభిస్తాయి.

ఏజీ బీఎస్సీ

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్య కోర్సుల తర్వాత అత్యంత ఆదరణ పొందుతున్న కోర్సు.. అగ్రికల్చర్ బీఎస్సీ. వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రైవేటు రంగంలో విత్తన ఉత్పాదక సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. బ్యాంకుల్లో సైతం రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ల విభాగంలో ఉద్యోగాలు లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ (ఏపీ), ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ(తెలంగాణ) పరిధిలో పలు కళాశాలల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీఎస్సీ-హార్టికల్చర్ సైన్స్

తెలంగాణలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఏపీలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సు ఉంది. ఉన్నత విద్య పరంగా.. పీజీ స్థాయిలో ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్, ప్లాంటేషన్ అండ్ స్పైస్ క్రాప్ ప్రత్యేక అంశాలుగా ఎమ్మెస్సీ చదివే అవకాశం ఉంది. ఈ కోర్సును పూర్తి చేసుకున్న వారికి స్టేట్ హార్టికల్చర్ మిషన్, నాబార్డ్ సహా పలు బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రైవేట్ డ్రిప్ ఇరిగేషన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లలో హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు అందుతున్నాయి.

బీఎఫ్ఎస్సీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్.. సంక్షిప్తంగా బీఎఫ్ఎస్సీ. ఇది చేపల పెంపకం, సేకరణకు సంబంధించి ప్రత్యేక పద్ధతులు అనుసరించేందుకు అవసరమయ్యే నైపుణ్యాలు అందించే కోర్సు. దీన్ని పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ సంస్థలు, ఆక్వా రీసెర్చ్ కంపెనీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. తెలంగాణలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

బైపీసీ విద్యార్థుల ముందున్న మరో ఉత్తమ కోర్సు.. బీటెక్–ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేయడం ద్వారా ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు.

బీఎస్సీ (సీఏబీఎం)

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్. బైపీసీ విద్యార్థులకు కార్పొరేట్ కొలువులకు మార్గం వేసే కోర్సు ఇది. వ్యవసాయ విధానంలో ఆధునిక పద్ధతులను అన్వయించడం, వాటి ద్వారా లాభదాయకత పెరిగేలా చేయడానికి అవసరమైన నైపుణ్యాలు ఈ కోర్సు ద్వారా అందిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ ప్రొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్

చదువులకు 'ప్రేమ్'తో..

బాలికల విద్యకు ప్రేమ్‌జీ చేయూత

- ఏటా రూ.750 కోట్ల స్కాలర్‌షిప్పులు
- 2.5 లక్షల మందికి ప్రయోజనం
- వచ్చే మూడేళ్లలో రూ.2,250 కోట్ల కేటాయింపు
- మరోసారి పెద్దమనసు చాటుకున్న విప్రో

wipro

సాక్షి, స్పెషల్ డెస్క్



మనదేశంలో ఆడపిల్లలు చదువుకోవాలంటే ప్రధాన సమస్య డబ్బు. ప్రాథమిక విద్య పూర్తి కాగానే.. ఆర్థిక స్థోమత లేక, పెళ్లీడు రాగానే పెళ్లిచేసి పంపించేస్తే సరిపోతుందని.. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆలోచిస్తుంటారు. ఈ నేపథ్యంలో బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. అయినా ఇప్పటికీ లక్షల మంది బాలికలు బడికి పోవడం లేదు. అలాంటి అమ్మాయిల ఉన్నత విద్యకు చేయూత ఇచ్చేందుకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ముందుకొచ్చింది. వచ్చే మూడేళ్లలో ఏటా రూ.750 కోట్ల చొప్పున బాలికల కాలేజీ చదువుల కోసం భారీ ఎత్తున రూ.2,250 కోట్లు వెచ్చించనుంది.

అజీమ్ ప్రేమ్ జీ..



దేశంలోని అపర కుబేరుల్లో ఒకరు. ఆయన స్థాపించిన విప్రో కంపెనీ అంటే విలువలకు పెట్టిందిపేరు. అజీమ్ ప్రేమ్‌జీ అనగానే దాతృత్వం గుర్తుకొస్తుంది. 2019లో విప్రో కంపెనీలో తన వాటా 7.6 బిలియన్ డాలర్లను తన అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు ఇస్తున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 2023 జనవరి వరకు సేవా కార్యక్రమాల ద్వారా రూ.2,40,000 కోట్లు ఖర్చు చేసినట్లు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వెల్లడించింది. కరోనా సమయంలో ఆక్సిజన్ బెడ్లు, ఐసీయూ బెడ్లు, ఇతర సాయం కోసం సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేశారు. కర్ణాటకలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 2024 నుంచి.. వారంలో నాలుగు రోజులు ఉచితంగా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు. దీని ద్వారా 55 లక్షల విద్యార్థులకు గుడ్లు అందించేందుకు ఏడాదికి రూ.800 కోట్ల వ్యయం చేస్తున్నారు. చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. ఇంత దొడ్డ మనసున్న ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఇప్పుడు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

2.5 లక్షల మందికి..

అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఎంపికైన మొత్తం 2,50,000 మంది అమ్మాయిలకు సంవత్సరానికి రూ.30వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తారు. అంటే సంవత్సరానికి రూ.750 కోట్లు.. మూడేళ్లకు రూ.2250 కోట్లు మేర బాలికల ఉన్నత విద్య కోసం అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ వెచ్చించనుంది. తద్వారా దేశంలో లాభాపేక్షలేని సంస్థ ద్వారా అమలవుతున్న భారీ ప్రత్యక్ష నగదు బదిలీ పథకం (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్ – డీబీటీ) గా ఇది నిలవనుంది.

అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, 12వ తరగతి పూర్తి చేసుకున్న అమ్మాయిలు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ కాలేజీ లేదా యూనివర్సిటీలో రెగ్యులర్ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో చేరిన అమ్మాయిలు కూడా దరఖాస్తుకు అర్హులే. ఇలా ఆయా కోర్సులో చేరి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకూ ఏటా రూ.30వేల ఉపకారవేతనం అందుతుంది. ఇలా మూడేళ్ల డిగ్రీ లేదా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకునే వరకూ ప్రతి విద్యార్థినికి మొత్తం రూ.90వేల ఉపకార వేతనం లభిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్‌లో ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకు అవసరమైన పత్రాలు.. పదో తరగతి, 12వ తరగతి మార్కుల పత్రాలు, డిగ్రీ లేదా డిప్లొమా కాలేజీలో అడ్మిషన్ లెటర్/బోనఫైడ్ సర్టిఫికెట్, ఫీజు రిసిప్ట్, పాస్‌పోర్టు ఫొటోలు.

ప్రేమ్‌జీ ఫౌండేషన్

విప్రో సంస్థ వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ ఆధ్వర్యంలో 2001లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏర్పాటైంది. దాతృత్వ కార్యక్రమాల ద్వారా దేశాభివృద్ధిలో పాల్పంచుకోవాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన లాభాపేక్షలేని సంస్థ ఇది. ఈ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి తదితర రంగాల్లో సేవలు అందిస్తున్నారు. 'బాలికలు ఉన్నత విద్యను పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌లను ఇస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన బాలికలు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. ఉన్నత విద్యను పూర్తిచేసుకోవడంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే బాలికలు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ ద్వారా వారు తమ చదువులు కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. ఉన్నత విద్యావంతులైన మహిళలు తమ జీవితంలో సాధికారతను సాధించగలరు'అంటారు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహరా.

https://azimpremjifoundation.org

ఉన్నత విద్యలో చేరేది మూడొంతులే..

ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం దేశంలో 15 లక్షల బడులున్నాయి. వీటిలో 25 కోట్ల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో సగం మంది ప్రభుత్వ బడుల్లోనే చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో సగటు చేరికలు 93 శాతం ఉంటే.. ఆరో తరగతికి వచ్చేసరికి అది 77.4 శాతానికి పడిపోతోంది. కేవలం 56.2 శాతం మందే 12వ తరగతి పూర్తి చేస్తున్నారు. కేవలం మూడొవంతు మంది కాలేజీలో చేరుతున్నారు. అదీగాక బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువే. ప్రధాన కారణం ఆర్థిక వెనుకబాటే.

విప్రో సామాజిక బాధ్యత

విప్రో కంపెనీ సామాజిక బాధ్యత కింద భారీ ఎత్తున అనేక కార్యక్రమాలు చేపడుతోంది. విప్రో వార్షిక నివేదిక 2023-24 ప్రకారం.. 2023-24లో ఆ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల కోసం రూ.17,900 కోట్లకుపైగా వెచ్చించింది. దీనిద్వారా విద్య, వైద్యం, డిజిటల్ స్కిల్లింగ్ వంటి అంశాల్లో 17 దేశాల్లోని 45 లక్షల మందికి లబ్ధి చేకూరింది.



తల్లిదండ్రులకు పాదపూజ

రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు వారాలుగా వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం 300 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ సూదిని పద్మారెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్ దాస్, ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఎంఈవో సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. - మాడ్గుల

పులి చర్మం, గోర్లు స్వాధీనం

- అనుమానితుల ఇళ్లలో అటవీ అధికారుల సోదాలు



దహెగాం/పెంచికల్‌పేట్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ అటవీ ప్రాంతంలో గత ఐదు రోజుల క్రితం హతమైన పులి చర్మం, కాళ్లు, గోర్లను అటవీ అధికారులు సోమవారం ఇదే జిల్లాలోని దహెగాం మండలం చిన్నరాస్పెల్లి గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల కారణంగా పెద్దపులి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. దీంతో అటవీ అధికారులు సవాల్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. పెంచికల్‌పేట్ మండలం ఆగర్‌గూడ, ఎల్లూర్, రాస్పల్లి, అమర్‌గొండ, కోయచిచ్చాల గ్రామాల్లో 30 మంది వన్యప్రాణుల వేటగాళ్లను అదుపులోకి తీసుకుని విచారించారు. పులిని హతమార్చడంలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు నిర్ధారణకు వచ్చారు. అప్పటికే నిందితులు పులి చర్మాన్ని, గోర్లను వేరు చేసి విక్రయించేందుకు పక్కా ప్రణాళిక వేశారు. మూడు రోజుల విచారణలో లభించిన సమాచారంతో చిన్నరాస్పెల్లి గ్రామంలోని ఒకరి ఇంట్లో పులి గోర్లు, గ్రామ సమీపంలోని ప్లాంటేషన్‌లో పూడ్చిపెట్టిన చర్మాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పులిని హతమార్చిన ఇద్దరితోపాటు చర్మం, గోర్లు పూడ్చిపెట్టడానికి సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా, పులి మృతి సంఘటనలో బీట్, సెక్షన్, రేంజ్ అధికారులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తాజా ఘటనలో శాఖాపరమైన విచారణ తర్వాత ఎవరిపై వేటు పడుతుందోనని అటవీశాఖ అధికారుల్లో గుబులు మొదలైంది.

ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర నెలల వ్యవధి గల డీటీపీ కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూ వీలర్ కోర్సుకు టెన్త్ అర్హత ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 29న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని చెప్పారు.

నీట్ అడ్మిషన్లలో స్థానిక కోటా వర్తింపచేయాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ నీట్ విద్యార్థులు

- కొందరు దుబాయి వెళ్లి వైద్య విద్య కోసం తెలంగాణకు వస్తున్నారన్న రాష్ట్ర ప్రభుత్వం
- జూన్ 2న సుదీర్ఘ వాదనలను వింటామన్న సీజేఐ ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో తమకు స్థానికత వర్తింపచేయాలని నీట్ విద్యార్థులు సుప్రీంకోర్టును కోరారు. 9 నుంచి 12వ తరగతి వరకు కంటిన్యూగా చదివితేనే స్థానికత వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో తాము నష్టపోతున్నామని వివరించారు. ఇతర ప్రాంతాల్లో చదువుకుని వైద్య విద్యకోసం ఇక్కడకు వచ్చిన తమకు ఉపశమనం కలిగించాలని అభ్యర్థించారు. ఈ అంశంపై దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్నాక దీనిపై సుదీర్ఘ వాదనలను జూన్ 2న వింటామంటూ విచారణను వాయిదా వేసింది.

స్థానికతపై జీవో 33 తెచ్చిన ప్రభుత్వం

వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో 33 తెచ్చింది. నీట్‌కు ముందు నాలుగేళ్లు స్థానికంగా చదవాలని జీవో 33లోని నిబంధన 3 (ఏ)లో స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్ సహా 160 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. గత సెప్టెంబర్ 5న హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని అభిప్రాయపడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని చెప్పింది. హైకోర్టు తీర్పును సెప్టెంబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే, ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ప్రభుత్వం సుప్రీంకోర్టులో అంగీకారం తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ తర్వాత మరికొంతమంది విద్యార్థులు తమకూ స్థానికత వర్తింపజేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దుబాయ్ నుంచి వస్తున్నారు: జూన్ 14న అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, హైకోర్టు తీర్పుపై తదుపరి విచారణ వరకు మాత్రమే స్టే ఉటుందని గత సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు తెలిపిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది ఆర్.బసంత్ ధర్మాసనానికి తెలిపారు. ఇప్పటికే ఈ విషయంలో స్టే ముగిసిందని తెలిపారు. ఆ స్టేను మరోసారి పొడిగించవద్దని కోరారు. తెలంగాణలో పుట్టి దుబాయ్, ఇతర దేశాలు వెళ్లి అక్కడ చదువులు చదివిన కొందరు విద్యార్థులు వైద్య విద్య కోసం రాష్ట్రానికి వస్తున్నారని ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ చెప్పారు. వారు ఇక్కడ దరఖాస్తు చేసుకోవడం వల్ల ఇక్కడే ఉండి ఇక్కడే చదివిన విద్యార్థులకు ఆటంకాలు వస్తున్నట్లు వివరించారు.

విద్యాధన్ స్కాలర్‌షిప్ ప్రారంభం

- దరఖాస్తుల గడువు జూన్ 30

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్య కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాధన్ స్కాలర్‌షిప్-2025ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతంమొదటి సంవత్సరం ఇంటర్/డిప్లొమా విద్యార్థులకు ఈ అవకాశం అందుబాటులో ఉందని, ఔత్సాహిక విద్యార్థులు విద్యాధన్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. ఎంపికై న విద్యార్థులకు వారి ఫీజుల ఆధారంగా ఏటా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులకు జూన్ 30 చివరి తేదీ. దరఖాస్తుల కోసం www.vidyadhan.org సంప్రదించాలని లేదా 8068333500 విద్యాధన్ హెల్ప్‌డెస్క్‌లో వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ సబ్జెక్టుల్లోకి ఆధునిక టెక్నాలజీ

మారనున్న సిలబస్.. కోర్సుల్లో సమూల మార్పులు

- ప్రాజెక్టు వర్క్‌కు అత్యంత ప్రాధాన్యం
- సరికొత్త క్రెడిట్ విధానం
- లాంగ్వేజెస్‌లో తగ్గుతున్న క్రెడిట్స్... సబ్జెక్టులకు మరికొన్ని క్రెడిట్స్
- యూజీసీ మార్గదర్శకాలకు లోబడి తుది మెరుగులు దిద్దుతున్న ఉన్నత విద్యా మండలి
- వివరాలు వెల్లడించిన మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి





సాక్షి, హైదరాబాద్

ఈ విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ కోర్సుల సిలబస్ సమూలంగా మారనుంది. ఇప్పుడున్న క్రెడిట్ విధానంలోనూ గుణాత్మక మార్పు కు శ్రీకారం చుడుతున్నారు. దీనికి సంబంధించిన కసరత్తు తుది దశకు చేరింది. దీనిపై త్వరలో వర్సిటీలతో ఉన్నత విద్యామండలి సమావేశం కాబోతోంది. మరోవైపు క్రెడిట్ విధానంపై యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలు పంపింది. దీని ఆధారంగా ఇప్పటికే చేపట్టిన సిలబస్ మార్పును మరోసారి అధ్యయనం చేస్తున్నారు. డిగ్రీలో చోటు చేసుకునే మార్పులు, కొత్త క్రెడిట్ విధానం పై మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సోమవారం మీడియాకు వివరించారు.

అనుభవానికి ప్రాధాన్యం

డిగ్రీలో బీకాం, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌కే విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. బీఏ, సాధారణ బీఎస్సీ కోర్సుల్లో పెద్దగా చేరడం లేదు. మరోవైపు డిగ్రీ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కోర్సుల్లో మార్పులు తెచ్చారు. సిలబస్ తగ్గించడంతోపాటు, ఆధునిక సాంకేతిక విద్యను జోడిస్తున్నారు. కొన్ని చాప్టర్లలో పూర్తిగా ఈ తరం సాంకేతిక అవసరాలతో సిలబస్‌ను రూపొందించారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రాజెక్టు వర్క్ చేయడాన్ని తప్పనిసరి చేస్తున్నారు. వ్యాల్యూ యాడెడ్ కోర్సుల పేరుతో ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించే విధానాన్ని అనుసరిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరం తొలి ఏడాది డిగ్రీలో ఈ మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. వాస్తవానికి సిలబస్‌పై మండలి కొన్ని నెలలుగా కసరత్తు చేసింది. ఏఏ కోర్సులు, చాప్టర్లు పెట్టాలనే దానిపై అనుభవజ్ఞుల అభిప్రాయాలను తీసుకుంది. దీనిని అమలు చేసే నేపథ్యంలో యూజీసీ క్రెడిట్ విధానంపై మార్పులను సూచించింది. దీంతో సిలబస్‌పై యూనివర్సిటీల వీసీలతో మరోసారి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం తీసుకోవాలని మండలి భావిస్తోంది.

మారుతున్న క్రెడిట్ విధానం

ప్రపంచవ్యాప్తంగా విద్యా విధానంలో క్రెడిట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. విదేశీ ఉద్యోగాలు, విద్యకు వెళ్లాలన్నా క్రెడిట్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రేడింగ్‌తో పాటు డిగ్రీలో క్రెడిట్స్‌ను అందిస్తున్నారు. ఇప్పటి వరకూ మూడేళ్ల డిగ్రీకి మొత్తంగా 150 క్రెడిట్స్ ఇస్తున్నారు. ఇక నుంచి 124 క్రెడిట్స్‌లో కోర్సును రూపొందించాలని యూజీసీ సూచించింది. అయితే, స్థానిక పరిస్థితులను బట్టి 130 క్రెడిట్స్ వరకూ ఇవ్వడానికి వీలుందని అధికారులు చెబుతున్నారు. ఇది అన్ని యూనివర్సిటీ వీసీల భేటీ తర్వాత నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు. లాంగ్వేజ్‌లకు మొత్తంగా 16 క్రెడిట్స్ ఉండేవి. ఇప్పుడు ఆఖరి రెండు సెమిస్టర్లలో లాంగ్వేజ్ తీసివేసి, 12 క్రెడిట్స్‌కు తగ్గించారు.

క్రెడిట్స్ ఇలా లెక్కిస్తారు....

క్రెడిట్స్‌ను బోధించే సమయం ఆధారంగా నిర్ధారిస్తారు. డిగ్రీలో ఏడాదికి రెండు సెమిస్టర్ల చొప్పున, మూడేళ్లకు ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతీ సెమిస్టర్‌లో 90 పనిదినాల బోధన జరుగుతుంది. రోజుకు మూడు గంటల చొప్పున బోధిస్తారు. ఈ లెక్కన మూడు క్రెడిట్స్ ఇస్తారు. సబ్జెక్టుకు నాలుగు క్రెడిట్స్ ఉంటే, రోజుకు నాలుగు గంటల బోధన చేపట్టాల్సి ఉంటుంది. మొత్తం మూడేళ్లకు 35 పేపర్లు (సబ్జెక్టులు, లాంగ్వేజ్, వ్యాల్యూ యాడెడ్ కోర్సులు కలిపి) ఉంటాయి. వీటికి మొత్తంగా 124 క్రెడిట్స్ ఉంటాయి.



స్కేల్ ఆఫ్ సీజీపీఏ కీలకం

డిగ్రీలో విద్యార్థి తుది ర్యాంకును స్కేల్ ఆఫ్ క్యుమిలేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్‌గా నిర్ణయిస్తారు. అంతర్జాతీయంగా దీనినే ప్రామాణికంగా తీసుకుంటారు. విద్యార్థి లాంగ్వేజ్ లేదా సబ్జెక్టులో వచ్చిన మార్కుల ఆధారంగా సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) నిర్ణయిస్తారు. ఉదాహరణకు విద్యార్థికి 75 శాతం కన్నా ఎక్కువ మార్కులు వస్తే ఏ గ్రేడ్ ఇచ్చి, 10 గ్రేడ్ ఇస్తారు. బోధన గంటల ప్రకారం ఇచ్చిన క్రెడిట్ పాయింట్‌ను, సీజీపీఏతో హెచ్చిస్తారు. ఇలా మొత్తం 139 క్రెడిట్ పాయింట్ వచ్చిందనుకుంటే, దీన్ని మొత్తం క్రెడిట్స్‌తో భాగహారిస్తారు. ఉదాహరణకు 139ని 20తో భాగహారిస్తే 6.95 వస్తుంది. దీన్ని స్కేల్ ఆఫ్ సీజీపీఏగా గుర్తిస్తారు. ఒక విద్యార్థి 10కు 6.95 సీజీపీఏ స్కేల్ సాధించినట్టు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



ఖమ్మం జిల్లా వేంసూరులో గాలిదుమారానికి నేలరాలిన మామిడి కాయలు



భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో గాలిదుమారానికి నేలరాలిన మామిడికాయలు

మామిడి రైతుకు దెబ్బ మీద దెబ్బ

- సీజన్‌లో నాలుగుసార్లు గాలిదుమారం, వర్షాలు
- ఫలితంగా మామిడిలో నాణ్యతలోపం
- రాష్ట్రమంతటా ధర తగ్గడంతో రైతులకు తీవ్ర నష్టం
- 32 జిల్లాల్లో 3.06 లక్షల ఎకరాల్లో మామిడి తోటల సాగు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మామిడి రైతులకు ఈ ఏడాది కోలుకోలేని నష్టం వాటిల్లింది. ఈదురుగాలులు, అకాల వర్షం, వడగళ్ల వానతో దెబ్బ మీద దెబ్బ పడినట్టు అయ్యింది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 3,06,395 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. అయితే తెగుళ్లు, గాలిదుమారానికి దిగుబడి పడిపోగా.. మరో పక్క ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు. బంగినపల్లి రకం మామిడి ఏప్రిల్ మొదటి వారంలో టన్ను రూ.50 వేల నుంచి రూ.60 వేలు పలకగా.. ఇప్పుడు రూ.30 వేలు మాత్రమే వస్తోంది. ఇక తోతాపురి గత సీజన్ ఇదే సమయంలో టన్ను రూ.15 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.8 వేలు దాటడం లేదు.

తగ్గిన దిగుబడి

కొన్నేళ్లుగా మామిడి దిగుబడులు తగ్గుముఖం పడుతున్నాయి. డిసెంబర్, జనవరి నెలల్లో మంచుతో పూత రాలగా, వేసవిలో గాలిదుమారాలు, వడగళ్ల వానల ప్రభావంతో పంట దిగుబడిపై పడింది. ఈ ఏడాది నాలుగుసార్లు గాలిదుమారం, వర్షాలతో మామిడి పంట దెబ్బతిన్నది. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల దిగుబడులు తగ్గాయి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకున్నా లాభం లేకుండా పోయింది. ఎకరానికి దుక్కులు, ఎరువులు, పురుగు మందులు కలిపి రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చు అయ్యింది. కౌలుకు తీసుకుంటే ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు చెల్లించాలి. కానీ దిగుబడి, ధర తగ్గడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

అధిక విస్తీర్ణంలో మామిడి సాగవుతున్న జిల్లాలు

జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
జగిత్యాల	36,325
నాగర్‌కర్నూల్	33,449
ఖమ్మం	31,697
రంగారెడ్డి	23,504
మంచిర్యాల	16,245
వనపర్తి	15,707
సంగారెడ్డి	13,722
మహబూబాబాద్	13,174
సిద్దిపేట	13,049

తొలుత ధర పలికినా..

రైతులు ఎక్కువగా చిన్న రసాలు, పెద్ద రసాలు, బంగినపల్లి, తోతాపురి, జలాలు, తెల్ల గులాబీలు సాగు చేస్తారు. ఇందులో పచ్చళ్ల రకాలే ఎక్కువగా ఉండగా, పండ్ల రకాలు స్వల్పంగా ఉంటాయి. ఖమ్మం జిల్లాలో 31,607 ఎకరాల్లో సాగయ్యే మామిడి తోటల్లో ఎక్కువగా బంగినపల్లి, తోతాపురి రకాలే ఉన్నాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో టన్ను రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఉన్న బంగినపల్లి ధర ఇప్పుడు రూ.30 వేలే పలుకుతోంది. మార్చి నెలలో కోల్‌కతా తదితర ప్రాంతాల్లో పచ్చళ్ల పెట్టే సీజన్ కావడంతో డిమాండ్ ఉంది. బంగినపల్లి జీడిదశలో ఉండడంతో కాయలకు డిమాండ్ ఏర్పడుతోంది. ఆ తర్వాత గాలిదుమారం, వర్షాలతో పండ్లు రాలిపోవడం, టెంకె పట్టడంతో ధరలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి.

కమీషన్ దుకాణాలు అంతంతే..

మామిడి అధిక దిగుబడి వస్తే కమీషన్ దుకాణాలు వెలుస్తాయి. ఇక్కడ కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. కానీ ఈసారి దిగుబడులు నామమాత్రంగానే ఉండటంతో రాష్ట్రంలో కమీషన్ దుకాణాలు కూడా తగ్గాయి. రైతుల నుంచి మారుబేరగాళ్లు తోటలు తీసుకొని చెట్ల సంఖ్య, దిగుబడి, డిమాండ్ ఆధారంగా ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించేవారు. ఈసారి ఆ పరిస్థితీ లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట ప్రాంతాల్లో గతేడాది పదుల సంఖ్యలో కమీషన్ దుకాణాలు ఏర్పాటైతే ..ఈసారి రెండు మాత్రమే ఉండటం పరిస్థితిని తెలియజేస్తోంది.



రూ.లక్షన్నర ఆదాయం కోల్పోయా..

మూడెరకాల మామిడి తోట ఉంటే ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టా. కోతదశలో గాలిదుమారాలు, వడగళ్లు, వర్షాలతో తీవ్రంగా నష్టపోయా. పెట్టుబడి కాకుండా రూ.1.50 లక్షల ఆదాయం కోల్పోయా. ధర కూడా ఎక్కువగా పలకడం లేదు.

– భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజాపురం, భద్రాద్రి కొత్తగూడెం



మునుపెన్నడూ ఈ పరిస్థితి లేదు

మునుపెన్నడూ ఈ పరిస్థితి లేదు. చీడపీడలొచ్చినా పంటను కాపాడుకున్నా.. ప్రకృతి వైపరీత్యాలు శాపంగా మారాయి. మా ఉమ్మడి కుటుంబానికి సంబంధించి ఐదెకరాల్లో ఉన్న తోటలో కాయంతా గాలిదుమారంతో నేలపాలైంది. ఆర్థికంగా నష్టపోయాం.

– నరుకుళ్ల వాసు, అయ్యన్నపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



మామిడి తోటలు కలిసి రాలేదు

నేను వేంసూరు మండలంలో మామిడితోటలను కొనుగోలు చేశా. మొత్తం రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టా. ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశించాను. కానీ అకాల వర్షాలు, గాలిదుమ్ముతో కాయలు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టపోయా.

– ఎం.డి.మొహీన్, వేంసూరు, ఖమ్మం జిల్లా



రాష్ట్రపతి భవన్‌లో 'నీలం'కు ఘన నివాళి

- పుష్పాంజలి ఘటించిన ద్రౌపదీ ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి, సమైక్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి ఆమె పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను రాష్ట్రపతి కొనియాడారు.

తల్లిగా గర్వపడుతున్నా: కవిత



సాక్షి, హైదరాబాద్: తన బిడ్డ గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న సందర్భంగా.. ఒక తల్లిగా ఎంతో గర్వపడుతున్నానని ఎమ్మెల్సీ కె.కవిత సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పెద్ద కుమారుడు ఆదిత్య.. అమెరికాలోని ఓక్ ఫారెస్ట్ యూనివర్సిటీ నుంచి సోమవారం గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకున్నారు. యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో కవిత, అనిల్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. కుమారుడు గ్రాడ్యుయేషన్ పట్టా స్వీకరిస్తున్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో కవిత పంచుకున్నారు. కాగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొనడానికి.. ఏడు రోజుల అమెరికా పర్యటనకు ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేయడం తెలిసిందే. ఈ నెల 23వ తేదీన ఎమ్మెల్సీ కవిత తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోలేదు

ఓఎంసీ కేసు పిటిషన్‌లో ఏముందంటే...

సాక్షి, హైదరాబాద్: 'సీబీఐ కోర్టు సాక్ష్యాలను, ఆధారాలను పరిగణనలోకి తీసుకోలేదు. యాంత్రికంగా శిక్షలు ఖరారు చేసింది. అక్రమంగా గనుల లీజు పొందారని, క్యాప్టివ్ మైనింగ్ పేరిట నాటి సర్కార్‌ను తప్పుదోవపట్టించారనే ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంది తప్ప దానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) ప్రైవేట్ లిమిటెడ్, బళ్లారి ఐరన్‌ఓర్ ప్రైవేట్ లిమిటెడ్ మైనింగ్‌పై దర్యాప్తును మాత్రమే ప్రభుత్వం కోరింది. సీబీఐ అత్యుత్సాహంతో తన పరిధి దాటి మైనింగ్ లీజులపై విచారణ జరిపింది. దర్యాప్తు సంస్థ చెప్పిన దాన్ని విని శిక్ష ఖరారు చేసింది. సరిహద్దు వివాదాల జోలికి వెళ్లవద్దని ఇదే హైకోర్టు చెప్పినా.. దర్యాప్తు సంస్థ వినలేదు. మైనింగ్ లీజు సరిహద్దు వివాదాలు ఇంకా సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అవి నిర్ధారణ కాకుండా ఏది అక్రమం.. ఏది సక్రమం తేల్చడం సాధ్యంకాదు. రిటర్న్‌లు సరిగా దాఖలు చేయలేదని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూర్చామన్న ఆరోపణలే తప్ప.. ఆధారాలు లేవు. ఏ ప్రభుత్వ ఉద్యోగితో కలసి కుట్ర పన్నినట్లు తేలనప్పుడు సెక్షన్ 409 కింద విశ్వాసఘాతుకానికి పాల్పడినట్లు ఎలా అవుతుంది? ప్రైవేట్ వ్యక్తినైన నాకు (జనార్దన్‌రెడ్డి) ఆ సెక్షన్ వర్తించదు. కుట్ర పన్నారన్న ఆరోపణలను సమర్థించే వాంగ్మూలం కూడా లేదు. వ్యక్తిగతంగా లీజు కోసం దరఖాస్తు చేయనప్పుడు.. ఆ మేరకు శిక్షలు విధించడం చెల్లదు. అక్రమ మైనింగ్ అని దర్యాప్తు అధికారులు చెబుతున్నా.. ఆ మైనింగ్ జారీ ఉత్తర్వులను సర్కార్ నిలిపివేయలేదు. రద్దు చేయలేదు. అలాంటప్పుడు అక్రమం ఎలా అవుతుంది? రోడ్డు నిర్మాణం, మైనింగ్ లాంటివి ఎంఎండీఆర్ చట్టం పరిధిలోకి వస్తాయి. వీటిలో కోర్టులు జోక్యం చేసుకోలేవు. అందుకే తొలుత ఈ చట్టం కింద అభియోగాలు మోపిన సీబీఐ.. తర్వాత మినహాయించుకుంది. కేవలం దర్యాప్తు సంస్థ సమర్పించిన పత్రాల ఆధారంగా శిక్ష విధింపు సరికాదు. ఇప్పటికే మూడున్నరేళ్ల శిక్ష అనుభవించా. నియోజకవర్గానికి వెళ్లవద్దన్న అనర్హత కారణంగా మరోచోటు నుంచి గెలిచా. ప్రజల కోసం పనిచేస్తున్నందునే పట్టంకట్టారు. శిక్ష అమలును వెంటనే నిలిపివేయాలి. హైకోర్టులో అప్పీల్‌పై విచారణ ముగిసి తీర్పు వచ్చేదాకా బెయిల్ ఇవ్వాలి'అని ఓఎంసీ కేసు పిటిషన్‌లో గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.



సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో జరిగిన సభలో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క. చిత్రంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు

పాత విద్యుత్ తీగలు మార్చండి

మాజీ ఎంపీ వీహెచ్ సూచన



సాక్షి, హైదరాబాద్: గుల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాదం నేపథ్యంలో.. ఇళ్లలోని పాత విద్యుత్ తీగలను మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు సూచించారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ వైరింగులతో అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. పాత ఇళ్లలో ఈ సమస్య మరింత ఎక్కువ ఉంటోందని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించాలని కోరారు ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీలు పెట్టుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. అదే కోవలో హరీశ్‌రావు, కవితలలో ఎవరు పార్టీ పెట్టినా.. ఎవరూ ఆపలేరని ఒక ప్రశ్నకు సమాధానంగా వీహెచ్ చెప్పారు.

గుల్జార్ హౌస్ ప్రమాదంపై విచారణ జరపండి

ఎన్‌హెచ్‌ఆర్‌సీకి న్యాయవాది ఇమ్మానేని ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: పాతబస్తీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని 17 మంది మృతి చెందిన గుల్జార్ హౌస్ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు హైకోర్టు న్యాయవాది ఇమ్మానేని రామారావు ఫిర్యాదు చేశారు. వాణిజ్య సముదాయాల నిర్వహణ, అక్రమ కట్టడాల నియంత్రణ సరిగా లేకపోవడమే ఇంత మంది ప్రాణాలు పోవడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా అనుమతులిస్తూ, నిబంధనలను గాలికి వదిలివేస్తుండటంపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన బల్దియా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తే చెరగవు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచం గర్వించదగిన నిర్మాణాలు చేపట్టడం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకే సాధ్యమని, ఆయన సృష్టించిన ఆనవాళ్లను చెరిపేస్తాం అన్నవాళ్లు.. ప్రస్తుతం వాటినే ప్రపంచానికి చూపించుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదాద్రి దేవాలయం.. కేసీఆర్ హయాంలో నిర్మితమైనవని గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వ చిహ్నం నుంచి తొలగిస్తామన్న చారిత్రక కట్టడాలైన చార్మినార్, రామప్ప గుడి.. మిస్ వరల్డ్ పోటీదారులకు చూపించేందుకు ఈ ప్రభుత్వానికి దిక్కయ్యాయని ఆయన సోమవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తుచేసే స్మారకజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని కూడా పోటీదారులకు చూపిస్తే.. రాష్ట్రం గొప్పతనం మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు.

మండుటెండకు వెండిమబ్బుల గొడుగు..



మండుటెండకు వెండి మబ్బులు గొడుగు పట్టాయి. మధ్యాహ్న మార్తాండుడు తన ప్రతాపం చూపిస్తుండగా ఒక్కసారిగా నిర్మల ఆకాశాన్ని కొండల్లా వచ్చి కమ్ముకున్నాయి. ఆహ్లాదకరంగా మారిన వాతావరణంలో చిటపట చినుకుల పలకరింతతో విజయవాడ నగరవాసి పులకరించిపోయాడు. బెంజ్ సర్కిల్ సమీపంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మబ్బుల ముసుగులో శేషాచలం



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎండలు మండిపోతుంటే ఆధ్యాత్మిక నగరం తిరుపతి వరుణుడి కరుణలో తడిసి ముద్దవుతోంది. రెండు రోజులుగా తిరుపతి పరిసరాల్లో వర్షం కురుస్తోంది. శేషాచలం కొండల్ని మబ్బులు ముసుగేయడంతో దేవదేవుని దర్శనానికి వెళ్లిన భక్తులు ఆ సుందర దృశ్యాన్ని చూసి మైమరచిపోయారు. అలిపిరి వద్ద ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఇనబాంధవా ప్రణామం



పగలంతా తీక్షణ కిరణాలతో ప్రజల్ని బెంబేలెత్తించిన వెలుగుల రేడు సాయంకాల సమయాన అలా అలా మబ్బుల మాటున కనుమరుగవుతున్నాడు. అస్తమించే సూర్యుని అరుణ కిరణాలు తాకి మబ్బులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. అనంతపురం క్లాక్ టవర్ ప్రాంతంలోని ఫ్లైఓవర్ పైనుంచి ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా...

నెలాఖరులోగా కాలువల మరమ్మతులు: నిమ్మల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ, మరమ్మతు పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సోమవారం కాలువల నిర్వహణ, మరమ్మతులపై ఎమ్మెల్యేలు అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.344 కోట్లు విడుదల చేశామని పనులు వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు.

దేవదాయ శాఖలో ఇద్దరు అధికారులకు క్లీన్‌చిట్

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి సాగర్‌బాబుపై శాఖాపరంగా జరుగుతున్న క్రమశిక్షణ ఆరోపణలపై తదిపరి చర్యలన్నింటినీ ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అధికారులు శ్రీశైలం ఆలయ ఈవోలుగా ఉన్న సమయంలో వారిపై ఆరోపణలు వచ్చాయి. విచారణ అనంతరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేసిన సిఫార్సు, దేవదాయ శాఖ కమిషనర్ నివేదిక మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఉగ్రవాద కదలికలపై నిరంతర నిఘా!

సాక్షి, అమరావతి: జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలపై అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోలీస్ శాఖ, పరిపాలన శాఖలకు సూచించారు. ఈ మేరకు పలు సూచనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలకు పవన్ కళ్యాణ్ లేఖ రాసినట్లు సోమవారం ఆయన కార్యాలయం తెలిపింది.

ర్యాబిస్‌ను నియంత్రిద్దాం

సాక్షి, అమరావతి: ర్యాబిస్ నియంత్రణపై కలిసికట్టుగా దృష్టి సారించాలని వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, పశుసంవర్ధక శాఖలు నిర్ణయించాయి. సచివాలయంలో సోమవారం వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అధ్యక్షతన జూనోసిస్ కమిటీ సమావేశం జరిగింది. జంతువుల నుంచి మానవులకు వ్యాపించే అంటు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

అడాప్ట్ నోడల్ అధికారిగా రైతు సాధికార సంస్థ సీఈవో

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అమలయ్యే ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) కింద రాష్ట్రంలో చేపట్టబోయే అడాప్షన్ ఫర్ రిసీలియన్స్ ప్రాజెక్టు నోడల్ అధికారిగా రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి. రామారావును ప్రభుత్వం నియమించింది.ఈమేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మధుసూదన్ బెయిల్‌పై రేపు తీర్పు

విజయవాడలీగల్: ఏపీపీఎస్సీ పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో నమోదు చేసిన కేసులో నిందితునిగా ఉన్న మధుసూదన్ బెయిల్‌పై ఇరువర్గాల వాదనలు ముగిశాయి. విజయవాడలోని ఫస్ట్ అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. న్యాయస్థానం ఈ నెల 21న తీర్పును వెల్లడించనుంది.

నాణ్యమైన విత్తనోత్పత్తికి సీడ్ హబ్ సెంటర్లు

సాక్షి, అమరావతి: నాణ్యమైన విత్తనోత్పత్తికి సీడ్ హబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ చెప్పారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సాంకేతిక ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో 2 కోట్ల మంది 'యోగా'లో పాల్గొనాలి

సాక్షి, అమరావతి: విశాఖలో వచ్చే నెల 21న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి వరకు కనీసం రెండు కోట్ల మంది ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సచివాలయం నుంచి సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.

అల్లూరి జిల్లాలోని పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం మంచి ఫలితాలు సాధిస్తోంది. తాటి ఉత్పత్తుల తయారీపై జరిపిన విస్తృత పరిశోధనల ఫలితంగా జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. 2024–25కు సంబంధించి ఉత్తమ అవార్డు పొందింది. దీంతో ఇక్కడ 32 ఏళ్లుగా జరిపిన పరిశోధనలకు సార్థకత లభించింది. దేశంలో ఉన్న నాలుగు పరిశోధన స్థానాల్లో మేటిగా నిలుస్తూ గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేస్తోంది.

ఏకతాటిగా ఫలాలు






పరిశోధన స్థానంలో వివిధ రకాల తాటి చెట్లు





తాటి నీరాతో తయారు చేసిన ఉత్పత్తులు



ధ్రువీకరణ పత్రం

- తాటి ఆధారిత ఉత్పత్తుల తయారీపై విస్తృత పరిశోధనలు
- గిరి రైతులకు ఆదాయ సిరులు
- పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానంలో 32 ఏళ్ల సేవలకు గుర్తింపు
- జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు

రంపచోడవరం: పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం (హెచ్‌ఆర్‌ఎస్)కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. తాటి పరిశోధనల ఫలితంగా ఉత్తమ పరిశోధన స్థానంగా గుర్తింపు పొందింది. ఈ అవార్డును ఈనెల 7 నుంచి 9 వరకు మధురైలో జరిగిన కార్యక్రమంలో పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. వీసీ వెంగయ్య స్వీకరించారు.

1993లో నిధుల కేటాయింపుతో..

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడిలో 1986లో ఏర్పాటైన ఈ ఉద్యానవన పరిశోధన స్థానానికి 1993లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సెంటర్ న్యూఢిల్లీ (ఐసీఏఆర్) తాటి పరిశోధనలకు నిధులు కేటాయించింది. అప్పటినుంచి 32 ఏళ్లుగా తాటి చెట్లకు సంబంధించి నిరంతరంగా వివిధ దశల్లో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

272 తాటి రకాలతో..

దేశంలో వివిధ ప్రాంతాలనుంచి 272 రకాల తాటి చెట్ల టెంకలను సేకరించి ఇక్కడ నాటారు. తరువాత దశలో తాటి చెట్ల నుంచి నీరా సేకరణపై పరిశోధనలు సాగాయి. ఆధునిక పద్ధతులను అవలంభించి నీరాను విజయవంతంగా సేకరిస్తున్నారు. తాటి నుంచి ఆహార ఉత్పత్తుల తయారీపై కూడా ఇక్కడి శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. దీనిలో భాగంగా నీరా నుంచి తాటి బెల్లం, తాటి సిరప్, తాటి తేగల నుంచి నూక,పిండి, తాటి గుజ్జు నుంచి జెల్లీ వంటి 20 రకాల ఆహార పదార్థాలను విజయవంతంగా తయారు చేశారు. గిరిజనులకు తాటి ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరిశోధనల ఫలితాలను చేరువ చేశారు.

- తాటి తేగలతో పిండి, నూక (రవ్వ) తయారు చేసిన మైదా స్థానంలో వీటిని వినియోగించి పోషక విలువలతో కూడి ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. వీటితో కేకులు, బిస్కెట్లు, జంతికలు, బ్రెడ్, నూడల్స్, రవ్వ లడ్డు, పిజ్జా బేస్ తదితర పదార్థాలను వాణిజ్య పరంగా తయారు చేస్తున్నారు.
- చింతూరు కేంద్రంగా పనిచేస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ వెంయ్య సహకారంతో మూడు టన్నుల తేగల పిండిని లండన్‌కు పంపించింది. తరువాత కోవిడ్ కారణంగా నిలిచిపోయింది. మళ్లీ పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- దేశంలో 32 వన్య పంట విభాగాలు ఉండగా వీటిలో కొబ్బరి పరిశోధన స్థానాలు 20, ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్లు, వక్క రీసెర్చ్ సెంటర్, తాటి పరిశోధన స్థానాలు నాలుగు ఉన్నాయి. వీటికి సంబంధించి ఏటా ఉత్తమ రీసెర్చ్ సెంటర్లకు అఖిల భారత వన్య పంటల విభాగంలో అవార్డు అందజేస్తారు. దీనిలో భాగంగా 2024–25కు సంబంధించి పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రానికి అవార్డు దక్కింది.

ఎంతో సంతోషంగా ఉంది



తాటి పరిశోధనల్లో అనేక అంశాల్లో ముందడుగు వేయగలిగాం. తమ పరిశోధన స్థానంలో 32 ఏళ్లుగా తాటిపై జరిపిన పరిశోధనలు, వాటి ఫలితాలపై జాతీయ స్థాయిలో మధురైలో జరిగిన కార్యక్రమంలో ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. తమ పరిశోధన స్థానానికి తొలిసారి జాతీయ స్థాయి గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. తాటి పరిశోధనల ఫలితంగా కొత్త రకం తాటి రకాలను త్వరలో తీసుకువస్తాం.జాతీయ వేదికపై తాటికి సంబంధించి పుస్తకాన్ని కూడా ఆవిష్కరించాం. 2014, 2017, 2023లో వ్యక్తిగతంగా జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి.

–డా. వీసీ వెంగయ్య, ప్రధాన శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానం

మనమిత్రను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అధికారులకు సీఎస్ విజయానంద్ ఆదేశం

సాక్షి, అమరావతి: మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి, ప్రభుత్వ సేవలన్నీ మనమిత్రలో పొందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూన్ 12లోపు మనమిత్ర ద్వారా ప్రజలకు 500 రకాల సేవలందేలా పనిచేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగాధికారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. డ్రోన్ మార్ట్ వెబ్ పోర్టల్‌ను సీఎం చేతులమీదుగా ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆర్టీజీఎస్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 325 సేవలు అందిస్తున్నామని, జూన్ 12కల్లా 500 సేవలు అందించనున్నామన్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చే వరకు పోరాటం ఆగదు

ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేవరకు కోకో రైతుల పోరాటం ఆగదని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలంలోని ఎం.నాగులపల్లి పాత పంచాయతీ కార్యాలయం వద్ద కోకో రైతుల ప్రాంతీయ సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా కంపెనీలు, ట్రేడర్లు రైతులను మోసగించడం దుర్మార్గమన్నారు. ఈ ఒక్క సీజన్లోనే (గడచిన మూడు నెలల కాలంలో) రూ.1000 కోట్ల వరకు రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 17న ఆందోళనల సమయంలో జరిగిన ఒప్పందానికి విరుద్ధంగా కంపెనీలు, ట్రేడర్లు పలు ప్రాంతాల్లో కొనుగోళ్లు జరపడం సరికాదన్నారు. ఒప్పందానికి భిన్నంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఎక్కడి సరుకు అక్కడ నిలిపివేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈనెల 21 లోపు ధర నిర్ణయం కాకపోతే కోకో రైతుల ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. అనంతరం కోకో రైతులు ధర్నా నిర్వహించారు.

ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్‌ను కూడా తరలించేస్తారా?

- 2027 జనవరితో ముగిస్తున్న లీజు అగ్రిమెంట్
- భారీగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసిందా అంటే, పరిశీలకులు అవుననే అంటున్నారు. అద్దె చెల్లించడం భారమవుతుందన్న సాకులు చెప్పి జిల్లా కేంద్రమైన ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఇడుపులపాయ, నూజివీడు సెంటర్లకు తరలిస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం, అదే కారణంతో ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్‌ను కూడా ఎందుకు ఎత్తివేయదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు క్యాంపస్‌లకు సంబంధించి రూ. 3 కోట్ల వరకూ విద్యుత్ బిల్లులను కూడా చెల్లించకుండా ప్రభుత్వం చేతులెత్తేసింది. ఒంగోలులో ట్రిపుల్ ఐటీ కాలేజీని పూర్తిగా ఎత్తేయాలన్న కుట్రతోనే అద్దెలు, విద్యుత్ బిల్లులను చెల్లించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా ఈ తరలింపులపై జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులలో ఎటువంటి స్పందన లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం ఐదు బ్రాంచీలతో, రెండవ సంవత్సరం సీఎస్‌ఈ విద్యార్థులతో కొనసాగుతోంది. ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్‌లో 2, 3, 4 సంవత్సరాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తారు.

విద్యుత్ బిల్లులను ఎందుకు చెల్లించలేదు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఇప్పటి వరకు రావ్ అండ్ నాయుడు క్యాంపస్ కరెంటు బిల్లు రూ. 90,96,753, ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్ విద్యుత్ బిల్లు రూ. 1,82,00,262 చెల్లించాల్సి ఉంది. ఈ వారంలో రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు విద్యుత్ సరఫరాను కట్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన క్యాంపస్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఈ విషయం బయటకు తెలియకుండా విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఇలా తరచుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యార్థులు విమర్శిస్తున్నారు.

ముగుస్తున్న ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్ లీజు...

చీమకుర్తి రోడ్డులో ఉన్న ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్ లీజు 2027 జనవరిలో ముగుస్తుంది. దీనికి నెలకు రూ. 40 లక్షలు అద్దె చెల్లించేలా అగ్రిమెంటు ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి వరకు అక్కడ క్యాంపస్ కొనసాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని చెబుతున్న అధికారులు, ఆ తరువాత మాత్రం ఏం జరుగుతుందో చెప్పలేమంటున్నారు. విద్యుత్ బిల్లులనే చెల్లించని ప్రభుత్వం, అద్దె మాత్రం ఎందుకు చెల్లిస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. లీజు ముగిసిన తరువాత ఎస్‌ఎస్‌ఎన్ క్యాంపస్‌ను కూడా తరలించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సోషల్ మీడియాతో వాస్తవాలను ప్రజలకు తెలియజేద్దాం

వైఎస్సార్‌సీపీ గ్లోబల్ కనెక్ట్ సమావేశంలో ఆలూరు సాంబశివారెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీపై అసత్య ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియాను అడ్డుకుంటూ.. సోషల్ మీడియా ద్వారా వాస్తవాలను ప్రజలకు తెలియజేద్దామని ఆ పార్టీ ఎన్నారై గ్లోబల్ వింగ్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆక్లాండ్(న్యూజిలాండ్)లోని మౌంట్ రోస్కిల్ వార్ మెమోరియల్ హాల్‌లో గ్లోబల్ కనెక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నారై సోషల్ మీడియా పోస్టింగ్‌లు.. ఇప్పుడు ప్రజలకు నిజం చెప్పే ఆయుధాలన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలు చెప్పడంతో పాటు.. వైఎస్ జగన్ అందించిన సుపరిపాలన, నాయకత్వాన్ని ప్రపంచానికి తెలియజేయాలని సూచించారు. నిజం మాట్లాడే గొంతులుగా, అభివృద్ధిని ప్రదర్శించే వేదికలుగా ఎన్నారైలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ యెద్దుల, బుజ్జి బాబు నెల్లూరి, సమంత్ డేగపూడి, విజయ్ అల్లా, బాల శౌర్య, రాజా రెడ్డి, గీతారెడ్డి, సంకీర్త్ రెడ్డి, రమేశ్ పానాటి, జిమ్మీ, బాలవేణు బీరం, కృష్ణారెడ్డి, జగదీశ్వరరెడ్డి, రఘునాథరెడ్డి, గోవర్ధన్ మల్లెల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రక్తహీనత బాధితుల సంఖ్య 1900

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1900 మంది హీమోఫీలియా (రక్తహీనత) బాధితులున్నారని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సోమవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 5 ఐసీహెచ్‌ఎస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేపడుతున్నట్టు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో 10.50 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేశామన్నారు.

అర్హత కలిగిన అందరికీ ఉపాధి కల్పించాలి

తిరుపతి కల్చరల్: దేశంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రౌషన్ కుమార్ సిన్హా డిమాండ్ చేశారు. తిరుపతిలో నాలుగు రోజుల పాటు జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడమే ప్రధాన డిమాండ్‌గా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రత్యేక జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో ఎన్నికల సంస్కరణల అవసరాన్ని పేర్కొంటూ త్వరలో ఐదు కోట్ల మంది సంతకాలతో కేంద్రానికి వినతి పత్రం పంపిస్తామన్నారు.

యువతకు మార్గదర్శి పుచ్చలపల్లి

- 40వ వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- నేటి నుంచి సీపీఎం సమైక్యతా యాత్రలు



చిత్రపటానికి పూలమాల వేసి అంజలిఘటిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: యువతకు ప్రత్యామ్నాయ ఆలోచనలు, స్ఫూర్తినివ్వడంలో కమ్యూనిస్టు దిగ్గజం, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. సీపీఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ సోమవారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదర్శనీయమైన రాజకీయాలకు సుందరయ్య స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఈనెల 20 నుంచి సమైక్యతా యాత్రలకు సీపీఎం పిలుపునిచ్చిందని ప్రకటించారు.

ఏపీ కేంద్రంగా ఆర్వీఎన్ఎల్ అనుబంధ కంపెనీ

- సబ్బవరం షీలానగర్ రోడ్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు
- రహదారులు, నిర్మాణ రంగ పనులు లక్ష్యం
- ఇప్పటికే రూ.555 కోట్లతో విశాఖ పోర్టు రహదారి నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్న ఆర్వీఎన్ఎల్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వరంగ రైల్ వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్వీఎన్ఎల్) రాష్ట్రంలో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసింది. పూర్తి 100 శాతం వాటాతో సబ్బవరం షీలానగర్ రోడ్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసినట్లు ఆర్వీఎన్ఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. మే 15న ఈ అనుబంధ కంపెనీ ఏర్పాటు చేశామని, దీని ద్వారా రహదారులు, నిర్మాణ రంగ కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. విశాఖపట్నం పోర్టును అనుసంధానం చేస్తూ ఆరు లైన్ల రహదారిని అభివృద్ధి చేసే ప్రాజెక్టును జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి ఆర్వీఎన్ఎల్ దక్కించుకుంది. ఈ రహదారి నిర్మాణానికై సబ్బవరం షీలానగర్ రోడ్ డెవలప్‌మెంట్ పేరుతో ఆర్వీఎన్ఎల్ కొత్త కంపెనీని నెలకొల్పింది. ఈ ప్రాజెక్టు కింద రూ.554.64 కోట్లతో 12.66 కి.మీ రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అనకాపల్లి–ఆనందపురం కారిడార్‌లో సబ్బవరం బైపాస్ నుంచి షీలానగర్ జంక్షన్ వరకు ఈ రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా అండర్‌పాస్‌లు, కల్వర్టర్లు, చిన్న చిన్న వంతెనలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంటుంది. రెండేళ్లలో నిర్మాణం పూర్తయ్యాక 15 ఏళ్లపాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రహదారుల నిర్మాణంలోకి ప్రవేశిస్తున్నట్లు ఆర్వీఎన్ఎల్ సీఎండీ ప్రదీప్ గౌర్ తెలిపారు.

EYE లవ్ యు & ప్లీజ్ టేక్ కేర్

చూసే ప్రక్రియలో ఏదైనా అడ్డంకి వచ్చినప్పుడు ఆ సమస్యలను వైద్యపరిభాషలో ‘విజువల్ డిస్టర్‌బెన్సెస్’ అంటారు. అంటే... చూపులో కలిగే అంతరాయాలని అర్థం. ఇవి చాలా కారణాలతో వస్తాయి. అనేక సమస్యల వల్ల ఇలా జరుగుతుంది. ఇందులో కొన్ని తాత్కాలికమైనవి. మరికొన్ని శాశ్వతంగా చూపును పోగొట్టేవి. అయితే తాత్కాలికమైనవే ఎక్కువ. కాకపోతే కొన్ని తాత్కాలికమైన వాటిని నిర్లక్ష్యం చేస్తే అది శాశ్వత అంధత్వానికి దారితీసే ముప్పు ఉంటుంది. కాబట్టి కొద్దిపాటి జాగ్రత్తలూ, చికిత్సలతో అంతా మామూలైపోయే ఈ అంతరాయాల గురించి తెలుసుకుందాం...

అన్ని అవయవాల్లోకీ చూపు వల్లనే దాదాపు 80% సమాచారం మనకు తెలుస్తుంది. అందుకే సర్వేంద్రియాణాం నయనం ప్రధానమనీ, కన్నుంటేనే కలికాలమనీ... ఇలాంటి ఎన్నో సామెతలూ, జాతీయాలూ, నుడికారాలూ ఉన్నాయి. అంతటి దృష్టిజ్ఞానానికి కలిగే అవరోధాలనూ, వాటిని పరిష్కరించుకునే మార్గాలను తెలుసుకోవడం అవసరం. ఆ అవరోధాలేమిటో, వాటిని అధిగమించే మార్గాలేమిటో చూద్దాం...



డాక్టర్ కె. రవికుమార్ రెడ్డి
సీనియర్ కంటి వైద్య నిపుణులు

దీర్ఘకాలిక ప్రమాదాలు తెచ్చిపెట్టే కారణాలు...

చూపునకు కలిగే కొన్ని రకాల సమస్యలు లేదా అంతరాయాలు క్రమంగా పెరుగుతూపోయి, వాటి కారణంగా దీర్ఘకాలికంగా ముప్పు కలిగించే అవకాశాలు ఎక్కువ. అందుకే వీటి విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండాలి. వాటిలో ముఖ్యమైనవి కొన్ని...

గ్లకోమా : కంటిలో ఉన్న ద్రవాలు కొంత ఒత్తిడిని కలగజేస్తుంటాయి. ఈ ఒత్తిడినే ‘ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్’ అంటారు. అయితే కొందరిలో ఈ ఒత్తిడి క్రమంగా పెరిగిపోతూ ఉండటం వల్ల వారికి కనిపించే దృష్టి వైశాల్యం (ఫీల్డ్ ఆఫ్ విజన్) క్రమంగా కుంచించుకుపోతూ / తగ్గిపోతూ ఉంటుంది. ఇలా క్రమంగా తగ్గిపోవడాన్ని / కుంచించుకుపోతూ ఉండటాన్ని ‘కన్‌స్ట్రిక్షన్ ఆఫ్ ఫీల్డ్’ అంటారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి చికిత్స తీసుకోకపోతే అతడి చూపు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇలా కంటిలోని ద్రవాల ఒత్తిడి పెరగడం వల్ల వచ్చే వ్యాధిని గ్లకోమా అంటారు.

లక్షణాలు : గ్లకోమా ఉన్నవారిలో చూసే వైశాల్యం (ఫీల్డ్) క్రమంగా కుదించుకుపోతుంది. ఇది ఒక్కోసారి క్రమంగా జరగవచ్చు లేదా కొందరిలో అకస్మాత్తుగానూ జరగవచ్చు. ఇక కంటిముందు నల్లమచ్చలాంటి వెలుగు, దగ్గరి వస్తువులను స్పష్టంగా చూడలేకపోవడం, లోతైన సొరంగంలోకి చూస్తున్న ఫీలింగ్ (టన్నెల్ విజన్) ఉండవచ్చు. ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్ అదుపులో ఉండేలా చికిత్స తీసుకోకపోతే ఈ లక్షణాలు క్రమంగా పెరుగుతూ పోయి చివరకు శాశ్వతంగా దృష్టి కోల్పోయే ముప్పు ఉంటుంది.

చికిత్స : గ్లకోమాకు చికిత్స మూడు విధాలుగా జరుగుతుంది. మొదటిది మందులతో ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్‌ను పెరగకుండా అదుపులో ఉంచడం. రెండోది లేజర్ చికిత్స. దీని తర్వాత కూడా ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్ అదుపులోకి రాకపోతే శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు.

రెటినల్ డిటాచ్‌మెంట్ : రెటీనాలోని లోపలి పొర, బయటి పొర... ఈ రెండింటి మధ్యలోకి కొన్ని ద్రవాలు రావడం వల్ల ఆ రెండు పొరలూ విడిపోవచ్చు. ఫలితంగా కొంతమేరకు గాని లేదా పూర్తిగా కాని దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

లక్షణాలు : కంటిముందు మెరుపులు, ఏవేవో కాంతిపుంజాలు తేలుతున్నట్లు అనిపించడం, చూసే వైశాల్యం (ఫీల్డ్) క్రమంగా తగ్గిపోతుండటం, కంటి ముందు ఏదో పరదా వేలాడుతున్నట్లుగా అనిపించడం, చివరగా పూర్తిగా చూపు కోల్పోవడం జరగవచ్చు.

చికిత్స : పై సమస్యలు కనిపించినప్పుడు వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించాలి. అప్పుడు డాక్టర్లు అత్యవసర శస్త్రచికిత్స చేసి, విడిపోయిన రెండు రెటీనా పొరలను కలుపుతారు.

హైపర్‌టెన్సివ్ రెటినోపతి : మన దేహంలోని అన్ని అవయవాలతో పాటు కంటికీ నిత్యం రక్తప్రసరణ జరుగుతుందన్న విషయం తెలిసిందే. అయితే రక్తపోటు ఉన్నవారిలో రక్తనాళాలపై కలిగే ఒత్తిడి తీవ్రంగా పెరిగినప్పుడు అత్యంత సన్నటి రక్తకేశనాళికలు (క్యాపిల్లరీస్) ఆ ఒత్తిడికి చిట్లిపోయే ప్రమాదం ఉంది. ఫలితంగా చూపు కోల్పోయే ముప్పు ఉంటుంది.

లక్షణాలు : చూపు మసకబారడం, ఒకవైపు సక్రమంగా కనిపించకపోవడం లేదా చూసే ఏరియా (వైశాల్యం) తగ్గడం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

చికిత్స : ఈ సమస్య వల్ల చూపు కోల్పోకుండా ఉండేందుకు రక్తపోటును అదుపులో ఉంచుకోవడమే మంచి నివారణ చర్య. ఇలాంటి సమస్య ఉన్న కొందరిలో లేజర్ లేదా శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.

అంతరాయాలను గుర్తించే లక్షణాలు

చూపునకు కలిగే అంతరాయాలు (దృష్టి దోషాలు) తాత్కాలికమైనవా లేదా దీర్ఘకాలికమైనవా అనేది కొన్ని సాధారణ లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. ఆ లక్షణాలు ఎలా వ్యక్తమవుతాయంటే... ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డిప్లోపియా), ఒకే వస్తువు అనేక వస్తువులుగా కనిపించడం (పాలియోపియా), మనం చూసే వస్తువు మసగ్గా కనిపించడం (బ్లర్రింగ్ ఆఫ్ విజన్), కళ్ల ముందు నల్లటి చుక్కలు లేదా మెరుపు తీగలు తేలిపోతున్నట్టు కనిపించడం (ఫ్లాషెస్ అండ్ ఫ్లోటర్స్), మనకు కనిపించే దృశ్యం మధ్యలో నల్లమచ్చ కనిపించడం లేదా కొంత భాగం అదృశ్యమైనట్టు కనపడకుండా పోవడం జరగవచ్చు. దీన్ని వైద్యపరిభాషలో ‘స్కోటోమాస్’ అంటారు.

ఫీల్డ్ డిఫెక్ట్స్ : మనం చూసే ప్రాంతపు వైశాల్యమంతటా అంతా ఒకేలా కనిపించకపోవచ్చు. ఇలాంటి సమస్యలను ఫీల్డ్ డిఫెక్ట్స్ అంటారు. ఉదాహరణకు...

హెమీ అనోపియా...
దృశ్యంలో సగభాగం స్పష్టంగా ఉండి, మరో సగభాగం స్పష్టంగా లేకపోవడం.

- **క్వాడ్రాంటనోపియా :** మనం చూసే ప్రాంతంలో పావు భాగం స్పష్టంగా లేకపోవడం.
- **కన్‌స్ట్రిక్షన్ :** మనం చూసే దృశ్య వైశాల్యం రానురాను క్రమంగా తగ్గిపోవడం.
- **టన్నెల్ విజన్ :** కన్‌స్ట్రిక్షన్ సమస్య వచ్చాక ఒక సొరంగంలోంచి లేదా ట్యూబ్‌లోంచి ఎదుటి వస్తువును చూస్తున్నట్లు ఉండటాన్ని ‘టన్నెల్ విజన్’ అంటారు.
- **కలర్డ్ హ్యాలోస్ :** టన్నెల్ విజన్ కాకుండా ఒకవేళ రంగురంగుల వలయాలు ఉన్నట్లు భ్రమ కలగడమే ‘కలర్డ్ హ్యాలోస్’.
- **లాస్ ఆఫ్ కలర్ విజన్ :** ఒకవేళ కొందరిలో ఎదుటనున్న దృశ్యం రంగుల్లో గాక నలుపు-తెలుపుల్లో కనిపించడాన్ని ‘లాస్ ఆఫ్ కలర్ విజన్’గా చెబుతారు. పైన పేర్కొన్న ఈ లోపాలన్నీ రకరకాల తాత్కాలిక, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల మనకు కనిపించే లక్షణాలుగా చెప్పవచ్చు.

తాత్కాలిక అంతరాయాలను కలిగించే కొన్ని కంటి సమస్యలు

మైగ్రేన్ : ఇది తీవ్రమైన తలనొప్పితో తాత్కాలికంగా కంటి చూపు కనిపించకుండా చేసే సమస్య. యువతలోనే ఎక్కువ. ఒకవైపు కంటిలోగాని లేదా తలలో ఒక పక్క గాని వచ్చే నొప్పి ఇది. అందుకే మామూలు వ్యక్తులు దీన్ని పార్శ్వపు నొప్పి అంటారు. ఈ నొప్పి వస్తున్నప్పుడు వికారంగా ఉండటం లేదా కొందరిలో వాంతులు కావడం జరుగుతుంది. కొందరిలో వాంతి తర్వాత పరిస్థితి చక్కబడుతుంది. మరికొందరిలో ఏదో కాంతి ఆవరించినట్లుగా కనిపిస్తుంటుంది. దీన్నే ‘విజువల్ ఆరా’ అంటారు. మరికొందరిలో ‘స్కోటోమాస్’ రూపంలో కనిపించవచ్చు. అంటే ఎదురుగా కనిపించే దృశ్యం మధ్యలో నల్ల మచ్చ కనిపించడం లేదా కొంత భాగం అదృశ్యమైనట్టు కనపడకుండా పోవడం. ఇక మరి కొందరిలో కళ్ల ముందు మిరిమిట్లు గొలిపే వెలుగు దివ్వెలు, మెరుపులూ కనిపించవచ్చు.

చికిత్స : నొప్పిని తక్షణం తగ్గించే మందులతో పాటు... భవిష్యత్తులో ఈ తరహా తలనొప్పి రాకుండా నివారించే మందులు... ఇలా రెండు రకాల మందులను ఏడాది నుంచి రెండేళ్ల పాటు వాడాలి.

క్యాటరాక్ట్ (తెల్ల ముత్యం): వయసు పెరుగుతున్న కొద్దీ కంటిలో ఉండే లెన్స్ తన పారదర్శకతను కోల్పోతుంది. ఫలితంగా దృష్టి మసకబారడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, చూపు సన్నగిల్లడం, రాత్రివేళ చూడటం కష్టమైపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్స : అత్యంత సాధారణమైన శస్త్రచికిత్స ద్వారా కంటిలోని లెన్స్‌ను మార్చి మరో పారదర్శకమైన లెన్స్ అమర్చడం వల్ల మళ్లీ మామూలుగానే చూడటం సాధ్యపడుతుంది.

డయాబెటిక్ రెటినోపతి : డయాబెటిస్ ఉన్నవారిలో కంటికి రక్తాన్ని అందించే అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమైన రక్తనాళాల్లోని లోపలి పొర ఎండోథీయమ్ కణాలు మృతిచెందడం వల్ల రెటీనాకు ఆక్సిజన్, పోషకాలు సరిగా అందవు. దాంతో రెటీనా దెబ్బతినే అవకాశాలెక్కువ. ఇది చూపు కోల్పోయే పరిస్థితిని తెచ్చిపెట్టవచ్చు.


లక్షణాలు : చిన్న అక్షరాలు చదవడం కష్టం కావచ్చు. క్రమంగా లేదా అకస్మాత్తుగా చూపు తగ్గవచ్చు. కళ్ల ముందు ఏవో కాంతిపుంజాలు తేలుతున్నట్లు (ఫ్లోటర్స్) కనిపించవచ్చు.

చికిత్స : తక్షణ లేజర్ చికిత్సతోగానీ లేదా కంటిలో ఇచ్చే ఇంజెక్షన్లతో గాని లేదా శస్త్రచికిత్స ప్రక్రియల ద్వారాగాని చూపు మరింత దిగజారకుండా ఆపే అవకాశాలుంటాయి. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు క్రమం తప్పకుండా తమ కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

ఏఆర్ఎమ్‌డీ : ఇది వయసుతో పాటు వచ్చే కంటి సమస్య. ‘ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్’ అనే ఇంగ్లిష్ పదాల సంక్షిప్త రూపమే ఈ ‘ఏఆర్ఎమ్‌డీ’. కంటి రెటీనాలోని ‘మాక్యులా’ అని పిలిచే మధ్యభాగం తీవ్రంగా ప్రభావితమైపోవడంతో ఈ సమస్య వస్తుంది.

లక్షణాలు : ఈ సమస్య ఉన్నవారిలో ‘స్కోటోమాస్’ రావచ్చు. ఇక వస్తువు - రూపం ఉన్నది ఉన్నట్లు గాక తీవ్రంగా మారి (డిస్టార్షన్) కనిపించవచ్చు. ఉన్న వస్తువు కంటే కనిపించేది చిన్నదిగా ఉంటే దాన్ని ‘మైక్రోప్సియా’ అంటారు. ఉన్న వస్తువు పరిమాణం కంటే కనిపించేది పెద్దదిగా ఉంటే దాన్ని ‘మ్యాక్రోప్సియా’ అంటారు. వస్తువు రూపం పూర్తిగా మారిపోతే దాన్ని ‘మెటామార్ఫోప్సియా’ అంటారు.

చికిత్స : ఈ సమస్య ఉన్నవారికి కంటి డాక్టర్లు లేజర్ చికిత్స ద్వారాగానీ లేదా కంటిలోని విట్రియల్ ఛేంబర్ అనే ప్రాంతంలో ఇంజెక్షన్స్ ఇవ్వడం వల్లగానీ లేదా శస్త్రచికిత్సతో గాని సమస్యను మరింతగా పెరగకుండా నిలువరించేందుకు అవకాశాలెక్కువ.



చూపు అంతరాయాల్లో తాత్కాలికం... దీర్ఘకాలికం...
వివిధ వ్యాధులు, రుగ్మతలు చూపునకు అంతరాయం కలిగించవచ్చు. అయితే అందులో కొన్ని తాత్కాలికమైనవి. చికిత్స తీసుకుంటే నయమై చూపు మామూలుగా వచ్చేస్తుంది. అయితే కొన్ని అవరోధాలు మాత్రం కాస్తంత దీర్ఘకాలిక చికిత్స అవసరమైనవి. ఆ తాత్కాలిక, దీర్ఘకాలిక అంతరాయాలేమిటంటే...

తాత్కాలిక
- మైగ్రేన్
- రిఫ్రాక్టివ్ ఎర్రర్స్
- కాటరాక్ట్
- ఆప్టిక్ నర్వ్ డిసీజ్
- ప్రమాదాలలో కంటికి అయ్యే గాయాలు
- రేచీకటి (నైట్ బ్లైండ్‌నెస్)
- మందుల వల్ల వచ్చే చూపు సమస్యలు
- పక్షవాతం తర్వాత కలిగే చూపు సమస్యలు
- మెదడులో వచ్చే గడ్డలు

దీర్ఘకాలిక
- గ్లకోమా
- రెటినల్ డిటాచ్‌మెంట్
- డయాబెటిక్ రెటినోపతి
- హైపర్‌టెన్సివ్ రెటినోపతి
- ఏ.ఆర్.ఎమ్.డి.
- థైరాయిడ్ ఐ డిసీజ్
- కెరటోకోనస్
- రెటినైటిస్ పిగ్మెంటోజా

థైరాయిడ్ ఐ డిసీజ్ : హైపోథైరాయిడిజమ్ లేదా హైపర్ థైరాయిడిజమ్ వ్యాధులు ఉన్న బాధితుల్లో కనిపించే సమస్య ఇది.

లక్షణాలు : ఈ సమస్య ఉన్న కొందరిలో కనుగుడ్లు ముందుకు పొడుచుకు వచ్చినట్లుగా కనిపిస్తుంటాయి. దీన్నే ‘ప్రోప్టోసిస్’ అంటారు. కొందరిలో కన్ను పొడిబారవచ్చు. ఒకే వస్తువు రెండుగా కనిపించవచ్చు. వస్తువుల రంగులు స్పష్టంగా లేకపోవచ్చు. కంటిలో నొప్పి కూడా ఉండవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తూ ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్ పెరగడం వల్ల బాధితుల్లో గ్లకోమా కూడా రావచ్చు.

చికిత్స : థైరాయిడ్ హార్మోన్ల సమతౌలత్య కోసం హార్మోన్ చికిత్స ఇవ్వాలి. ఇక కొందరిలో ‘ఆర్బిటాల్ డీకంప్రెషన్’ అనే శస్త్రచికిత్స అవసరం కావచ్చు. ఇటీవల మోనోక్లోనల్ యాంటీబాడీస్ అనే మందులు అందుబాటులోకి వచ్చాయి. వాటితో ప్రోప్టోసిస్‌ను నయం చేయవచ్చు.

ట్రామా (గాయాలు): కంటికి దెబ్బతగిలినప్పుడు తక్షణం కనిపించే లక్షణాలు, ఆ తర్వాత కనిపించే లక్షణాలు వేర్వేరుగా ఉండవచ్చు. చూపు మసకబారవచ్చు. కంటి ముందు మెరుపులు కనిపించడం, వెలుగు రేకలు తేలుతున్నట్లు ఉండటం, కంటిలోని ద్రవం (విట్రియల్) బయటకు రావడం, దీర్ఘకాలంలో గ్లకోమా, రెటీనా పొరలు విడిపోవడం, కంటి నరం దెబ్బతినడం వంటి ప్రమాదాలు జరగవచ్చు.

చికిత్స : కంటికి ఏదైనా దెబ్బ తగిలినప్పుడు (ట్రామా కేసుల్లో) అత్యవసరంగా తగిన చికిత్స చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం తక్కువ. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా దీర్ఘకాలం పాటు ఫాలో అప్‌లో ఉండాలి.

పొగతాగడం వల్ల: దీని వల్ల వచ్చే తాత్కాలిక అంధత్వం (టొబాకో ఆంబ్లోపియా) అన్నది ఆ అలవాటును మానివేయడం వల్ల తగ్గిపోతుంది.

రే-చీకటి (నైట్ బ్లైండ్‌నెస్): ఇది ఆహారంలో విటమిన్-ఏ మోతాదులు తగ్గడం వల్ల కలిగే కంటి సమస్య. మరికొందరిలో ఇది రెటీనాకు వచ్చే ఆరోగ్య సమస్యలు అంటే... రెటినైటిస్ పిగ్మెంటోజా వంటి వాటి వల్ల రావచ్చు. కొందరిలో హై మయోపియా (తీవ్రమైన దగ్గరి దృష్టి... అంటే చాలా దగ్గర్నుంచి చూస్తేగానీ స్పష్టంగా కనిపించకపోవడం) వల్ల లేదా గ్లకోమా వల్లగానీ ఈ సమస్య రావచ్చు.

లక్షణాలు : ఈ సమస్య వచ్చినవారిలో రాత్రిపూట సరిగా కనిపించకపోవచ్చు. ఇక విటమిన్-ఏ లోపం తీవ్రంగా ఉన్నవారిలో కార్నియా కరిగిపోయే పరిస్థితి వస్తుంది. వైద్యపరిభాషలో దీన్నే ‘కెరటోమలేసియా’ అంటారు. ఇది పిల్లల్లో ఎక్కువ. దీన్ని అత్యవసరమైన పరిస్థితిగా గుర్తించి చికిత్స అందించాలి.

చికిత్స : ఆహారంలో తగినంత విటమిన్ ఏ ఉన్న పదార్థాలు ఇవ్వడం, విటమిన్-ఏ మాత్రలు వాడటం, ముందస్తు నివారణగా (ప్రొఫిలాక్టిక్ చికిత్సగా) విటమిన్-ఏ ఇస్తారు.

రెటినైటిస్ పిగ్మెంటోజా: వంశపారంపర్యంగా కనిపించే వ్యాధి. దీనికి పూర్తిస్థాయి చికిత్స ఇప్పట్లో అందుబాటులో లేదు. రెటీనా డాక్టర్లు కొంతవరకు చికిత్స అందజేస్తారు.

డ్రగ్స్ : కార్టికోస్టిరాయిడ్స్, కీళ్లనొప్పుల కోసం దీర్ఘకాలం పాటు వాడే కొన్ని రకాల మందులు, క్షయవ్యాధికి వాడే కొన్ని మందుల వల్ల స్కోటోమాస్ వచ్చి క్రమంగా చూపు తగ్గుతూ పోవచ్చు. ఒక్కోసారి ఇది శాశ్వత అంధత్వానికి దారితీసే ముప్పు ఉంటుంది. అందుకే చూపు తగ్గుతున్నట్లు గ్రహించగానే డాక్టర్‌ను సంప్రదించి, వాడుతున్న మందులను వివరించి, తగిన చికిత్స తీసుకోవాలి. దాంతో కోల్పోయిన చూపు తిరిగి వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ.

పక్షవాతం (స్ట్రోక్): పక్షవాతం వచ్చినవారిలో మెదడులోని కొన్ని భాగాలకు రక్తసరఫరా తగ్గడం వల్ల ఆ భాగాలు చచ్చుబడిపోతాయి. మెదడులో చూపునకు సంబంధించిన ప్రాంతానికి రక్తప్రసరణ తగ్గితే తాత్కాలికంగా చూపునకు అంతరాయం కలగవచ్చు. మామూలుగానైతే ఇది తాత్కాలిక సమస్య. అయితే అతి కొద్ది సందర్భాల్లో మాత్రం ఇది శాశ్వత అంధత్వానికీ దారితీయవచ్చు.

చికిత్స : ఇందులో నివారణే చికిత్సతో సమానం. డయాబెటిస్‌ను, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం వల్ల ఈ ముప్పును తప్పించుకోవచ్చు.

బ్రెయిన్ ట్యూమర్స్ : మెదడులో వచ్చే గడ్డలు... చూపును మెదడుకు చేరవేసే ‘ఆప్టిక్ నర్వ్’ను నొక్కివేయడం వల్ల గానీ లేదా కంటికీ, నరానికీ రక్తప్రసరణనిచ్చే రక్తనాళాన్ని నొక్కివేయడం వల్ల గానీ అంతరాయం కలగవచ్చు. దాంతో ఒక్కోసారి పాక్షిక అంధత్వం రావచ్చు. లేదా మొత్తం దృశ్యం కాకుండా సగమే కనిపించవచ్చు. ఇలాంటప్పుడు తగిన నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, ఒకవేళ గడ్డలుంటే శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగింపజేసుకోవాలి. అప్పుడు చూపు చాలావరకు మళ్లీ రావచ్చు.

కెరటోకోనస్ వ్యాధి : సాధారణంగా గమనించి చూస్తే మన కంటి నల్ల గుడ్డు ప్రాంతం ఒకింత ఉబ్బెత్తుగా కనిపిస్తూ గుండ్రం (స్ఫెరికల్)గా ఉంటుంది. కానీ కెరటోకోనస్ అనే కండిషన్ ఉన్నవారిలో ఈ ఉబ్బెత్తుగా ఉండేభాగం కోణం (కోన్) ఆకృతిని సంతరించుకుంటుంది. ఈ కండిషన్‌నే ‘కెరటోకోనస్’ అంటారు.

లక్షణాలు : ఈ కండిషన్ ఉన్నవారు సౌకర్యంగా చూడలేరు. అంతా మసగ్గా కనిపిస్తుంటుంది. కొన్నిసార్లు తాము చూసే దృశ్యం కదిలిపోతున్నట్లు, వణుకుతున్నట్లుగా కనిపిస్తుంటుంది.

చికిత్స : కాంటాక్ట్‌లెన్స్‌లతో చికిత్స చేయవచ్చు. ‘కొలాజెన్ క్రాస్ లింకింగ్’ ప్రక్రియ అవసరపడవచ్చు. ‘కెరటోప్లాస్టీ’ అనే చికిత్స చేయాల్సి రావచ్చు.

రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ (దృష్టిలోపాలు) : సరైన అద్దాలు వాడటం ద్వారా తరహా కంటి సమస్యలను అధిగమించవచ్చు. వీటినే రిఫ్రాక్టివ్ లోపాలు అంటారు. కొందరికి చాలా దగ్గరి నుంచి చూస్తేగాని వస్తువులు స్పష్టంగా కనిపించవు. దీన్నే ‘మయోపియా’ లేదా ‘నియర్‌సైటెడ్‌నెస్’ అంటారు. ఇక కొందరు ఆ వస్తువులను మరింత దూరంగా ఉంటే తప్ప స్పష్టంగా చూడలేరు. ఈ కండిషన్‌ను ‘హైపరోపియా’ లేదా ‘ఫార్‌సైటెడ్‌నెస్’ అంటారు. ఇక కొందరిలో గ్రాఫ్‌లో ఉన్న అడ్డు, నిలువు రేఖలు ఒకే సారి కనిపించవు. ఈ సమస్యను ‘ఆస్టిగ్మాటిజమ్’ అంటారు.

సరిదిద్దడమిలా : ఈ రిఫ్రాక్టివ్ ఎర్రర్స్‌ను తగిన అద్దాలను ఉపయోగించి సరిచేయవచ్చు. కేవలం ఈ అద్దాలతోనే వాళ్ల దృష్టి దోషాలు తొలగిపోతాయి. కాబట్టి దీని గురించి అంతగా ఆందోళన అవసరం లేదు. అలాగని చికిత్స తీసుకోకుండా ఉన్నా, తగిన అద్దాలు వాడకపోయినా సమస్య మరింత తీవ్రం కావచ్చు.

మెల్లకన్ను : ఇంగ్లిష్‌లో ‘స్క్వింట్’ అనే ఈ కండిషన్‌ను చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. ఈ కండిషన్‌లో కుడి, ఎడమ కనుగుడ్లలో ఏదో ఒకటి లోపలి వైపునకో, బయటికో చూస్తుంటుంది. సాధారణంగా మెల్లకన్ను ఉన్నవారికి ఒకే వస్తువు రెండుగా కనిపించడం, మసకగా కనిపించడం, తలనొప్పి, వాంతులు ఉండవచ్చు. మరికొందరిలో ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. కొందరు దీన్ని అదృష్టంగా కూడా పరిగణిస్తుంటారు. కానీ దీర్ఘకాలంలో చూపు పూర్తిగా పోయే ముప్పు కూడా ఉంటుంది.

చికిత్స : మెల్లకన్నుకు వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలి.

ఇవే కాకుండా... డబుల్ విజన్, ఫ్లాషెస్, స్కోటోమాస్, హాఫ్ ఫీల్డ్ లాస్, ప్రాప్టోసిస్, రంగుల వలయాల వంటివి కనిపిస్తే వీలైనంత త్వరగా కంటి వైద్య నిపుణులను సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాల్సిందే. లేకపోతే చూపు తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని గుర్తుంచుకోవాలి.

బిజినెస్ రీల్

మెహుల్ చోక్సీకి సెబీ రూ. 2 కోట్ల డిమాండ్ నోటీసు



న్యూఢిల్లీ: పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రూ. 2.1 కోట్లకు డిమాండ్ నోటీసు జారీ చేసింది. 15 రోజుల్లోగా చెల్లించకపోతే అసెట్స్‌తో పాటు బ్యాంకు ఖాతాలు కూడా అటాచ్ అవుతాయంటూ హెచ్చరించింది. గీతాంజలి జెమ్స్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించిన ఆరోపణల మీద 2022 జనవరిలో విధించిన జరిమానాను చోక్సీ చెల్లించకపోవడంతో ఈ నోటీసు జారీ అయింది. గీతాంజలి జెమ్స్ సీఎండీ అయిన చోక్సీ, ఆయన మేనల్లుడు నీరవ్ మోదీ .. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. 14,000 కోట్లు మోసం చేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2018లో వారు దేశం నుంచి పరారయ్యారు. 2019లో బ్రిటన్‌లో అరెస్టయిన మోదీ ప్రస్తుతం అక్కడి జైల్లో ఉండగా, చోక్సీ బెల్జియంలో అరెస్టయ్యారు.

ఏఐఎఫ్‌లో పెట్టుబడుల నిబంధనలు సరళతరం



ముంబై: ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో (ఏఐఎఫ్) బ్యాంకులు, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేసేలా రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదనలు చేసింది. వీటి ప్రకారం రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలో ఉండే సంస్థ (ఆర్ఈ) ఏదైనా ఒక ఏఐఎఫ్ స్కీము మొత్తం నిధి పరిమాణంలో పది శాతం వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇందులో 5 శాతం వరకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. అది దాటితే, నిర్దిష్ట అంశాలకు లోబడి 100 శాతం ప్రొవిజనింగ్ చేయాల్సి ఉంటుంది. వ్యూహాత్మక అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఏఐఎఫ్‌లలో పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వంతో సంప్రదింపుల మేరకు ఈ నిబంధన నుంచి మినహాయింపు లభించవచ్చు. ఇక ఏదైనా ఒక ఏఐఎఫ్ స్కీములో మొత్తం ఆర్ఈల పెట్టుబడులకు 15 శాతం పరిమితి వర్తిస్తుంది. ఈ ప్రతిపాదనలపై జూన్ 8 వరకు సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు తెలియజేయొచ్చు. ఏఐఎఫ్‌లలో ఆర్ఈల పెట్టుబడులకు 2023 డిసెంబర్‌లో ఆర్‌బీఐ నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని పాటించడంలో ఆర్ఈలు ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరిస్తున్న నేపథ్యంలో తాజా మార్పులను ప్రతిపాదించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-5-2025

విశాఖ	545-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	363.8	3.82
TATACONSUM	1,170.00	1.99
BAJAJ-AUTO	8,491.00	1.98
ADANIENT	2,551.00	1.23
HINDUNILVR	2,380.00	1.05

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,814.40	-2.83
HCLTECH	1,661.00	-2.06
INFY	1,589.40	-1.46
JSWSTEEL	1,024.30	-1.35
SHRIRAMFIN	666.3	-1.26

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,630
ఎన్ఎస్ఈ	1,16,116
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,58,343
ఎఫ్ఐఐ	- 526
డీఐఐ	- 238

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.90	$	61.97
బ్రెంట్	65.27	$	65.41

ఎస్‌బీఐ లాభాలకు యోనో దన్ను

- దీన్ని మరింతగా విస్తరించాలి
- మార్కెటింగ్ గురు రాజేంద్ర శ్రీవాస్తవ విశ్లేషణ

డిజిటల్ విభాగం చిన్నదే అయినా భారీగా ప్రయోజనం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీ లాభాలకు డిజిటల్ విభాగం గణనీయంగా తోడ్పాటు అందిస్తోంది. ఈ విభాగం చిన్నదే అయినప్పటికీ భారీగా ప్రయోజనాలను చేకూర్చుతోందని మార్కెటింగ్ గురు, దేశీ ఫిలిప్ కోట్లర్‌గా పేరొందిన రాజేంద్ర శ్రీవాస్తవ విశ్లేషించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రూ. 70,901 కోట్ల లాభం ప్రకటించింది. నికరలాభంపరంగా గ్లోబల్ టాప్ 100 కంపెనీల్లో మన దేశం నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీల సరసన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా నిల్చింది. ఎస్‌బీఐ ఈ ఘనత సాధించడంలో, 2017లో బ్యాంక్ ఆవిష్కరించిన డిజిటల్ ప్లాట్‌ఫాం 'యూ ఓన్లీ నీడ్ వన్' (యోనో) యాప్ కూడా కీలక పాత్ర పోషించిందని శ్రీవాస్తవ తెలిపారు. కానీ దీన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకునే యూజర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. అందరికీ ఆర్థిక సేవలు అందించేందుకు లక్షల మంది ఉద్యోగులు, వేల సంఖ్యలో బ్రాంచీలను ఉపయోగించడం కన్నా డిజిటల్ విభాగాన్ని ఇంకా సమర్థవంతంగా వినియోగించుకోవడంపై దృష్టి పెడితే మరింత ప్రయోజనం లభించగలదని తెలిపారు. 'ఎస్‌బీఐలో దాదాపు 50 కోట్ల ఖాతాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా ఇంత మందికి సేవలందిస్తున్న అగ్రగామి బ్యాంకు. కానీ ఈ ఖాతాదారుల్లో 7.4 కోట్ల మంది మాత్రమే (సుమారు 14 శాతం మంది) యోనో యూజర్లు ఉన్నారు. ఈ చిన్న విభాగమే ఎస్‌బీఐ లాభాలకు దన్నుగా నిలుస్తోంది. తక్కువ మార్జిన్, అధిక సర్వీస్ వ్యయాలు ఉండే ఖాతాలు 37 కోట్ల పైగా ఉంటున్నాయి. అందరికీ ఆర్థిక సేవలు అందించాలన్న నినాదం కింద ప్రారంభించిన చాలా మటుకు ఖాతాల్లో బ్యాలెన్సులు తక్కువగా ఉంటున్నాయి. లేదా వినియోగంలోనే ఉండటం లేదు. వీటి వల్ల నిర్వహణ వ్యయాల భారం అధికంగా ఉంటోంది' అని శ్రీవాస్తవ వివరించారు.

యోనోకు మరింత ప్రాధాన్యమివ్వాలి ..

రికార్డు లాభాలు అర్జిస్తున్నప్పటికీ ఎస్‌బీఐ పీబీ నిష్పత్తి (ప్రైస్–టు–బుక్) ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే తక్కువగా 1.4 స్థాయిలో ఉందని శ్రీవాస్తవ చెప్పారు. అదే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (2.8), ఐసీఐసీఐ బ్యాంకుల (3.3) మార్కెట్ వేల్యుయేషన్ అధిక స్థాయిలో ఉంటోందని వివరించారు. ఇవి డిజిటల్ మాధ్యమాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, కార్యకలాపాల వ్యయాల భారాన్ని తక్కువ స్థాయికి పరిమితం చేసుకోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఆర్థిక పనితీరు కన్నా, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోలేకపోవడం వల్లే దేశీ మార్కెట్లో పోటీ సంస్థలతో పోలిస్తే ఎస్‌బీఐ పీబీ నిష్పత్తి డిస్కౌంట్లో ఉంటోందని శ్రీవాస్తవ విశ్లేషించారు. ఈ నేపథ్యంలో యోనోను సమర్థంగా వినియోగించుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం ఆధార్, యూపీఐ, ఇంటర్నెట్ కనెక్టివిటీ, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీలాంటి డిజిటల్ మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడి, గ్రామీణ ప్రాంతాల వారు కూడా మొబైల్ ఫోన్స్ ద్వారా లావాదేవీలు జరుపుతున్న పరిస్థితుల్లో భౌతిక శాఖల విషయంలో బ్యాంకు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఫిన్‌టెక్ విప్లవానికి స్పందనగా 2017లో ప్రారంభించిన యోనో ఇప్పుడు ఎస్‌బీఐ వృద్ధి వ్యూహానికి మూలస్తంభంగా మారింది. ప్రైవేట్ దిగ్గజాలు, ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు దీటుగా 7.4 కోట్ల మంది రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూ. 3.2 లక్షల కోట్ల రుణాల వితరణకు ఈ ప్లాట్‌ఫాం ఉపయోగపడింది. రోజువారీగా యోనోలో లాగిన్స్ 1 కోటి పైగా ఉంటాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ సేవింగ్స్ అకౌంట్లకు సంబంధించి 65 శాతం లావాదేవీలు దీని ద్వారానే జరుగుతున్నాయి. యోనో కేవలం బ్యాంకింగ్‌కే పరిమితం కాకుండా వివిధ సర్వీసులు అందిస్తోంది. దీని ద్వారా ఖాతాలు తెరవొచ్చు, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు, బీమా పాలసీలు కొనుగోలు చేయొచ్చు, ఆన్‌లైన్ షాపింగ్ చేయొచ్చు, రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు, ప్రభుత్వ సర్వీసులను కూడా పొందవచ్చు.
- వ్యయ–ఆదాయ నిష్పత్తి, కస్టమర్లను దక్కించుకునేందుకు చేసే వ్యయాలు, అసెట్స్‌పై రాబడులు తదితర అంశాల విషయంలో డిజిటల్ బ్యాంకులు ఎన్నో ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న బ్యాంకులకు మించి నిలకడగా రాణిస్తున్నాయి. భారత్‌లో పేటీఎం, ఫోన్‌పే, జీరోధాలాంటి ఫిన్‌టెక్ సంస్థలు ఒక్కసారిగా ఎగిశాయి. వాటికి భిన్నంగా ఎస్‌బీఐకి భారీ స్థాయి, విశ్వసనీయత, రెగ్యులేటరీ సంస్థ నుంచి మద్దతులాంటి సానుకూలాంశాలు ఉన్నాయి. ఆర్థిక సమ్మిళితత్వానికే కాకుండా పోటీపడి, రాణించేందుకు కూడా వీటిని బ్యాంకు ఉపయోగించుకోవాలి.
- శాఖల నెట్‌వర్క్, ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేయకుండానే మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను రెట్టింపు చేసుకునే సామర్థ్యం ఎస్‌బీఐకి ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఖాతాదారులకు యాప్‌ను మరింత చేరువ చేసి, యోనో యూజర్లను పెంచుకోవాలి.
- కాస్తంత పెట్టుబడులు పెడితే, కస్టమర్లను డిజిటల్ యూజర్లుగా మార్చుకోవచ్చు. తద్వారా సేవల వ్యయాలను తగ్గించుకోవచ్చు. పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని శాఖలు, ఏటీఎంలువంటి ఆర్‌వోఐ (పెట్టుబడిపై రాబడి) తక్కువ స్థాయిలో ఉండే భౌతిక మౌలిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని దశలవారీగా తగ్గించుకోవావాలి. అలాగే, నిద్రాణ స్థితిలో ఉన్న ఖాతాలు, లేదా లో–బ్యాలెన్స్ ఖాతాలకు సంబంధించి నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవాలి. యోనో ద్వారా మరిన్ని ఉత్పత్తులను విక్రయించవచ్చు. యోనోను అనుబంధ సాధనంగా కాకుండా కస్టమర్లకు చేరువయ్యేందుకు, ఆదాయాన్ని పెంచుకునేందుకు కీలక చోదకంగా పరిగణించాలి.

సుప్రీం కోర్టులో వొడాఫోన్ పిటీషన్ డిస్మిస్



న్యూఢిల్లీ: ఏజీఆర్ (సవరించిన స్థూల ఆదాయం) బాకీల నుంచి మినహాయింపు కోరుతూ వొడాఫోన్, ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ దాఖలు చేసిన పిటీషన్లను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఒక బహుళ జాతి కంపెనీ ఇలాంటి పిటీషన్ వేయడం తమను షాక్‌కి గురి చేసిందని వ్యాఖ్యానించింది. ఒకవేళ ప్రభుత్వం తనంతట తాను ఏదైనా సహాయం చేయదల్చుకుంటే న్యాయస్థానం జోక్యం చేసుకోబోదని తెలిపింది. వివరాల్లోకి వెళ్తే.. టెలికం సంస్థలు లైసెన్సింగ్, స్పెక్ట్రం వినియోగ ఫీజుల కింద నిర్దిష్ట మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం టెలికం సేవలతో పాటు టెల్కోలకు వచ్చే ఇతరత్రా వనరుల నుంచి కూడా వచ్చే ఆదాయాన్ని వాటి మొత్తం ఆదాయంగా (ఏజీఆర్) నిర్వచిస్తూ, దాని ప్రాతిపదికగా చెల్లింపులు జరపాలంటూ ప్రభుత్వం, న్యాయస్థానం గతంలో సూచించడం వివాదానికి దారి తీసింది. ఏజీఆర్‌పరమైన బకాయిలను తప్పుగా లెక్కించడం వల్ల తమపై ఆర్థిక భారం గణనీయంగా పెరిగిపోతుందని, దీన్ని మినహాయించాలని లేదా పునఃసమీక్షించాలని న్యాయస్థానాన్ని టెల్కోలు ఆశ్రయించాయి. రూ. 30,000 కోట్ల బాకీల నుంచి మినహాయింపునివ్వాలంటూ వొడాఫోన్ కోరింది. గత ఉత్తర్వుల కారణంగా ప్రభుత్వం సహాయం చేయలేకపోతోందన్న పిటీషనర్ వాదనలను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. జూలై వరకు వాయిదా వేయాలని లేదా ఉపసంహరించుకునేందుకు అనుమతించాలన్న అభ్యర్థనలను పక్కన పెట్టింది. ప్రభుత్వమే స్వయంగా సహాయం చేయదలిస్తే న్యాయస్థానం అడ్డుకోబోదని స్పష్టం చేసింది.

క్యూ4లో వృద్ధి రేటు @ 6.9 శాతం

- 2024–25లో 6.3 శాతం
- జీడీపీపై ఇక్రా అంచనాలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.9 శాతంగా ఉండొచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఇది 6.3 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) ఫిబ్రవరిలో ప్రకటించిన అంచనాల కన్నా ఇది తక్కువ. 2024–25లో తొలి మూడు త్రైమాసికాల్లో నమోదైన 6.5 శాతం, 5.6 శాతం, 6.2 శాతం వృద్ధి ప్రాతిపదికన పూర్తి ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతం స్థాయిలో ఉండొచ్చంటూ ఎన్ఎస్‌వో ఫిబ్రవరిలో ప్రకటించింది. ఎన్ఎస్‌వో చెబుతున్న 6.5 శాతం స్థాయిలో వృద్ధి ఉండాలంటే మార్చి క్వార్టర్‌లో 7.6 శాతం వృద్ధి సాధించాల్సి ఉంటుంది. క్యూ1 నుంచి క్యూ3 వరకు డేటాలో చెప్పుకోతగ్గ స్థాయిలో మార్పులు చేర్పులు ఉంటే తప్ప వృద్ధి రేటు 6.3 శాతానికి పరిమితం కావచ్చని ఇక్రా పేర్కొంది. పూర్తి ఆర్థిక సంవత్సరం, నాలుగో త్రైమాసికం ప్రొవిజనల్ అంచనాలను ఎన్ఎస్‌వో మే 31న విడుదల చేయనుంది. టారిఫ్‌లపరమైన అనిశ్చితి కారణంగా క్యూ4లో ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులు హెచ్చుతగ్గులకు లోనైనట్లు ఇక్రా వివరించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 9.2 శాతంగా నమోదైంది.



బిట్‌కాయిన్‌పై స్పష్టమైన విధానం ఎందుకు లేదు?

కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్న



న్యూఢిల్లీ: క్రిప్టో కరెన్సీల నియంత్రణ విషయంలో స్పష్టమైన విధానాన్ని కేంద్రం ఎందుకు తీసుకురాలేకపోతోంది? అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. బిట్‌కాయిన్ ట్రేడింగ్‌ను చట్టవిరుద్ధమైనదిగా, హవాలా వ్యాపారంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. సమాంతర మార్కెట్ కలిగి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపిస్తున్నట్లు పేర్కొంది. నియంత్రణల ద్వారా క్రిప్టోకరెన్సీ ట్రేడ్‌లపై దృష్టి సారించొచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. గుజరాత్‌లో బిట్‌కాయిన్ ట్రేడ్ వ్యాపారానికి సంబంధించిన కేసులో నిందితుడు శైలేష్ బాబూలాల్ భట్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అభిప్రాయాలు వ్యక్తం చేసింది. 2020లో ఆర్‌బీఐ సర్క్యులర్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడంతో దేశంలో బిట్‌కాయిన్ ట్రేడింగ్ చట్టవిరుద్ధం కాదంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

ఫండ్స్ ఆస్తులు రూ.65.74 లక్షల కోట్లు

- 23 శాతం పెరుగుదల
- 2024–25 సంవత్సరంలో మెరుగైన వృద్ధి
- ఈక్విటీల్లోకి రూ.4.17 లక్షల కోట్ల పెట్టుబడులు
- ప్రతి నలుగురిలో ఒకరు మహిళా ఇన్వెస్టరే



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) 23 శాతం పెరిగి రూ.65.74 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మార్కెట్ ర్యాలీతో పెట్టుబడుల విలువ పెరగడానికి తోడు, నికర పెట్టుబడుల రాక ఏయూఎం వృద్ధికి తోడ్పడింది. 2023–24 చివరికి మ్యూచువల్ ఫండ్స్ ఏయూఎం రూ.53.40 లక్షల కోట్లుగా ఉంది. ''ఆస్తుల పరిమాణం పెరగడానికి మార్క్ టు మార్కెట్ (ఎంటీఎం) పెరుగుదల సానుకూలించింది. నిఫ్టీ 50 టీఆర్ఐ 6 శాతం, సెన్సెక్స్ టీఆర్ఐ 5.9 శాతం చొప్పున పెరగడం ఇందుకు దోహదం చేసింది. డెట్ విభాగంలోనూ ఎంటీఎం పెరగడం అనుకూలించింది''అని యాంఫి తెలిపింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల పథకాల్లోకి రూ.8.15 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ఫండ్స్ నిర్వహణ ఆస్తుల వృద్ధికి దారితీసింది. ముఖ్యంగా ఈక్విటీల్లోకి రికార్డు స్థాయిలో రూ.4.17 లక్షల కోట్లు వచ్చాయి. ఇన్వెస్టర్లు, పెట్టుబడి ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్ ఇలా అన్నింటా వృద్ధి కనిపించింది. మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోలు 23.45 కోట్ల గరిష్టానికి చేరాయి. ఇన్వెస్టర్ల సంఖ్య 5.67 కోట్లకు పెరిగింది. 1.38 కోట్ల మంది మహిళా ఇన్వెస్టర్లు కావడం గమనార్హం. ముఖ్యంగా ఈక్విటీ పథకాలకు సంబంధించి ఫోలియోలు 33 శాతం పెరిగి 16.38 కోట్లుగా ఉన్నాయి. అంటే మొత్తం ఫోలియోల్లో ఈక్విటీ ఫోలియోలే 70 శాతం మేర ఉండడం గమనార్హం. హైబ్రిడ్ ఫండ్స్ ఫోలియోలు 16 శాతం పెరిగి 1.56 కోట్లుగా ఉన్నాయి. ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల (ప్యాసివ్ ఫండ్స్) ఫోలియోలు 48 శాతం పెరిగి 4.15 కోట్లుగా ఉన్నాయి.

ఎన్ఎఫ్‌వోల జోరు

గత ఆర్థిక సంవత్సరంలో న్యూ ఫండ్ ఆఫర్లు (ఎన్ఎఫ్‌వోలు) కూడా పెద్ద సంఖ్యలోనే వచ్చాయి. 70 ఈక్విటీ ఎన్ఎఫ్‌వోలు మార్కెట్ నుంచి రూ.85,244 కోట్ల పెట్టుబడులను సమీకరించాయి. 2023–24లో వచ్చిన ఈక్విటీ ఎన్ఎఫ్‌వోలు 58కాగా, అవి ఇన్వెస్టర్ల నుంచి సమీకరించిన నిధులు రూ.39,297 కోట్లుగానే ఉన్నాయి. డెట్ ఫండ్స్‌లోకి నికరంగా రూ.1.38 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

సిప్ పెట్టుబడులు రూ.2.89 లక్షల కోట్లు..

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గత ఆర్థిక సంవత్సరంలో మ్యూచువల్ ఫండ్స్‌లోకి రికార్డు స్థాయిలో రూ.2.89 లక్షల కోట్ల పెట్టుబడులు తరలి వచ్చాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 45 శాతం పెరిగాయి. సిప్ నిర్వహణ ఆస్తులు 24.6 శాతం పెరిగి రూ.13.35 లక్షల కోట్లకు చేరాయి. దీంతో మ్యూచువల్ ఫండ్స్ మొత్తం నిర్వహణ ఆస్తుల్లో సిప్ ఏయూఎం 20.31 శాతానికి పెరిగింది. మహిళా ఇన్వెస్టర్ల సంఖ్య గత ఆర్థిక సంవత్సరంలో 24 శాతం మేర పెరిగి 1.38 కోట్లుగా (ప్రతి నలుగురిలో ఒకరు) ఉంది. మహిళల్లోనూ ఆర్థిక స్వాతంత్ర్యం, అవగాహన పెరుగుతోందని యాంఫి నివేదిక తెలిపింది. ఆర్థిక అక్షరాస్యతకు తోడు, ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండడం ఇందుకు నేపథ్యంగా పేర్కొంది. ఇక గత ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ ఆధారిత ఫండ్స్‌లోకి నికరంగా రూ.4.17 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రెట్టింపయ్యాయి. దీంతో ఈక్విటీ పథకాల నిర్వహణ ఆస్తుల విలువ 25 శాతానికి పైగా పెరిగి రూ.29.45 లక్షల కోట్లకు చేరుకుంది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

పవర్‌గ్రిడ్ లాభం రూ.4,143 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.12,591 కోట్ల ఆదాయంపై రూ.4,143 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.12,305 కోట్లు, లాభం రూ.4,166 కోట్ల చొప్పున ఉన్నాయి. 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.15,521 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.15,573 కోట్లతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. ఆదాయం మాత్రం రూ.46,913 కోట్ల నుంచి రూ.47,459 కోట్లకు పెరిగింది. ప్రతీ షేరుకు రూ.1.25 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఇప్పటికే రెండు విడతలుగా పంపిణీ చేసిన రూ.7.75కు ఇది అదనం.

బీఎస్ఈలో పవర్‌గ్రిడ్ షేరు ఒక శాతానికి పైగా లాభపడి రూ.304 వద్ద ముగిసింది.

జైడస్ వెల్‌నెస్ బలమైన పనితీరు

- ఒక్కో షేరు ఐదు కింద విభజన
- షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ సంస్థ జైడస్ వెల్‌నెస్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 14 శాతానికి పైగా పెరిగి రూ.172 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.150 కోట్లుగా ఉంది. ఆహారం, పోషకాలు, వ్యక్తిగత సంరక్షణ విభాగాల్లో బలమైన పనితీరు నమోదైంది. ముఖ్యంగా ఆహార విభాగంలో 15 శాతం, న్యూట్రిషన్ విభాగంలో 13 శాతం చొప్పున వృద్ధి కనిపించింది. ఆదాయం రూ.911 కోట్లకు వృద్ధి చెందింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.2 ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.347 కోట్లకు దూసుకుపోయింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.267 కోట్లుగానే ఉంది. ప్రతీ షేరుకు రూ.6 చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు రూ.2 లాభపడి రూ.1,833 వద్ద ముగిసింది.

దొడ్ల డెయిరీ లాభం హైజంప్

మార్చి క్వార్టర్‌కు రూ.68 కోట్లు



ముంబై: దొడ్ల డెయిరీ మార్చితో అంతమైన మూడు నెలల కాలానికి ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 45 శాతం ఎగసి రూ.68 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.47 కోట్లుగా ఉంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.787 కోట్ల నుంచి 15 శాతానికి పైగా ఎగసి రూ.910 కోట్లకు చేరింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం రూ.260 కోట్లకు విస్తరించింది. ఆదాయం సైతం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 19 శాతం పెరిగి రూ.3,720 కోట్లుగా నమోదైంది. ప్రతీ షేరుకు రూ.2 చొప్పున డివిడెండ్ పంపిణీ చేసేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో దొడ్ల డెయిరీ షేరు 3 శాతం లాభపడి రూ.1,152 వద్ద స్థిరపడింది.

మెప్పించిన డీఎల్ఎఫ్

లాభంలో 39 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: రియల్టీ దిగ్గజం డీఎల్ఎఫ్ మార్చి క్వార్టర్‌కు రూ.1,282 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.920 కోట్లతో పోల్చి చూస్తే 39 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం రూ.2,317 కోట్ల నుంచి రూ.3,348 కోట్లకు వృద్ధి చెందింది. సేల్స్ బుకింగ్ విలువ రూ.21,223 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్లో సేల్స్ బుకింగ్‌లు రూ.14,778 కోట్లతో పోల్చి చూస్తే 44 శాతం పెరిగింది. గురుగ్రామ్‌లో చేపట్టిన అల్ట్రా లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టులో అమ్మకాలు గొప్పగా జరగడం ఇందుకు అనుకూలించింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.4,367 కోట్లకు వృద్ధి చెందింది. ఆదాయం రూ.8,996 కోట్లుగా నమోదైంది. ప్రతీ షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్ మంజూరీకి కంపెనీ బోర్డు సిఫారసు చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో డీఎల్ఎఫ్ షేరు 3 శాతం లాభపడి రూ.737 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ ఫర్వాలేదు

న్యూఢిల్లీ: కరూర్ వైశ్యా బ్యాంక్ మార్చి త్రైమాసికంలో రూ.513 కోట్ల లాభాన్ని సాధించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.456 కోట్లతో పోల్చి చూసినప్పుడు 13 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.2,813 కోట్ల నుంచి రూ.3,025 కోట్లకు వృద్ధి చెందింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ లాభం రూ.1,942 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,605 కోట్లతో పోల్చితే 21 శాతం వృద్ధి చెందింది. ఒక్కో షేరుపై రూ.2.60 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

బీఎస్ఈలో కరూర్ వైశ్యా బ్యాంక్ షేరు పెద్ద మార్పు లేకుండా రూ.227 వద్ద స్థిరపడింది.

‘అవును... మందు మానేశాను’

వేగంగా కోలుకుంటున్నానన్న స్టోక్స్



లండన్: ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ ఐదు నెలల విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. తరచు గాయాల బారిన పడుతూ మళ్లీ మళ్లీ ఆటకు దూరమవుతున్న 33 ఏళ్ల స్టోక్స్ గత ఏడాది డిసెంబర్ తర్వాత అసలు ఏ స్థాయి మ్యాచ్ కూడా ఆడలేదు. తొడ కండరాల గాయంతో తప్పుకున్న అతను ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. వేగంగా ఫిట్‌నెస్ అందుకునే క్రమంలో భాగంగా ‘రీహాబిలిటేషన్’ సమయంలో మద్యానికి దూరంగా ఉన్నట్లు వెల్లడించాడు. ‘నాకు తొలిసారి గాయమైనప్పుడు నా శరీరం చికిత్సకు సరిగా స్పందించలేదు. ఇది ఎలా జరిగిందని ఆలోచిస్తే వారం రోజుల క్రితం బాగా మద్యం తాగిన విషయం గుర్తుకొచ్చింది. బహుశా అది కూడా కారణం కావచ్చనిపించింది. దాంతో ఈసారి గాయం తర్వాత చాలా జాగ్రత్తగా ఉన్నాను. నేను మారితే మంచిదని భావించా. అయితే పూర్తిగా అది సాధ్యం కాదు కాబట్టి రీహాబిలిటేషన్ వరకు నియంత్రణలో ఉండేందుకు ప్రయత్నించా. మైదానంలోకి దిగే వరకు దీనిని పాటించాలని ప్రయత్నిస్తున్నా. అందుకే ఈ ఏడాది జనవరి నుంచి మద్యం మానేశా. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానిని ముట్టలేదు’ అని స్టోక్స్ చెప్పాడు. గురువారం నుంచి జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టులో బరిలోకి దిగనున్న స్టోక్స్...ఆ తర్వాత భారత్‌తో టెస్టు సిరీస్, యాషెస్ సిరీస్ కోసం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించాడు.

టైటిల్ బోణీ చేసేనా?



పీవీ సింధు

- నేటి నుంచి మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ
- ఈ ఏడాది ఒక్క టైటిల్ గెలవలేకపోయిన భారత షట్లర్లు

కౌలాలంపూర్: ఈ ఏడాది స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్న భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో టోర్నీకి సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మలేసియా మాస్టర్స్ వరల్డ్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత కొంత కాలంగా లయ దొరకబుచ్చుకోలేక ఇబ్బంది పడుతున్న స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ ఈసారైనా మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నారు. గత నెల సుదిర్మన్ కప్‌లో భాగంగా ఇండోనేసియా, డెన్మార్క్ చేతిలో ఓడిన ఈ ఇద్దరు తిరిగి సత్తా చాటాలని భావిస్తున్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో రెండు పతకాలు సాధించిన సింధు ప్రస్తుతం ప్రపంచ 16వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ నుగుయెన్ థుయ్ లిన్ (వియత్నాం)తో సింధు తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)తో 35వ ర్యాంకర్ ప్రణయ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మూడో సీడ్ చౌ టైన్ చెన్ (చైనీస్ తైపీ)తో సతీశ్ కుమార్ కరుణాకరన్, బ్రియాన్ యంగ్ (కెనడా)తో ఆయుశ్ శెట్టి, జియా హెంగ్ జాసన్ (సింగపూర్)తో ప్రియాన్షు రజావత్ తలపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోద్ పోటీ పడుతున్నారు. పురుషుల డబుల్స్‌లో సాయి ప్రతీక్-పృథ్వీ కృష్ణమూర్తి, హరిహరన్-రూబన్ కుమార్ బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో నాలుగు జోడీలు పోటీలో ఉన్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్, ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో, అషిత్ సూర్య-అమృత, ఆద్య-సతీశ్ కుమార్ బరిలో దిగనున్నారు. ఇక ప్రధాన పోటీలకు ముందు జరగనున్న క్వాలిఫయింగ్ టోర్నీ పురుషుల విభాగంలో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌తో పాటు శంకర్ ముత్తుస్వామి, తరుణ్ మన్నెపల్లి మంగళవారం బరిలోకి దిగనున్నారు. మహిళల విభాగం నుంచి అన్మోల్ పోటీలో ఉంది.

హెచ్‌ఐఎల్ రిజిస్ట్రేషన్ షురూ



న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) వచ్చే సీజన్ ఆటగాళ్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మూడు నెలల పాటు కొనసాగనున్న రిజిస్ట్రేషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా 1000 మందికి పైగా ప్లేయర్లు దరఖాస్తు చేసుకుంటారని హాకీ ఇండియా (హెచ్ఐ) భావిస్తోంది. ఏడేళ్ల విరామం తర్వాత గతేడాది హెచ్ఐఎల్ తిరిగి ప్రారంభం కాగా... పురుషుల విభాగంలో బెంగాల్ టైగర్స్, మహిళల విభాగంలో ఒడిశా వారియర్స్ చాంపియన్స్‌గా నిలిచాయి. ఇక తదుపరి సీజన్ కోసం నెదర్లాండ్స్, బెల్జియం, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, స్పెయిన్, అర్జెంటీనా, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, మలేసియా, దక్షిణ కొరియా సహా పలు దేశాలకు చెందిన ప్లేయర్లు హెచ్‌ఐఎల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోనున్నారు. సోమవారం ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు 20 వరకు కొనసాగనుంది. ‘హెచ్‌ఐఎల్ 2024-25 సీజన్‌కు మంచి ఆదరణ దక్కింది. పురుషుల విభాగంలో 8, మహిళల విభాగంలో 4 ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. గతేడాది కూడా వెయ్యి మందికి పైగా ఆటగాళ్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈసారి అంతకంటే ఎక్కువ ఆదరణ దక్కుతుందని భావిస్తున్నాం’ అని హాకీ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ‘భారత హాకీలో హెచ్‌ఐఎల్ గేమ్ చేంజర్ లాంటిది. గత సీజన్ అంచనాలను మించిపోయింది. 2026 సీజన్‌లో మరింత ఆదరణ దక్కడం ఖాయం. అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడటం వల్ల మన ప్లేయర్లు మరింత నేర్చుకోగలరు’ హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అని అన్నాడు.

విదేశీ భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నాం

‘షూటింగ్ లీగ్’పై ఎన్‌ఆర్‌ఏఐ చీఫ్ కాళికేశ్



న్యూఢిల్లీ: భారత్‌లో ఈ ఏడాది ప్రారంభం కానున్న షూటింగ్ లీగ్‌లో విదేశీ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తామని జాతీయ రైఫిల్ షూటింగ్ సంఘం (ఎన్ఆర్ఏఐ) అధ్యక్షుడు కాళికేశ్ సింగ్‌దేవ్ చెప్పారు. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) భారత లీగ్ కోసం నవంబర్-డిసెంబర్‌లను అందుబాటులో ఉంచింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్ఏఐ ఆరంభ లీగ్‌ను ఈ నవంబర్ 24 నుంచి డిసెంబర్ 7 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 6 నుంచి 8 నగరాలకు చెందిన ఫ్రాంచైజీలు ఇందులో పాల్గొంటాయి. ఒక్కో ఫ్రాంచైజీ టీమ్‌లో 12 మంది షూటర్లు (ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు) ఉంటారు. 12 మందిలోనే ఇద్దరు చొప్పున నలుగురు విదేశీ ఆటగాళ్లకు అవకాశముంటుంది. దీనిపై ఎన్‌ఆర్ఏఐ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఏఐ చీఫ్ కాళికేశ్ మాట్లాడుతూ ‘ఇప్పటికే పలు భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు మొదలుపెట్టాం. విదేశీ ఫ్రాంచైజీలకు ఆహ్వానం పలుకుతాం. దీనికి సంబంధించిన వెసులుబాట్లను కూడా పరిశీలిస్తాం’ అని అన్నారు. భారత్‌లో ఇప్పటికే సుమారు లక్ష మంది షూటర్లు (రిజిస్టర్డ్) ఉన్నారు. వీరిలో 50 శాతం దాకా పతకాలు తీసుకువచ్చే ప్రతిభావంతులు ఉన్నారు. అంతర్జాతీయ షూటింగ్ పోటీల్లో చాలామంది సత్తా చాటుకుంటున్నారు. అయితే ప్రేక్షకుల హాజరే వెలతిగా ఉంది. ఢిల్లీలోని ప్రముఖ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో పోటీలు జరిగినా కూడా చూసేవారే కరువవుతున్నారు. ఇది భారత ఫ్రాంచైజీ షూటింగ్ లీగ్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశముంది. అయితే ఒక్కసారి లీగ్ మొదలయ్యాక ఆసక్తి కలిగిస్తే ప్రేక్షకుల ఆదరణ కూడా ఉంటుందని కాళికేశ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. షూటింగ్‌లో పెట్టుబడులు పెంచడం ద్వారా వచ్చే ఐదు, పదేళ్లలో భారత షూటింగ్‌లో రోల్ మోడల్స్‌ను తయారు చేయొచ్చని ఆయన అన్నారు.

అల్‌కరాజ్‌దే పైచేయి

- రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సొంతం
- ఫైనల్లో నంబర్‌వన్ సినెర్‌పై వరుస సెట్‌లలో విజయం

రోమ్: వచ్చే ఆదివారం ప్రారంభం కానున్న టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్... ఫ్రెంచ్ ఓపెన్‌లో మరోసారి తానే ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నానని స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ సంకేతాలు పంపించాడు. 22 ఏళ్ల అల్‌కరాజ్ గత ఏడాది తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించాడు. ఈ మెగా టోర్నీకి సన్నాహకంగా జరిగిన రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 క్లే కోర్టు టోర్నీలో అల్‌కరాజ్ తొలిసారి విజేతగా నిలిచాడు. ఆదివారం రాత్రి ముగిసిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అల్‌కరాజ్ ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)పై వరుస సెట్‌లలో గెలుపొందాడు. 1 గంట 43 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్‌కరాజ్ 7-6 (7/5), 6-1తో సినెర్‌ను ఓడించాడు. వరుసగా 26 విజయాల తర్వాత సినెర్‌కిదే తొలి పరాజయం కావడం గమనార్హం. ముఖాముఖి రికార్డులో అల్‌కరాజ్ 7-4తో సినెర్‌పై ఆధిక్యాన్ని పెంచుకోగా... ఇటలీ ప్లేయర్‌పై అల్‌కరాజ్‌కిది వరుసగా నాలుగో విజయం. ఈ ఏడాది అల్‌కరాజ్‌కిది మూడో టైటిల్‌కాగా ఓవరాల్‌గా 19వ టైటిల్. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 9,85,030 యూరోల (రూ. 9 కోట్ల 46 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ సినెర్‌కు 5,23,870 యూరోల (రూ. 5 కోట్ల 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.



అల్‌కరాజ్ సినెర్

5 క్లే కోర్టులపై జరిగే మూడు మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలను (మాడ్రిడ్, మోంటె కార్లో, రోమ్) సాధించిన ఐదో ప్లేయర్‌గా అల్‌కరాజ్ గుర్తింపు పొందాడు. గతంలో రాఫెల్ నాదల్ (స్పెయిన్), నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), గుస్తావో కుయెర్టెన్ (బ్రెజిల్), మార్సెలో రియోస్ (చిలీ) మాత్రమే ఈ ఘనత సాధించారు.

వేలం బరిలో నవీన్

- స్టార్ రెయిడర్‌ను విడుదల చేసిన ఢిల్లీ
- 31, జూన్ 1 తేదీల్లో పీకేఎల్ వేలం



ముంబై: ఐపీఎల్ తర్వాత ప్రేక్షకాదరణలో రెండో స్థానంలో నిలిచిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం ప్రక్రియకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. దబంగ్ ఢిల్లీ స్టార్ రెయిడర్ నవీన్ కుమార్ తొలిసారి పీకేఎల్ వేలానికి వచ్చాడు. దబంగ్ ఢిల్లీ 8వ సీజన్‌లో విజేతగా నిలిచింది. ఈ ఫ్రాంచైజీ తరఫున ఆరు సీజన్లు ఆడిన నవీన్ 1102 రెయిడింగ్ పాయింట్లు సాధించాడు. అలాంటి ఆటగాడిని ఢిల్లీ వదిలేసుకోవడంతో మిగతా ఫ్రాంచైజీలు అతనిపై కన్నేశాయి. ఇలా విడుదల, అట్టిపెట్టుకున్న ఆటగాళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను 12 ఫ్రాంచైజీలు ప్రకటించాయి. అన్ని ఫ్రాంచైజీలు కలిపి 83 మందిని రిటెయిన్ (అట్టిపెట్టుకోవడం) చేసుకున్నాయి. మొత్తం నాలుగు కేటగిరీలుగా ఆటగాళ్లను అట్టిపెట్టుకునే వీలుంది. ఎ, బి, సి, డిగా విభజించిన రిటెయినర్లలో ఎ ఆటగాడికి రూ. 30 లక్షలు, బి ప్లేయర్‌కు రూ. 20 లక్షలు, సి, డి ఆటగాళ్లకు వరుసగా రూ. 13 లక్షలు, రూ. 9 లక్షలు చెల్లించాల్సివుంటుంది. ఒక్కో ఫ్రాంచైజీ గరిష్ట పరిమితి రూ. 5 కోట్లకు లోబడే రిటెయిన్ మొత్తాన్ని తీసివేయగా మిగిలిన మొత్తంతో ఆటగాళ్లను వేలంలో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ముంబైలో ఈ నెల 31, జూన్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు కబడ్డీ ఆటగాళ్ల వేలం పాట జరుగనుంది.

బెంగాల్ వారియర్స్: విశ్వాస్, యశ్ మలిక్, మన్‌జీత్, దీప్ కుమార్, సుశీల్ కాంబ్రేకర్. **బెంగళూరు బుల్స్:** చంద్ర నాయక్, లక్కీ కుమార్, మన్‌జీత్, పంకజ్. **దబంగ్ ఢిల్లీ:** సందీప్, మోహిత్.
గుజరాత్ జెయింట్స్: హిమాన్షు సింగ్, హిమాన్షు, ప్రతీక్ దహియా, రాకేశ్.
హరియాణా స్టీలర్స్: రాహుల్ సెప్తాల్, వినయ్, శివమ్ అనీల్, జైదీప్, జయసూర్య, విశాల్ తటే, సాహిల్ మనికందన్, వికాస్ రామదాస్ జాదవ్.
జైపూర్ పింక్‌పాంథర్స్: రెజా మిర్బాఘెరి, అభిషేక్, రోనక్ సింగ్, నితిన్ కుమార్, సోంబిర్, రితిక్ శర్మ. **పట్నా పైరేట్స్:** హమిద్ మిర్జాయి నదిర్, త్యాగరాజన్ యువరాజ్, సుధాకర్, అయాన్, నవ్‌దీప్, దీపక్, సాహిల్ పాటిల్.
పుణేరి పల్టన్: అభినేశ్, గౌరవ్ ఖత్రి, పంకజ్ మోహితే, అస్లామ్ ముస్తఫా, మోహిత్ గోయత్, దాదాసో శివాజీ పూజారి, ఆదిత్య తుషార్ షిండే. **తమిళ్ తలైవాస్:** మొయిన్ షఫాగి, హిమాన్షు, సాగర్, నితేశ్ కుమార్, నరేందర్, రోనక్, విశాల్ చహల్, ఆశిష్, అనూజ్ గవాడే, ధీరజ్ రవీంద్ర బైల్మరే.
తెలుగు టైటాన్స్: శంకర్ భీమ్‌రాజ్, అజిత్ పాండురంగ పవార్, అంకిత్, ప్రఫుల్ జవారే, సాగర్ చేతన్ సాహు, నితిన్, రోహిత్. **యు ముంబా:** సునీల్ కుమార్, రోహిత్, అమిర్ మొహమ్మద్, సతీశ్ కన్నన్, ముకిలన్ షణ్ముగమ్, అజిత్ చౌహాన్, దీపక్ కుందు, లోకేశ్ గోస్లియా, సన్నీ. **యూపీ యోధాస్:** సుమిత్, భవానీ రాజ్‌పుత్, సాహుల్ కుమార్, సురేందర్ గిల్, అషు సింగ్, హితేశ్ గగన గౌడ, శివమ్ చౌదరి, జయేశ్ వికాస్ మహాజన్, గంగారామ్, సచిన్, కేశవ్ కుమార్.

‘అనుభవం’ అమూల్యమైంది!

మా వ్యూహాలు మార్చనవసరం లేదు • చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ ఫ్లెమింగ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్‌లో ‘ప్లే ఆఫ్స్’ అవకాశాలు ఎప్పుడో చేజార్చుకొని 12 మ్యాచ్‌ల తర్వాత చివరి స్థానంలో కొనసాగుతోంది. యువ ఆటగాళ్లు ఆయుశ్ మాత్రే, నూర్ అహ్మద్, డెవాల్డ్ బ్రెవిస్ లాంటివారు రాణించినా... జట్టు నమ్ముకున్న సీనియర్లు పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా స్పిన్నర్ అశ్విన్‌తో పాటు రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్, దీపక్ హుడా లీగ్‌లో ఎంతో అనుభవం ఉన్నా కనీస ప్రదర్శన ఇవ్వలేదు. అయితే తమ టీమ్ వైఫల్యానికి పలు కారణాలు ఉన్నాయని, తన దృష్టిలో ఎప్పటికీ అనుభవానికి పెద్ద పీట ఉంటుందని టీమ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యాఖ్యానించాడు. గతంలో సీనియర్లతోనే తాము వరుసగా టైటిల్స్ గెలిచిన విషయాన్ని అతను గుర్తు చేశాడు. ‘ఆటగాళ్ల వయసు ఎంత ఎక్కువగా ఉందనేది నేను పట్టించుకోను. నా దృష్టిలో అనుభవం అమూల్యమైంది. గత కొన్నేళ్లలో మాకు అదే ఎన్నో విజయాలు అందించింది. ఈ సీజన్‌లో అది పని చేయకపోవచ్చు. ఫలితం అందరికీ నిరాశ కలిగించిన మాట వాస్తవమే కానీ వైఫల్యానికి వేర్వేరు కారణాలు ఉన్నాయి’ అని ఫ్లెమింగ్ అభిప్రాయపడ్డాడు. ఇన్నేళ్లుగా చెన్నై టీమ్ సీనియర్ల ఆటతో అనుసరిస్తున్న వ్యూహాలను ఇకపై కూడా మార్చాల్సిన అవసరం లేదని అతను అన్నాడు. ‘సీనియర్లపై నమ్మకం ఉంచడంతో పాటు ప్రతిభాన్వేషణ కూడా ఈ సమయంలో ముఖ్యం. జట్టులో యువ ఆటగాళ్లు ఉండాలని అందరూ అంటున్నారు. కానీ వారందరినీ వెతికి తెచ్చుకోవాలి కదా. జట్టులో వారు సరిపోతారో లేదో చూడాలి. అనుభవజ్ఞులతో కలిపి వారిని ఆడించాలి. ఈ సీజన్‌లో కొందరు కొత్త కుర్రాళ్లు చెలరేగడం నిజమే అయినా అత్యధిక పరుగులు, అత్యధిక వికెట్ల ఆటగాళ్ల జాబితా చూస్తే ఐపీఎల్‌లో అనుభవం ఉన్నవారే కనిపిస్తారు. మాకు ఈ సీజన్ పెద్ద సవాల్‌గా నిలిచింది. ఇకపై మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం’ అని ఫ్లెమింగ్ వివరించాడు.



ఫ్లెమింగ్

సోషల్ మీడియా పోస్ట్‌తో... బీబీసీ పోస్టుకు ఎసరు

కామెంటేటర్ ఉద్యోగం కోల్పోయిన మాజీ ఫుట్‌బాలర్ గ్యారీ లినేకర్



లండన్: ఇంగ్లండ్ మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు, కామెంటేటర్ గ్యారీ లినేకర్... బీబీసీ వ్యాఖ్యాత స్థానం నుంచి వైదొలగనున్నాడు. సామాజిక మాధ్యమాల్లో జియోనిజానికి సంబంధించిన పోస్ట్ పెట్టిన కారణంగా పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొన్న గ్యారీ... ఇప్పుడు వ్యాఖ్యాతగా తప్పుకోనున్నాడు. మీడియా సెలబ్రిటీగా మంచి పేరున్న 64 ఏళ్ల లినేకర్... అత్యధిక పారితోషికం అందుకుంటున్న బ్రిటిష్ జాతీయ ప్రసారకుడిగా ఉన్నాడు. బీబీసీలో వ్యాఖ్యాతగా అతడు ఏడాదికి దాదాపు 1.7 మిలియన్ల అమెరికా డాలర్లు (రూ. 14 కోట్ల 52 లక్షలు) ప్రతిఫలంగా పొందుతున్నాడు. ‘జియోనిజం రెండు నిమిషాల్లో వివరించొచ్చు’ అనే క్యాప్షన్‌తో కూడిన ఎలుక చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో లినేకర్‌పై విమర్శలు గుప్పుమన్నాయి. యూదు వ్యతిరేక భావజాలం కలిగిన ఇలాంటి పోస్టు పెట్టినందుకు లినేకర్ ఇప్పటికే బహిరంగ క్షమాపణలు చెప్పినప్పటికీ... బీబీసీ గౌరవ మర్యాదలకు భంగం కలిగించినందుకు సోషల్ మీడియా పాలసీ ప్రకారం అతడిపై యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఇంగ్లండ్ జాతీయ జట్టు తరఫున 80 మ్యాచ్‌లాడిన లినేకర్... 48 గోల్స్ చేశాడు. 1986 ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు.



కొండ అంచున ఫ్లవర్‌వేజ్ ఆకారంలోని ఈ చెట్ల పేరు బాటిల్ ట్రీ. యెమెన్‌లోని సాకొత్రా దీవిలో తప్ప మరెక్కడా కనిపించవు. మారుతున్న వాతావరణంతో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది

పాక్ చెప్పిందంతా అబద్ధం

జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఘటనలో పూర్తిగా మాదే పైచేయి

- బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన
- సాక్ష్యాధారాలు చూపుతూ సవివరంగా వీడియో విడుదల

ఇస్లామాబాద్: రెండు నెలల క్రితం పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసిన ఉదంతంలో ఆ దేశ ప్రభుత్వం, సైన్యం చెప్పినదంతా అబద్ధమని బలూచిస్తాన్ వేర్పాటువాదుల గ్రూప్ అయిన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) సోమవారం ప్రకటించింది. రైలు హైజాక్ ఘటనలో తమదే పైచేయి అని పేర్కొంటూ సాక్ష్యాధారాలతో సవివరంగా ఒక వీడియోను రూపొందించి తాజాగా విడుదలచేసింది. పాకిస్తాన్‌లో విస్తీర్ణంపరంగా అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ అభివృద్ధిలో ఆమడ దూరంలో నిలిచిపోయిన బలూచిస్తాన్ ప్రజలు ఏకమై తమ ప్రాంత స్వయంప్రతిపత్తే లక్ష్యంగా ఉద్యమిస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఉద్యమంలో భాగంగా మార్చి 11వ తేదీన పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును వందలాది మంది బలూచ్ సాయుధులు రైలు పట్టాలను పేల్చేశాక హైజాక్ చేయడం తెల్సిందే. అయితే ఈ ఘటనలో బలూచ్ మిలిటెంట్లను హతమార్చి వందల మంది ప్రయాణికులను కాపాడామని పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ప్రకటించాయి. అయితే అదంతా అబద్ధమంటూ 36 నిమిషాల వీడియోను బలూచ్ ఆర్మీ మీడియా విభాగం హక్కాల్ ఒక వీడియోను బయటపెట్టింది. అందులో దాడికి ముందే సుశిక్షితులైన వందలాది మంది బీఎల్ఏ ఫైటర్లు షూటింగ్ ప్రాక్టీస్ చేయడం, రైలును హైజాక్ చేశాక ఏ బోగీ జనాలను ఎటువైపు తీసుకెళ్లాలి? ఎవరి బాధ్యతలు ఏమిటి? వంటి వాటితోపాటు బందీలకు ఎలాంటి హానీ తలపెట్టకుండా జాగ్రత్తగా రైలు నుంచి దూరంగా తీసుకెళ్లిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. బందీలను చిత్రహింసలకు గురిచేసి కొందరిని చంపేశామన్న పాక్ సైన్యం వాదనల్లో నిజం లేదని బీఎల్ఏ ఈ వీడియోతో నిరూపించింది. బందీల్లో 200 మంది పాక్ పోలీసులు, అధికారులు ఉన్నారు. వాళ్లను రెండు రోజుల పాటు బంధించిన దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులను హింసించారన్న వాదనలో వాస్తవం లేదని ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. అసలు దాడి చేయడానికి గల కారణాలు, ఆవశ్యకతను బీఎల్ఏ సీనియర్ నేత ఒకరు ఈ వీడియో మొదట్లోనే స్పష్టంచేశారు. ''మా పోరాటం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మా ఉద్యమం కీలకదశకు చేరుకుంటోంది. ఈ దశలో సంక్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. మా యువ ఫైటర్లు ఇలాంటి కఠిన నిర్ణయాలను అమలుచేయాల్సి వచ్చింది. ఇలాంటి నిర్ణయాలుకాకుండా మరే ప్రత్యామ్నాయాలు లేవని మా వాళ్లకూ అర్థమైంది. తుపాకీని నిలువరించాలంటే తుపాకీని పట్టుకోవాల్సిందే. తుపాకీ పేలుడు శబ్దం కూడా కొంత దూరం వరకే వినిపిస్తుంది. తన తండ్రి కోసం తనయుడు ప్రాణత్యాగానికైనా సిద్ధమయితే అదే కొడుకు కోసం తండ్రి కూడా ఎంతకైనా తెగిస్తాడు''అని ఆయన చెప్పాడు. హైజాక్ ప్రణాళిక రచన, అమలు, ముందుండి నడిపించి ఫిదాయీ ఫైటర్ యూనిట్ మజీద్ బ్రిగేడ్ వివరాలు, ఫొటోలు, సభ్యుల స్పందనలను వీడియోకు జతచేశారు. పాక్ సైన్యం ప్రతిదాడిచేసినా అత్యల్ప స్థాయిలో తమ వైపు ప్రాణనష్టం జరిగిందంటూ వీరమరణం పొందిన వాళ్లకు నివాళులు అర్పించిన దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. 30 గంటలపాటు సైనిక ఆపరేషన్ తర్వాత 33 మంది రెబల్స్‌ను మట్టుబెట్టామని పాక్ సైన్యం ఆనాడు ప్రకటించింది. బందీలను విడిపించే క్రమంలో 23 మంది జవాన్లు, ముగ్గురు రైల్వే ఉద్యోగులు, ఐదుగురు ప్రయాణికులు చనిపోయారని తెలిపింది. అయితే తాము మాత్రం బందీలుగా ఉన్న 214 మంది పాకిస్తాన్ పోలీసులందరినీ చంపేశామని రెబల్స్ ప్రకటించారు.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై రష్యా నిషేధం

మాస్కో: అధ్యక్షుడు పుతిన్ పాలనను విమర్శించే సంస్థలపై రష్యా యంత్రాంగం మరోసారి కొరఢా ఝుళిపించింది. తాజాగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై నిషేధం విధించింది. నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడే సంస్థలపై నిషేధానికి వీలు కల్పించే 2105 చట్టం ప్రకారం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను నిషేధిస్తున్నట్లు రష్యా ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం తెలిపింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను అవాంఛనీయ సంస్థగా అభివర్ణించింది. రష్యాను రాజకీయంగా ఆర్థికంగా ఏకాకిని చేయడమే లక్ష్యంగా దేశ వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తోందని ఆరోపించింది. దీని ప్రకారం, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇకపై రష్యాలో ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించరాదు. ఈ సంస్థకు మద్దతు పలికిన సాయం చేసిన వారిపైనా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశముంది. అవాంఛనీయ సంస్థలుగా రష్యా ప్రకటించిన 223 సంస్థల్లో ప్రముఖ స్వతంత్ర వార్తా సంస్థలు, హక్కుల గ్రూపులు ఉన్నాయి. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై మొదలైన దండయాత్ర తర్వాత ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తులు, సంస్థలపై కట్టడి మరీ పెరిగిపోయింది. ఉక్రెయిన్‌లో రష్యా ఆర్మీ అనేక దురాగతాలకు పాల్పడుతోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శిస్తోంది. ఈ సంస్థ ఏటా ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకునే మానవహక్కుల ఉల్లంఘనల ఘటనలపై నివేదిక వెలువరిస్తుంటుంది. రష్యా ప్రభుత్వ నిర్ణయంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ స్పందించాల్సి ఉంది.

దేశంలో కోవిడ్ అదుపులోనే ఉంది

అధికార వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి అదుపులోనే ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. హాంకాంగ్, సింగపూర్‌లలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ఓ కన్నేసి ఉంచినట్లు వివరించాయి. ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన సోమవారం వివిధ విభాగాలకు చెందిన నిపుణులు సమావేశమై దేశంలో కోవిడ్ పరిస్థితిపై సమీక్షించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 'దేశంలో ప్రస్తుతం కోవిడ్-19 యాక్టివ్ కేసులు 257. ఈ కేసులన్నీ దాదాపు స్వల్ప లక్షణాలు కలిగినవే. ఆస్పత్రిలో చికిత్స అవసరం లేనివి. మే 19వ తేదీ నాటికి దేశంలో కరోనా పరిస్థితి అదుపులోకి ఉంది'అని ఈ సమావేశం నిర్ణయించిందని అధికార వర్గాలు వివరించాయి. ఇన్‌ఫ్లూయెంజా తరహా, శ్వాస సంబంధ ఇన్ఫెక్షన్ కేసులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ఆస్పత్రులను ఈ సమావేశం కోరింది. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

'బాయ్‌కాట్ తుర్కియే' బాటలో అజియో, మింత్రా

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ విషయంలో పాక్‌కు మద్దతు ప్రకటించిన తుర్కియేను బాయ్‌కాట్ చేయాలన్న పిలుపునకు స్పందన పెరుగుతోంది. తాజాగా, మింత్రా, అజియోలు ఆన్‌లైన్ ఫ్యాషన్ వేదికల నుంచి పాపులర్ తుర్కియే బ్రాండ్ దుస్తులను తొలగించాలని నిర్ణయించాయి. ఈ రెండు ఆన్‌లైన్ ఫ్యాషన్ వేదికలపై ఇకపై భారతీయ కొనుగోలుదార్లకు కొన్ని బ్రాండెడ్ దుస్తులు అందుబాటులో ఉండవు. ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యంలోని మింత్రాకు భారత్‌లో ట్రెండీఓల్ అనే తుర్కియే బ్రాండ్ దుస్తుల్ని విక్రయించే హక్కులున్నాయి. ట్రెండీఓల్‌కు చైనా కంపెనీ అలీబాబాతోనూ సంబంధముంది. కాగా, తిరిగి తుర్కియే బ్రాండ్లను తీసుకువచ్చేది లేనిదీ ఇప్పుడే చెప్పలేమంది. గత వారం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలోనే రిలయన్స్ యాజమాన్యంలోని అజియో తుర్కియే బ్రాండ్ల ఉత్పత్తులను తొలగించడం ప్రారంభించింది. గురువారం కల్లా తుర్కియేకు చెందిన కొటాన్, మవి, ఎల్సీ వైకికి వంటి అన్ని ఉత్పత్తుల తొలగింపు పూర్తయిందని ఆ సంస్థ అధికారులు తెలిపారు. వీటి స్థానంలో అవుటాఫ్ స్టాక్ అనే మార్క్ కనిపిస్తుందని చెప్పారు. ఇప్పటికే తుర్కియేలోని తమ కార్యాలయాన్ని రిలయన్స్ మూసివేసింది.

యూకే ప్రొఫెసర్ ఓసీఐ హోదా రద్దు



దేశ వ్యతిరేక కార్యకలాపాల వల్లే

ఆమెకు పంపిన లేఖలో కేంద్రం ● అప్రజాస్వామిక చర్యలు: కౌల్

లండన్: భారత సంతతికి చెందిన నితాషా కౌల్ అనే విద్యావేత్త ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను కేంద్రం రద్దు చేసింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. ''పలు అంతర్జాతీయ, సోషల్ మీడియా వేదికల్లో భారత్‌కు వ్యతిరేకంగా రాస్తున్నారు. ప్రసంగాలు చేస్తున్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని, దేశంలోని సంస్థలను లక్ష్యంగా చేసుకుని దురుద్దేశంతో, వాస్తవాలను పూర్తిగా విస్మరించి, చరిత్ర పట్ల గౌరవం లేకుండా వ్యవహరిస్తున్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చింది'' అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్రం పంపిన లేఖను కౌల్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ''విద్యా రంగంలో చేసిన కృషికి నన్నిలా శిక్షించారు. అత్యంత దారుణం. మోదీ ప్రభుత్వ మైనారిటీ వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలకు మరో నిదర్శనం'' అంటూ ఆరోపణలు గుప్పించారు. విదేశీ పౌరసత్వమున్న భారత సంతతి వ్యక్తులకు కేంద్రం ఇచ్చే ప్రత్యేక హోదా ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా. ఇది జీవితకాలపు వీసా. ఇది ఉన్నవారు భారత్‌ను సందర్శించడానికి ఎలాంటి పరిమితులూ ఉండవు.

విమానాశ్రయం నుంచే బహిష్కరణ

'ప్రజాస్వామ్యం- రాజ్యాంగ విలువలు' అంశంపై ప్రసంగించేందుకు కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది కౌల్‌ను బెంగళూరుకు ఆహ్వానించింది. విమానాశ్రయంలో దిగగానే అధికారులు ఆమెను అడ్డుకుని 24 గంటల్లోనే బ్రిటన్‌కు తిప్పి పంపారు. ఆర్ఎస్ఎస్‌ను విమర్శి స్తున్నందుకే ఇలా చేశారని ఆమె అప్పట్లో ఆరోపించారు. ''కర్నాటక ప్రభుత్వం ఆహ్వానంపై వస్తే కేంద్రం నాకు ప్రవేశం నిరాకరించింది. నా దగ్గర బ్రిటన్ పాస్‌పోర్ట్, ఓసీఐ కార్డు, ఇలా చెల్లుబాటయ్యే పత్రాలన్నీ ఉన్నాయి. ఇది నాకు మాత్రమే కాదు, నన్ను ఆహ్వానించిన బీజేపీయేతర (కాంగ్రెస్) ప్రభుత్వానికి కూడా జరిగిన అవమానం'' అని ఆక్షేపించారు. భారత్ విచ్ఛిన్నం కావాలని కోరుకునే కౌల్ వంటి ఓ పాక్ సానుభూతిపరురాలిని ఆహ్వానించడం దారుణమని బీజేపీ అప్పట్లో ఆరోపించింది. ఇలాంటి చర్యలతో కర్నాటక కాంగ్రెస్ సర్కారు దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తోందంటూ మండిపడింది.

ఎవరీ కౌల్?

నితాషా కౌల్ లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ విశ్వవిద్యాలయంలో పాలిటిక్స్, అంతర్జాతీయ సంబంధాల విభాగంలో అధ్యాపకురాలు. జమ్మూ కశ్మీర్ నుంచి యూపీలోని గోరఖ్‌పూర్‌కు వలస వచ్చిన కశ్మీరీ పండిట్ల కుటుంబంలో జన్మించారు. ఢిల్లీలో పెరిగారు. ఢిల్లీ వర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో బీఏ ఆనర్స్ చేశారు. 1997లో హల్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చేయడానికి 21 ఏళ్ల వయసులో ఇంగ్లాండ్ వెళ్లారు. ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్, ఆర్థిక, తత్వశాస్త్రాల్లో పీహెచ్‌డీ చేశారు. బ్రిస్టల్ బిజినెస్ స్కూల్‌లో ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశారు. 2010లో భూటాన్‌లోని రాయల్ థింపు కళాశాలలో సృజనాత్మక రచనలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆమె రచయిత్రి, కవయిత్రి కూడా.

స్వర్ణదేవాలయంపైనే దాడికి తెగించిన పాక్

మే 8న దాడులను విజయవంతంగా తిప్పికొట్టిన భారత బలగాలు

- ఆనాటి వివరాలు తాజాగా వెలుగులోకి

అమృత్‌సర్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రస్థావరాలపై భారత దాడులతో వెర్రెక్కిపోయిన పాకిస్తాన్ బలగాలు మే 8వ తేదీన పంజాబ్‌లోని ప్రఖ్యాత స్వర్ణదేవాలయాన్ని కూల్చేందుకు దుస్సాహసం చేశాయని తాజాగా వెల్లడైంది. గోల్డెన్‌టెంపుల్‌పై గగనతల దాడుల వివరాలను తాజాగా భారత ఆర్మీ మేజర్ జనరల్ కార్తీక్ సి.శేషాద్రి బహిర్గతంచేశారు. శేషాద్రి ఆర్మీలోని 15వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌లో జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీఓసీ)గా సేవలందిస్తున్నారు. మే 8వ తేదీన పాక్ జరిపిన దాడులు, ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎలా తుత్తునియలు చేసిందో శేషాద్రి సోమవారం వివరించారు.

ముందే అంచనా వేశాం

''ఆపరేషన్ సిందూర్‌తో అనూహ్య దాడులను చవిచూసిన పాకిస్తాన్ వెంటనే భారత ఆర్మీ బేస్‌లతోపాటు జనావాసాలను లక్ష్యంగా చేసుకుంది. ఇవి చాలవన్నట్లు మత సంబంధ ప్రాంతాలపైనా విరుచుకుపడుతుందని మేం ముందే అంచనావేశాం. ఇందులో సరిహద్దు రాష్ట్రమైన పంజాబ్‌లోని స్వర్ణదేవాలయంపై క్షిపణులు ప్రయోగించే వీలుందని ఊహించాం. వెంటనే గగనతల రక్షణ వ్యవస్థను స్వర్ణదేవాలయం వద్ద మోహరించాం. ఆ ప్రాంత గగనతల రక్షణ వ్యవస్థను శత్రు దుర్భేద్యంగా మార్చేశాం. ఊహించినట్లే పాకిస్తాన్ మానవరహిత గగనతల ఆయుధాలతో పాక్ స్వర్ణదేవాలయంపైకి దాడులు మొదలెట్టింది. దూసుకొస్తున్న డ్రోన్లు, క్షిపణులు, చిన్నపాటి అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్(యూఏవీ)లను భారత ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్ గురిచూసి నేలమట్టంచేశారు. స్వర్ణదేవాలయానికి ఒక్క గీత కూడా పడనివ్వలేదు''అని శేషాద్రి వివరించారు. మరోవైపు స్వర్ణదేవాలయం సహా పంజాబ్‌లోని పలు ప్రాంతాలను ఆకాశ్ క్షిపణి వ్యవస్థలు, ఎల్-70 డిఫెన్స్ గన్స్‌లతో తమ జవాన్లు ఎలా కాపాడారో భారత ఆర్మీ సోమవారం వివరించింది. సంబంధిత ఆయుధ వ్యవస్థల పనితీరును చూపే వీడియోను విడుదలచేసింది.

గూఢచార నెట్‌వర్క్ గుట్టు రట్టు

13 మంది అరెస్టు

చండీగఢ్/లక్నో/రాంపూర్: ఉత్తర భారతంలోని మన ఆర్మీకి సంబంధించిన కీలక, సున్నిత సమాచారాన్ని పాకిస్తాన్ నిఘా విభాగానికి చేరవేస్తున్న నెట్‌వర్క్ గుట్టును పోలీసులు బట్టబయలు చేశారు. గత రెండు వారాల వ్యవధిలోనే ఇద్దరు మహిళలు సహా 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, అర్మాన్, నౌమన్ ఇలాహి, దేవేందర్ సింగ్, తారిఫ్, యూపీ వాసులు షహజాద్, రవీంద్ర కుమార్, పంజాబ్ నుంచి ఫలక్‌షేర్ మసీహ్, సూరజ్ మసీహ్, గుజాలా, యమీన్ మహమ్మద్, సుఖ్‌బీర్ సింగ్, కరణ్‌బీర్ సింగ్ ఉన్నారు. హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఈ దందాలోకి లాగిన ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్ కార్యాలయం అధికారి ఎహ్సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను గూఢచర్యం ఆరోపణలపై ఇటీవలే ప్రభుత్వం బహిష్కరించడం గమనార్హం. వీరందరి ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నామని, వీరి ఎలక్ట్రానిక్ పరికరాల్లోని సమాచారాన్ని విశ్లేషిస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఢిల్లీలోని పాక్ హైకమిషన్ కార్యాలయంలో పనిచేసే పాక్ పౌరులు అసిఫ్ బలోచ్, జఫార్ అనే వారిపై అధికార రహస్యాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సదర్ తారు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామన్నారు.

ఈ నెల 4 నుంచి ప్రారంభం

సరిహద్దుల్లో ఉన్న ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఫొటోలను పాకిస్తాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)కి పంపించిన ఆరోపణలపై ఈ నెల 4న పోలీసులు అమృత్‌సర్‌కు చెందిన ఫలక్‌షేర్ మసీహ్, సూరజ్ మసీహ్‌లను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ఆర్మీ కదలికలు, బీఎస్ఎఫ్ క్యాంపు ప్రాంతాలు, విమానాశ్రయాల ఫొటోలు, ఇతర సున్నిత సమాచారాన్ని పాకిస్తాన్‌లోని నిఘా అధికారులకు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరితోపాటు మలెర్‌కొట్లాకు చెందిన మహిళ గుజాలా(31), యమీన్ మహమ్మద్ అనే వారిని ఈ నెల 11న పట్టుకున్నారు. వీరికి సైతం డానిష్‌తో సంబంధాలున్నాయని, ప్రతిఫలంగా వీరు ఆన్‌లైన్ ద్వారా డబ్బు అందుకుంటున్నట్లు విచారణలో తేలింది. అదేవిధంగా, 15న సుఖ్‌ప్రీత్ సింగ్, కరణ్‌బీర్ సింగ్ అనే వారిని ఐఎస్ఐ తరఫున పనిచేస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ సోమవారం వెల్లడించారు. వీరు ఆపరేషన్ సిందూర్ సమయంలో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లలో ఆర్మీ కదలికల గురించిన సమాచారాన్ని ఐఎస్ఐకి షేర్ చేసినట్లు వెల్లడైందన్నారు.

తుపాకీతో పోజిచ్చి దొరికిపోయాడు..

హరియాణాలోని పానిపట్ జిల్లాకు చెందిన నౌమన్ ఇలాహి(24)ని ఈ నెల 15న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూపీలోని కైరానాకు చెందిన ఇతడు ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఐఎస్ఐ హ్యాండ్లర్‌గా ఉంటూ ఆర్మీ సమాచారాన్ని చేరవేసినట్లు విచారణలో వెల్లడైంది. 16న కైతాల్‌కు చెందిన దేవేందర్ సింగ్(25) అనే పీజీ విద్యార్థిని పోలీసులు పట్టుకున్నారు. ఇతడు తుపాకీతో పోజిచ్చిన ఫొటోను ఆన్‌లైన్‌లో షేర్ చేశాడు. గతేదాది పాకిస్తాన్‌లో పుణ్య క్షేత్రాల దర్శనకు వెళ్లిన సమయంలో అక్కడి నిఘా అధికారులతో పరిచయం ఏర్పడినట్లు వెల్లడించాడు. వారి కోరిక మేరకు పటియాలా కంటోన్మెంట్ ఫొటోలను పంపించినట్లు అంగీకరించాడు.

తరచూ పాక్‌కు ప్రయాణం

హరియాణా పోలీసులు ఆదివారం నుహ్ జిల్లాకు చెందిన అర్మాన్(26)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలోని ఉద్యోగి ద్వారా చాలా కాలంలో ఆర్మీ కార్యకలాపాలు, కదలికలను గురించిన సమాచారాన్ని వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నట్లు తేలిందని పోలీసులు చెప్పారు. ఇతడిచ్చిన సమాచారంతో హరియాణా, యూపీ పోలీసులు కలిసి ఆదివారం రాంపూర్‌కు చెందిన షహజాద్ అనే వ్యక్తిని పట్టుకున్నారు.

నచ్చని అభిప్రాయాలతో బీజేపీలో భయం: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: తనకు నచ్చని ఎలాంటి అభిప్రాయానికైనా బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అశోకా వర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ అరెస్టే ఇందుకు ఉదాహరణ అని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు భంగం కలిగించారనే ఆరోపణలపై కేసులు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేయడం తెల్సిందే. ప్రొఫెసర్ అలీ ఖాన్ అరెస్టును తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఖర్గే చెప్పారు. వ్యక్తిత్వ హననం, వేధింపులు, ట్రోలింగ్, చట్ట విరుద్ధ అరెస్టులను కాంగ్రెస్ సహించదన్నారు.

ఇండొనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం

జకర్తా: ఇండొనేసియాలో లెవోటోబి లకిలకి అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే మొదలైన విస్ఫోటనాలు సోమవారం ఉదయం దాకా కొనసాగాయి. ఆదివరం అర్ధరాత్రి దాటాక జరిగిన పేలుళ్ల ధాటికి బూడిద ఏకంగా 6 కిలోమీటర్ల ఎత్తు దాకా ఎగసిపడింది. సోమవారం ఉదయం కూడా 1.2 కి.మీ. ఎత్తుకు బూడిద ఎగసిపడిందని అధికారులు తెలిపారు. 1,584 మీటర్ల ఎత్తుండే లకిలకి అగ్నిపర్వతం చాలా క్రియాశీలకంగా ఉంది. గత నవంబర్ 7న భారీ విస్ఫోటనం సంభవించింది. అగ్నిపర్వత శిఖరం నుంచి 8 కి.మీ. ఎత్తున బూడిద ఎగసిపడింది. అప్పుడు తొమ్మిది మంది మృతి చెందగా పలువురు గాయపడ్డారు. మార్చి 21న అది మరోసారి పేలింది.



రబ్బరు బోట్లలో జనాన్ని తరలిస్తున్న సహాయక సిబ్బంది



వరదలో చిక్కుకున్న కారును నెడుతున్న స్థానికులు



ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు

బెంగళూరును ముంచెత్తిన కుండపోత

బనశంకరి: దేశ ఐటీ రాజధాని బెంగళూరును అకాల వర్షం ముంచెత్తింది. ఆదివారం రాత్రి కుండపోతగా కురిసిన వానలు నగరంలోని అనేక ప్రాంతాలను జలమయం చేసింది. ఇళ్లలోకి వరద చేరడంతో జనం మోకాలి లోతు నీళ్లలోనే నడవాల్సి వచ్చింది. ప్రజలను రబ్బరు బోట్లు, ట్రాక్టర్ ట్రాలీల్లో తరలించారు. కొందరు ఆఫీసులకు సైతం రబ్బర్ బోట్లలోనే చేరుకున్నారు. బహుళ జాతి సంస్థలకు నెలవైన మాన్యత టెక్ పార్క్ వరద నిలిచి చెరువును తలపించింది. పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా కబ్బన్ పార్క్ ఏరియాలో రోడ్లపై చెట్లు కూలిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగించింది. వర్షంతో గోడ కూలిన ఘటనలో వైట్‌ఫీల్డ్‌లో ఒక మహిళ చనిపోయారు. జయనగర్‌లో చెట్లు కూలి వాహనాలు ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతమైన శ్రీసాయి లేఔట్ ఈసారి కూడా జలమయమైంది. దీంతో, సుమారు 150 మందిని అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. సిల్క్‌బోర్డ్ జంక్షన్‌లో మోకాలి లోతు వరద నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలను జనం నెట్టుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. నీళ్లలో నడిచి వెళ్లడం ఇష్టం లేని కొందరు బీఎంటీసీ బస్సుల్లోకి కిటికీల ద్వారా లోపలికి దూకేయడం కనిపించింది. ఇళ్లలోకి చేరిన నీటిని బకెట్లతో ఎత్తి పోసుకున్నారు. కాగా, గత 24 గంటల వ్యవధిలో బెంగళూరు నగరంలో 10.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో వాతావరణ విభాగం తెలిపింది. చివరిసారిగా 2022 మే 18న ఇంతటి భారీ వర్షం కురిసిందని గుర్తు చేసింది. 1909 మే 6న కురిసిన 15.39 సెంటీమీటర్ల వాన ఇప్పటికీ రికార్డుగానే ఉందని పేర్కొంది. కాగా, వానలతో బెంగళూరు జనజీవన అస్తవ్యస్తం కావడంపై బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. గ్రేటర్ బెంగళూరు కాస్తా కాంగ్రెస్ పాలనలో సబ్‌మెర్జ్‌డ్ బెంగళూరుగా మారిందని ఎద్దేవా చేసింది. డిప్యూటీ సీఎం శివకుమార్ స్పందిస్తూ.. బెంగళూరుకు వర్షాల కష్టాలు కొత్తేమీ కాదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

హెచ్-1బీ వీసాలు రద్దు చేయాలి

- ఆ వీసాదారులను పంపించేయాలి
- భారత సంతతి రిపబ్లికన్ వ్యాఖ్యలు
- మీ వలస నేపథ్యం మర్చిపోయారా?
- రోహిత్‌పై మండిపడుతున్న ఎన్నారైలు

టెక్సాస్: భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ నేత రోహిత్ జాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''హెచ్-1బీ వీసాలను రద్దు చేయాలి. ఆ కార్యక్రమాన్నే ఆపేయాలి. హెచ్-1బీ వీసాదారులను అమెరికా నుంచి పంపించేయాలి''అంటూ ట్రంప్ సర్కారుకు మతిలేని సూచనలు చేశారు. హెచ్-1బీ, ఇతర వీసాదారుల వీసాలు పునరుద్ధరించాలన్న రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు రిచ్ మెక్‌కార్మిక్ వ్యాఖ్యలను జాయ్ వ్యతిరేకించారు. అమెరికాను పోటీలో ముందు నిలపడంలో హెచ్-1బీ వీసా విధానం పాత్ర ఏమీ లేదని చెప్పుకొచ్చారు. ఆయన వ్యాఖ్యలపై ఆన్‌లైన్‌లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. హెచ్-1బీ వీసాదారుల్లో అత్యధికులు భారతీయులేనన్నది తెలిసిందే. వారంతా జాయ్ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. ఆయన తన వలస నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటే మంచిదని హితవు పలుకుతున్నారు. 'మీరు సౌకర్యవంతంగా స్థిరపడ్డాక అందుకు దోహదపడ్డ నిచ్చెనను లాగేయాలని అనుకుంటున్నారా?'అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాయ్ కుటుంబం ఆ వీసా పథకం ద్వారానే లబ్ధి పొందిన విషయాన్ని మర్చిపోవద్దని అంటున్నారు. అమెరికా కంపెనీలు నిపుణులైన విదేశీయులను నియమించుకునేందుకు హెచ్-1బీ వీసా వీలు కల్పిస్తుంది. 2022లో జారీ అయిన 3.2 లక్షల హెచ్-1బీ వీసాల్లో 77 శాతం భారతీయులే దక్కించుకున్నారు. 2023లో 3.86 లక్షల వీసాల్లోనూ 72.3 శాతం వాటా వారిదే. హెచ్-1బీ వర్క్ వీసా తొలుత మూడేళ్లపాటు చెల్లుబాటవుతుంది. తరువాత ఆరేళ్ల పొడిగించుకోవచ్చు.

టోర్నడోలతో 28 మంది మృత్యువాత

లండన్(యూఎస్ఏ): శక్తివంతమైన టోర్నడోలు అమెరికాను అతలాకుతలం చేస్తున్నాయి. కెంటకీ, మిస్సోరి, వర్జీనియాల్లో జరిగిన వివిధ ప్రమాద ఘటనల్లో ఆదివారం వరకు 28 మంది చనిపోయారు. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. అత్యధికంగా కెంటకీలో నష్టం వాటిల్లింది. వందల సంఖ్యలో నివాసాలు నేల మట్టం కావడంతో వేలాదిగా జనం నిరాశ్రయులయ్యారు. వాహనాలు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. ఒక్క కెంటకీలోనే 19 మంది మృత్యువాతపడ్డారు. మృతుల్లో అత్యధికులు లారెల్ కౌంటీకి చెందిన వారే.

సలహా సంఘానికి అధ్యక్షత వహించింది ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటి సారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది.

ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.



- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 - అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/విపక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.

ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14-18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్య్ర హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19-22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్య్ర హక్కు (Right to Religion): ప్రకరణలు 25-28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతూలే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి.

ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం - మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13 - చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు - న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి.

ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

'ముత్యపు చిప్ప' పదానికి పర్యాయ పదం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

వ్యాకరణాంశాలు- భాషాంశాలు

మాదిరి ప్రశ్నలు

1. 'అవ్వారల'- పదంలో ఉన్న సంధి?
   1) అత్వసంధి 2) త్రికసంధి
   3) గుణసంధి 4) వృద్ధిసంధి
2. 'పుస్తకాలు' పదాన్ని విడదీసి రాస్తే?
   1) పుస్తకా+లు 2) పుస్తకామ్+లు
   3) పుస్తకము + లు 4) పుస్తక +ఆలు
3. 'రాణ్మహేంద్రవరం' పదంలో ఉన్న సంధి?
   1) జశ్త్వసంధి 2) విసర్గసంధి
   3) అనునాసిక సంధి 4) శ్చుత్వసంధి
4. 'భక్తురాలు' పదాన్ని విడదీసి రాస్తే?
   1) భక్తి + ఆలు 2) భక్త + ఆలు
   3) భక్త+ రాలు 4) భక్తు+ రాలు
5. 'తన్మయం' పదంలో ఉన్న సంధి?
   1) జశ్త్వసంధి 2) అనునాసిక సంధి
   3) విసర్గసంధి 4) వృద్ధిసంధి
6. 'నమోనమః' పదాన్ని విడదీసి రాస్తే?
   1) నమ + నమః 2) నమో+ నమః
   3) నమః + నమః 4) నమోః + నమః
7. 'పయః + నిధి' - కలిపి రాస్తే?
   1) పయన్నిధి 2) పయోనిధి
   3) పయాన్నిధి 4) పయోన్నిధి
8. మీగడ పదాన్ని విడదీసి రాస్తే?
   1) మీ+ కడ 2) మీ + గడ
   3) మీదు + కడ 4) మీదు + గడ
9. 'దొంగభయం' ఏ సమాసం?
   1) షష్ఠీ తత్పురుష 2) పంచమీ తత్పురుష
   3) సప్తమీ తత్పురుష
   4) ద్వితీయ తత్పురుష
10. 'విధాతృనానతి' ఏ సమాసం?
    1) బహువ్రీహి 2) ద్వంద్వసమాసం
    3) షష్ఠీ తత్పురుష 4) ప్రథమాతత్పురుష
11. భారతదేశం, గంగానది-పదాల్లో ఉన్న సమాసం?
    1) ద్వంద్వ సమాసం
    2) సంభావన పూర్వపద కర్మధారయం
    3) షష్ఠీ తత్పురుష
    4) అవ్యయీభావ సమాసం
12. 'ప్రతిదినం, యథాశక్తి' పదాలు ఏ సమాసాలు?
    1) ద్వంద్వ సమాసం
    2) ప్రథమాతత్పురుష
    3) అవ్యయీభావ సమాసం
    4) చతుర్థీ తత్పురుష
13. 'చిగురుకేలు' ఏ సమాసం?
    1) ఉపమాన ఉత్తరపద కర్మధారయం
    2) బహువ్రీహి సమాసం
    3) విశేషణ ఉత్తరపద కర్మధారయం
    4) ఉపమాన పూర్వపద కర్మధారయం
14. 'లేమా! దనుజుల గెలువగలేమా' లోని అలంకారం?
    1) లాటానుప్రాసం 2) ఛేకానుప్రాసం
    3) యమకం 4) ముక్తపదగ్రస్తం
15. 'చుక్కలు తలపూవులుగా అక్కజముగ మేను పెంచియంబర వీధిన్' పాదాల్లో ఉన్న అలంకారం?
    1) ఉత్ప్రేక్ష 2) అతిశయోక్తి
    3) స్వభావోక్తి 4) దృష్టాంతం
16. 'అజ్ఞానాంధకారంలో కూర్చోకుండా, విజ్ఞాన వీధుల్లో విహరించాలి' ఇందులో అలంకారం
    1) రూపకాలంకారం 2) ఉపమాలంకారం
    3) దృష్టాంతం 4) సమాసోక్తి
17. యతిమైత్రి 14వ అక్షరంగా ఉన్న పద్యం ఏది?
    1) శార్దూలం 2) మత్తేభం
    3) ఉత్పలమాల 4) మత్తకోకిల
18. 'భ-జ-స-నల-గగ' అనే గణాలుండే పద్యం
    1) కందం 2) ద్విపద
    3) తేటగీతి 4) ఉత్సాహం
19. 'జీతాలు చాలక ఎన్‌జీవోలు సమ్మెచేశారు' అనే వాక్యంలో అసమాపక క్రియ
    1) వ్యతిరేక అనంతర్యార్థకం
    2) వ్యతిరేక శత్రర్థకం 3) వ్యతిరేకక్త్వార్థకం
    4) వ్యతిరేక తుమున్నర్థకం
20. 'రామకృష్ణారావు ఆమోదముద్ర వేశారు' అనే వాక్యం?
    1) సంయుక్త వాక్యం 2) కర్తరీ వాక్యం
    3) ప్రత్యక్ష వాక్యం 4) అనుకరణ వాక్యం
21. 'రామకృష్ణుడు గురువు, వివేకానందుడు శిష్యుడు' అనే వాక్యాలు?
    1) సంశ్లిష్ట వాక్యాలు 2) సామాన్య వాక్యాలు
    3) క్రియారహిత వాక్యాలు
    4) సందేశ వాక్యాలు
22. 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' అనేది?
    1) సామెత 2) జాతీయం
    3) నానుడి 4) సూక్తి
23. 'మీరు రావచ్చు', 'అతడు పోవచ్చు' అనే వాక్యాలు?
    1) అప్యర్థక వాక్యాలు
    2) వికల్పార్థక వాక్యాలు
    3) అనుమత్యర్థక వాక్యాలు
    4) సందేహాత్మక వాక్యాలు
24. 'గొడ్డలిపెట్టు' అనే జాతీయానికి అర్థం?
    1) బలమైన కోరిక 2) విఘాతం
    3) ఆధారం 4) ఆటంకం
25. 'మిరుమిట్లు గొలుపు' అనేది?
    1) పదబంధం 2) పొడుపు కథ
    3) జాతీయం 4) నానుడి
26. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అనేది?
    1) జాతీయం 2) సామెత
    3) పద బంధం 4) నానుడి
27. 'రికామి' అనే పదానికి అర్థం?
    1) తెలివైన వాడు 2) సోమరిపోతు
    3) అజ్ఞాని 4) మందబుద్ధి
28. 'అయుతం' పదానికి అర్థం?
    1) వేయి 2) నూరు
    3) పది వేలు 4) ఆయుధం
29. 'ఇనుడు' పదానికి అర్థం?
    1) ఇంద్రుడు 2) సూర్యుడు
    3) చంద్రుడు 4) బ్రహ్మ
30. 'ఉపద్రవం' అంటే అర్థం?
    1) ఉప్పునీరు 2) ద్రావకం
    3) ఆపద 4) కల్తీ ద్రవం
31. 'కైరవం' పదానికి అర్థం?
    1) కడియం 2) పెద్దధ్వని
    3) తెల్ల కలువ 4) ప్రదక్షిణ
32. 'సుడిగములు' పదానికి అర్థం?
    1) మెట్టెలు 2) అందెలు
    3) పూలు 4) గాజులు
33. 'అనృతం' పదానికి నానార్థం కానిది?
    1) అసత్యం 2) స్వచ్ఛత
    3) వాణిజ్యం 4) సేద్యం
34. కాలం పదానికి నానార్థం?
    1) చావు 2) నలుపు
    3) సమయం 4) పైవన్నీ
35. 'గుణం' పదానికి నానార్థం?
    1) బాణం 2) విల్లు
    3) వింటినారి 4) దూది
36. 'ఫలం' పదానికి నానార్థం కానిది?
    1) పండు 2) పుష్పం
    3) ప్రయోజనం 4) సుఖం
37. 'ఉపాధ్యాయుడు' పదానికి వికృతి రూపం?
    1) పంతులు 2) గురువు
    3) ఒజ్జ 4) మార్గదర్శి
38. 'కైత' పదానికి ప్రకృతి రూపం?
    1) కయిత 2) కేత
    3) కవిత 4) కవనం
39. 'జాతర' పదానికి ప్రకృతి రూపం?
    1) యాతర 2) జాత్ర
    3) యాత్రా 4) యాత్ర
40. 'రాజ్ఞి' పదానికి వికృతి రూపం?
    1) రాజి 2) రాణి
    3) రాగిణి 4) రాగి
41. 'రతనం' పదానికి ప్రకృతి రూపం?
    1) రత్నం 2) జత్నం
    3) వజ్రం 4) రమ్యం
42. 'విజ్ఞానం' పదానికి వికృతి రూపం?
    1) విగ్గేనం 2) విన్నేణం
    3) విన్నాణం 4) విన్యాణం
43. 'అన్నం' పదానికి పర్యాయ పదం?
    1) బోనం 2) కూడు
    3) బువ్వ 4) పైవన్నీ
44. 'కప్ప' పదానికి పర్యాయపదం?
    1) మండుకం 2) భేకం
    3) దద్దురం 4) పైవన్నీ
45. 'వాంఛ, తృష్ణ, ఈప్సితం' పదాలకు పర్యాయపదాలు?
    1) అయిష్టం 2) దాహం
    3) కోరిక 4) చిరాకు
46. 'వనిత, మహిళ, స్త్రీ' పదాలకు పర్యాయ పదం?
    1) సహనం 2) కనికరం
    3) వలువ 4) పడతి
47. 'గృహం' పదానికి పర్యాయ పదం?
    1) ఇల్లు 2) గేహం
    3) నికేతనం 4) పైవన్నీ
48. 'చీకటి' పదానికి పర్యాయ పదం?
    1) తమం 2) అంధకారం
    3) ఇరులు 4) పైవన్నీ
49. 'భవుని భార్య'అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
    1) లక్ష్మీ 2) సరస్వతి
    3) భవాని(పార్వతి) 4) గౌరి
50. 'హరి' పదానికి పర్యాయ పదం?
    1) విష్ణువు 2) కోతి
    3) సింహం 4) పైవన్నీ
51. 'ముత్యపు చిప్ప' పదానికి పర్యాయ పదం?
    1) శంఖం 2) శుక్తి
    3) గుర్రపు సుడి 4) పైవన్నీ
52. 'నాశనం లేనిది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
    1) నశ్వరం 2) అక్షరం
    3) శాశ్వతం 4) ఆకాశం
53. 'తిథి, వార నియమాలు లేక ఇంటికి, భోజనానికి వచ్చేవాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
    1) అతిథి 2) యాచకుడు
    3) భిక్షకుడు 4) బంధువు
54. 'వెడల్పైన ముఖం గలది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
    1) పులి 2) సింహం
    3) ఎలుగుబంటి 4) ఏనుగు
55. 'ఉంగరం' పదానికి ప్రకృతి రూపం?
    1) అంగుష్టం 2) కంకణం
    3) అంగుళీయకం 4) ఆభరణం
56. ప్రతి పాదంలో ఆరు ఇంద్ర గణాలు తర్వాత రెండు సూర్య గణాలు ఉండే పద్యం?
    1) తేటగీతి 2) ఆటవెలది
    3) ద్విపద 4) సీసం
57. 'య-వ-ర-ల'ను ఏమంటారు?
    1) వృద్ధులు 2) యణ్ణులు
    3) గుణాలు 4) వక్రతమాలు
58. వాడుగొట్టె, నీవు డక్కరి, నిజం దెలిపి పదాల్లోని సంధి?
    1) నుగాగమ సంధి 2) సరళాదేశ సంధి
    3) గసడదవాదేశ సంధి
    4) ప్రాతాది సంధి
59. 'బంగారం, హొన్ను, కాంచనం, కనకం' పర్యాయ పదాలు ఉన్న పదం?
    1) సింగారం 2) సువర్ణం
    3) రజితం 4) అయం
60. 'బండ జింకలు' పదానికి అర్థం?
    1) తుమ్మెదలు 2) కందిరీగలు
    3) గబ్బిలాలు 4) అడవి జింకలు

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 2	5) 2
6) 3	7) 2	8) 3	9) 2	10) 3
11) 2	12) 3	13) 4	14) 3	15) 2
16) 1	17) 2	18) 1	19) 3	20) 2
21) 3	22) 2	23) 3	24) 2	25) 3
26) 2	27) 2	28) 3	29) 2	30) 3
31) 3	32) 4	33) 2	34) 4	35) 3
36) 2	37) 3	38) 3	39) 4	40) 2
41) 1	42) 3	43) 4	44) 4	45) 3
46) 4	47) 4	48) 4	49) 3	50) 4
51) 4	52) 2	53) 1	54) 2	55) 3
56) 4	57) 2	58) 3	59) 2	60) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఐహెచ్ఎంసీఎల్‌లో 49 ఇంజనీర్ పోస్టులు

ద్వారకలోని ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్ఎంసీఎల్) 49 ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 49
- **అర్హతలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచిల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉంటాలి. గేట్ స్కోరుకు ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ. 40,000-1,40,000 మధ్య ఉంటుంది.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. గేట్ మార్కులకు ప్రాధాన్యం ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 02.06.2025
- **వెబ్‌సైట్:** http://www.ihmcl.co.in

సీఐఎస్ఎఫ్‌లో 30 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటా(హాకీ)లో హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల సంఖ్య:** 30
- **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)
- **అర్హత:** గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు హాకీలో రాష్ట్ర/జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి.
- **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక ప్రక్రియ:** ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.05.2025
- **వెబ్‌సైట్:** www.cisf.gov.in/cisfeng/recruitment

సైన్య సహకార పద్ధతిని మొదటగా అంగీకరించిన నిజాం రాజు?

భారత జాతీయోద్యమంలో భాగంగా హైదరాబాద్ రాజ్యంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ఘట్టానికి ప్రత్యేకత ఉంది. 1947 ఆగస్టు 15న భారతదేశానికంతటికీ స్వాతంత్ర్యం లభించినా.. హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం నిరంకుశ పాలనలోనే మగ్గింది. స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో నిజాం రాజ్యంపై ఆపరేషన్ పోలో పేరుతో 'పోలీస్ చర్య' జరిపారు. ఫలితంగా 1948 సెప్టెంబరు 17న చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు. దీంతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సుమారు 13 నెలల తర్వాత హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. నాటి నుంచి వీరు అఖిల భారతావనిలో సగర్వంగా భాగస్వాములయ్యారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర




హైదరాబాద్ రాజ్యంలో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి దేశవ్యాప్తంగా సుమారు 560 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. వాటిలో హైదరాబాద్ సంస్థానం అతిపెద్దది, ముఖ్యమైంది. ఇది దక్కన్ పీఠభూమి మధ్యన, సుమారు 8300 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉండేది. మొగల్ సామ్రాజ్య పాలనా కాలంలో దక్కన్ సుబేదార్‌గా పనిచేసిన అసఫ్ జా నిజాం ఉల్‌ముల్క్ క్రీ.శ. 1724లో స్వతంత్రంగా హైదరాబాద్ రాజ్య పాలన ప్రారంభించాడు. నిజాం రాజులు 224 ఏళ్ల పాటు హైదరాబాద్‌ను పాలించారు.

అసఫ్‌జాహీ రాజుల నిరంకుశాధికారం వల్ల ప్రజలు అనేక రకాలుగా దోపిడీకి గురయ్యారు. పాలనా బలహీనతలు, వారసత్వ తగాదాల వల్ల వీరు ఆంగ్లేయులకు లోబడి పాలన సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. క్రీ.శ.1800లో బ్రిటిష్ గవర్నర్ జనరల్ వెల్లస్లీ 'సైన్య సహకార పద్ధతి'ని ప్రకటించాడు. దీనికి మొట్టమొదటగా హైదరాబాద్ రాజు నిజాం అలీఖాన్ అంగీకారం తెలిపాడు. దీంతో నిజాం రాజులపై ఆంగ్లేయుల పెత్తనం విపరీతంగా పెరిగిపోయింది. అంతేకాకుండా నిజాం సంస్థానానికి చెందిన ప్రజల్లో జాతీయోద్యమ భావాలు ఆలస్యంగా బీజం పోసుకున్నాయి. దీనికి ప్రజల నిరక్షరాస్యత, ఆంగ్లేయ రెసిడెంట్, నిజాంల అణిచివేత ధోరణి, నిజాం తాబేదారులైన దొరల భయానక ఆధిపత్యం ప్రధాన కారణం.

1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావం - పరిణామాలు

భారతదేశ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందిన 1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై కూడా పడింది. 1857 మే 10న ఢిల్లీ సమీపంలోని మీరట్‌లో ప్రారంభమైన సిపాయిల తిరుగుబాటు అనతికాలంలోనే దేశమంతా విస్తరించింది. ఉత్తర భారతదేశంలో సిపాయిల తిరుగుబాటు ఫలితాలు హైదరాబాద్ సంస్థానంలోని బ్రిటిష్ వ్యతిరేకులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. భారతదేశంలో మొగల్ సామ్రాజ్య పాలన పునఃస్థాపన కోసం కృషి చేయాలని ఉద్బోధిస్తూ ప్రధానంగా మసీదుల్లో సాగిన ఉద్రేకపూరిత ప్రసంగాలు సంస్థానంలోని ముస్లింలను బాగా ఆకర్షించాయి. మౌల్వీ ఇబ్రహీం, మౌల్వీ అల్లా ఉద్దీన్ ఈ విధమైన ప్రచారంతో ప్రజలను ముందుకు నడిపారు. ఈ పవిత్ర యుద్ధం (సిపాయిల తిరుగుబాటు) పేరును 'జిహాద్'గా ప్రకటించి, ఇందులో పాల్గొనని వారిని ముస్లిం, హిందూ వ్యతిరేకులుగా పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానంలో బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న డేవిడ్‌సన్ సిపాయిల తిరుగుబాటుకు మద్దతిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని నిజాంను ఆదేశించాడు. హైదరాబాద్ రాజ్య దివాన్ (ప్రధానమంత్రి) అయిన మొదటి సాలార్‌జంగ్ బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లను తీవ్రంగా అణచివేశాడు. హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న ఔరంగాబాద్‌లో ఈ తిరుగుబాటు ప్రభావం ఎక్కువగా ఉండేది. 1857 జూన్‌లో ఇక్కడి తిరుగుబాటుదారులను నిజాం సైన్యం నిర్బంధించింది. జూలై నాటికి సికింద్రాబాద్‌లో ఈ తిరుగుబాటు తీవ్రమైంది. శివచరణ్, మాధవదాస్, అనూప్‌సింగ్, కృష్ణదాస్, లాల్‌ఖాన్, ఖాదర్‌ఖాన్ లాంటి పదకొండు మంది తిరుగుబాటుదారులను సాలార్‌జంగ్ పట్టుకొని శిక్షించాడు. మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి వచ్చి హైదరాబాద్‌లో అల్లర్లు సృష్టిస్తున్నారనే నెపంతో జమేదార్ చిడ్డాఖాన్, అతడి అనుచరులను (బుల్దానా నుంచి తప్పించుకొని వచ్చిన సైనికులు) సాలార్‌జంగ్ నిర్బంధించాడు. వారిని బ్రిటిష్ రెసిడెంట్ వద్దకు పంపాడు. 1857 జూలై 17న ప్రజలు అధిక సంఖ్యలో మక్కామసీద్ వద్ద గుమిగూడి బంధించిన వారిని విడుదల చేయాలని, లేకపోతే రెసిడెన్సీపై దాడిచేసి వారిని విడిపిస్తామని హెచ్చరించారు. కోపగించిన సాలార్‌జంగ్ ఆంగ్ల సైన్యాన్ని రెసిడెన్సీకి కాపలాగా పెట్టి, అరబ్బు సైనికుల సహాయంతో మక్కా మసీద్ ప్రాంతంలోని ప్రజలను చెదరగొట్టించాడు. అయినప్పటికీ అదే రోజు రాత్రి అయిదు వందల మంది రోహిల్లా ముస్లింలు తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్ నాయకత్వంలో రెసిడెన్సీపై దాడికి ప్రయత్నించారు. రెసిడెన్సీ సమీపంలోనే స్వగృహాలు కలిగి ఉన్న అబ్బాన్ డబ్బా సాహెబ్, షావుకారు జై గోపాల్‌దాస్ వీరికి సహకరించారు. ఆంగ్లేయ సైన్యం తుపాకీ గుళ్లకు రోహిల్లాలు అనేక మంది మరణించారు. ఈ విధంగా తిరుగుబాటును అణచివేశారు. తప్పించుకుపోయిన తుర్రేబాజ్‌ఖాన్‌ను 'కుర్బాన్ అలీ' సహాయంతో సాలార్‌జంగ్ 'తుప్రాన్' గ్రామం వద్ద పట్టుకున్నాడు. తర్వాత అతడిని బ్రిటిషర్ల తుపాకీకి బలిచేశాడు. మౌల్వీ అల్లా ఉద్దీన్‌కు ద్వీపాంతవాస శిక్ష వేసి అండమాన్‌కు పంపించారు. ఆయన 1884లో అక్కడే మరణించారు.

ఆంగ్లేయాధికారులు ప్రథమ స్వాతంత్ర్య సమరంలో నిజాంతో పాటు ప్రధానంగా అతడి దివాన్ సాలార్‌జంగ్ పాత్రను మెచ్చుకొని 1860 జూలైలో షోలాపూర్ సంస్థానాన్ని బహుమతిగా ఇచ్చారు. అంతకుముందు నిజాం రాజు నుంచి స్వాధీనం చేసుకున్న రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను తిరిగి ఇచ్చేశారు. దీంతోపాటు నైజాం తీర్చాల్సిన 50 లక్షల రూపాయల రుణాన్ని కూడా రద్దు చేశారు. బ్రిటిష్ రాణి 'స్టార్ ఆఫ్ ఇండియా' అనే పేరుతో ఒక కొత్త బిరుదును సృష్టించి నిజాం రాజు అఫ్జల్ ఉద్దౌలాకు బహూకరించారు. రెసిడెంట్ డేవిడ్‌సన్ ఈ బిరుదు జ్ఞాపికను 1861 నవంబరు 25న నిజాంకు అందించాడు. ఈ చర్య నైజాంను కించపరిచేదేగానీ, గౌరవించేది కాదని హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. 1857 సిపాయిల తిరుగుబాటు విఫలమవడం వల్ల భారతదేశంలో ఆంగ్లేయులకు, హైదరాబాద్‌లో వారి అనుచరులుగా సాలార్‌జంగ్, నిజాం రాజులకు తిరుగులేని ఆధిపత్యం దక్కింది.

బేగం బజార్ కుట్ర కేసు-1862

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ తిరుగుబాటుదారుల్లో పీష్వా నానా సాహెబ్ (దొండెపంత్) ప్రముఖులు. కాన్పూర్‌లో జరిగిన తిరుగుబాటులో నానా సాహెబ్, ఆయన స్నేహితుడు తాంతియా తోపే (రామచంద్ర పాండురంగ్) ప్రధాన పాత్ర పోషించారు. పీష్వా నానా సాహెబ్‌కు సన్నిహిత బంధువుగా చెప్పుకున్న రావ్ సాహెబ్ (రామారావు) 1862 మార్చిలో బేగం బజార్ (హైదరాబాద్)లో షావుకారు కిషన్‌లాల్‌కు చెందిన బాలముకుంద్ బాగ్‌లో ఆశ్రయం పొందారు. రావ్ సాహెబ్ బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటుకు పథకం రచించి మోర్తాడ్ (ఆర్మూర్ తాలుకా, నిజామాబాద్) జమీందార్లయిన రుక్మారెడ్డి, రాజారెడ్డితో పాటు అమృతలాల్ (కంటోన్మెంట్ రాజు) సోదరుడైన తుల్జారామ్, షావుకారు పురాణ్‌మల్, రామ్‌రతన్‌జీ మద్దతును సంపాదించారు. సాలార్‌జంగ్ దీన్ని గమనించి పీష్వా రావ్ షాహెబ్, ఆయన దివాన్ కిషన్ రావ్, మద్దతుదార్లపై బేగం బజార్ కుట్ర కేసు పెట్టాడు. వారిపై రకరకాల శిక్షలు, జరిమానాలు విధించి వారి పథకాన్ని భగ్నం చేశాడు. ఈ పరిణామం 1857 తిరుగుబాటుకు కొనసాగింపుగా హైదరాబాద్ సంస్థానంలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటుగా ప్రసిద్ధి చెందింది.

ఇతర తిరుగుబాట్లు

బ్రిటిషర్ల పాలనపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేక ప్రభావం, తదనంతర పరిణామాల ఫలితాలు హైదరాబాదీ సంస్థాన ప్రాంతాలపై పడ్డాయి. దీని వల్ల చిన్న చిన్న తిరుగుబాట్లు జరిగాయి. వాటిలో ముఖ్యమైనవి.

- రాజా వెంకటప్ప నాయక్ తిరుగుబాటు (షోలాపూర్)
- రంగారావు పట్వారీ తిరుగుబాటు (కొలాస్)
- గోండుల తిరుగుబాటు (ఆదిలాబాద్, రామ్‌జీ గోండ్ నాయకత్వంలో)
- రోహిల్లాల పితూరీ (నిర్మల్, ఆదిలాబాద్)
- భిల్లుల తిరుగుబాటు (అజంతా, ఔరంగాబాద్)
- చింతా భూపతి, సన్యాసి భూపతి తిరుగుబాటు (గోల్కొండ ప్రాంతం)

మాదిరి ప్రశ్నలు

1. 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు ఉన్న నిజాం రాజు ఎవరు?
ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
బి) సాలార్‌జంగ్
సి) నిజాం అలీఖాన్ డి) అఫ్జల్ ఉద్దౌలా
2. మొదటి సాలార్‌జంగ్ అసలు పేరేమిటి?
ఎ) తురాబ్ అలీఖాన్ బి) లాయక్ అలీ
సి) మీర్ మహమ్మద్ అలీ
డి) నవాబ్ నిజాం అలీఖాన్
3. హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్‌పై జరిగిన దాడికి నాయకత్వం వహించిందెవరు?
ఎ) తుర్రేబాజ్ ఖాన్ బి) మౌల్వీ ఇబ్రహీం
సి) రావ్ సాహెబ్ పీష్వా
డి) జమేదార్ చిడ్డాఖాన్
4. 1857 సిపాయిల తిరుగుబాటు సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న అధికారి ఎవరు?
ఎ) జనరల్ పాట్రిక్ బి) కల్నల్ డేవిడ్‌సన్
సి) కల్నల్ కింగ్స్ ఫోర్డ్ డి) జనరల్ మెట్‌కాఫ్
5. అసఫ్‌జాహీ వంశస్థుల పూర్వీకులు ఏ దేశానికి చెందినవారు?
ఎ) అఫ్గానిస్తాన్ బి) మంగోలియా
సి) టర్కీ డి) ఏదీకాదు
6. బేగంబజార్ కుట్ర కేసు(1862)లో ప్రధాన నిందితుడిగా ఎవరిని పేర్కొన్నారు?
ఎ) పీష్వా నానాసాహెబ్
బి) షావుకారు కిషన్ లాల్
సి) రామారావ్ డి) జమిందార్ రుక్మారెడ్డి
7. బుల్దానా నుంచి వచ్చిన తిరుగుబాటుదారులకు నాయకత్వం వహించినవారెవరు?
ఎ) తుర్రేబాజ్‌ఖాన్
బి) మౌల్వా అల్లా ఉద్దీన్
సి) చిడ్డాఖాన్ డి) అబ్దుల్ ఖయ్యూం
8. హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెంట్‌పై ఏ రోజున దాడి జరిగింది?
ఎ) 1857 జూలై 17 బి) 1857 మే 10
సి) 1857 జూన్ 29 డి) 1857 ఏప్రిల్ 13
9. 1857 భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ పరిణామాల వల్ల హైదరాబాద్ సంస్థానంలో ప్రధానంగా కలిగిన మార్పు ఏది?
ఎ) నిజాం రాజు నిరంకుశత్వం పెరిగింది
బి) పాలనలో సాలార్‌జంగ్ ప్రభావం విపరీతంగా పెరిగింది
సి) బ్రిటిష్ రెసిడెంట్ ఆధిపత్యం పెరిగింది
డి) సంస్థానంపై బ్రిటిష్ రాణి ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది
10. హైదరాబాద్ సంస్థానంలో 1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావాలను అణచివేసిన ఘనత ఎవరికి దక్కింది?
ఎ) నిజాం రాజు అఫ్జల్ ఉద్దౌలా
బి) కల్నల్ డేవిడ్‌సన్
సి) మొదటి సాలార్‌జంగ్
డి) ఆర్మీ జనరల్ లాయక్ అలీ
11. నానా సాహెబ్ ఎక్కడ జరిగిన తిరుగుబాటుకు నాయకత్వం వహించారు?
ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
సి) లక్నో డి) కాన్పూర్
12. రోహిల్లా ముస్లింల పితూరీ ఎక్కడ జరిగింది?
ఎ) షోలాపూర్ బి) ఉస్మానాబాద్
సి) నిర్మల్ డి) గోల్కొండ
13. ఆదిలాబాద్‌లో జరిగిన గోండుల తిరుగుబాటుకు నాయకత్వం వహించినవారెవరు?
ఎ) రామ్‌జీ గోండ్ బి) తుల్జారామ్ గోండ్
సి) వెంకటప్ప నాయక్
డి) పట్వారీ రంగారావ్
14. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించింది ఎవరు?
ఎ) మహాత్మా గాంధీ బి) అంబేద్కర్
సి) అబ్రహం లింకన్ డి) కారల్ మార్క్స్
15. ఔరంగాబాద్‌లో అశ్వికదళాల సైనిక తిరుగుబాటును నిర్వహించినవారు?
ఎ) మౌల్వీ ఇబ్రహీం, మౌల్వీ అల్లా ఉద్దీన్
బి) జమేదార్ అమీర్‌ఖాన్, డఫేదార్ ఫిదా అలీ
సి) తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్
డి) జమేదార్ చిడ్డాఖాన్, అబ్బాన్ డబ్బా సాహెబ్

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) బి; 5) సి;
6) సి; 7) సి; 8) ఎ; 9) బి; 10) సి;
11) డి; 12) సి; 13) ఎ; 14) డి; 15) బి.

The biggest international financial centre?

BANK EXAMS
BANKING AWARENESS



1. A draft issued by the bank has been lost by the payee. He sends a letter to the issuing bank to stop payment. Bank will:
a) Note caution and will advice the payee to contact purchaser of the draft
b) Not act on the request
c) Stop payment
d) Performs no action
e) None of the above
2. Mutual funds are required to be registered with:
a) AMFI b) SEBI
c) IBA d) RBI e) NABARD
3. What is Yield Curve Risk?
a) It is a line of graph plotting the yield of all maturities of a particular instrument
b) Yield curve changes its slope and shape from time to time
c) Yield curve can be twisted to the desired direction through the intervention of RBI
d) All of the above
e) None of the above
4. The biggest international financial centre in the world:
a) Frankfurt b) Geneva
c) London d) New York
e) Paris
5. The expansion of BIFR, in the context of the Indian Industry is:
a) Board for Industrial and Financial Reconstruction
b) Bureau for Industrial and Financial Reconstruction
c) Board for Investment and Financial Reconstruction
d) Bureau for Investment and Financial Reconstruction
e) None of these
6. The largest financial conglomerate of India is:
a) HDFC Bank b) ICICI Bank
c) IFCI d) SBI e) None of these
7. Under which of the following methods of depreciation, amount of depreciation varies every year?
a) Written Down Value Method
b) Straight Line Method
c) Amount of depreciation does not vary on year to year basis
d) Either a or b
e) None of these
8. Usually, the validity period of an Income Tax Refund Order is:
a) 1 month b) 2 months
c) 3 months d) 6 months
e) 4 months
9. Which of the following is true about "White Card"?
a) It is related to companies producing milk products
b) It does not carry on its face, the brand of the issuer
c) It is meant to covert blank money into the economy
d) It is a card that provides white money
e) None of these
10. First bank in India to launch its interactive banking service through Dish TV:
a) HSBC b) ICICI Bank
c) HDFC Bank d) Axis Bank
e) None of these
11. First Indian Governor of the RBI:
a) C.D. Deshmukh
b) Sachindra Ray
c) S. Mukherjee d) D.I.G. Patel
e) None of the above
12. CGTMSE (Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises) has been set up on the recommendations of:
a) Narashimham Committee
b) Ghosh Committee
c) Chore Committee
d) Kapoor Committee
e) Krishna Committee
13. The primary relationship between the banker and the customer is that of:
a) Trustee and beneficiary
b) Debtor and Creditor
c) Principal and agent
d) Lesser and lessee
e) None of these
14. A debt becomes time-barred after:
a) One year
b) Two and a half year
c) Three years
d) Five years e) Six years
15. In the matter of handling bills of exchange for collection, the relationship between customer and the bank is:
a) Trustee and the beneficiary
b) Principal and agent
c) Bailor and bailee
d) All of the above
e) None of the above
16. Hypothecation is:
a) A transaction of conditional sale
b) A legal transaction whereby goods may be made available as security for a debt
c) Transfer of ownership by the borrower to the lender
d) Either a or b
e) None of the above
17. Payment of a cheque may be countermanded by the ___
a) Payee b) Drawer
c) True owner d) Drawee
e) None of these
18. J.S. Verma Committee Report relates to:
a) Strengthening of weak banks
b) Corporate Governance
c) Bank Mechanization
d) All of the above
e) None of the above
19. A Usance Bill when presented for acceptance has to be accepted/ dishonoured within:
a) 24 hours b) 36 hours
c) 48 hours d) 60 hours
e) 26 hours
20. Invoice is a:
a) Accounting document
b) Legal document
c) Commercial document
d) All of the above
e) None of the above
21. When does a person become insolvent?
a) When he left with no property of his own
b) When he declares an insolvent by the Court
c) When he terminates from a job he was holding
d) When he declares himself to be an insolvent
e) None of the above
22. When two parties make an arrangement to exchange future cash flows, it is called:
a) Options b) Arbitrage
c) Swap d) Futures
e) None of the above

KEY

1) a 2) b 3) d 4) c 5) a
6) d 7) a 8) c 9) b 10) c
11) a 12) d 13) b 14) c 15) b
16) b 17) b 18) a 19) c 20) c
21) b 22) c

Banking related developments

- Kerala became first state with bank accounts for all families.
- Federal Bank bagged CNBC TV18 Financial Inclusion Award.
- ICICI Bank customer can recharge Delhi Metro cards with SMS.
- Yes bank has recently launched 'Saaf suthra Bharat' campaign in Sri Nagar. The bank successfully launched this campaign contributing to the Swachh bharat abhiyan.
- Axis Bank launches "smart self-service terminal" that enables the customers to deposit as well as withdraw cash from the same machine.
- Private sector Indus Ind Bank has launched video-branch, claiming to be a first-of-its-kind service; enabling customers interact with the staff of the bank through video conference facility.
- ICICI bank has launched a new mobile named iMobile app for its windows phone customers.
- The Reserve Bank of India has cancelled the certificate of registration of NBFCs (Siber Financial Services Private Limited, Sri Vishnu Finance & Investment Private Limited, Margdarsi Investment and Leasing Company Private Limited.) for carrying on the business of non-banking financial institution.
- CSR was made 2% compulsory through Companies Act 2013.
- RBI further simplifies KYC Norms regarding bank accounts as "One Documentary Proof of Address is enough to open bank account".
- Domestic banks will need US $200 billion additional capital over the next five years to meet Basel - III norms for capital adequacy and the demand for funds as growth picks up, Fitch Ratings.
- State bank of India has tied up with Bangalore-based mobile payments service provider Ezetap Mobile Solutions Pvt. Ltd. in association with Ezetap the bank has planned to roll out "ATM cum POS terminals".
- Kotak Mahindra bank has introduced "Kaypay payment system". This allows the face book users to send money to each other.
- Insurance Regulatory and Development Authority (IRDA) align ed it's corporate governance and disclosure norms in accordance with the new Companies Act, 2013, through a 12-member committee.
- Non-Scheduled UCBs are permitted to "Internet Banking (View Only) Facility" for Customers.
- Bank of India got approval to open branch in Vietnam.
- As per the new guidelines of the Reserve Bank of India (RBI), banks in six metros - New Delhi, Mumbai, Chennai, Kolkata, Hyderabad and Bangalore - are free to charge other bank customers beyond 3 ATM transactions per month. Banks have also been allowed to restrict free transactions to 5 for customers at it's own ATM network.
- HDFC became first listed Indian company to have 75% shareholding by FIIs.
- S&P (Standard and Poor) downgraded credit rating of Indian Overseas Bank to speculative grade.
- FDI limits allowed - Public Sector Banks: 20%. Private Sector Banks: 74%.
- Kotak Mahindra bank to acquire ING Vysya Bank.
- RBI allows FIIs to buy equity in Yes Bank.
- Exim Bank to set up Rs. 1,500 crore funds to assist ship-building industry. To give a boost to ship building in the country, the Export-Import Bank of India (Exim Bank) is planning to set PMJDY scheme, was announced in Modi's first Independence Day speech on 15 August 2014.